మాతృశ్రీ తత్త్వ సౌరభం



డా॥ బి.యల్. సుగుణ

మాతృశ్రీ తత్త్వ సౌరభం

తెలుగు విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పట్టా పొందిన
సిద్ధాంత వ్యాస సారాంశం

శ్రీమతి డా॥ బి.యల్. సుగుణ
ప్రిన్సిపాల్, మాతృశ్రీ ఓరియంటల్ కళాశాల
ఉపాధ్యక్షులు, అమ్మతత్త్వ ప్రచారసమితి
జిల్లెళ్ళమూడి

మాతృశ్రీ తత్త్వ సౌరభం

శ్రీమతి డా॥ బి.యల్.సుగుణ

ప్రథమ ముద్రణ : అక్టోబర్ 2013
(నాన్నగారి శతజయంతి ప్రచురణ)
ప్రతులు : 1000

వెల : రూ. 75/-

ముద్రణ
సుధా ప్రింటింగ్ వర్క్స్
అరండల్‌పేట, విజయవాడ-2.
ఫోన్ : **0866-6626233**

ప్రతులకు
శ్రీమతి డా॥ బి.యల్.సుగుణ
ప్రిన్సిపాల్, మాతృశ్రీ ఓరియంటల్ కళాశాల
జిల్లెళ్ళమూడి **- 522 113**
ఫోన్ : **94917 55866**

అంకితం



ఈ రచనకు


కర్త, కర్మ, క్రియ అన్నీ తానే అయిన

విద్యా స్వరూపిణి "అమ్మ"కు


భక్తితో....

- సుగుణ

విషయసూచిక



అమ్మ నాన్నగారు



శ్రీ అనసూయేశ్వరాలయం



అమ్మ ఆదరణలో చలం



అందరిల్లు

నివేదన

వాత్సల్యామృతవర్షిణి, అర్కపురీశ్వరి అమ్మ చరణారవిందాలకు సభక్తికంగా ప్రణామాలు సమర్పించుకుంటున్నాను.

నాకు జన్మ నిచ్చి నా ప్రగతికి కారకులయి అమ్మసన్నిధికి చేర్చి మంచి జీవితాన్ని అందించిన పుణ్యదంపతులు నా తల్లిదండ్రులు కీ॥శే॥ తలగడదీవి సీతారామమ్మ, వెంకట సుబ్బారావుగార్లకు ముందుగా నా నమస్సులు. నాకు ఊహ తెలిసిన తరువాత అమ్మను మొట్టమొదటిసారిగా మా స్వగ్రామమైన అడవుల దీవిలో చూశాను. ఆ క్షణమే అన్పించింది అమ్మ దగ్గర ఉంటే బాగుండునని. మరి అమ్మ నా ఆలోచన గ్రహించినట్లుగా మా సోదరి వివాహానికి నేను జిల్లెళ్ళమూడి రాగా నన్ను దగ్గరకు పిలిచి ఇక్కడ కళాశాలలో చదువుకో అని చెప్పింది. అమ్మ సూచన మేరకు జిల్లెళ్ళమూడిలోని మాతృశ్రీ ఓరియంటల్ కళాశాలలో 1975లో భాషాప్రవీణలో చేరాను. ఈ రీతిగా అమ్మ ఒడిలో అమ్మ బడిలో నాకు అవకాశం లభించింది. తెలిసీ తెలియని వయస్సులో ఎదిగీ ఎదగని మనస్సుతో జిల్లెళ్ళమూడిలో అడుగుపెట్టిన నేను ఒక వ్యక్తిగా దిద్ది తీర్చబడింది అమ్మ సన్నిధిలోనే. 'దైవ ప్రేరణ కాదు, ప్రేరణే దైవం' అని చెప్పిన అమ్మ అన్నింటికీ ప్రేరణ తానై నన్ను నడిపిస్తూ ఉన్నది.

అమ్మ శరీర పరిత్యాగానికి ముందు ఒకరోజు నన్ను దగ్గరకు పిలిచి 'పరిశోధన చెయ్యమ్మా' అని చెప్పింది. అప్పటికి నా మనస్సులో ఆ ఊహకూడ లేదు. కానీ తరువాతి కాలంలో అమ్మను గురించే పరిశోధన చెయ్యాలని అన్పించింది. 'మీరనేదయినా, అనుకునేదయినా, ఆచరించేదయినా నేననుకుంటేనే' అని అమ్మ చెప్పినట్లుగానే సంకల్పం తానై అమ్మ తత్త్వం మీద పరిశోధన చేసే ప్రేరణను కలిగించి ఆ అదృష్టాన్ని నాకు ప్రసాదించింది. ఆ సిద్ధాంత వ్యాసం అందరికీ అందుబాటులోకి తేవాలనే ఆలోచనతో కొన్ని మార్పులు చేసి ఈ గ్రంథరూపంగా తీసుకురావడం జరిగింది.

తమ అమృతాశీస్సులు అందించిన కుర్తాళం పీఠాధిపతి, పూర్వాశ్రమ ప్రసాదరాయ కులపతి, జగద్గురు శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరానంద భారతీస్వామి వారి పాదపద్మాలకు భక్తిపూర్వకంగా నమస్సుమనస్సులు సమర్పించుకుంటున్నాను.

మాతృశ్రీ సాహిత్యంపై పరిశోధన చేయడానికి నాకు అనుమతి ఇచ్చిన పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారికి, బొమ్మూరు సాహిత్య పీఠం

ఆనాటి అధిపతులు ఆచార్య బేతవోలు రామబ్రహ్మంగారికి. తమ పర్యవేక్షణలో పరిశోధన చేసే అవకాశాన్ని కల్పించిన డాక్టర్ వడ్లా సుబ్రహ్మణ్యంగారికి కృతజ్ఞతా పూర్వక అభివాదాలు. ప్రతి సన్నివేశంలోనూ తండ్రిలా నన్ను ఆదరించడమే కాక పరిశోధనకు ఎంతగానో ప్రోత్సహించి, అమ్మతత్త్వాన్ని తెలియచేసే 'మాతృసంహిత'ను ఆధారగ్రంథంగా అందించిన అమ్మ ఆంతరంగిక కార్యదర్శి, మాన్య సోదరులు కీ॥శే॥ శ్రీ కొండముది రామకృష్ణగారికి, అడుగడుగునా అండగా నిలిచి ఆశీర్వదించిన శ్రీమతి బ్రహ్మాండం వసుంధరక్కయ్యకు, అపారమైన శిష్య వాత్సల్యంతో తమ ఆశీస్సులు అందించిన గురువర్యులు డా॥పన్నాల రాధాకృష్ణశర్మ గారికి, వాత్సల్య స్వరూపులు శ్రీ విఠాల రామచంద్రమూర్తి గారికి, అవతారమూర్తి అమ్మగర్భవాసాన జన్మించి అమ్మకు ప్రతిరూపమై తమ ఆశీస్సులందించిన అందరన్నయ్య శ్రీ బ్రహ్మాండం రవీంద్రరావుగారికి, నా రచనను పరిశీలించి, ఆమోద ముద్రవేసి ఉత్సాహ ప్రోత్సాహాలు అందించిన సుప్రసిద్ధ పత్రికా రచయిత శ్రీ పొత్తూరి వెంకటేశ్వరరావు గారికి, అమ్మ పట్ల భక్తి భావంతో నా పట్ల వాత్సల్యంతో నన్ను ప్రోత్సహించిన మాతృశ్రీ విద్యాపరిషత్ అభివృద్ధి సంఘ అధ్యక్షులు శ్రీబొప్పూడి రామబ్రహ్మంగారికి, ఈ గ్రంథాన్ని పరిశీలించి, ఆశీస్సులందించిన 'స్ఫూర్తి'ప్రదాత, మాన్యసోదరులు శ్రీ కొండముది హనుమంతరావు గారికి, శ్రీ విశ్వజననీ పరిషత్ ఉపాధ్యక్షులు శ్రీ కొండముది గోపాలకృష్ణమూర్తిగారికి, ఎంతో ఆదరంతో అన్ని విధాలుగా నన్ను ప్రోత్సహిస్తున్న ఆత్మీయసోదరులు, విశ్వజననీ సంపాదకులు, కళాశాల కరస్పాండెంట్ శ్రీ పి.యస్.ఆర్.ఆంజనేయప్రసాద్ గారికి హృదయపూర్వక నమస్కారములు.

ఉత్తమ అధ్యాపకురాలిగా అదే ఒరవడిని మాకు అందించడమే కాక అమ్మ తత్త్వపరిశోధనలో పాలుపంచుకోవడమే అమ్మ ఆరాధనగా భావించి పరిశోధనా విషయంలో గురుతర బాధ్యత వహించిన మా గురువర్యులు, ఆత్మీయులు డా॥యు.వరలక్ష్మిగారికి, ఈ గ్రంధాన్ని అచ్చువేయమని ప్రేరణ ఇవ్వడమే గాక ఈ గ్రంధ ప్రచురణను మాతృశ్రీ సమర్చనంగా భావించి పఠన సౌకర్యం కోసం కొన్ని సవరణలు చేసి ఈ గ్రంథం వెలుగులోకి రావడానికి ప్రధాన భూమిక వహించిన అమ్మతత్త్వ ప్రచారసారథి శ్రీ మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి గారికి, నా పట్ల ఆత్మీయతతో తగిన సూచనలతో అన్ని విధాలుగా ప్రోత్సాహాన్ని అందించిన డా॥ మల్లాప్రగడ శ్రీవల్లిగారికి కృతజ్ఞతాభివందనాలు. నిరంతరం నన్ను, నా రచనలను ప్రోత్సహిస్తున్న ఆత్మీయ సోదరులు శ్రీ ఏ.వి.ఆర్.సుబ్రహ్మణ్యం గారికి, పరిశోధనా వ్యాసంగంలో సహకరించిన కళాశాల అధ్యక్షులు డా॥యన్.సుబ్రహ్మణ్యేశ్వర శాస్త్రిగారికి, అమ్మవాక్యవిశ్లేషణ సశాస్త్రీయంగా ఉండడానికి

ఎన్నో విషయాలను తెలియజేసిన గురుతుల్యులు శ్రీ టి.వి.సోమయాజులు గారికి, డాక్టర్ పి.ఝాన్సీలక్ష్మీబాయిగారికి, సర్వదా ఆశీస్సులు అందించిన కీ॥శే॥ శ్రీ ఐ.హనుమబాబు గారికి, ఇతర అధ్యాపక బృందానికి నా నమస్సులు.

తొలినాళ్ళలోనే ఈ సిద్ధాంత గ్రంథరచనను ప్రోత్సహిస్తూ ఆశీఃపూర్వకమైన కానుకను అందించిన మాన్యసోదరులు, బెంగుళూరు వాస్తవ్యులు శ్రీ అంగర సూర్యనారాయణ గారికి కృతజ్ఞతలు.

నా జీవితాన్ని వెలుగు బాటలో నడిపించిన బావగారు కోన సత్యనారాయణ మూర్తిగారికి, సోదరి రాజ్యలక్ష్మికి, తమ ప్రేమను పంచి ఇచ్చే అన్నా వదినలు తలగడదీవి లక్ష్మీనారాయణశర్మ గారికి, లక్ష్మీభారతికి, ఇతర కుటుంబ సభ్యులందరికీ, నా అభివృద్ధిని ఆకాంక్షించే మా మామగారు శ్రీ భట్టిప్రోలు వెంకట చలపతిరావుగారికి, అత్తగారు సుశీలగారికి, ఎల్లప్పుడూ నన్ను అభిమానించి ఆదరించే మా మేనమామ శ్రీ యల్లాప్రగడ నరసింహారావుగారికి, శ్రీమతి సుశీలగారికి, మా కుటుంబం అమ్మ దగ్గరకు రావడానికి మూలకారకులయిన శ్రీ యల్లాప్రగడ మధుసూదనరావుగారికి, శ్రీమతి లలితగారికి నా నమస్సులు.

'బాధ్యత తెలుసుకుని ప్రవర్తించేవాడు భర్త' అన్న అమ్మ వాక్యానికి ఉదాహరణగా నిలుస్తూ పరిశోధన తమదిగా భావించి బాధ్యత వహించిన నా జీవన సహచరులు శ్రీ భట్టిప్రోలు రామచంద్రగారికి నా హార్దిక అభివందనాలు. తమ వంతు సహకారంగా నాకు సమయాన్ని అందించిన చిరంజీవులు రవికిరణ్‌కు దీప్తికి, పూర్వవిద్యార్థినులు చి.సౌ.ఆర్.మాధవికి, డి.సుధారాణికి, ఎల్లప్పుడూ ఆత్మీయతను పంచి ఇచ్చే చి.సౌ.ఎల్.మృదులకు, చి.ఫణిరామలింగేశ్వరశర్మకు అమృతాశీస్సులు అందించమని అమ్మను ప్రార్థిస్తున్నాను.

శ్రీ మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తిగారి ద్వారా ఈ గ్రంథాన్ని గురించి విని, ముద్రణకు ఆర్థిక సహకారం అందించిన సహృదయులు, బళ్లారి వాస్తవ్యులు శ్రీ మంత్రిప్రగడ శ్రీరామనారాయణశర్మగారికి, వారి శ్రీమతి సీతామహాలక్ష్మి గారికి కృతజ్ఞతలతో నమస్కరిస్తున్నాను. ఆ దంపతులపై నిరంతరం అవ్యాజమైన కరుణ కురిపించాలని అమ్మను మనసారా ప్రార్థిస్తున్నాను.

అన్నింటినీ మించి అందరిలో ఉండి, అన్నీ తానై నడిపిస్తున్న అమ్మకు భక్తితో ఈ గ్రంథాన్ని సమర్పించుకుంటున్నాను.

- సుగుణ

ఆశీర్వాద శ్రీముఖము



కుర్తాళం సిద్దేశ్వరీ పీఠాధిపతులు
శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరానందభారతీస్వామి

డాక్టర్ సుగుణ జిల్లెళ్ళమూడి కళాశాలలో ఉద్యోగం చేస్తున్న విద్యావతి. మాతృశ్రీ అనసూయాదేవి జీవితం మీద పరిశోధనచేసి మంచి గ్రంథం వ్రాశారు. అమ్మ ఇష్టాలేమిటి? నమ్మకాలేమిటి? ఆచరణ విధానాలేమిటి? ఇటువంటి అనేక విశేషాలమీద విషయ సేకరణ చేసి వాటినొక పద్ధతిలో క్రోడీకరించి యీ రచనను తీర్చిదిద్దారు.

ఇటీవల అమ్మ మీద వచ్చిన పుస్తకాలు చాలా వాటిని చూచాను. ఎవరి మార్గం వారిదే. ఎవరి రచనాప్రణాళిక వారిదే. సంఘటనలను విశ్లేషణ చేయటంలో కూడా ఎవరిపద్ధతి వారిదే. కాకపోతే పూర్వ రచయితల ప్రభావం తరువాతి వారిమీద పడక తప్పదు. ఈ రచన చదువుతున్నప్పుడు ఇంతకు ముందు గమనించని కొత్తవాటిని చూస్తున్నానా! అనిపించింది. ఆకర్షణీయమైన వచోధోరణి. రచయిత్రిని ఆశీర్వదిస్తూ మరిన్ని గ్రంథాలు ఈమె నుండి రావాలని భావిస్తున్నాను.

నారాయణస్మరణతో... శుభమస్తు !

ప్రామాణిక గ్రంథం

- డా॥పొత్తూరి వెంకటేశ్వరరావు
గౌరవ సంపాదకులు, 'విశ్వజనని'

"మాతృశ్రీ తత్త్వసౌరభం" జిల్లెళ్ళమూడి అమ్మను గురించి 1960-2013 మధ్య ఆమె అనుగ్రహానికి పాత్రులైనవారు వ్రాసి వెలువరించిన గ్రంథాలలో ప్రత్యేక స్థానం కలిగిన రచన.

ఇకముందు, అంటే 2013 తరువాత వచ్చే విశ్వజనని సాహిత్యంలో విశ్వవిద్యాలయాల గుర్తింపు మరెన్ని గ్రంథాలకు లభిస్తుందో, ఆ తల్లిని గురించి ఏయే అంశాలపై ఎవరెవరు ఏయే విశ్వవిద్యాలయాలలో పరిశోధనలు చేస్తారో ఊహించలేముగాని, ప్రస్తుతానికి అట్టి గౌరవాన్ని పొందిన తొలిరచన కావడం "మాతృశ్రీ తత్త్వసౌరభం" ప్రత్యేకత. ఆమె "సహజప్రేమ" గురించీ, "ఆశ్చర్యకర వాత్సల్యం" గురించీ, అపూర్వ తాత్త్విక చింతన గురించీ బ్రహ్మసూత్రాల వంటి అద్భుతమైన ఆలోచనాగర్భిత అమ్మసూత్రాలను గురించీ, సూక్తుల గురించీ ఎన్నో విశ్వవిద్యాలయాలలో పరిశోధనలు జరగవచ్చు. వాటికి డాక్టరేట్ల ప్రదానం జరగనూవచ్చు. కాని, తొలి పిహెచ్.డి పరిశోధన గ్రంథంగా "మాతృశ్రీ తత్త్వసౌరభం" స్థానం చెరగిపోనిదీ, తిరుగులేనిదీ.

అమ్మనుగురించి పుస్తకాలు వ్రాసిన వారిలో దాదాపు అందరూ అమ్మను స్వయంగా దర్శించి, స్పర్శించి, మాట్లాడి అనుభవాలు పొందినవారే. అందులోనూ చాలామంది అమ్మ ప్రేరణతోనే రచన చేశామని ప్రకటించుకొన్నారు. "మాతృశ్రీ తత్త్వసౌరభం" రచించిన డాక్టర్ బి.యల్.సుగుణ గారిది కూడా అదేమాట. అదే భావనను మరింత విస్తృతపరచి "అన్నింటికి ప్రేరణ తానై నన్ను నడిపిస్తూ ఉన్నది" అని "నివేదన"లో వ్రాసుకొన్నారు. "తెలిసీ తెలియని వయస్సులో ఎదిగీ ఎదగని మనస్సుతో తాను జిల్లెళ్ళమూడిలో అడుగుపెట్టిన" క్షణం నుంచి, అమ్మ శరీర పరిత్యాగానికి ముందు తనను దగ్గరకు పిలిచి "పరిశోధన చెయ్యమ్మా!" అని

చెప్పడం వరకు వివిధ ఘట్టాలను గమనిస్తే అమ్మ ఆమెను ఎలా తీర్చిదిద్దిందో స్పష్టంగా తెలుస్తుంది. ఆమే కాదు, నేనైనా, మీరైనా మరెవరైనా అమ్మను చూద్దామనే ఆలోచన కలిగిన క్షణం నుంచి అమ్మ ఆలయప్రవేశం వరకు జీవితంలో జరిగిన సంఘటనల, పరిణామాల క్రమాన్ని పర్యావలోకనం చేసి, ఆలోచించుకుంటే మన జీవితాలనూ అమ్మ నడిపించిన తీరు మనకు స్పష్టమవుతుంది. ప్రేరణ అమ్మదే అయినా ఇంతవరకు వచ్చిన గ్రంథాలలో దేని విశిష్టత దానికుంది. తెలుగులోనే కాదు, సంస్కృతంలోనూ, ఇంగ్లీషులోనూ వచ్చిన గ్రంథాలలో సైతం వ్రాసినవారి స్వీయానుభవాల, ఆలోచనల (subjectivity) ప్రభావం కనిపిస్తున్నది. అదే ఆయా గ్రంథాలకు విశిష్టత చేకూర్చి ఉంటుంది. అమ్మ జీవితవిశేషాలను, ఆమె అసాధారణ వ్యక్తిత్వాన్నీ, జీవితాంతం ఆమె మాటలలో, చేతలలో వైరుధ్యం లేకపోవడాన్నీ చెప్పడంలో సుగుణ గారికి సంస్కృతం, తెలుగు సాహిత్యాలలో ఉన్న పరిజ్ఞానం ఉపయోగపడింది. ఒకానొక విశేషాన్ని ఎరుకపరిచేటప్పుడు శంకరుల వారి ఆత్మానాత్మ విచారణశ్లోకమో, గీతావాక్యమో, కొడాలి సుబ్బారావు గారి పద్యమో, నదీరా పాట చరణమో ఆమె ఉటంకించిన తీరు ఎవరికైనా ఈ అభిప్రాయాన్ని కలిగిస్తుంది.

ఆరితేరిన ఆచార్యుల మార్గదర్శనం వల్ల కావచ్చు, సుగుణగారి సహజ ప్రతిభ వల్ల కావచ్చు, "మాతృశ్రీ తత్త్వ సౌరభం"ఒక మంచి ప్రణాళికతో రూపొందింది. సిద్ధాంతవ్యాసాన్ని యథాతథంగా కాక, అందరికీ అందుబాటులోకి తేవాలనే ఆలోచనతో కొన్నిమార్పులు చేసి ఈ గ్రంథాన్ని వెలువరించారు. ఇందులో మూడు అధ్యాయాలు ఉన్నాయి. "మాతృశ్రీ జీవన సౌందర్యరేఖలు" అమ్మ జీవిత విశేషాలను, తెలిసినవారు చదివినప్పుడు సైతం 'ఇది చెప్పలేదే' అనిపించనివిధంగా ముప్పది పేజీలలో కుదించి చెప్పిన అధ్యాయం. అమ్మ జీవిత చరిత్ర ఒక మహోదధి అని చాలామందికి తెలుసు. ఐనా దానిని అరచేతిలో తీర్థప్రమాణస్థాయికి తగ్గించడానికి అసాధారణ ప్రతిభ అవసరమవుతుంది. అమ్మ జీవితంలో ఒక ముఖ్యపాత్ర 'రహి'. అందరికి అతడి పేరు తెలుసు. కాని అతడిని చూసి ఫలానా అని గుర్తించిన వారెవరూ నాకు తెలిసి లేరు. మూసిన కన్ను తెరవకుండా మూడు

రోజులపాటు ఒక బావి ప్రక్కన ముసుగు కప్పుకొని అనారోగ్యంతో పడున్న అతడికి పరిచర్యలు చేసి ప్రాణం పోసింది అమ్మ. ఈ సంఘటనను తగినంత వివరంగా అధ్యాయంలో చేర్చగలిగారు సుగుణగారు. రెండవ అధ్యాయం "అమ్మ అసాధారణ వ్యక్తిత్వం". ఆమెను పోల్చడానికి మహనీయుల చరిత్రలలో మరొకరెవరూ కనిపించరు. 'సృష్టి అనాది, నాది' అని ప్రకటించిన ఆ మహా మహిమాన్వితకు వర్తించగల మరొక్క పదవి లేదు, ఆమే స్వయంగా ప్రకటించుకొన్న 'అమ్మ' అనే మాట తప్ప. సంప్రదాయాలను అనుసరిస్తూనే సంప్రదాయ గతిని మార్చడం ఆమెకు మాత్రమే చెల్లింది. ఐనా, 'ఆమెను ఎవరూ "సంస్కర్త" అనలేదు. 'ప్రేమ నాకు సహజం' అని ప్రకటించిన వారూ మరొక్కరు లేరు. అది కేవలం ఆమె మాట. "అమ్మ వాక్యాలు- విజ్ఞాన వీచికలు" మూడవ అధ్యాయం. తరచినకొలదీ మరింత మరింత లోతైన అర్థాలను స్ఫురింపజేసే విధంగా అమ్మ వాక్యాలలో కొన్నింటిని ఎంచుకొని, అవి అమ్మమూర్తిమత్వాన్ని ఎలా ఆవిష్కరింపచేశాయో తెలియజేశారు డాక్టర్ సుగుణ. అందుకు ఎంచుకున్న పదాలు అమ్మ మాటలవలెనే అతి తేలికైనవి, సులభంగా అర్థమయ్యేవి.

డాక్టర్ సుగుణ ఈ గ్రంథరచనను అమ్మ లీలగా భావించారు. అంతేకాదు, 'అమ్మను దర్శించి, అమ్మ ప్రసాదించిన వాక్కులతోనే ఈ రచన చేసినట్లు ఆమె గ్రంథం ముగింపు వాక్యాలతో వ్రాశారు. పరిశోధన కోసం చాలా కష్టపడినట్లు చెప్పకపోవడమే కాక, తన రచన అమ్మ లీల అనటం ఆమె వినయ సౌశీల్యం.

అమ్మ జీవితాన్ని గురించీ, అమ్మ తత్త్వాన్ని గురించి ఇంత తక్కువ పేజీలలో వ్రాయడమే గాక, అమ్మ సూక్తులలో తన దృష్టిలో ముఖ్యమైనవన్నీ ఏరి, చివరి అధ్యాయంలో కూర్పుచేసిన డాక్టర్ సుగుణ గారి ఈ గ్రంథం అమ్మను గురించి తెలుసుకోవాలనుకునే కొత్తవారికి "కొండను అద్దమందు చూపిన" విధంగా ఉపయోగపడుతుంది. అమ్మను గురించి అంతా తెలుసుననుకొనే వారికి సైతం మళ్లీ మళ్లీ చదవాలనిపిస్తుందికూడా. ఇంతమంచి "ప్రామాణిక గ్రంథం" వ్రాసిన డాక్టర్ సుగుణకు హార్దికాభినందనలు.

శుభాశీస్సులు

'విద్యావాచస్పతి'
డా॥ పన్నాలరాధాకృష్ణ శర్మ
వ్యవస్థాపక ప్రాచార్యులు, మాతృశ్రీ ఓరియంటల్ కళాశాల

'మాతృశ్రీ తత్త్వ సౌరభం' అన్న గ్రంథమును రచించిన సుగుణ సౌజన్య వినయములు మూర్తీభవించిన వ్యక్తి. 'మాతృశ్రీ ప్రాచ్య కళాశాల' అను నందనవనంలో ఆవిర్భవించిన ఉదాత్త దివ్యలత ఈ రచయిత్రి.

'మాతృశ్రీ దివ్య జీవన సౌందర్యరేఖలు' అను విభాగంలో వాత్సల్యమూర్తి అయిన అమ్మను గురించి స్పష్టమైన అవగాహన కలుగుతుంది. ఈ విభాగంలో అమ్మ శైశవం నుండి మహాభినిష్క్రమణం వరకు ఎన్నింటినో అమ్మ జీవిత దశలను రచయిత్రి తల స్పర్శగా స్పృశించింది.

'అమ్మ అసాధారణ వ్యకిత్వం' అన్న విభాగంలో అమ్మ 'తార్కికత-తాత్త్వికత', 'సేవాపరాయణత', ' ఉదాత్తగృహిణీధర్మం', 'సంభాషణ చాతుర్యం', 'అసాధారణ ధారణ' మొదలగు విషయాలను నిసర్గసుందరంగా రచయిత్రి వివరించింది.

'అమ్మ వాక్యాలు- విజ్ఞానవీచికలు' అన్న విభాగంలో అమ్మ చెప్పిన అపూర్వ నిర్వచనాలను 'మానవత్వం- మాధవత్వం', 'ముముక్షుత్వమే మోక్షం', 'మృత్యుంజయత్వం', 'సంకల్పరాహిత్యం', 'అద్వైతం' మొదలగు విషయములను లలితవచన విన్యాసంతో హృదయంగమంగా రచయిత్రి విశదీకరించింది.

'జ్ఞానదీపికలు' అనెడి విభాగంలో అమ్మ సూక్తులను యధాశక్తిగా లోతుగా పరిశీలించి చక్కగా అవగతం చేసింది. ఈ గ్రంథం చదివినవారికి అమ్మ యొక్క విశ్వరూపం, విశ్వజనీనత ప్రస్ఫుటంగా తెలియగలవు. ఈ సాహిత్యకుసుమమును అమ్మ పావన పాదపద్మములకు సమర్పించిన సౌభాగ్యవతి, ఆయుష్మతి అయిన డా॥సుగుణ సర్వధా అభినందనీయురాలు. ఆమెకు సర్వశ్రేయములను ప్రసాదింపవలసినదిగా పరమేశ్వరిని ప్రార్థించుచున్నాను.

శ్రీమాతృచరణాంభోజ బంభరాయిత మానసా ।
జీయా దన్వర్థ నామ్నీయం సుగుణా సాధుభాషణా ॥

అమృతాశీస్సులు

విఠాల రామచంద్రమూర్తి
విశ్రాంత ప్రాచార్యులు
మాతృశ్రీ ఓరియంటల్ కళాశాల

'అమ్మ వ్యక్తి కాదు, అనంతమైన శక్తి' అనే మాటలను నిరూపించే సంఘటనలను అమ్మ మహోజ్జ్వల చరిత్ర నుండి క్రోడీకరించి, సరళ సుందరంగా అందించిన ఘనత డా॥సుగుణది. 'నా జీవితం అబద్ధం–చరిత్రబద్ధం' అన్న అనంత వాత్సల్యజలధి అమ్మ. మనం తీసికెళ్ళిన పాత్రను బట్టి కొంత జలం మనం తేగలం. త్రికాలాబాధ్యమైన మధురమైన సత్యం అమ్మ. రూపం, మాటలు, చేతలు, భావాలూ అన్నీ రమణీయాలే. నిరంతర స్మరణీయాలే.

అంతటా అవ్యాజ వాత్సల్యవర్షమే అమ్మ చరితము. "వసంతవత్ లోకహితం చరంతః" అన్నట్లుగా

"అనుభవతి హి మూర్ధ్నా పాదపః తీవ్రముష్ణం
శమయతి పరితాపం ఛాయయా సంశ్రితానాం"

తాను సూర్యతాపాన్ని సహిస్తూ ఆశ్రితులకు నీడనిచ్చే చెట్టులాంటిది అమ్మ.

జిల్లెళ్ళమూడిలో ఎల్లవేళలా అందరికీ అన్నంపెట్టే అన్నపూర్ణాలయంగా, మనశ్శాంతిని ప్రసాదించే దేవాలయాలుగా, మనుగడకు మార్గదర్శనం చేసే విద్యాలయాలుగా అమ్మ తనను తాను ఆవిష్కరించుకొంది. ఆ నీడలో అమ్మ దర్శన, స్పర్శన ఆలాపాదుల వల్ల తృప్తినీ, ధైర్యాన్నీ, శాంతిని పొంది తరించిన, తరిస్తున్న వారెందరో. ఆ అదృష్టానికి, అమ్మ అనుగ్రహానికి పాత్రురాలైన డా॥సుగుణ ధన్యురాలు. అమ్మ సన్నిధిలో చదువుకొని, ఆ కాలేజీలోనే లెక్చరర్‌గా, ప్రిన్సిపాల్‌గా అమ్మసేవకు అంకితం కావడం విశేషం, ప్రశంసార్హం. తన స్థితిగతులకు మూలకారణం అమ్మ అనడం సౌభాగ్యవతి సుగుణ విద్యావినయ సౌశీల్యాలకు నిదర్శనం.

'నీకిచ్చింది తృప్తిగా తిని, యితరులకు ఆదరంగా పెట్టుకో' అన్నది అమ్మచూపిన వెలుగుబాట.

1. నీకు ఇచ్చింది : నువ్వు ఇప్పుడు అనుభవిస్తున్న సుఖశాంతులు నీ ప్రయోజకత్వం వల్ల నీవు సంపాదించినవి కావు. నీకు దైవానుగ్రహం వల్ల లభించినవి. ఎందుకంటే నీకన్న తెలివైనవాళ్ళు సంపన్నులు ఈ మాత్రంగా లేరు.

2. తృప్తిగా తిని : మనకు లభించింది కొంచెమైనా, ఎక్కువైనా సంతృప్తి పడాలి. ఎంతున్నా ఇంకా ఇంకా కావాలనుకుంటే కష్టాల పాలౌతారు.

వ్యాప్తిం బొందక వగవక
ప్రాప్తంబగు లేశమైన పదివేలనుచున్
తృప్తింజెందని మనుజుడు
సప్త ద్వీపములనైన జక్కంబడునే'

"సంతోషికాడేని శక్రుడైన నశించు" అని భాగవతం.

అందువల్ల లభించిన దాన్ని తృప్తిగా అనుభవించు. చాలామంది ఇక్కడే ఆగిపోతున్నారు. ఇక్కడ కామాయేకాని ఫుల్‌స్టాప్ కాదు.

3. ఇతరులకు ఆదరంగా పెట్టుకో : నీవు, నీ భార్యాబిడ్డలు అనుభవించడానికే కాకుండా ఇతరులకు కూడా పెట్టాలి. యథార్థానికి ఇతరులు కూడా నీవారే. నీవే వాళ్ళకు కూడా, నేనేదో వాళ్ళకు సహాయం చేస్తున్నాను, వాళ్ళను ఉద్ధరిస్తున్నాను అనే భావంతో కాకుండా ఆదరంతో పెట్టాలి. నా తృప్తికోసం. నాకోసమే ఇస్తున్నాను అనే నిశ్చయజ్ఞానం ఉండాలి. అందుకే అమ్మ 'పెట్టు', అనకుండా 'పెట్టుకో' అన్నది.

'తానొక గడ్డకట్టుకొని, తత్పరతన్ శిలలై నశించు న
జ్ఞానుల కేడనోయి సుఖసంగతి, తా తన యాలు, ఆత్మసం
తానము, తోడబుట్టువులు, తల్లియు, తండ్రి, కులమ్ము, దేశమున్
మానవులెల్ల ప్రాణులు కుమార! సమస్తము తాను కావలెన్.'

అని సౌందరనందం.

"సర్వత్రానురాగమే విరాగ"మని అమ్మ మాట.

'కలౌ స్మరణా న్ముక్తిః' అన్నారు పెద్దలు. అమ్మస్మరణ ఆనందదాయకం. ఆ స్మరణ రూపమైన సాధనకు పరమోపయోగంగా, పారాయణ యోగ్యంగా విరచితమైన యీ గ్రంథం (పరిశోధన వ్యాసం) సౌభాగ్యవతి సుగుణ తపఃఫలం.

ఇంత సంగ్రహంగా, సమగ్రంగా అమ్మను పాఠకులకు, సాధకులకు చూపించిన సుగుణ ప్రయత్నం సఫలమని అభినందిస్తూ అన్ని రంగాల్లో సుగుణను గెలిపించమని జ్ఞాన శిఖరాగ్రాన, దేవతామూర్తి అయిన అమ్మను ప్రార్థిస్తున్నాను.

'జయహో మాతా'

అమ్మ కృపావర్షమే ఈ రచన

శ్రీమతి బ్రహ్మాండం వసుంధర

ప్రేమామృత వర్షిణి జిల్లెళ్ళమూడి అమ్మ ప్రత్యక్షంగా ఎంతోమందికి ఎన్నో రీతుల అనుభూతుల్ని ప్రసాదించింది. మనం పొందే అమ్మ ప్రేమ తత్వాన్ని ఇతరులకు అందించగల వరం సుగుణకు ప్రసాదించింది.

అమ్మ చిన్నకుమారుడైన రవి వివాహ సందర్భంగా అమ్మ అడవులదీవిని పావనం చేసింది. ఆగ్రామ వాస్తవ్యులైన తలగడదీవి వెంకట సుబ్బారావు గారి కుటుంబం అమ్మను దర్శించుకున్నారు. వారి తృతీయ పుత్రిక అయిన సుగుణకు అమ్మను దర్శించగానే అమ్మ దగ్గర ఉంటే బాగుంటుంది అని అనిపించిందట.

సోదరి వివాహానికి వచ్చిన సుగుణను అమ్మ తన దగ్గరకు పిలిచి ఇక్కడి కళాశాలలో చదువుకోమని చెప్పింది. అమ్మ సూచన మేరకు జిల్లెళ్ళమూడి కళాశాలలో చేరి విద్యనభ్యసిస్తున్న సుగుణ విశ్వవిద్యాలయంలో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణురాలై, కుటుంబ బాధ్యతను కూడా స్వీకరించింది. అమ్మ అనుగ్రహంతో ఆ కుటుంబం స్థిరపడింది.

ప్రత్యక్షంగా బాధ్యత స్వీకరించిన అమ్మ, సుగుణను జిల్లెళ్ళమూడి మాతృశ్రీ ఓరియంటల్ కళాశాలలోనే అధ్యాపక వృత్తిలో నియోగించింది.

కళాశాలలో మంచి విద్యార్థినిగానూ, విద్యార్థినీ విద్యార్థులలో గౌరవార్హురాలైన అధ్యాపకురాలిగాను వన్నెకెక్కేలా అమ్మ తీర్చిదిద్దింది.

అమ్మ ఈ అనంతశక్తిలో లీనమవటానికి పయనించబోతూ ఒక రోజున సుగుణను చేరబిలిచి సుగుణ చేతిని తన చేతిలోకి తీసుకుని తన అమృత హస్తంతో పి.హెచ్.డి చేయమని లిఖించింది. అమృతకరావలంబం అందుకున్న సుగుణ మనస్సు ఆనంద సాగరమైంది. అంశం అమ్మ వ్యక్తీకరించపోయినా అమ్మను గురించే పరిశోధన చెయ్యాలన్న ప్రేరణను అమ్మ సుగుణకు కల్పించింది.

అమ్మ దగ్గరకు వచ్చే అనుంగు బిడ్డల్లో ఎందరో విద్యాధికులున్నారు. ఎందరో ప్రొఫెసర్లున్నారు. కాని మరెవ్వరికీ అందని అవకాశాన్ని, తొలిగా అమ్మను గురించి పరిశోధనచేసే ఘనతను అమ్మ సుగుణకే దక్కించింది.

అమ్మ అనుజ్ఞ పొందిన సుగుణ తెలుగు విశ్వవిద్యాలయంలో పరిశోధన చేసింది. "మాతృశ్రీ తత్త్వ సౌరభం" అని ముద్దుగా నామకరణం చేసింది. అమ్మలోని మాతృత్వం, ప్రేమ, త్యాగనిరతి, కరుణరసాన్ని పొందుపరచి అందిస్తూ అమ్మ తత్వసౌరభాన్ని అందరికీ వెదజల్లింది. మనమూ వాటిని ఆఘ్రాణిద్దాం, ఆస్వాదిద్దాం.

అమ్మ పాటించిన మంత్రం 'సరే' మంత్రం.

సుగుణ ఇతరుల నొప్పింపక, తానొవ్వక, 'సరే' మంత్రాన్నే పాటిస్తుందేమో అనిపిస్తుంది. సాత్విక స్వభావంతో నిండైన హృదయంతో పిన్నల, పెద్దల ఆదరాభిమానాలను చూరగొన్నది.

అమ్మ గురించి వాస్తవాన్ని ఆర్ద్రంగా ఎదుటివారి హృదయం స్పందించేలా, ఎంతసేపు విన్నా మరింతసేపు మాట్లాడితే బాగుంటుందనిపించే విధంగా ప్రసంగిస్తూ పలువురి ప్రశంసలందుకున్నది.

బాల్యం నుండీ అమ్మ భక్తులైన కుటుంబంలోని వ్యక్తి సుగుణ జీవన సహచరులు రామచంద్ర. అమ్మ పరిపూర్ణానుగ్రహంతో అమ్మ సేవల్లో పాలుపంచుకుని తన జీవితాన్ని సార్ధకం చేసుకుంటున్న రామచంద్ర దొరకటం సుగుణ అదృష్టం. అమ్మకిష్టమైన పుత్రుని పేరు రహి. అందువల్ల తమ పుత్రునికి రహి అని, తమ కుమార్తెకు అనసూయా దీప్తి అని పేర్లు పెట్టుకున్న తీరు చూస్తే, వారూ అమ్మసేవలో తరించాలనే కోర్కె ఈ దంపతుల్లో పుష్కలంగా ఉన్నది అని తెలుస్తుంది. వారి కోరికను మన్నించి వారిపై కృపావృష్టిని కురిపించాలని అమ్మను ప్రార్ధిస్తున్నాను.

జయహో మాతా

పేరూ తీరూ సుగుణే

బ్రహ్మాండం రవీంద్రరావు
ప్యాట్రన్, శ్రీ విశ్వజననీ పరిషత్

సోదరి సుగుణ రచించిన 'మాతృశ్రీ తత్త్వ సౌరభం' అను గ్రంథం అమ్మ తత్త్వంపై విశ్వవిద్యాలయ స్థాయిలో వెలువడిన ప్రథమ పరిశోధనా గ్రంథం. ఈ గ్రంథంలోని అంశాలు అక్షరసత్యాలు, అతిశయోక్తులకు అతీతాలు.

అమ్మ యొక్క ప్రథమ దర్శనంలోనే మానసికంగా చేరువయి, అనతికాలంలోనే అమ్మ అండను చేరుకోగలిగింది సుగుణ. ఎందరో జ్ఞానులు, మేధాసంపన్నులు, విద్యాధికులు అమ్మను దర్శించారు. కాని ఇందరిలో అమ్మ తన చరిత్రపరిశోధనకు ప్రథమవ్యక్తిగా సార్ధక నామధేయురాలైన సోదరి సుగుణను ఎంచుకున్నది. అనుగ్రహించింది.

"పిన్నవయస్సులోనే పెద్ద మనస్సు", "సంప్రదాయానికి అమ్మ కొత్త నిర్వచనం" వంటి శీర్షికలలో అమ్మ అసాధారణ వ్యక్తిత్వం వ్యక్తమౌతుంది. "సాధ్యమైనదే సాధన" వంటి అంశాలు ఆచరణాత్మక సందేశాన్ని వినిపిస్తాయి. మనం అమ్మ సంభాషణలను విన్నాము. కొన్ని సంఘటనలను, కొన్ని సన్నివేశాలను ప్రత్యక్షంగా చూశాము. ఈ గ్రంథం చదువుతున్నప్పుడు వర్తమానంలో వుండి చరిత్రగా గోచరిస్తున్నప్పుడు ఎంతో ఉద్వేగానికి గురిచేస్తుంది. రచయిత్రిగా సుగుణ ఈ చరిత్రలో తానూ ఒక పాత్రయి వ్యవహరించిందని అనిపిస్తుంది.

1985లో ఒక రోజున అమ్మ శ్రీ పి.యస్.ఆర్. ఆంజనేయప్రసాద్ గారికి తన సమకాలీన చరిత్రను గ్రంథస్థం చేయమని సూచన చేసింది. అమ్మ మాటలన్నీ అమ్మ నిర్ణయాలు కావని నా అనుభవం. కారణం, అమ్మ మాట ఆంజనేయప్రసాద్ గారి దగ్గర వ్యక్తమైతే, అమ్మ నిర్ణయం సోదరి సుగుణను ప్రేరేపించింది. అమ్మ తన జనన కాలం నుంచి, ఈనాటి చరిత్ర వరకు సమగ్రంగా సమీక్షించే అదృష్టం సుగుణకు ప్రసాదించింది. ఇంతటి అత్యద్భుత గ్రంథాన్ని అందించిన సోదరి సుగుణను మనసారా అభినందిస్తున్నాను. ఆమె కలం నుండి మరిన్ని గ్రంథాలు రావాలని కోరుకుంటున్నాను. ఆమె ఇంతటి ఉన్నత స్థితికి ఎదగటంలో అనుక్షణం ప్రోత్సహించి తన వంతు పాత్ర పోషించిన రచయిత్రి భర్త శ్రీ భట్టిప్రోలు రామచంద్రగారికి అభినందనలు తెలుపుతూ, వారి కుటుంబ సభ్యులందరిపై అమ్మ అనుగ్రహం అనుక్షణం ప్రసరించాలని మనసారా కోరుకుంటున్నాను.

ఆత్మీయ అభినందన

పురుషోత్తమ పుత్రభార్గవ

పి.యస్.ఆర్.ఆంజనేయప్రసాద్

సంపాదకులు, విశ్వజనని

కరస్పాండెంట్, మాతృశ్రీ విద్యాపరిషత్ విద్యాసంస్థలు

చిరంజీవి సుగుణ మా కళాశాల విద్యార్థినిగా నాకు తెలుసు. తెలివిగల పిల్ల. చక్కగా చదువుకొని చదువుకున్న కళాశాలలోనే అధ్యాపకురాలుగా చేరి, సమర్థురాలైన అధ్యాపకురాలిగా పేరు తెచ్చుకున్నది. అమ్మను గూర్చి అనర్గళంగా శ్రోతల హృదయాలకు హత్తుకునే రీతిలో మాట్లాడగలిగిన ఉపన్యాస విన్యాసాన్ని సాధించింది. ఎంత జ్ఞాపకశక్తి, ఎంత మేధస్సు, గురువులకు కూడా అసూయ కలిగేంత వచో వికాసాన్ని సాధించింది. ఆచార్యత్వం నుంచి అనతికాలంలోనే ప్రాచార్యత్వాన్ని కూడా అందుకున్న ప్రజ్ఞాశాలి. దానికి తోడు ఆమెకున్న వినయశీలత బంగారానికి తావి అబ్బినట్లున్నది.

అమ్మవద్ద చదువుకొని, అమ్మ స్థాపించిన కళాశాలలో ఉద్యోగిస్తూ, అమ్మను గూర్చిన సాహిత్యంపై పరిశోధనచేసి డాక్టరేటు పట్టా సాధించింది. ఈనాడు సామాన్యంగా పరిశోధనలు సాహిత్యలోకంలో నిలబడేతంగా ఉంటున్నవని లోకం ఒప్పుకోవటం లేదు. ప్రతిభాసంపన్నులు లేరనికాదు. తక్కువనే వైమర్శికలోకం భావిస్తున్నది.

సరే, ఇక అమ్మను గూర్చిన సాహిత్యం కూడా తక్కువ రాలేదు. సంస్కృతాంధ్ర ఆంగ్లభాషలలో 150 గ్రంథాల దాకా వచ్చాయి. ఇతర భాషలలో కూడా ఒకటో రెండో వచ్చాయి. వాటన్నిటినీ అవలోకం చేసి వాటిలోని సారాన్ని గ్రహించి ఒక క్రొత్త విషయాన్ని ప్రతిపాదించగలిగినప్పుడు గదా! పరిశోధకుల నైపుణ్యం తెలిసేది.

ఈ పరిశోధనలోని ప్రత్యేకత ఏమిటంటే అమ్మతత్త్వ జలధిలో ఆణిముత్యాలు ఏరి, వాటిని వివరించటంలో, విశ్లేషించటంలో సుగుణ తన ప్రతిభాపాటవాలను చూపించటం. మానవులు తరించటానికి అమ్మ చెప్పిన సులభ

సూత్రమైన, ఆచరణయోగ్యమైన విషయాలను బ్రహ్మసూత్రాలు, ఉపనిషత్తుల జోలికిపోయి సామాన్యునికి గహనం చేయకుండా హాయిగా తేలికగా అర్థమయ్యే భాషలో వివరించటంలో తన నైపుణ్యాన్ని ప్రదర్శించింది సుగుణ. ఉదాహరించిన శ్లోకాలుగాని, పద్యాలుగాని అందరికీ అందుబాటులో ఉండే భాగవతము, భగవద్గీత, చిన్నప్పుడు చదివిన వేమన శతకం వంటి వాటినుండే తీసుకున్నది.

అసలు అమ్మను మించి సులభంగా చెప్పగలిగిన వారీ సృష్టిలోనే లేరు. అమ్మే శబ్దము-శబ్దబ్రహ్మము కదా! అమ్మచేసిన అర్థవంతమైన శాబ్దిక చమత్కారాలు, పదకేళీ విన్యాసాలు, సంభాషణా చాతుర్యాలు అనుభవించినవారికి తెలుసు - కనీసం చదివి తెలుసుకోవాలి. ఆ అమ్మ చరిత్రను, ఆ తత్త్వాన్నీ లోకానికి అందించాలని చేసిన కృషి ఫలితంగా వెలువడిన బృహత్తరమైన పరిశోధనా గ్రంథం నుండి అమృతగుళికల వంటి ఘట్టాలను ఏరి రసాయనం చేసి మనకందించింది సౌభాగ్యవతి సుగుణ. 'పుత్రవత్ సర్వభూతాని' అని ఆచరణలో చూపించిన ఒక ఆదర్శగృహిణిగా, దేవులాడినా దొరకని దేవతగా, అందరికీ సుగతేనని చాటి చెప్పగల చైతన్యమూర్తిగా మన మధ్య మసలిన ఒక మహత్తరశక్తిని అద్దంలో చంద్రునివలె చూపించిందీ గ్రంథంలో రచయిత్రి. శరీరం ధరించి కూడా ఆకాశంలో నక్షత్రాలను గంపలో నేరేడు పళ్ళలా చూడగలిగిన అమ్మను గూర్చి మనం ఎంతని చెప్పగలం?

ఏమైనా అమ్మచరిత్ర ఒక వంద, నూట యాభై పేజీలలో వస్తే బాగుండును - అనుకుంటున్న కాలంలో ఈ గ్రంథం వెలువడింది. ఇది ఆలోటును కొంత తీర్చవచ్చు. డాక్టర్ సుగుణను అభినందిస్తూ నిత్యవిద్యార్థిగా అమ్మను ఇంకా ఇంకా తరచి చూచి మహత్తరమైన అమ్మతత్త్వాన్ని లోకానికి అందిస్తుందని భావిస్తాను - భవతు.

నిత్యపారాయణ గ్రంథము

బొప్పూడి రామబ్రహ్మము
రిటైర్డ్ జి.యమ్.ఆంధ్రాబ్యాంకు
పూర్వాధ్యక్షులు, శ్రీవిశ్వజననీపరిషత్;
అభివృద్ధి సంఘాధ్యక్షులు, మాతృశ్రీ విద్యా పరిషత్

లక్ష్మి సుగుణ అక్కయ్యతో గత 15 సం॥లుగా పరిచయం. అమ్మ ఒడిలో పెరిగి, అమ్మబడిలో చదువుకుని, అమ్మ చేత తీర్చిదిద్దబడింది. అమ్మ దగ్గర ఉద్యోగము చేసే మహద్భాగ్యము కలిగినది. అమ్మతో సంభాషించే అవకాశము దొరికినది. 'విద్యా దదాతి వినయం' అన్న సూక్తికి గీటురాయి, సార్థక నామధేయురాలు సుగుణ.

పరిశోధనచేయమని అమ్మే ప్రేరణ యిచ్చింది. మాతృశ్రీ విద్యా పరిషత్ అధ్యక్షునిగా తగు ప్రోత్సాహమివ్వటము నా బాధ్యతగా భావించి ఒత్తిడి చేసేవాడిని. తల్లిగా, గృహిణిగా, అధ్యాపకురాలిగా తన కర్తవ్యాన్ని శ్రద్ధా భక్తులతో, దీక్షతో నిర్వహిస్తూ కొంచెము కష్టమే అయినది. 'ఇష్టమైతే కష్టమే'మిటి? సుగుణ అక్కయ్యకు డాక్టరేట్‌డిగ్రీ వచ్చినప్పుడు నాకు డాక్టరేట్ వచ్చినంతగా ఆనందించాను. వెంటనే శ్రీ విశ్వజననీ పరిషత్ అధ్యక్షునిగా పరిశోధనా వ్యాసాన్ని, పుస్తకము రూపముగ తయారుచేసి యిస్తే ప్రచురణ బాధ్యతను స్వీకరిస్తామన్నాను. కాని అమ్మ ప్రణాళిక మన ఆలోచన కన్నా మిన్నగా ఉంటుంది. ఆ తరుణము యిప్పటికి వచ్చింది. 'మాతృశ్రీ తత్త్వ సౌరభం' అనే ఈ పుస్తకము ఇప్పుడు వచ్చింది. దాదాపు ఒక దశాబ్దము గడిచినది. ఇప్పుడు రావటము లోని విశేషము సుగుణ అక్కయ్య పి. హెచ్.డితో సంతృప్తిపడి ఆగిపోకుండా, నిరంతర పరిశోధనా కృషి వలన, భావ పరిపుష్టిలు సంతరించుకుని, శాస్త్రసమన్వయము విశేషముగా జరిగినది.

అమ్మ చరిత్ర దగ్గర నుంచి, గుణవిశేషములతో, అమ్మతత్వ చింతనను అనేక కోణాలతో చూచి, సహస్ర కిరణాల వెలుగును, ఆ పరంజ్యోతిని అమ్మ బిడ్డలమైన మనందరము దర్శించగలిగేటట్లు మనముందు ఉంచింది.

అమ్మ 'భాషారూప' కనుక అమ్మ పదకేళీ విన్యాసము, అమ్మ భాషలోని ప్రత్యేకత తీరు చదివి మనము ఆనందాన్ని పొందుతాము. ఈ పుస్తకము సమగ్ర సుందరము. నిత్యపారాయణగ్రంథము. డాక్టర్ సుగుణ ద్వారా అమ్మ మరిన్ని పుస్తకాలను వెలుగులోనికి తీసుకుని రావాలని ఆకాంక్షిస్తున్నాను.

స్ఫూర్తి

కొండముది హనుమంతరావు

జీవిత సభ్యులు

కొండముది రామకృష్ణ ఫౌండేషన్

"మాతృశ్రీ తత్త్వ సౌరభం" అనే ఈ గ్రంథం శ్రీమతి సుగుణ లోగడ Ph.Dడిగ్రీ కొరకు పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి సమర్పించిన సిద్ధాంత వ్యాసం.

జిల్లెళ్ళమూడి అమ్మ "నేను గురువును కాను, మీరు శిష్యులు కారు; నేను దైవాన్ని కాను, మీరు భక్తులు కారు; నేను అమ్మను మీరు బిడ్డలు" అని అతి సామాన్యంగా ప్రకటించినప్పటికీ అమ్మ జీవితం ఒక మహోదధి; అమ్మ తత్త్వం ఆద్యంతరహితమైన ఆకాశం.

అట్టి అమ్మ జీవితాన్ని, తత్త్వాన్ని శోధించి, పరిశోధించి ఈ సిద్ధాంత వ్యాసరాజాన్ని శ్రీమతి సుగుణ సమర్పించారు. అందులోని వస్తు వైవిధ్యాన్ని, తత్త్వవిశేషాన్ని విశ్వవిద్యాలయం అంచనా వేసుకుంది. రచయిత్రి యొక్క విశ్లేషణ సామర్థ్యాన్ని, గుణాత్మక విమర్శనా పటిమను పరిగణనలోకి తీసుకుంది. తదనుగుణంగా సుగుణను డాక్టర్ సుగుణగా గుర్తింపు ప్రదానంచేసి గౌరవించింది.

సాధారణంగా డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (Ph.D) కొరకు సాహిత్యరంగంలో పరిశోధన చేసే విద్యార్థులు - నాకు తెలిసినంతవరకు - ఒక ప్రముఖకవి రాసిన గ్రంథం మీద పరిశోధన చేస్తారు. అది ప్రాచీనకవి కాళిదాసు విరచిత "అభిజ్ఞాన శాంకుంతలం" కావచ్చు, లేదా సంప్రదాయకవి జ్ఞానపీఠ బహుమతి గ్రహీత విశ్వనాథ సత్యనారాయణ గారు రాసిన "రామాయణ కల్పవృక్షం" కావచ్చు. లేదా ఆధునిక గేయకవితా సారథి మహాకవి శ్రీశ్రీ కలం నుంచి వెలువడిన "మహాప్రస్థానం" కావచ్చు. మరికొందరు విద్యార్థులు జానపదగేయ సాహిత్యం, ఆధునిక భావకవిత్వం, తెలుగునాట అవధాన విద్య మొదలైన వాటిలో ఏదో ఒక అంశంపై పరిశోధన చేస్తారు. కాని ఈ రచయిత్రి నూతన దృక్పథంతో అమ్మతత్త్వంపై విస్తృత పరిశోధనచేసి, గొప్ప విజయాన్ని సాధించారు.

అమ్మ ఆంతరంగిక కార్యదర్శిగా అమ్మ సన్నిధిలో షుమారు మూడు దశాబ్దాల పాటు పవిత్రజీవితం గడిపిన కీ॥శే॥ కొండముది రామకృష్ణ అన్నయ్య అమ్మతత్త్వాన్ని వివిధ కోణాలలో అధ్యయనం చేసి, అపూర్వ అనుభవాలను పొంది వాటిని నెలనెలా "మాతృశ్రీ" మాసపత్రికలో సంపాదకీయాల ద్వారా ఆవిష్కరించారు.

ఆ వ్యాసాలను (మాతృసంహిత) గ్రంథరూపంలో తీసుకురావాలని సంకల్పించి, వాటి జిరాక్స్‌కాపీలను కాలక్రమంలో (Chronological Order) ఏర్పాటు చేశారు. ఆ సందర్భంలో ఆ వ్యాసాలను ఆ పద్ధతిలోగాక అంశాలవారీగా (మాతృత్వం, అద్వైతం మొ॥) వర్గీకరించి గ్రంథరూపంలో ముద్రిస్తే పాఠకులకు మరింత ప్రయోజనకరంగా ఉంటుందేమో అని నేను సూచన చేశాను. కాని ఆయన తన అనారోగ్య కారణంగా, ఆ సూచనను ఆచరణలో పెట్టలేని అశక్తత వ్యక్తంచేస్తూ "భవిష్యత్తులో అమ్మతత్త్వం మీద పరిశోధన చేయదలుచుకున్న జిజ్ఞాసులకు 'మాతృసంహిత' ఆధారగ్రంథం (Source Book) గా ఉపయోగడితే చాలును. అదే పదివేలు" అన్నారు.

ఇప్పుడు అదే నిజమయింది. శ్రీమతి సుగుణ తన పరిశోధనను సమర్పించటంలో శాస్త్రీయత, సమగ్రత ప్రదర్శించారు. స్థూలంగా తన సిద్ధాంత వ్యాసాన్ని మూడు అధ్యాయాలుగా విభజించుకున్నారు.

1) **మాతృశ్రీ జీవన సౌందర్య రేఖలు :** ఇందులో అమ్మ జీవితవిశేషాలు, తన చిన్నతనంలోనే అమ్మ కుల మత లింగ వయస్సులకు అతీతమయిన తల్లి ప్రేమను చూపిన సంఘటనలను ఆర్ద్రంగా పేర్కొన్నారు.

2) **అమ్మ అసాధారణ వ్యక్తిత్వం :** ఇందులో అమ్మ అవ్యాజ ప్రేమతత్వం, ఉత్తమ గృహిణీధర్మం, సంభాషణా చాతుర్యం, అసాధారణ ధారణ, ద్వంద్వాతీత స్థితిని సోదాహరణంగా వివరించారు.

3) **అమ్మ వాక్యాలు-విజ్ఞాన వీచికలు :**
వాస్తవానికి అమ్మతత్త్వ విచారణ ఈ అధ్యాయంలోనే జరిగింది.
అమ్మ సందేశాలు ఈయలేదు - ఉపదేశాలు చేయలేదు.
అమ్మ బహిరంగ ఉపన్యాసాలు చేయదు - సామూహిక బోధనలు చేయదు.

తన నివాసంలో బిడ్డలకు దర్శనం ఇచ్చే సమయాలలో మౌనంగా ఉండి, ప్రసన్న దృక్కులతో ఆశీస్సులు అందజేస్తుంది. బిడ్డలు తమతమ సందేహాలను ఆ సమయంలో వ్యక్తంచేస్తే, వాటికి తగిన సమాధానాలను వారికి అర్థమయ్యే రీతిలో అరటిపండు వలిచి చేతిలో పెట్టినట్లుగా, తనదైన శైలిలో అమ్మ వివరిస్తుంది. "అమ్మ సంభాషణలే శాస్త్రాలసారం" (కొండముది రామకృష్ణ అన్నయ్య)

ఈ గ్రంథ రచయిత్రి తాను అర్థం చేసుకున్న అమ్మతత్త్వాన్ని అంశాలవారీగా విభజించుకున్నారు. ఇదే మూడవ అధ్యాయం.

1) అపూర్వ నిర్వచనాలు :

మృత్యుభయం లేనివాడే మృత్యుంజయుడు.

పరిమితమైన మమకారం మానవత్వం, అపరిమితమైనది మాధవత్వం.

2) పదకేళీ విన్యాసాలు : వైకల్యం లేనిదే కైవల్యం. ఇష్టం లేనిదే కష్టం.

3) జీవన సత్యాలు : అనుకున్నది జరగదు, తనకున్నది తప్పదు.

ఆశా అసంతృప్తుల కలయికే జీవితం.

4) అల్పాక్షరాలలో అనల్పార్థాలు : ధ్యాసే ధ్యానం; సహించలేనిదే హింస.

5) తత్త్వజలధిలో ఆణిముత్యాలు : నేను నేనైన నేను; ఉన్నదంతా అదే.

6) అమ్మ వాక్యాలు-సామాజిక భావనలు :

నీకిచ్చినది తృప్తిగా తిని, ఇతరులకు ఆదరంగా పెట్టుకో.

నీ బిడ్డయందు దేనిని చూస్తున్నావో అందరియందు దానిని చూడటమే బ్రహ్మస్థితిని పొందడం.

7) జ్ఞాన వీచికలు :

సంకల్పమే సంసారం; త్యాగానికి చరమదశ సర్వసంగ పరిత్యాగం.

ఇలా తన పరిశోధనను వివిధ అధ్యాయాలుగా విభజించి రామాయణ భారతభాగవత భగవద్గీత ఆధ్యాత్మిక గ్రంథాల నుంచి, జగద్గురువులు శంకరాచార్యులు, భగవాన్ శ్రీ రమణమహర్షి బోధనల నుంచి ఉదాహరణలను జోడించి సకల జనులకూ ఉపయుక్తమైన గ్రంథాన్ని ప్రచురించిన డా॥సుగుణను హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను.

నీచేతిలో వెలుగుతున్న కొవ్వొత్తితో రెండవచేతిలో వెలగని కొవ్వొత్తిని వెలిగించవచ్చు. ఇతరుల వద్ద ఉన్న కొవ్వొత్తులను వెలిగించవచ్చు. అలాగే తన ఈ గ్రంథం నుంచి డా॥సుగుణ స్ఫూర్తి పొంది మరికొన్ని ఇటువంటి రచనలను వెలువరించగలదని, అదేవిధంగా మరెందరో జిజ్ఞాసులు స్ఫూర్తిపొంది అమ్మతత్త్వ పరిశోధనలకు పూనుకొనగలరని నా ఆకాంక్ష.

అమ్మ ప్రేరణతోనే తన పరిశోధన మొదలైనదని, అమ్మ అనుగ్రహంతోనే ముందుకు సాగిందని రచయిత్రి తన "నివేదన"లో పేర్కొన్నట్లుగా అమ్మప్రేరణ, అనుగ్రహమూ పరిశోధకులకందరికీ లభించాలని అమ్మనే ప్రార్థిస్తున్నాను.

జయహో మాతా!

మలయమారుతం

డా॥ యు.వరలక్ష్మి
కార్యదర్శి, అమ్మతత్త్వ ప్రచారసమితి

అర్కపురీ వైభవాన్ని దశదిశా పరివ్యాప్తం చేస్తూ గోపురశిఖరాల్లా వెలుగులీనే మా విద్యార్థి బృందంలో 'అగ్రగణ్య' సుగుణ. పెట్టిన పేరుకే వన్నె తెచ్చింది సుగుణ వర్తనం. మాట, మన్నన, నడత, నడవడిక ఏది చూసినా మూర్తీభవించిన సౌందర్యమే సుగుణ. 'అమ్మప్రేమకు చిరునామా సుగుణ చిరునవ్వు' అని నేనంటే పరిచయమున్న ప్రతిహృదయం నాతో శ్రుతికలుపుతుంది. సుగుణతో నా అనుబంధం నాకు తెలిసి నాలుగు దశాబ్దాలు. ఏ జననాంతర సౌహృదమో ముడిపడి ఉండకపోతే అమ్మ సన్నిధిలో, మేమిద్దరం ఇలా కలుసుకొని ఉండకపోదుము. విద్యార్థినిగా సుగుణ, అధ్యాపకురాలిగా నేను అందరింటిలో అడుగుపెట్టింది ఒకేసారి. గురుశిష్యులం కొన్నాళ్ళు, సహాధ్యాపకులం మరికొన్నాళ్ళు. సూర్యచంద్రులే అంటారు మా విద్యార్థులు. ఆప్తమిత్రులు అనుకుంటారు అందరూ. అంతరంగాలు వేరయినా ఆలోచనా స్రవంతి ఒకటేనని దర్శించారేమో రామకృష్ణ అన్నయ్య మాయిద్దరినీ జంటకవులనేవారు. ఇంటింటికీ అమ్మ సందేశాన్ని అందించాలని సంకల్పించిన వజ్రోత్సవ సంరంభహేలా నేపథ్యరచనలో నేను, సుగుణ తోడునీడగా ముందుకు సాగాం. నావరకు నాకు ఆనందం అర్ణవమై మనస్సు అంబరాన్ని చుంబించాలని ఆరాటపడుతున్నా, సమస్యలతో రణానికి సమాయత్తం కాక సతమతమవుతున్నా, కలలోనైనా, కలవరంలోనైనా నాకు స్ఫురించేది నేను స్మరించేది సుగుణ. అందుకే సుదూరతీరాలలో ఉన్నా మాకు లిప్తకాలం చాలు చేరువకావటానికి. నిమిత్తాలకు నిర్వచనాలకు అందని మా అనుబంధాన్ని ఏ ఒక్క బంధానికో, బాంధవ్యానికో పరిమితం చేయటానికి నా మనస్సంగీకరించదు. ఆంతరమైన అనుభూతి అక్షరాలకు అందేదికాదు. అమ్మబడిలో ఆ మమతల గర్భగుడిలో వెలిగే చిరుదివ్వెలం మేము.

ఉత్తమ అధ్యాపకురాలిగా సుగుణను నిలబెట్టింది ప్రధానంగా ఆమె వ్యాకరణ పాఠం. తింటే గారెలు తినాలి. వింటే సుగుణగారి వ్యాకరణ పాఠం వినాలి అంటారు విద్యార్థులు. ఇన్నేళ్ళ నా అనుభవంలో బాలవ్యాకరణం,

ప్రౌఢవ్యాకరణం, అహోబలపండితీయం అక్షరం విడిచిపెట్టకుండా ఆశంకలతో సహా ధారణచేసిన ఏకైక విద్యార్థిని సుగుణ. విద్యార్థి దశలోనే విశ్వవిద్యాలయంలో సర్వప్రథమురాలిగా నిలిచి, పాఠ్యప్రణాళికామండలి సభ్యురాలిగా నియమింపబడి కళాశాల ప్రతిష్ఠను ఇనుమడింపచేసింది సుగుణ.

పాండిత్యం కృషితో సాధించవచ్చు. సౌజన్యం సహజాతం కావలసిందే. 'విద్యా దదాతి వినయం' అనటానికి నిలువెత్తు నిదర్శనం సుగుణ. నిజాయితీ నిబద్ధతలకు సౌజన్యం సౌహార్దం తోడయిన సుగుణఅంతరంగం స్నేహసౌశీల్యాలతో గుబాళించే మేలిమి బంగారం. కలిమి లేముల కష్టసుఖాల తాకిడితో అలలా ఎగసిపడటం కాక తీరంలా నిలబడగలిగిన ధీరత్వం సుగుణ వ్యక్తిత్వంలో కనిపించే విస్పష్టమైన పరిణామం. అది నిరంతర మాతృశ్రీతత్త్వ చింతనాఫలం కావచ్చు. శిలను శిల్పంగా మలిచే అమ్మ సంకల్పబలం కావచ్చు. ఏ భావాలు, ప్రభావాలు లేకుండా స్వచ్ఛంగా, స్వచ్ఛందంగా విషయాన్ని పర్యాలోచించటం సమీక్షించటం సుగుణ పరిణత ప్రజ్ఞకు తార్కాణం. ఇటీవల ఏ గ్రంథావిష్కరణ జరిగినా సుగుణ సమీక్షా ప్రసంగాలే. ఏ ఆధ్యాత్మిక పత్రిక చూచినా సుగుణ వ్యాసపరంపరలే. రాశిలోనే కాదు వాసిలోనూ మిన్న అయిన ఆ వచన రచనా విన్యాసాలు జీవన ప్రాంగణంలోకి అడుగుపెడుతున్న పసిపాప పసిడి పలుకులు కావు. అంతరంగాన్ని మథించి జీవిత పరమార్థాన్ని ఆవిష్కరించే అద్భుత ప్రవచనాలు.

పరిశోధన గురించి ప్రస్తావించవలసివస్తే 'మీరు చూస్తే నేను కనపడను, నేను కనపడితేనే మీరు చూస్తారు' అన్న అమ్మ గురించి పరిశోధన సాగించాలంటే సంకల్పం అమ్మదై వుండాలి. అమ్మ సుగుణ చేతిలో పిహెచ్.డి అన్న పదాన్ని వేలితో రాసి మరీ అనుమతినే కాదు, తన అనుగ్రహాన్నీ ప్రకటించింది. మాతృశ్రీ సాహిత్యంపై పరిశోధన చేయాలనే అభిలాష, ఆకాంక్ష సుగుణవే అయినా ఇంటా బయటా అందుకు అనుకూల వాతావరణం సమకూర్చటంలో బాధ్యత వహించిన రామచంద్ర గారు ముందుగా అభినందనీయులు. ఈ విషయంలో వారు నిర్వహించిన పాత్ర నిరుపమానం.

అనుభవం శాస్త్రాన్నిస్తుంది అనేది మనందరికీ అనుభవమే. అమ్మతో మనసా వాచా కర్మణా ఉన్న సాన్నిహిత్యం సుగుణ పరిశోధనకు రాచబాట వేసింది.

అమ్మపట్ల తనకున్న అచంచల భక్తివిశ్వాసాలను సంయమనంతో ప్రకటించటంలోను, అహమహమికయా వస్తున్న భావ పరంపరలను క్రమబద్ధీకరించటంలోను సుగుణ కృతకృత్యురాలయ్యింది. గ్రంథంలోని మూడు అధ్యాయాలను పరిశీలించి చూస్తే “ఇంతితై వటుండింతై” అన్నట్లు త్రివిక్రమస్ఫూర్తితో రచన సాగింది. అమ్మ జననం మొదలు మహాభినిష్క్రమణ వరకు సాగిన చరిత్ర రచన ప్రసన్నమై కథాకథనశైలిలో విషయ ప్రధానమై విరాజిల్లుతోంది. సామాన్య పాఠకలోకానికి సుగమంగా, స్వీయభావాలకు తావివ్వని సత్యకథనంగా జీవన రేఖా చిత్రణను పరిణతి చెందిన రచయిత్రిలా రక్తి కట్టించింది సుగుణ. అమ్మ అసాధారణ వ్యక్తిత్వ నిరూపణకు పూర్వరంగంగా జీవిత చరిత్ర ఎంత అవసరమో అంతమేరకు సంక్షిప్తంగాను సమగ్ర సుందరంగాను నిక్షేపించింది. అమ్మ గురించి సామాన్య ప్రజానీకానికి సాధారణంగా కలిగే ప్రశ్నలతో పాఠకుల మనస్సులనాకట్టుకునే రీతిలో తొలి అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. కర్తృత్వ భావన లేకుండా తన ద్వారా ఒక సత్యం ఆవిష్కరింపబడుతున్నట్లు అసంగయోగంలా రచన సాగించింది.

‘ఈ సృష్టి అనాది, నాది’ అన్న అమ్మ తద్భిన్నంగా ‘నాది సర్వసామాన్యమైన స్థితి’ అనటంలోనే అమ్మ అసాధారణత్వం, ఆలోచనాలోచనాలకు అభివ్యక్త మవుతోంది. జీవనరేఖాచిత్రం పాఠకుని మనఃఫలకంపై ప్రత్యక్షమయ్యాక అమ్మ వ్యక్తిత్వాన్ని చిత్ర వర్ణ శోభలతో వెలుగులీనే సువర్ణ వర్ణచిత్రంగా తీర్చిదిద్దటం ఎంతయినా అభినందనీయం. దివ్యమైన అమ్మ వ్యక్తిత్వ వైభవాన్ని విభిన్న కోణాలలో సందర్శించి పాఠకుల అంతరంగాలలో ఆవిష్కరించిన తీరు రచయిత్రి విశ్లేషణా వైదగ్ధ్యానికి పరిశోధనా పటిమకు నికషోపలమై నిలుస్తోంది. ప్రేమావతారమైన అమ్మ అవ్యాజప్రేమతో ప్రారంభించి ద్వంద్వాతీత స్థితి వరకు చేసిన విశ్లేషణలో అనుక్రమం అంతఃసూత్రమై అలరిస్తోంది. సూత్రప్రాయంగా చేసిన కొన్ని ప్రతిపాదనలు సిద్ధాంత గ్రంథరచనా ప్రామాణికతకు నిదర్శనాలై రచయిత్రి చిత్త సంస్కార నిరూపకాలై ముచ్చటగొల్పుతున్నాయి. అవలోకించండి :

పుట 44. ప్రశ్నలో నుండే సమన్వయ దృష్టి కలుగుతుంది. సమన్వయం కలిగిన ప్రశ్నే సూత్రంగా రూపుదిద్దుకుంటుంది.

జ్ఞానానికి మరోరూపం ప్రేమ. ప్రేమకు అభివ్యక్తి మార్గం సేవ. అమ్మ వైవాహిక జీవితం రక్తిలా మొదలయి భక్తిగా పరిణమించి ముక్తి మార్గాన్ని నిర్దేశించేదిగా ఉంది.

పుట-84. అనిర్వచనీయమైన సౌందర్యానుభూతికి అక్షరరూపాలే అమ్మవాక్యాలు

పుట-84. ఏ వ్యక్తి అయినా ఏ వస్తువయినా ఏవిషయమైనా మళ్లీ మళ్లీ కావాలన్పించే ఔత్సుక్యాన్ని కల్గిస్తే అది సౌందర్యమే.

పుట-103. సమస్యలమేఘాలే సమాధానాలను వర్షిస్తాయి. మట్టిలోనుండీ మాణిక్యాలు మందహాసం చేస్తాయి.

పుట-112. 'నేను నేనైన నేను' అన్న వాక్యం అమ్మ విశ్వతాదాత్మ్యస్థితికి మహనీయ శబ్దరూపం.

పుట-155. ప్రతివ్యక్తి పంచలోహ విగ్రహం లాగా చాతుర్వర్ణ్య మిశ్రితమైన సంపూర్ణమూర్తి.

భావబంధురమైన ఆలోచనామృతమైన యిటువంటి వాక్య విన్యాసాలు నవ్య నవనీతంలా చవులూరిస్తూనే అక్షరదీపాలై వెలుగులు నింపుతాయి.

"అమ్మ వాక్యాలు-విజ్ఞాన వీచికలు" అనే అధ్యాయం అపూర్వ నిర్వచనాలను, పదకేళీ విన్యాసాలను వివరిస్తూ అమ్మ మాటలలోని సాహిత్యతత్వాన్ని సౌందర్యానుభూతితో మేళవిస్తూ లౌకిక జీవితాన్ని ఆధ్యాత్మికతతో అనుసంధానం చేస్తూ సాధనలా సత్యశోధనలా సాగి విజ్ఞానదీధితులను వెలార్చింది. రచయిత్రి మాతృశ్రీ తత్త్వజలధిలో మునిగి పాఠకులకోసం ఆణిముత్యాలను అందంగా ఏర్చికూర్చిన అనుభూతిని అందించింది. కొన్ని వాక్యాలకు నేపథ్యాన్ని వివరించి, గాఢమైన నిగూఢమైన తాత్త్వికాంశాలను సులలిత సుందరశైలిలో మృదుమధురంగా వివరించగలగటం విశేషం. కేవలం వాక్యార్థ వివరణతో ఆగిపోకుండా ఒక సాధకుడు తాత్త్విక పరమార్థాన్ని ఎలా అందుకోవాలో, ఎలా అనుభవంలో పండించుకోవాలో ఆచరణయోగ్యంగా మార్గనిర్దేశం చేసినట్లనిపించింది. అన్నదాన ప్రాశస్త్యాన్ని వివరించే సందర్భంలో ఉపనిషద్వాణిని సమన్వయిస్తూ చేసిన

వ్యాఖ్యానం రచయిత్రి శేముషీవైభవ నిరూపకమని చెప్పక తప్పదు. సంకల్పరాహిత్యాన్ని సాధించాలనుకుని అలసిసొలసి ఆగిపోకుండా సాధకుని చేయిపట్టి మెట్లు ఎక్కించిన తీరులో రచయిత్రి ఆత్మీయతా ముద్ర ప్రస్ఫుటమవుతోంది. పాఠకుల హృదయాలను పరవశింపచేసే సుగుణ వచనరచనాశైలి వీచే మలయానిలయమే. జీవన మాధుర్యాన్ని మహత్త్వాన్ని పంచిపెట్టే మాతృశ్రీ తత్త్వం సత్యసందర్శనమే. పంచేంద్రియ తర్పణంగా ప్రసారమవుతున్న ఆ పరిమళవీచికలను అందుకుందాం, ఆస్వాదించుదాం.

ఆచరణ పథంలో అడుగుమోపే మన సంస్కారమే అమ్మకు నమస్కారం. రచయిత్రికి నిజమైన అభినందనచందనం అదే.



ఆప్తవాక్యం

మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి

అధ్యక్షులు, అమ్మతత్త్వ ప్రచారసమితి

"నాది తెలిసీ తెలియని స్థితి" అని అమ్మ ప్రకటించింది. సాధారణంగా ఏ వాక్యాన్ని అయినా పైపైన మాత్రమే చూసే మనం ఈ మాటను అమ్మకే అన్వయించి, అర్థం చేసుకుంటున్నాం. "అమ్మ ఒక సామాన్య మధ్యతరగతి కుటుంబంలో పుట్టింది, సామాన్య గృహిణిగా జీవితం గడిపింది, ప్రాథమిక విద్యాభ్యాసమూ లేదు. పెద్దగా ఆధ్యాత్మిక సాధనా లేదు, అమ్మకు ప్రపంచజ్ఞానం అంతంత మాత్రమే" ఇక తాత్త్విక అవగాహన అసలే ఉండదు" అనిపిస్తుంది మనకు. ఇలా అనుకోవడానికి కూడా అమ్మ మాటలనే ఆధారం చేసుకుంటాం మనం. "నేనేమీ చదువుకోలేదుగా నాన్నా!" అని, "నాకు తెలిసి దీపారాధన కూడా చెయ్యలేదు" అని అమ్మ చేసే ప్రకటనలు మనం తరచుగా విన్నాం. గ్రంథాలలో చదివాం. అందువల్ల "ఏ విషయం పట్ల అయినా, అమ్మ కున్నది మిడిమిడి జ్ఞానం మాత్రమే. కనుకనే అమ్మ తనది 'తెలిసీ తెలియని స్థితి' అని స్వయంగా వివరించింది" అనుకుంటూ ఉంటాం. 'అమ్మకు ఏ విషయంలోనూ సమగ్రమమైన పరిజ్ఞానం లేదు' అనేది ఆ వాక్యానికి అర్థమై ఉంటుంది అని సరిపెట్టుకుంటాం మనం.

అయితే, ఈ సందర్భంలో మనం గుర్తించవలసిన మరో అంశం ఉన్నది. అమ్మ చెప్పిన అన్ని వాక్యాలకూ యథాతథంగా మనం అర్థం చెప్పుకోవడం సరిపోదు. కొన్ని వాక్యాలకు పైకి కనిపించే సామాన్యార్థం కాక, లోతైన గూడార్థం ఏదో ఉండి ఉంటుంది అని మనం ఆలోచించాలి, అలా ఆలోచించి,అమ్మను మనం అర్థం చేసుకోవడానికి అనువుగా "మరుగే నా విధానం" అని మరో ప్రకటన చేసింది అమ్మ.

'నాది తెలిసీ తెలియని స్థితి' అని అమ్మ చేసిన ప్రకటనను కూడా కొంచెం నిదానించి పరిశీలించాలి. "అమ్మను గురించి మనకు తెలియనిది ఏమున్నది? అమ్మకు సంబంధించిన ఏ అంశమైనా మనకు స్పష్టంగా తెలుసు కదా!" అనుకునే

మనకు అమ్మచేసిన సూచన ఈ ప్రకటనలో దాగి ఉంది. అమ్మను గురించి మనకు తెలిసినట్లే ఉండి, ఇంకా తెలియనిది ఎంతో ఉందని,మనం 'తెలిసింది' అనుకుంటున్నది కూడా అంతంత మాత్రమేనని, తెలిసిందని అనుకున్న అంశాలలో కూడా మనకు తెలియని కోణాలు ఎన్నో ఉన్నాయని మనం గుర్తించాలి. అలా గుర్తించవలసిన అవసరం మనకు ఉన్నదని చెప్పే వాక్యమే 'మరుగే నా విధానం'.

"అమ్మ అంటే జిల్లెళ్ళమూడిలో మంచం మీద కూర్చున్నదే కాదుగా, ఆదీ అంతమూ లేనిది, సర్వానికీ ఆదీ అంతమూ అయినది" అని అమ్మ స్వయంగా చేసిన ప్రకటన మనకు దారిచూపుతుంది. "రూపం పరిమితం, శక్తి అనంతం" అని ప్రకటించింది అమ్మ. జిల్లెళ్ళమూడిలో మంచం మీద కూర్చున్న పరిమిత రూపం గల అమ్మ మనకు తెలుసు. ఆదీ అంతమూ లేని, ఆద్యంతాలూ తానై ఉన్న అపరిమిత శక్తి అయిన అమ్మ మనకు తెలియదు. మనకు తెలిసిన ఈ రూపం చాటున మనం తెలుసుకోవలసిన శక్తి దాగి ఉండడమే "మరుగు". అదే తన విధానమని ప్రకటించడంలో అమ్మ మన ఆలోచనలకు పదును పెడుతోంది.

"మీకు ఎంతో కొంత తెలిసి కూడా, ఇంకా తెలియనిది, తెలుసుకోవలసింది నా స్థితి" అని అమ్మ చెప్తోంది. అదే అమ్మతత్త్వం. ఆ తత్త్వాన్ని అన్వేషించి, అవగాహన చేసుకోవడం, అవగాహనను అనుభూతిగా అనుభవించడం, ఆ ఆనందానుభూతిని అక్షరరూపంలో ఆవిష్కరించడం సామాన్యమైన విషయం కాదు.

అమ్మ అనుగ్రహానికి పరిపూర్ణంగా నోచుకున్న అదృష్టవంతులకు మాత్రమే అది సాధ్యం.

అలాంటి అదృష్టం దక్కిన అమ్మబిడ్డలలో అగ్రగణ్య శ్రీమతి సుగుణ. ఏ పురాకృత సుకృతమో ఫలించి, చిన్నతనంలోనే అమ్మ దర్శన భాగ్యాన్ని, అమ్మ ఆదేశం మేరకు అమ్మ సన్నిధిలోనే విద్యాభ్యాసం చేసే అరుదైన అదృష్టాన్ని పొందిన శ్రీమతి సుగుణ, ఆపై అమ్మ నెలకొల్పిన కళాశాలలోనే అధ్యాపకురాలిగా జీవితాన్ని ప్రారంభించి, అందరింటి సభ్యుల కుటుంబానికి చెందిన వ్యక్తితోనే జీవితాన్ని పంచుకోవడం ఆమెకు దక్కిన వరం. అమ్మ సాహిత్యాన్ని పరిశోధనాంశంగా ఎన్నుకొని, తెలుగు విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పట్టా అందుకోవడం డా॥సుగుణకు అమ్మ ప్రసాదించిన అవ్యాజ కరుణాఫలం.

విశ్వవిద్యాలయానికి సమర్పించిన సిద్ధాంత వ్యాసాన్ని మరింత సులభ సుందరం చేసి, అందరికీ అందుబాటులోకి తెచ్చే రచనగా రూపొందించి, "మాతృశ్రీ తత్త్వ సౌరభం" అనే పేరుతో ఇప్పుడు ప్రకటిస్తున్నారు డా॥సుగుణ.

"నా జీవితం అబద్ధం, చరిత్రబద్ధం" అని ప్రకటించిన అమ్మజీవన సౌందర్య రేఖలను సంక్షిప్త సుందరంగా, సమగ్రభావ బంధురంగా అందించి, తత్త్వసౌధానికి మంచి పునాది వేశారు డా॥సుగుణ. అమ్మ జీవితంలోని ఏయే సన్నివేశాలను తెలుసుకుంటే, అమ్మపట్ల మనకు సరైన అవగాహన కలుగుతుందో వాటిని ఒకక్రమంలో పొందుపరిచారు.

ఇక "అమ్మ అసాధారణ వ్యక్తిత్వం"లోని ఎన్నో కోణాలను సోపపత్తికంగా నిరూపించడంలో డా॥సుగుణ చూపిన ప్రతిభ అనన్య సామాన్యం. ఒక వంక అమ్మజీవితసన్నివేశాలను, అమ్మవాక్యాలనూ ఉట్టంకిస్తూనే, మరోవంక ఆర్షవాఙ్మయ జలధిలోని అనర్ఘ రత్నాలను సేకరించి తెచ్చి, ఉపబలకంగా చూపించారు డా॥సుగుణ. అందుకు ఆమె సముపార్జించిన బహుగ్రంథ పరిజ్ఞానం మూలధనంగా ఉపకరించింది. ఈ లోకంలో ఎందరో సిద్ధపురుషులు, అవతారమూర్తులు, తత్త్వవేత్తలు కనిపిస్తున్నారు. వారిలో అమ్మకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. అది తెలియాలంటే కేవలం అమ్మ జీవితచరిత్ర తెలిస్తే, చాలదు. అమ్మ వ్యక్తిత్వ విశిష్టత తెలియాలి. మాతృమూర్తిగా, స్థితప్రజ్ఞగా, ప్రజ్ఞానిధిగా, శబ్దమంజరిగా, ఆదర్శగృహిణిగా, సంప్రదాయేశ్వరిగా, గురుమూర్తిగా, సేవాతత్పరగా, మనస్తత్వశాస్త్ర నిపుణగా, తర్కబద్ధంగా తత్త్వాన్ని నిరూపించే ఉపదేష్టగా - ఇలా భిన్న విభిన్న కోణాల్లో అసాధారణ వ్యక్తిత్వం గల అమ్మను తాను దర్శించి, అక్షరరూపంలో చిత్రించి, ఆ దర్శన భాగ్యాన్ని పాఠకులకు పంచారు డా॥సుగుణ.


తాత్త్విక శిఖరాగ్రాన కొలువుతీరిన అమ్మ మనకోసం దిగివచ్చి, మనను చేయిపట్టి నడిపించింది. లౌకికమైన ధర్మాలతో ప్రారంభించి, అలౌకికమైన అద్వైతం వరకు అమ్మ ప్రస్తావించని అంశం లేదు. సామాన్య మానవుడి గుండె తలుపు తట్టి, అతడి హృదయంలో వివేక సూర్యోదయం కలిగించడానికి అవతరించిన అర్కపురీశ్వరి అమ్మ, అలతి అలతి మాటలతో అలవోకగా 'అసలు' తత్త్వాన్ని

ఆవిష్కరించింది అమ్మ. ఆ మాటల్లో అపూర్వ నిర్వచనాలు, పదకేళీ విన్యాసాలు, జీవనసత్యాలు, జ్ఞానదీపికలు, తత్త్వజలధిలోని ఆణిముత్యాలు, సామాజిక భావనలు ఎన్నెన్నో గుబాళిస్తూ ఉంటాయి. అన్నింటిలో దాగిన తాత్త్విక వైభవాన్ని, సాహిత్య సౌందర్యాన్ని దర్శించి, మనకు తేటతెల్లం చేశారు డా॥ సుగుణ.

చివరగా ఒక్కమాట. చెట్టుసారం పండు రుచిలో వ్యక్తమైనట్లుగా, మనిషి సంస్కారం మాటల్లో వెల్లడి అవుతుంది. ఈ రచనలోని ప్రతి అక్షరంలోనూ ప్రత్యక్షమయ్యేది ఆ సంస్కారమే. ఒక అవతారమూర్తికి సమవయస్క కాకపోయినా, సమకాలీన అయిన ఒక రచయిత్రి తన సంస్కారాన్నే నేపథ్యంగా చేసుకుని ఆ తత్త్వంలోని ఏయే అంశాలను ఏ క్రమంలో ఏ విధానంలో ఏ మేరకు వెల్లడించాలో ఆచరించి చూపించారు డా॥సుగుణ.

మాతృశ్రీతత్త్వ చింతనకు, ప్రచారానికి ఈ గ్రంథం చక్కని ఉపకరణం. అంతేకాదు, భావికాలంలో రాబోయే మరెన్నో రచనలకు మార్గదర్శకం కూడా. ఇంత చక్కని గ్రంథాన్ని 'అందరింటికి' అందించడంలో శ్రీమతి డా॥సుగుణ చేసిన కృషికి నేపథ్యంగా నిలిచిన స్నేహశీలి ఆమె జీవన సహచరులు శ్రీ భట్టిప్రోలు రామచంద్ర. అమ్మసేవలో తరిస్తున్న ఈ దంపతులకు హృదయపూర్వకంగా నమస్కరిస్తున్నాను. అవ్యాజకరుణామూర్తి అయిన అమ్మ అనుగ్రహాన్ని పుష్కలంగా అందుకున్న ఈ రచయిత్రి కలం నుండి మరెన్నో మంచి రచనలు వెలువడాలని నిండు మనస్సుతో ఆకాంక్షిస్తున్నాను.





శ్రీ హైమవతీ దేవి



యోగీశ్వరేశ్వరి అమ్మ



'అంతా అదే' - అమ్మ



కన్నతల్లి శ్రీమతి సీతారామమ్మ

మాతృశ్రీ జీవన సౌందర్యరేఖలు

జిల్లెళ్ళమూడి అమ్మకు మాతృశ్రీగా ఉన్న ప్రశస్తి పాఠకలోకానికి పరిచితమే. ఆధ్యాత్మిక చింతనలో సామ్యవాదాన్ని ప్రవేశపెట్టి తాను స్వయంగా ఆచరించి అందరికీ ఆదర్శంగా నిలిచింది అమ్మ. ప్రపంచం నలుమూలలా అమ్మ ఎందరికో ఉపాస్య దైవం. అసంఖ్యాక జనుల అనురాగానికి, ఆరాధనకు లక్ష్యమై ఉన్న ఈ అమ్మ ఎవరు ? ఆమె ప్రత్యేకత ఏమిటి ? అమ్మ ఎంచుకున్న మార్గం ఏమిటి ? అమ్మ చేసిన సాధన ఏమిటి? ఇవన్నీ ఎవరికయినా కలిగే సందేహాలే. వాటికి సమాధానమే అమ్మ జీవన సౌందర్య రేఖాచిత్రణం.

అమ్మ జననం : అన్నపూర్ణగా ప్రసిద్ధి చెందిన ఆంధ్రరాష్ట్రంలో గుంటూరు జిల్లా పొన్నూరు సమీపాన మన్నవ గ్రామం అమ్మ జన్మస్థలం. 1923 మార్చి 28వ తేదీ రుధిరోద్గారి చైత్రశుద్ధ ఏకాదశి బుధవారం నాడు అరుణోదయ సమయాన అమ్మ ఆవిర్భావం జరిగింది. తండ్రి ఆ గ్రామానికి కరణం శ్రీమన్నవ సీతాపతి శర్మగారు, తల్లి శ్రీమతి రంగమ్మగారు. అమ్మ తల్లిగర్భంలో పడినప్పటి నుంచి ఇంట్లో అందరికీ మహిమాన్విత అనుభవాలు గోచరించాయి. ఒక దివ్యశక్తి మానవరూపంలో అవతరించబోయే ముందు కొన్ని విచిత్ర అనుభవాలు ముందుగా కన్పించటం సహజం. అమ్మ జనన సమయంలోనూ కొందరు విచిత్ర పరిణామాలనూ, విశేషలక్షణాలను గమనించ గలిగారు. ఇక అమ్మ ఈ భూమిపై కన్ను తెరచిన క్షణం నుంచీ అన్నీ అద్భుత విషయాలే, అన్నీ వింతలూ, విశేషాలే. 27వ రోజున బారసాల జరిపి, ఆశ్లేషా నక్షత్రం కనుక ఏ పేరు పెడితే బాగుంటుంది అని అందరూ ఆలోచించి నిర్ణయించిన పేరు 'అనసూయ'. అక్కడ కూర్చున్న అందరూ ఒకేసారి అనుకోకుండా 'మన అమ్మ పేరు అనసూయ' అన్నారు. ఆ తరువాత కాలంలో ఆ 'అనసూయ' అనే పదాన్ని అమ్మే వివరించింది. 'రాగద్వేష అసూయలను పారద్రోలేది అనసూయత్వం అదే అనసూయ తత్త్వం అని. ఆ తత్త్వమే అమ్మ జీవితంలో అడుగడుగునా కనిపిస్తుంది.

అమ్మ శైశవం : అమ్మ పుట్టడానికి ముందు రంగమ్మగారికి పిల్లలు పుట్టి పోవడం జరుగుతూ ఉండేది. అందుకని అమ్మ పుట్టగానే రంగమ్మగారు

అమ్మకు పాలివ్వడానికి సందేహిస్తుంటే మంత్రసాని గొల్లనాగమ్మ 'ఇప్పుడు నీవు ఇవ్వమ్మా తరువాత నేను పెంచుతాను' అని సలహా ఇచ్చింది. తెలిసి అన్నా తెలియక అన్నా ఆ తరువాత కాలంలో అదే నిజమయింది. అమ్మ జన్మించేనాటికి వారికి ఉన్న సంతానం ఒక్కరే. ఆయనే అమ్మ అన్నయ్య రాఘవరావుగారు. అసలే పిల్లలు సరిగా బ్రతకక తల్లిదండ్రులు బాధపడుతూ ఉంటే పుట్టుకతోనే చాలా సున్నితంగా ఉన్న అమ్మ అనారోగ్యం వారిని మరింత కలవరపెట్టింది. అమ్మను చిన్నప్పటి నుంచీ అనుక్షణం వెన్నంటి ఉండి పెంచి పెద్దచేసింది మరిడమ్మగారు. ఆమె సీతాపతిగారి మేనత్త. ఆరవ ఏటనే భర్తను కోల్పోయి అందరి సంతానాన్ని తన సంతానంగా భావిస్తూ బంధువులలో ఎవరికి ఎప్పుడు అవసరం వస్తే అక్కడకు వెడుతూ వారికి సేవ చేస్తూ ఉండేది. అలాగే రంగమ్మగారి ఆరోగ్యం బాగుండనందు వలన మరిడమ్మగారు అమ్మ పోషణ బాధ్యతను స్వీకరించింది.

అప్పగింత : అమ్మకు మూడవ నెల వచ్చేటప్పటికి మరిడమ్మగారు యాజలి వెళ్లాల్సి వచ్చినందువలన అమ్మను మంత్రసాని గొల్లనాగమ్మ చేతిలో పెట్టి తాను వచ్చేవరకు జాగ్రత్తగా పెంచమని, రోజూ కొద్దిసేపు తెచ్చి తల్లిదండ్రులకు చూపించమని చెప్పి అమ్మ పెంపకాన్ని నాగమ్మకు అప్పచెప్పింది. నాగమ్మ చాలా సంతోషంగా బంధువులతో ఊరేగింపుగా అమ్మను తన ఇంటికి తీసుకు వెళ్లింది. అప్పటి నుంచి ఏడాదిన్నర వయసు వరకు అమ్మ నాగమ్మ ఇంట్లోనే పెరిగింది. వాళ్లు పాలు పడితే తాగేది. పాలకోసంగానీ, అన్నంకోసం గానీ ఎప్పుడూ అడగలేదు. సాంప్రదాయిక బ్రాహ్మణ కుటుంబంలో అమ్మ జన్మించినా అందరి పిల్లలకు సామాన్యంగా జరిగే అన్నప్రాశన అమ్మకు జరగలేదు. పారాడుతూ పారాడుతూ నాగమ్మ తింటున్న కంచంలోని ఎంగిలి మెతుకులను నోట్లో పెట్టుకుని అమ్మ తనకు తానే అన్నప్రాశన చేసేసుకున్నది.

మరిడమ్మ గారు ఊరు నుంచి వచ్చాక గొల్లనాగమ్మతో 'నేను వచ్చానుగా అమ్మాయిని నేనే అట్టిపెట్టుకుంటాను తీసుకురమ్మని' చెప్పింది. ఏదో అనిర్వచనీయమైన అనుబంధం నాగమ్మకు అమ్మతో ఏర్పడటం వలన తన పెన్నిధిని ఎవరో దోచుకున్నట్లు బాధపడుతూనే నాగమ్మ అమ్మను తీసుకువచ్చి దించి అమ్మ

వద్దనే ఎక్కువకాలం గడిపేది. నాగమ్మ బాధ చూసి ఏమో అమ్మ కూడా ప్రతిరోజు కొంచెం సేపయినా నాగమ్మ ఇంటివద్దకు తీసుకు వెళ్లనిదే ఊరుకునేది కాదు.

మరిడమ్మగారు ఇంటిలో ఎపుడూ సత్కాలక్షేపం చేస్తూ ఉండేది. ఆమె యోగాభ్యాసానికీ, ధ్యానానికీ తప్ప మిగిలిన సమయంలో ఇరుగు పొరుగువారిని చేర్చుకొని తత్త్వవిచారణ జరుపుతూ ఉండేది. పురాణ కథలకు సంబంధించిన పాటలు పాడుతూ ఉండేది. అంతేకాక కుటుంబ నిర్వహణలో ఆమె ప్రదర్శించే సహనానికి అంతులేదు. ఈ సహనం, సేవాసక్తి, త్యాగబుద్ధి, తత్త్వవిచారణానురక్తి అమ్మకు మరిడమ్మగారి పెంపకంవలన వచ్చాయేమో అని అనేకులు ఊహించేవారు. మరిడమ్మగారి ప్రతిమాటనూ చేతనూ అమ్మ గమనిస్తూ ఉండేది. రెండు సంవత్సరాలయినా నిండని వయస్సులోనే పెద్దవాళ్లకు వలె ముఖం ఎప్పుడూ గంభీరంగా ఉండేది.

సహజ యోగానుభవం : పందొమ్మిది నెలల వయస్సులో అమ్మ ఒక రోజు సాయంకాలం దొడ్డిలో ఉన్న ఒక చెట్టు క్రింద పద్మాసనం వేసుకుని నల్లగ్రుడ్డుపైకి పోనిచ్చి అరమోడ్పుకన్నుతో ధ్యాననిమగ్న అయింది. అది చూసి అమ్మకు చిన్నబిడ్డ నొప్పి వచ్చిందని అందరూ కంగారుపడి, వైద్యుణ్ణి పిలిపించారు. ఆయన వచ్చి ఉల్లిపాయలూ, జిల్లేడురసంతో వైద్యం చేశారు. ఫలితం కన్పించలేదు. ఏం చేయాలో పాలుపోక వారు ఆందోళన చెందుతుండగా కొంతసేపటికి అమ్మే మామూలు స్థితిలోకి వచ్చింది. మొదట అది అంతకుముందు వాడిన మందుల ప్రభావం అనుకున్నా, అమ్మ అప్పుడు సడలించిన పద్మాసనం చూసి అమ్మ ముఖంలోనూ, కన్నుల్లోనూ వెలిగే ఉజ్జ్వల కాంతిని చూసి ఆశ్చర్యపోవడం అందరి వంతు అయింది.

ఆ తరువాత కొద్దిరోజులకే రంగమ్మగారు అమ్మను తీసుకుని తెనాలి వెళ్లారు. రంగమ్మగారి తల్లిదండ్రులు శ్రీ చంద్రమౌళి వెంకట సుబ్బారావు గారు శ్రీమతి జానకమ్మగారు. వీరి నివాసం తెనాలి. అక్కడ కూడ అమ్మ ఒకరోజు దానిమ్మ చెట్టు క్రింద ఎడమకాలును ముందుకు చాచి కుడికాలును వెనుకకు మడిచి దానిమ్మ పువ్వు చేతిలోకి తీసుకుని శ్వాస ఆపివేసి నల్లగ్రుడ్డు లోపలికి పోనిచ్చి

అరమోడ్పు కన్నులతో కూర్చున్నది. ఆ స్థితిలో అమ్మను చూసిన పెదతల్లి అన్నపూర్ణమ్మగారు 'ఏమిటి' అని అనుకుంటూ ఉండగానే అమ్మ యథాస్థితికి వచ్చింది. ఏమిటమ్మా అలా కూర్చున్నావు అని ఆమె అడిగితే 'శాంభవీముద్రలే' అని అలవోకగా చెప్పింది అమ్మ. మాటలే సరిగా పలుకని వయస్సులో శాంభవీముద్ర గురించి మాటలాడటమే గాదు అభ్యాసం చేయడం చూసి ఆమె ఆశ్చర్యపోయింది. పట్టలేని ఆనందంతో 'రంగమ్మతల్లీ'! పోయిన పిల్లలు పోయినా ఇంతవరకు అదృష్టవంతురాలవమ్మా ఈ బిడ్డ చాలు' అన్నది.

మాతృత్వ ప్రకటన : పూవు పుట్టగానే పరిమళించినట్లుగా చిన్నతనం నుంచీ 'అందరూ బిడ్డలే' అన్న భావమే అమ్మ ప్రత్యేకత. కనుకనే మూడేండ్ల వయస్సులోనే ఒకసారి తన తల్లి రంగమ్మగారితో మాట్లాడుతూ 'నీవు లేనప్పుడు నేనే అమ్మనై ఉంటాగా' అన్నది అమ్మ. ఈ మాటే అమ్మ అనంతర జీవితానికి ఉపశ్రుతి అయింది. ఒకసారి చిదంబరరావుగారింట్లో అందరి భోజనాలు పూర్తి అయినా, అమ్మ అన్నయ్య రాఘవరావుగారు ఎక్కడికో వెళ్ళి అన్నానికి రాలేదు. అమ్మ మరిడమ్మగారి దగ్గరకు వెళ్ళి 'అన్నయ్య ఇంకా అన్నానికి రాలేదే? తల్లికి ఒక బిడ్డ రాకపోయినా దిగులే' అనగానే మరిడమ్మగారు "అదేమిటమ్మా" అన్నయ్యను పట్టుకుని బిడ్డ అంటావు. అయినా వాడు అన్నం తినకపోతే బాధపడే తల్లి కాస్తా దాటిపోయింది గదా !" అన్నది. "వాడు అన్నం తినకపోతే బాధపడే తల్లి పోయింది గాని ఎవరు అన్నం తినకపోయినా బాధపడే తల్లి ఉన్నది" అని అన్నది అమ్మ. ఈ విధంగా అనుక్షణమూ తాను అందరికీ అమ్మను అన్న స్పందన అమ్మలో ఉన్నట్లు బాల్యంలోనే వ్యక్తమైంది.

నేను అమ్మను అని అమ్మ ప్రకటించడమే కాదు, మూడు నాలుగేండ్ల వయస్సు నుంచే పెద్దవాళ్ళు కూడ 'అమ్మ' అనే పిలిచేవారు. ఒకసారి ఖాదరువలీ అనే బండివాడు తెనాలిలో అమ్మను చూసి 'సీతాపతి గారితో మాట్లాడే అమ్మ మాటలు విని' అమ్మ వెంటే వస్తూ ఉంటాడు. అమ్మ వద్ద ఉన్న బంగారం అతనిలో దుర్బుద్ధిని కలిగించిందేమో అని సీతాపతిగారు 'ఎవరివి నీవు? ఎందుకు వస్తున్నావు'? అని అడిగారు. 'ఏమీలేదు ఈ అమ్మ మాట్లాడుతుంటే వినాలనిపిస్తున్నది.

ఈ అమ్మను చూస్తుంటే ఇంకా చూడాలనిపిస్తున్నది' అని అన్నాడు ఖాదరువలీ. మరొకరోజు అమ్మను, సీతాపతిగారిని బండి ఎక్కించుకొని స్టేషన్‌లో దింపి ఆయన బాడుగ డబ్బులు ఇవ్వబోతే 'వద్దయ్యా అమ్మకు నీవు తండ్రివి, నేను బిడ్డను. నేను కూలికి రాలేదు. అమ్మ కోసం వచ్చాను" అన్నాడు ఖాదరువల్లీ. 'చిన్నపిల్లలను పట్టుకుని అమ్మ అంటావేమిటిరా?" అని సీతాపతిగారు అడిగితే "ఎందుకనో తెలీదు గాని అట్లా అనిపిస్తున్నదయ్యా, నేను కూడా బాపట్ల వచ్చి నా అన్నం నేను తింటూ, అమ్మను చూస్తూ ఉంటాను" అని అడిగాడు. ఈ విధంగా ఎందరో ఆ వయస్సు నుంచే అమ్మ అని పిలుస్తూ ఉండేవారు.

మాతృవియోగం : అమ్మ బాల్యం మన్నవ గ్రామంలోనూ, బాపట్ల రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న చంద్రమౌళి చిదంబరరావు గారింట్లోనూ గడిచింది. చిదంబరరావుగారు అమ్మ తాత గారైన చంద్రమౌళి వెంకట సుబ్బారావుగారి సోదరులు. ఆయన వృత్తిరీత్యా న్యాయవాదులు. ప్రవృత్తిరీత్యా కవి, సంఘసంస్కర్త, రాజకీయవాది. బంధువులలో ఎక్కువగా అమ్మను ఆదరించి అభిమానించిన వారు చిదంబరరావుగారే. రంగమ్మగారి అనారోగ్యం కారణంగా వైద్యం నిమిత్తం బాపట్లలో చిదంబరరావుగారింటికి తీసుకు వచ్చారు. అక్కడ కొన్నాళ్లు వైద్యం జరిగాక ఆమె మరణించింది. అప్పటికి అమ్మకు మూడవ సంవత్సరం. 'మీ అమ్మ పోయిందమ్మా' అన్న తాతగారితో "దైవం పంపిన మనిషి దైవం ఇష్టప్రకారం దైవంలోకి పోతే మధ్యలో మనకు ఏడుపు ఎందుకు" అన్న అమ్మ ప్రశ్న ఆయనకు దిగ్భ్రమ కలిగించింది. మరొక సందర్భంలో 'శ్వాస ఆగిపోవడమే చనిపోవడమా,' అంటూ శ్వాసను బంధించింది. చిన్నప్పటి నుంచి అమ్మ ప్రవర్తన, మాట రెండూ విలక్షణంగానే ఉండేవి. చిన్నప్పటి నుంచి అనుక్షణమూ అమ్మ మాటనూ అలౌకికతను అవలోకిస్తున్నవారు కనుకనే అమ్మ స్థితి చూసి మొదట గాభరపడినా అతి సులభంగా అమ్మ పొందిన సమాధిస్థితినీ, శరరీంపై అమ్మకు గల అధికారాన్నీ అర్థం చేసుకుని ఎప్పటిదీ సాధన - అని ఆశ్చర్యమూ ఆనందమూ పొందారు చిదంబరరావుగారు.

రంగమ్మగారు పోయాక ఆమె పుట్టింటివారు అమ్మ పెంపకం బాధ్యతను స్వీకరించటానికి ముందుకు వచ్చినా అమ్మ తెనాలి వెళ్లటానికి ఇష్టపడలేదు.

ఎక్కువకాలం మన్నవలోనూ, బాపట్లలో చిదంబరరావుగారి వద్దనూ ఉండడానికి ఇష్టపడేది. అమ్మ ఎక్కడ ఉంటే మరిడమ్మగారు కూడా అక్కడే ఉంటూ ఉండేది.

అమ్మ మన్నవలో ఉన్నప్పుడు ప్రతిరోజూ సాధ్యమయినంతవరకు దేవాలయాలలోనూ, గంగరాజు పున్నయ్యగారి తోటలోనూ కాలక్షేపం చేస్తూ ఉండేది. ఆ తోటలో తనకు ఇష్టమయిన చింతచెట్టు క్రింద ఎక్కువ సమయం గడుపుతూ ఉండేది.. అమ్మ ఇంటికి రాకపోయినా ఆ ఊరిలోనే ఉన్న పినతండ్రిగారి ఇంటి వద్ద ఉన్నదేమోలే అని ఎవరూ అమ్మ విషయం పట్టించుకునేవారు కాదు. అమ్మ పట్ల ఒక్కొక్కప్పుడు ఎంత ఆదరం చూపించేవారో ఒక్కొక్కసారి అంతగా పట్టించుకోని స్థితీ ఉండేది. ఎపుడయినా ఇంటికి వచ్చినపుడు భోజనం విషయం ప్రస్తావనకు వస్తే ఎక్కడో భోంచేశానని చెప్పి అమ్మ అన్నం తినేది కాదు. ఎవరూ అంతకంటే అడిగేవారూ కాదు. ఒకసారి అందరూ కాఫీ తాగుతుంటే అమ్మ తాగటం లేదని గమనించిన చిదంబరరావుగారు అమ్మతో 'నీకు సహించవా? వాళ్లు ఇవ్వరా?' అని అడిగారు. 'ఒక రోజున వాళ్లు ఇవ్వవస్తే వద్దన్నట్లున్నాను, అప్పటినుంచి వాళ్లు అడగరల్లే ఉంది' అని అమ్మ ఎంతో నిర్లిప్తంగా సమాధానం చెప్పింది. ఒక్కొక్కప్పుడు అమ్మ నిత్యావసరాలను కూడా గుర్తించేవారు ఉండేవారు కాదు. ఆనాటి సాంఘిక పరిస్థితులలో ఆడపిల్లల చదువు పట్ల ఆసక్తి ఉండేది కాదు. అందుకనే అమ్మకు అక్షరాభ్యాసం చేసినవారు గానీ పాఠశాలలకు పంపినవారు గాని లేరు.

త్యాగశీలం : చిన్నతనం నుంచీ ఎదుటివాళ్ల కష్టాలను, కన్నీళ్లనూ గమనించి తన దగ్గర ఉన్న డబ్బును ఇచ్చి ఆదుకోవడం అమ్మకు అలవాటు. ఎవరు ఏ అవసరంలో ఉన్నా ఆదుకోవడం అమ్మ నైజం. ఇంట్లో ఏమయినా వస్తువులు తీసుకురమ్మని డబ్బు ఇస్తే దారిలో కుంటివాళ్లూ, గుడ్డివాళ్లూ కనిపిస్తే వారికి ఇస్తూ ఉండేది. దగ్గర ఉన్న డబ్బే కాదు ఒంటిమీదున్న నగలను, చివరకు తాను వేసుకున్న గౌను కూడ విప్పి ఇచ్చి వేసిన సంఘటనలు అనేకం కన్పిస్తాయి. ఇది అమ్మకు సర్వసాధారణమయిన విషయం. చిదంబరరావు తాతగారిని అడిగి పాతధోవతులు తీసుకుని తన బట్టలు అన్నీకలిపి బిచ్చగాళ్లకూ ఇస్తూ ఉండేది.

ఒకసారి ఒక క్షయ రోగికి వైద్యం నిమిత్తం అమ్మ తన నగలు తీసి ఇవ్వటం చూసిన రామాచార్యులు గారు చిదంబరరావు తాతగారితో 'అమ్మాయికి చిన్నతనం కదూ ! పాత్రత ఎరిగి దానం చేయటం తెలీదు' అన్నారు. వెంటనే అమ్మ 'నేను ఎవరికి ఏమి ఇచ్చినా అది దానం అనుకోవటం లేదు. వారి వస్తువే నా దగ్గర ఉన్నది వారిది వారికి ఇస్తున్నానని అనుకుంటున్నాను. వారిది వారికి ఇవ్వటంలో వారి మంచి చెడ్డల ప్రశ్నతో సంబంధం ఏముంది? ఒక వేళ నేనే ఇస్తున్నానని మీరు అనుకుంటే నాకు వారి అవసరమే కన్పిస్తుంది కాని వారి అర్హత ప్రసక్తి రాదు' అని సమాధానం ఇచ్చింది.

విలక్షణమైన ఆలోచన : అమ్మకు నాలుగేండ్ల వయస్సులోనే ఒకసారి బాపట్లలో బజారులో వెళ్తుండగా బ్రహ్మాండం వారి సత్రంలో బిచ్చగాళ్లు, ఇంకా అనేకమంది కలిసి భోజనం చేయటం చూసిన అమ్మ మనస్సులో ఆ క్షణంలోనే ఒక ఆలోచన కలిగింది. అన్ని గ్రామాల్లో అందరి ఆస్తులూ కలుపుకుని ఎవరి వృత్తివారు చేసుకుంటూ ఒకే చోట ఉంటూ ఒకే రకంగా తింటూ ఉంటే ఎంత బాగుంటుంది అని. అమ్మ ఆ తరువాత ఏర్పరచిన అందరింటికీ, అన్నపూర్ణాలయానికీ దివ్య సంకల్పం ఆనాడే జరిగిందేమో.....!

బాల్యం నుంచీ అమ్మ ఆలోచన విలక్షణంగా సాగేది. ఒకసారి బాపట్ల రైల్వే ప్లాట్‌ఫారం మీద చిదంబరరావుగారు అమ్మకు జీడిపప్పు కొనిపెట్టారు. వెంటనే అమ్మ ఆ జీడిపప్పు అమ్మే పిల్లకు కూడ ఒక కానీ జీడిపప్పు కొని పెట్టింది. అదేమిటి? ఆ పిల్లకు అన్ని జీడిపప్పులున్నాయి గదా అని చిదంబరరావుగారు అడిగితే 'ఆ అమ్మాయికి అమ్ముకోవటానికి గాని తినటానికి కాదుగా అమ్మేవాళ్లు అసలు తినలేరు' అన్న అమ్మ సమాధానమే అమ్మ విలక్షణమైన ఆలోచనను తెలియచేస్తున్నది.

తత్త్వాన్వేషణ: 'అనుభవం శాస్త్రాన్నిస్తుంది గానీ శాస్త్రం అనుభవాన్నివ్వదు' అన్నది అమ్మవాక్యం. అమ్మ ఏం చెప్పినా స్వానుభవంనుంచే చెప్పింది. అమ్మ బాపట్లలో ఉన్నప్పుడు రోజూ ఒక వరాహానికి అన్నం పెట్టడం అలవాటు. ఒకసారి చిదంబరరావు గారింట్లో వంటమనిషి రాఘవమ్మగారిని అడిగి ఒక ఆకులో

అన్నం పెట్టించుకుని పెరటిలోకి పరిగెత్తగా అక్కడ పడుకున్న వరాహం అమ్మను చూసి ఆనందంతో దగ్గరకు వచ్చింది. అమ్మ తాను తెచ్చిన అన్నం ఆ వరాహానికి పెట్టగా అది అన్నం తినకుండా అమ్మను ఆనుకుని పడుకుని ఉంటుంది. దాని పిల్లలు వచ్చి తల్లి దగ్గర పాలు తాగుతూ ఉంటాయి. అమ్మ ప్రేమగా లాలనగా ఒక చేత్తో ఆ వరాహం వెన్ను రాస్తూ మరొక చేత్తూ విస్తరి ముందుకు లాగి దగ్గర కూర్చుని దాని చేత అన్నం తినిపిస్తుంది. ఆ తరువాత దాని పిల్లలతో పాటు అమ్మ కూడా ఆ వరాహం దగ్గర పాలు తాగుతుంది. అంతలో చిదంబరరావుగారు అటు వచ్చి అమ్మను చూసి ఆశ్చర్యంతో ఏమిటీ 'పందులతో ఆడుకుంటున్నావా? నిన్ను కూడా పందిపిల్ల అంటారు' అన్నారు ! అంటే తప్పేముంది తాతగారూ మనం వంట ఇంట్లో ఉంటాం అవి పాకీదొడ్డిలో ఉంటాయి. మనకు వంటిల్లు ఎంతో వాటికి పాకీ దొడ్డి అంతేకదా! అని సమాధానమిచ్చింది అమ్మ. ఆ తరువాత మూడు రోజుల పాటు రోజూ ఒక గ్లాసులో దాని దగ్గర పాలుతీసి పరిశోధన చేసింది అమ్మ. ఆ పాలను కాచి తోడువేసి ఒకరోజు, పచ్చిపాలు తోడు వేసి ఒకరోజు, పాలన్నీ ఇగిరిపోయి మీగడ మాత్రం వచ్చేదాక కాచి తోడు వేసి ఒకరోజు, వెన్న తీస్తుంది. ఆ వెన్ననుండి అగ్ని లేకుండా నెయ్యి ఎందుకు రాదో చూద్దాం అనుకుంటూ చాలసేపు తరచగా నెయ్యి అవుతుంది. కనుకనే 'పంచామృతాలు అంటే అయిదు అని కాక, పాలు, మీగడ, పెరుగు, వెన్న, నెయ్యి అంటూ ఒకే పాలనుంచి పంచామృతతత్త్వాలు వెలువడ్డాయి, అంటూ, 'పంచబద్ధ అమృతాలు' అని నిర్వచించింది.

పిన్న వయస్సులోనే పెద్దమనస్సు : ఒకరోజు పాకీ మఖిషి రాక అందరూ ఆదుర్దా, ఆందోళన పడుతూ ఉంటారు. 'పాకీ మనిషి పనికిమాలినదని ప్రక్క నుంచి వెళితేనే అపవిత్రులమవుతామని పసుపు నీళ్లు చల్లుకునే వీళ్లు ఆ మనిషి గురించి ఆందోళనపడడం మాత్రం మహాపవిత్రంగా ఉన్నది' అనుకుంటూ అమ్మ తానే ఎవరికీ తెలియకుండా పాకీ దొడ్డిని శుభ్రం చేస్తుంది. అవసరం విలువయినదని ఆ నాలుగేళ్ల వయస్సులోనే గుర్తించిందేమో !

రంగమ్మగారి సంవత్సరీకాలకు అందరూ కలిసి మన్నవ బయలుదేరతారు. రైలులో ఒక తాత, మనవడు అమ్మ ఎదురుగా కూర్చొని ప్రయాణం చేస్తుండగా

కిటికీ చెక్క చేతిమీద పడి ఆ షాక్‌కు మనుమడు చనిపోతాడు. ఆ తరువాత పొన్నూరులో దిగి ఆ పెట్టెలోని వారందరూ ఎవరి దారిన వాళ్లు వెళ్లిపోతారు. ఆ తాతకు ఎవరూ సహాయపడరు. అమ్మ చిదంబరరావుగారితో 'ఆ తాతకు సహాయంగా ఉంటుంది. ఆ పిల్లవాడికి మనం అంత్యక్రియలు చేయించి వెళదామా' అని అడిగితే 'మనకు ఎందుకమ్మా! ప్రొద్దు గ్రుంకుతున్నది మనం వెళ్లిపోదాం' అన్నారు. కాని వాళ్లు మన్నవకు బండి మాట్లాడేలోగా అమ్మ తాత దగ్గరకు వచ్చి తన ఉంగరం తీసి తాత చేతిలో పెట్టి "ఇది మార్చి నీకు కావలసింది వాడుకో" అని తాతకు ఇచ్చింది. ఆ తరువాత చిదంబరరావుగారి దగ్గరకు వచ్చి తాను తరువాత వస్తానని చెప్పి తమతో వచ్చిన పాలేరు ఖాసింను మాత్రం ఉండమని చెప్పింది. అంతేకాదు తనకంటే పెద్దవాడయిన ఆ పిల్లవాడిని, అందునా శవాన్ని భుజాన వేసుకుని వెళ్తూ ఉంటే పాలేరు ఖాసిం, ఆ పిల్లవాడి తాత ఆశ్చర్యంతో నోటమాట రాక వెంబడించి వస్తుండగా ఆ పిల్లవాడిని ఊరి చివరకు చేర్చి పడుకోబెట్టి మిగిలిన కార్యక్రమమంతా తాను దగ్గరుండి చేయించి ఖాసింతో మన్నవ చేరుకుంటుంది. తనను ఎత్తుకునే వయస్సులో మరణమంటే ఏమిటో తెలియని పసివయస్సులో అమ్మ చర్యలను గమనించినవారు అవాక్కయి నిలబడి పోయారు.

వాగ్దానం : మన్నవలో వండి పెట్టేవారు ఎవరూ లేనప్పుడు సీతాపతిగారు పూటకూళ్ల ఇంట్లో తనకు, అమ్మకు భోజనానికి ఏర్పాటు చేసేవారు. వారు పడే ఇబ్బందులను గమనించి బంధువులందరూ కలిసి ఒత్తిడి తెచ్చి సీతాపతిగారికి కామేశ్వరమ్మ గారి నిచ్చి రెండవ పెళ్లి చేశారు.

అమ్మ మేనత్త కనకమ్మగారికి నలుగురు సంతానం. ఒకరు బ్రహ్మాండం నాగేశ్వరరావుగారు (అమ్మ భర్త). రెండవవారు లోకనాథం గారు, మూడవ కుమారుడు నరసింహారావుగారు. అంగవైకల్యంతో బాల్యంలోనే మరణించారు. ఒక ఆడపిల్ల. ఆమెనే పాప అత్తయ్య అంటారు.

అమ్మ మేనత్త భర్త బ్రహ్మాండం సుబ్బారావుగారికి అమ్మ అంటే అమితమైన ప్రేమ. రోజూ తన దగ్గర కూర్చోబెట్టుకుని తాను తినే పండ్లు అమ్మకు ఇచ్చి 'పాపం తల్లిలేని పిల్లవు. తినమ్మా నీకెవరు పెడతారు' అనేవారు.

చిన్నకుమారుడయిన, లోకనాథంగారికి డబ్బులు ఇచ్చి "నీవు కొనుక్కున్నదెల్లా అనసూయకు కూడ పెడుతూ ఉండు" అనేవారు. అప్పుడప్పుడు 'బావను తప్పకుండా చేసుకుంటావా' అని అమ్మను అడిగేవారు 'చేసుకుండే యోగ్యత ఉంటే తప్పక చేసుకుంటాను' అంటూ ఉండేది అమ్మ. అప్పటికి నరసింహారావుగారు ఉన్నారు. 'అనసూయ మంచిది నాన్నా. అన్నయ్యకు తప్పకుండా చేసుకుందాం' అనేవారు నరసింహారావుగారు. ఆయనకు అమ్మ అంటే చాలా ఇష్టం. "చేసుకున్నా చేసుకోకపోయినా ముందు ఈ పిల్లలను అలవాటు చేసుకోమ్మా దిగులుపడకుండా ఉంటారు. మీ అత్తయ్యకు చిన్నప్పటి నుంచీ కష్టాలే. అని ఎంతమంది ఉన్నా ప్రాణం పోయేటప్పుడు నీవు నా దగ్గరే ఉండమ్మా" అని చెప్పి వారి పెద్దకుమారుడు నాగేశ్వరరావుగారినీ, అమ్మనీ చిదంబరరావుగారికి చూపించి సంజ్ఞ చేశారు. ఆయన పోయినపుడు లోకనాథం, నరసింహారావుగార్లను ఓదార్చింది అమ్మే. 'మీ నాన్నగారు లేని మీ కుటుంబానికి ఆయనను చూపలేకపోవచ్చు గాని ఆయన లేనందువలన కలిగే ఇబ్బంది లేకుండా చేస్తాను' అని చెప్పింది అమ్మ.

అభిన్న భావన : చిదంబరరావుగారి అమ్మాయి శ్రీమతి భారతీదేవికి అనారోగ్యం కల్గితే ఇంకొల్లు పాపులూరు మధ్య ఉన్న ఆంజనేయస్వామికి ప్రదక్షిణాలు చేస్తే తగ్గుతుందని ఎవరో సలహా ఇచ్చారు. అందుకని చిదంబరరావుగారి కుటుంబం, అమ్మ అందరూ పావులూరు బయలుదేరారు. అక్కడకు వచ్చాక అందరూ అమ్మను కూడ ప్రదక్షిణలు చేయమన్నారు. నివేదన కోసం వంటమనిషిని అడిగి బెల్లం, పెసరపప్పు తీసుకుని వెళ్లబోతుంటే, భారతీ దేవి అభ్యంతరం పెట్టింది. అయినా అమ్మ ప్రదక్షిణాలు చేసే ప్రయత్నాన్ని విరమించుకోక ఆలోచించి "మట్టిని మాత్రం ఎందుకు నివేదన చేయకూడదు? ఇదయితే ఎవరికీ అభ్యంతరం ఉండదు కదా! అయినా మట్టిగడ్డలు నివేదన చేస్తే ఇక్కడ పండే పంటలన్నీ నివేదన చేసినట్లే" అని 108 ప్రదక్షిణాలు చేసి, మట్టిగడ్డలనే ఆంజనేయస్వామికి నివేదన చేసి, కనిపించిన వారందరికీ ఆ గడ్డలనే ప్రసాదంగా పంచిపెట్టింది. అది ప్రసాదంగా తీసుకున్నవారు కొందరు విమర్శిస్తే మరికొందరు నోటిలో వేసికొని దాని వాసనకు, రుచికి ఆశ్చర్యపోయారు. విడ్డూరంగా అందరూ చెప్పుకోవటం విని వంటమనిషి రాఘవయ్యగారు "ఇదేమిటమ్మా! మట్టిని దేవుడికి నివేదన చేయటం ఏమిటి?

ప్రసాదంగా అందరికీ పంచటం ఏమిటి?" అని అడిగితే 'నివేదనకు నియమం ఏమున్నది ? మనకు ఏది ఉంటే దేవుడికి అది సమర్పిస్తాము, దేవుడు పండ్లయితేనే పుచ్చుకుంటాను లేకపోతే వద్దు అనలేదుగా, బంగారం అయితేనే స్వీకరిస్తాను మట్టి అయితే నాకు పనికిరాదు అని చెప్పలేదుగా. మనకు కల్గినదేదో దానినే సంతోషంగా నివేదన చేస్తాము. నాకు ఉన్నది మట్టి, నాకు ఆ సమయంలో అందింది మట్టి, కనుకనే దానిని నివేదన చేశాను. దేవుడికి ఏది నివేదన చేస్తామో అదే మనకు ప్రసాదం. అంతవరకే నాకు తెలుసు. అయినా 'వింటే విమర్శకాని కంటే విమర్శ లేదు. కన్నవాడిది అనుభవం, విన్నవాడిది అనుమానం' అని వివరించింది అమ్మ.

ప్రేమ నాకు సహజం : తల్లి లేని బిడ్డ కాబట్టి అమ్మను కొన్నాళ్లు తమ దగ్గర ఉంచమని అమ్మ అమ్మమ్మగారు జానకమ్మగారు, తాతగారు వెంకట సుబ్బారావుగారు సీతాపతిగారిని అడుగుతూ ఉండేవారు. అందుకని అమ్మను తెనాలి తీసుకువెళ్లి కొన్నాళ్లు అక్కడ ఉంచాలని సీతాపతిగారు నిశ్చయం చేసుకుని ఆ విషయం అమ్మతో చెప్పారు. అమ్మ లోకనాథంగారి వద్దకు వచ్చి "నేను వెళ్లిపోతే రోజూ నీతో ఎవరు ఆడుకుంటారు. పాపను ఎవరు ఎత్తుకుంటారు?" అని దిగులుగా అడుగుతుంది. 'మామీద నీకెందుకు అనసూయా ! ఇంత ప్రేమ, మేము నీకు ఏమీ చెయ్యటం లేదుగా' అని లోకనాథంగారు అడిగితే 'ప్రేమ నాకు సహజం. లోకంలో ఎవరు కష్టపడుతున్నా నాకు అట్లాగే ఉంటుంది. మీరు నాకేదో చెయ్యాలని నేనెపుడూ అనుకోను' అన్నది అమ్మ.

సంకీర్తనా ప్రియత్వం : కొన్నాళ్ల తరువాత సీతాపతి గారి రెండవ భార్య కామేశ్వరమ్మగారు కాపురానికి వస్తుంది. అందుకని అమ్మను మన్నవ తీసుకు వచ్చి ఆమెకు తోడుగా ఉండమన్నారు సీతాపతిగారు. ఇంటి పరిస్థితులను బట్టిగాని, ఆనాటి సాంఘిక పరిస్థితులను బట్టిగాని, అమ్మకూడ సంఘర్షణకు లోనుకాక తప్పలేదు. ఎవరు ఏపని చెప్పినా చేస్తూ చాలా జాగ్రత్తగా నడచుకునేది అమ్మ. అలా కొన్నాళ్లు కామేశ్వరమ్మగారి వద్దనే ఉన్నది. అప్పటికి అమ్మకు 11 సంవత్సరాలు. ప్రతిరోజు మన్నవలో ఏదో ఒక ఇంటిలో భజన కార్యక్రమం జరుగుతూ ఉండేది. అమ్మ ప్రతి ఇంటికీ వెళుతూనే ఉండేది. వెళ్లకపోయినా అందరూ పిలిపించేవారు.

ఏ కీర్తనయినా ఎవరయినా మొదటి చరణం చెప్పాక రెండవ చరణం అమ్మ చెపుతుంటే అందరూ ఆశ్చర్యపోయేవారు. సంకీర్తన ఎన్ని గంటలయినా విసుగులేదు, రానిపాట లేదు అని అందరూ మురిసిపోయేవారు. ఆ గ్రామంలోనే ఒక యాభై మంది కలిసి నగర సంకీర్తన చేసేవారు. వారితో కలసి అమ్మ నగర సంకీర్తనకు కూడ వెళుతూ ఉండేది. ఇంట్లో మరిడమ్మగారు సర్వకాల సర్వావస్థలలోనూ పాటలు, తత్త్వాలు పాడుతూ, అద్వైత విచారణ చేస్తూ ఉండేవారు. ఊరి మొదట్లో మన్నవ హనుమంతయ్యగారు ఉపనిషత్తులు భగవద్గీత ప్రవచనం చేస్తూ ఉండేవారు. అమ్మ బాల్యావస్థలో మన్నవస్థితి అది.

వివాహం : అమ్మను కనకమ్మగారి పెద్దకుమారులయిన బ్రహ్మాండం నాగేశ్వరరావుగారి కిచ్చి వివాహం చేయటానికి నిశ్చయం చేశారు. కాని, అనుకున్న సమయానికి వివాహం జరుగలేదు. ఏదో మాట పట్టింపు కారణంగా వివాహం జరగటానికి కొంతకాలం ఆలస్యమైంది.

బంధువులందరి మధ్య ఈ పెళ్లి విషయమై అనేక చర్చలు జరుగుతూ ఉండేవి. వివాహం నిశ్చయం కాక మునుపు ఏ అభిప్రాయమూ వ్యక్తపరచలేదు అమ్మ. ఎవరడిగినా 'అంతా మా నాన్న ఇష్టమే' అని చెప్పింది. కాని ఒకసారి వివాహం నిశ్చయమయిన తరువాత వివాహం ఆగిపోయి ఎన్ని అవరోధాలు వచ్చినా ఎన్ని ఒడిదుడుకులు ఎదురయినా మనస్ఫూర్తిగా ఒకసారి నిశ్చయించాక ఆయనే భర్త అయినట్లుకదా ఇక రెండవ ఆలోచనకు తావులేదు అనే నిర్ణయంతోనే ఉన్నది అమ్మ.

ఈ సన్నివేశంలో మన మనస్సులో మహాపతివ్రత సావిత్రికథ స్ఫురణకు వస్తుంది. సావిత్రి పెళ్లికి పూర్వమే సత్యవంతుని గుణశీలాదులు విని అతడినే తన మనస్సులో నిలుపుకున్నది. సత్యవంతుడు అల్పాయుష్కుడని నారదుని ద్వారా విని ఆమె తండ్రి అశ్వపతి సందేహిస్తూ ఉంటే సావిత్రి మనసారా ఒక్కసారి వరించిన మనిషి ఎలాంటి వాడైనా మృత్యు ముఖంలో ఉన్నా అతడినే వివాహమాడతానని తన దృఢ మనో నిశ్చయాన్ని తండ్రికి తెలిపింది. అతడి తల్లిదండ్రులు రాజ్యం పోయి అడవులలో ఉన్నారని తెలిసీ, అతడిని వివాహం

చేసుకుంటే ఎన్నో కష్టాలు ఎదుర్కోవలసి వస్తుందని తెలిసీ తండ్రిని ఒప్పించి అరణ్యాలపాలైన సత్యవంతుడినే వివాహమాడింది. అందుకే ఆమె మహాపతివ్రత అయింది. మనకు పురాణాలలో పాతివ్రత్య మహిమతో మానవాతీత శక్తుల్ని సంపాదించిన మహా పతివ్రతలెందరో కనిపిస్తారు.

వివాహ విషయంలో అమ్మ పరిస్థితి గమనించిన చిదంబరరావుగారు 'చూడగా చూడగా అగ్నిగుండంలో దూకబోతున్నట్లుగా ఉన్నదమ్మా!" అంటే "ఒక చోట ఉంటే గదా దూకటానికి, నా బాటే నిప్పులబాట. ఆ బాటలో నడక సాగించబోతున్నాను. ఆరని అగ్నిగుండంలో పడి తీరని వ్యథల్లో చిక్కి తియ్యగా అనుభవిస్తూ సరే మంత్రంతో జీవించాలి" అన్నది అమ్మ. "క్రొత్తగా ఇపుడు నిప్పుల బాటేముందిలేమ్మా! పుట్టినప్పటినుండి నిప్పులలోనే తిరుగుతున్నట్లే ఉంద"ని తన బాధను వ్యక్తం చేస్తారు చిదంబరరావుగారు. అంతకు ముందు అనుకున్న ప్రకారం అమ్మ వివాహం శ్రీ బ్రహ్మాండం నాగేశ్వరరావుగారితో 05-05-1936 వ తేదీన బాపట్లలో చిదంబరరావుగారి ఇంట్లో జరిగింది. అప్పటికి అమ్మకు పదమూడు సంవత్సరాలు నిండాయి. ఆనాటికి నాగేశ్వరరావుగారు (నాన్నగారు) జిల్లెళ్ళమూడి గ్రామకరణీకాన్ని స్వీకరించారు.

<u>**వైవాహిక జీవితం :**</u> అమ్మ కాపురానికి వెళ్లాక నాన్నగారి (నాగేశ్వరరావు గారు) కుటుంబం బాపట్లలో కాపురం పెట్టారు.అమ్మ బాపట్లలో ఉండగానే అనారోగ్యం కారణంగా చాలాకాలం చీరాలలోని బేర్ హాస్పిటల్లో ఉండటం జరిగింది. అక్కడ నుండి వచ్చాక ఆర్థికపరిస్థితుల వల్లగానీ, గ్రామకరణాలందరూ ఆయా గ్రామాల్లోనే ఉండాలనే ప్రభుత్వ నిబంధనల ప్రకారం గానీ 1940 ఏప్రియల్ నెలలో అమ్మ కుటుంబమంతా జిల్లెళ్ళమూడి వచ్చి స్థిరపడింది. జిల్లెళ్ళమూడి గుంటూరు జిల్లా బాపట్లకు 8 మైళ్ల దూరంలో ఉన్నది. జిల్లెళ్ళమూడి చాలా చిన్నగ్రామం. ఒకనాడు అది ఒక అగ్రహారం. జనాభా కూడ తక్కువే. అమ్మ ఆ గ్రామానికి వచ్చేనాటికి రోడ్డు కూడా లేదు. అమ్మ దగ్గరకు జనం విస్తృతంగా వచ్చేటంతవరకు అది మట్టిరోడ్డే. ఆ తరువాత ఎన్నో సౌకర్యాలు. జిల్లెళ్ళమూడి పేరు దేశ విదేశాలలో మారు మ్రోగింది అంటే అమ్మవలననే. ఈనాడు ఆ గ్రామం ప్రపంచంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల్లో ఒకటి అయింది.

అమ్మకు ముగ్గురు సంతానం. పెద్దకుమారుడు శ్రీ బ్రహ్మాండం సుబ్బారావుగారు. 1939లో గుంటూరులో కుగ్లర్ ఆస్పత్రిలో జన్మించారు. ఆయన కొన్ని సంవత్సరాలు జిల్లెళ్ళమూడి గ్రామ సర్పంచ్‌గా పనిచేసి గ్రామం అభివృద్ధికి ఎంతో కృషి చేసి 1990లో మరణించారు. అమ్మ రెండవ సంతానం హైమ. 1943వ సంవత్సరంలో బాపట్లలో చిదంబరరావు తాతగారింట్లో జన్మించింది. మూడవ సంతానం శ్రీ బ్రహ్మాండం రవీంద్రరావుగారు. ఈయన 1946లో ప్రకాశం జిల్లా వేటపాలెంలో జన్మించారు. ఆయన ఇపుడు జిల్లెళ్ళమూడిలో అమ్మ సంస్థల అభివృద్ధికై అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారు.

అమ్మ కుటుంబం జిల్లెళ్ళమూడి వచ్చినపుడు మొట్టమొదటగా ఉండటానికి స్థలం చూపించినవారు ఖగ్గారామయ్యగారు. ఆయన నాన్నగారి దగ్గర మునసబుగా చేసేవారు. ఇంటిపనులను యథావిధిగా నిర్వహించడం, అత్తగారు చెప్పిన పనులను చేస్తూ, గృహిణిగా ఏదో ఒక పనిలో నిమగ్నమై ఉంటూ ఉండేది అమ్మ. అమ్మకు విశ్రాంతి అంటే ఏమిటో తెలీదు. అడిగినదానికి ఔను, కాదు అనే సమాధానం చెప్పడం తప్ప అమ్మ వేరే మాట్లాడేది కాదు. అమ్మ స్థితిని బాల్యంలోనే గుర్తించిన చిదంబరరావుగారు అమ్మ మీద ఉన్న ఆత్మీయతతో కోరి కష్టాలు వరిస్తుందనే భయంతో వివాహ సందర్భంలో 'నీకీ పెళ్లి ఎందుకమ్మా' అని అడిగితే 'లోకంలో ఉన్న కష్టాలన్నింటినీ భరిస్తూ సంసార జీవనం ఎలా సాగించాలో లోకానికి నేర్పడం కోసమేననీ, అన్నీ అనుభవిస్తూ ఏది మనసుకు అంటకుండా ఉండడం సాధ్యమేనని చెప్పడానికేననీ చెప్పింది అమ్మ. చెప్పినట్లుగానే జీవితంలో సుఖదుఃఖాల ఉభయ పార్శ్వాలనూ చవి చూసింది. ఎందరు ఎన్నితప్పులు చేసినా, తన పట్ల క్రూరంగా ప్రవర్తించినా హింసించినా భూదేవంత సహనాన్నే ప్రదర్శించింది. ఈ సందర్భంలో కులధర్మపత్నీ ధర్మాలలో 'క్షమయా ధరిత్రీ' అన్న మాట గుర్తుకు వస్తుంది. 'తన ఇష్టాన్ని చంపుకుని ఒకరి ఇష్టాన్ని తన ఇష్టంగా చేసికొనడమే సహనమని' చెప్పిన అమ్మ ఆచరించి చూపింది.

సామాజిక దృక్పథం : 1947-50ల మధ్యకాలంలో జిల్లెళ్ళమూడిలో వర్గకక్షలు ఏర్పడి గ్రామంలో పేదవాళ్లకి బ్రతకటమే కష్టమయింది. అందుకని అమ్మ ఆ పేదవాళ్లకోసం సహకార సంస్థలను సర్వోదయ జీవన విధానాన్ని

ప్రారంభింపజేసి వారికి బ్రతుకు తెరువు చూపించింది. ఆదర్శాలు వల్లించడం కాక ఆచరణలో చూపించడం, సమస్యను గూర్చి చర్చించడం కాక పరిష్కారం మార్గం ఆలోచించడం అమ్మ విధానం. కనుకనే అమ్మ భావాలు ఆశయాలకే పరిమితం కాకుండా ఆచరణరూపం ధరించాయి. ఆనాటి సమాజ చిత్రాన్ని ఒకసారి చూస్తే గ్రామ స్వరాజ్యం కోసం, పేదల అభ్యున్నతి కోసం, అస్పృశ్యతా నివారణ కోసం, దేశ స్వాతంత్ర్యం కోసం, సామాజిక న్యాయం కోసం, అహరహం అనుక్షణం గాంధీజీ అడుగు జాడలలో సమాజం ముందుకు సాగుతున్న కాలమది. గాంధీజీ పిలుపుకి సమాజం ప్రతి స్పందించిన కాలమది. గాంధీజీ కలలు గన్న గ్రామాభ్యుదయానికి అమ్మ ఆనాడే నాంది పలికింది.

సంస్కరణ : 'అవ్యాజ ప్రేమకాదు. ప్రేమే అవ్యాజమైంది' అని చెప్పే అమ్మ ఆ ప్రేమతోనే దుర్మార్గులను కూడ సన్మార్గులుగా మార్చిన సంఘటనలనేకం ఉన్నాయి. హరిజనుడయిన మంత్రాయిని, సొమ్ముల కోసం తనను చంపడానికి ప్రయత్నించిన జాలరిని, ఈవిధంగా అనేక మందిని తన ప్రేమతోనే మార్చింది. అమ్మ బాల్యంలోనే అమ్మ ప్రేమకు కరిగిపోయి మౌలాలి అనే ముస్లిం ఎంతో కాలం అమ్మ ఎక్కడ ఉంటే అక్కడే ఉండి చివరకు అంతటా అమ్మనే దర్శించగలిగాడు.

అస్వస్థత కాదు స్వస్థితి : అమ్మ అసాధారణ స్థితిని గుర్తించని కుటుంబ సభ్యులను, బంధువులను అమ్మ స్థితి అయోమయంలో పడవేసింది. అమ్మకు అనారోగ్యం అనుకుని నయం చేయించేందుకు బంధువులు ఎన్నో ప్రయత్నాలు చేశారు. అమ్మను ఎంతో మంది వైద్యులకు చూపించి సలహాలు అడిగారు. కాని వారికి అమ్మ వ్యాధి అంతు చిక్కలేదు, వైద్య శాస్త్రానికి అందలేదు. అమ్మ అత్తగారు కనకమ్మగారు అమ్మను వైద్యం కోసం జిల్లెళ్ళమూడికి అతిదగ్గరగా ఉన్న మంత్రిపూడిలోని వీరయ్యగారి వద్దకు తీసుకుని వెళ్లింది. ఆయన ఆయుర్వేద వైద్యుడు, తత్త్వవేత్త. మొదటిసారిగా వారు అమ్మలో కన్పించే ఈ స్థితి శారీరక రోగంకాదని, అది ఒక దివ్యయోగమని గుర్తించి, ఆ విషయం కనకమ్మగారితో చెప్పినప్పటికీ ఆమె నమ్మలేదు. శ్రీ వీరయ్యగారు తన దగ్గరకు వచ్చిన రోగులందరికీ 'గంజాయి తోటలో తులసి మొక్క మొలిచింది. వెళ్లి దర్శించండి' అని సలహా ఇవ్వగా అప్పటి నుంచి అమ్మను చూడటానికి జనం ప్రత్యేకంగా జిల్లెళ్ళమూడి రావడం ప్రారంభం

అయింది. అలా మొదటిసారిగా వచ్చినవారు పూండ్ల గ్రామానికి చెందిన శ్రీమతి నోరి మాణిక్యమ్మగారి కుటుంబం.

అమ్మగా గుర్తింపు : వీరి బంధువుల ద్వారా చీరాల పట్టణంలో అమ్మను గురించి తెలిసింది. అప్పటి నుంచి ఊరూరా అమ్మ గురించి ప్రచారమై అందరూ అమ్మను చూడటానికి జిల్లెళ్ళమూడి రావడం ప్రారంభించారు. అమ్మకు సంకీర్తన అంటే చాలా ఇష్టం. కనుకనే ఆనాడు తన దగ్గరకు వచ్చిన వారిచేత భగవన్నామం చేయిస్తూ తాను చేస్తూ ఉండేది. అమ్మ ఆవరణలో కూడ భగవన్నామం నిరంతరం విన్పించాలని కోరుకునేది. తరువాత కాలంలో శ్యామ్ అనే ముస్లిం సోదరులు 'జయహోమాతా శ్రీ అనసూయా, రాజరాజేశ్వరి శ్రీ పరాత్పరి' అని అమ్మ నామానికి రూపకల్పన చేశారు. ఆ నామమే అఖండనామంగా జిల్లెళ్ళమూడిలో ఇప్పటికి జరుగుతూ ఉన్నది.

యోగులకు భిక్షా ప్రదానం : రెడ్డిపాలెం ఆనందాశ్రమ స్థాపకులు లక్ష్మీకాంతయోగి గొప్ప ఆధ్యాత్మిక సాధన చేసిన వ్యక్తి. అమ్మకు వైద్యం చేయించే భాగంగానే కొంతమంది ఆహ్వానం మేరకు ఆయన జిల్లెళ్ళమూడి వచ్చారు. అమ్మను చూసి గాయత్రీ మాతగా దర్శించి 'అమ్మా గాయత్రీ ఇక్కడ ఉన్నావా?' అని ప్రశ్నించారు. మధ్యకాలంలో అమ్మ దగ్గరకు ఒకటి రెండుసార్లు వచ్చారు. తరువాత ఆయనకు ఎనభై ఏళ్ల వయస్సులో మళ్లీ అమ్మ దగ్గరకు వచ్చారు. అపుడు ఆయనకు అమ్మ అన్నం కలిపి పెట్టింది."ఈ ఎనభై ఏళ్ల ముది బిడ్డకు అమ్మ అన్నం పెట్టటం, అందులో తనకు పెట్టటం విశేషం" అన్నారు. అందుకు అమ్మ "ఇందులో విశేషం లేదు. నీవు పెద్దవాడివి అని నువ్వు అనుకుంటున్నావు కాని ఎన్ని సంవత్సరాలు వచ్చినా నువ్వు నాకు బిడ్డవే" అన్నది. అమ్మ అన్నం పెట్టేటప్పుడు అమ్మకు అందరూ పసివాళ్లే. వాళ్ల వయస్సుగానీ వాళ్ల స్థితిగతులు కానీ ఏ మాత్రం అడ్డురావు - అడ్డుగావు. శ్రీ ప్రభుదత్త బ్రహ్మచారి, స్వామి పూర్ణానంద, శ్రీశ్రీశ్రీ లక్ష్మణ యతీంద్రులు, స్వామి అవధూతేంద్ర ... ఇలా ఎందరో మహానుభావులు అమ్మ చేతిమీదుగా గోరుముద్దలు తిని ఆనందించినవారే. శ్రీశ్రీశ్రీ ప్రణవానంద స్వామీజీ (కారంచేడు) సన్యాసాశ్రమ స్వీకార సమయంలో మొదటి భిక్షను అమ్మే పెట్టిందని చెప్పారు.

దైనందిన జీవితం : పదిమంది మేలు కోసం పదిమంది మనుష్యులు కలిసి పదిమంది మనసులు కలిసి చేసేది అర్చన. ఆ అర్చన కోసమే ఈనాటి అనసూయేశ్వరాలయ నిర్మాణం (పెద్దగుడి) 1956లో గుప్పెడు బియ్యం పథకం ద్వారానే ప్రారంభం అయింది. ఆ కాలంలో అమ్మ తనను చూడడానికి వచ్చిన వాళ్లకు స్వయంగా వంట చేసి పెట్టేది. ఇంటి పని చేసుకుని నాన్నగారికి కావలసిన సౌకర్యాలు చూసుకుంటూ వచ్చిపోయేవారికి వండి వడ్డిస్తూ ఉండేది అమ్మ. ఆ తరువాత తనను దర్శించడానికి వచ్చేవారితో రోజు 12 గంటల వరకు తాత్త్విక సంభాషణలు చేస్తూ ఉండేది. మళ్లీ తెల్లవారుజామునే లేచి విరామం లేకుండా పనిచేస్తూ ఉండేది.

అన్నపూర్ణాలయ స్థాపన : అమ్మను చూడడానికి వచ్చేవాళ్ల సంఖ్య క్రమంగా పెరిగింది. వారు నాన్నగారికి (నాగేశ్వరరావుగార్కి) బరువు కాకూడదనే ఉద్దేశంతో వస్తూ వస్తూ కూరగాయలూ, మరికొన్ని వస్తువులు తీసుకొని వచ్చేవారు. అది నాన్నగారికి ఇష్టముండేది కాదు 'నాకున్నంతలో పెడతాను. హాయిగా భోజనం చేయండి. మీరిట్లా ఏదయినా తెస్తే నాకు బరువుగా ఉంటుంద'ని గట్టిగా మందలించేవారు. వచ్చేవాళ్ల సంఖ్య పెరగడంతోపాటు, వాళ్లు అమ్మ సన్నిధిలో ఎక్కువ కాలం ఉండాలని కోరుకున్నారు. అందుకని వారందరూ ఆలోచించి వేరే వంట ఏర్పాటుకు అమ్మను అడిగి అనుమతి పొందారు. కొందరు నాన్నగారికి కూడా విషయం విన్నవించి ఆయనకు కూడ నచ్చచెప్పారు. మరి ఇది ఎట్లా జరుగుతుంది, దీని బాధ్యత ఎవరు వహిస్తారు అని ఆదుర్దాపడే నాన్నగారితో అమ్మ 'ఇది జగన్నాథ రథం. కదిలితే ఆగదు. దేనివాడు దానికి వస్తాడు. మీరేమీ ఆందోళన పడవద్దు' అని సమాధానం చెప్పింది. తత్ఫలితంగా 1958 ఆగష్టు 15వ తేది వేరే వంటశాలకు ఏర్పాటు జరిగింది. దానికి అమ్మ 'అన్నపూర్ణాలయం' అని నామకరణం చేసింది.

ఏ వేళ ఎంతమంది వచ్చినా ఆకలే అర్హతగా అన్నపూర్ణాలయంలో భోజనం పెట్టాలని అమ్మ ఆదేశం. రోజూ అన్నపూర్ణాలయంలో ఎంత ఎక్కువమంది భోజనం చేస్తే అమ్మకు అంత ఆనందం. 1958 నుంచి ఇప్పటివరకు ఎన్ని లక్షల మంది భోజనం చేసి ఉంటారో..... కేవలం సందర్శకుల కోసం ప్రారంభమైన

అన్నపూర్ణాలయంలో అక్కడి కళాశాలలో విద్యార్థినీ విద్యార్థులు, పనిపాటల కోసం వచ్చేవాళ్లు, అమ్మ ఆవరణలో నివాసముండే వాళ్లు, అన్ని వృత్తుల వాళ్లు. అన్ని కులాల వాళ్లు భోజనం చేస్తూ ఉంటారు. 1973లో అమ్మ స్వర్ణోత్సవాల సందర్భంగా ఒకే పంక్తిన లక్షమంది భోజనం చేయడమనే ఉత్సవం అన్నపూర్ణాలయ చరిత్రలో సువర్ణాధ్యాయం. అలాగే అమ్మకు 60వ పుట్టినరోజు సందర్భంగా జరిగిన వజ్రోత్సవంలో 60 వేల మంది ఒకే పంక్తిలో భోజనం చేశారు. ఒక సందర్భంలో 'లక్షమంది తిన్నదీ, ఒక్కడు తినకుండా వెళ్లిందీ నాకు సమానం. ఒక్కడు చాలదూ తినకుండా వెళితే, ఆ ఒక్కడు పెట్టే బాధ తృప్తిగా తిన్న లక్షమంది అందించే ఆనందం కన్న బరువైనది' అన్నది అమ్మ. చిన్న నీటిచెలమలా ప్రారంభమై సెలయేరులా రూపుదిద్దుకున్న అన్నపూర్ణాలయం నేడు ఆరు కాలాలూ ప్రవహించే జీవనదిలా సాగుతూ ఉన్నది.

పరిణామక్రమం : అంతకు ముందు అమ్మను గుర్తించని బంధువులు క్రమంగా అమ్మ విశేషాన్ని గుర్తించి అమ్మ దగ్గరకు రావడం మొదలు పెట్టారు. వారిని గురించి అమ్మ 1965 లో ఒకసారి శ్రీ పాద గోపాలకృష్ణమూర్తి గారితో 'ఈ జీవితంలో విశేషం ఏమిటంటే ఒకనాడు అందరూ బ్రతికుండి పుల్లాకుతో సమానంగా చూసిన వాళ్లంతా ఇప్పుడు పమిడి విస్తరి లాగ ఎక్కడ ఇదై పోతుందేమోనని చూసుకుంటున్నారు వేరే ప్రాయశ్చిత్తం ఏముంది?' అన్నది.

అపూర్వ అనుబంధం : చీరాల నుంచి అమ్మను దర్శించడానికి వచ్చే యాత్రికులలో కోన సుబ్బారావు గారి కుటుంబం ఒకటి. 1958 లో ఒకనాడు వారి కుటుంబం మొత్తం జిల్లెళ్ళమూడి అమ్మ దర్శనం కోసం వచ్చారు. వారి అమ్మాయి వసుంధర అమ్మను చూసిన క్షణం నుంచీ అమ్మే తన సర్వస్వం అని భావించింది. అమ్మ సేవయే తన జీవిత పరమార్థంగా ఎంచుకుని 1962 నుంచీ అమ్మ సేవకు సంపూర్ణంగా అంకితం అయి అమ్మ సన్నిధిలో ఉండిపోయింది. ఆమె మనస్సు తెలుసుకున్న అమ్మ 1966 మే 5న ఆమె మెడలో శాస్త్రోక్తంగా మంగళ సూత్రధారణ చేసింది.

'కళంక రహితమైన మనస్సును కళంకరహితంగా మరొకరికి అర్పణ చేయటమే కళ్యాణం' అని అమ్మ కళ్యాణానికి ఇచ్చిన నిర్వచనం. అలాగే సోదరి

వసుంధర కూడ నిష్కళంకంగా త్రికరణశుద్ధిగా తనను తాను అమ్మకు సమర్పణ చేసుకుంది. భావం తెలుసుకుని ప్రవర్తించేది భార్య అని అమ్మ అన్నట్లుగానే ఆనాటి నుంచి ఈనాటివరకూ జిల్లెళ్ళమూడిలోనే ఉంటూ అమ్మ ఆదర్శాలను ఆచరణలో పెడుతూ అమ్మ సేవలో జీవితాన్ని ధన్యం చేసుకుంటోంది ఆమె. వివాహానికి నిజమైన అర్థం అదే కదా.

మాతృశ్రీ పత్రిక ఆవిర్భావం : లోకానికి అమ్మ ఇస్తున్న మహత్తర దివ్య సందేశాన్ని అందరికీ అందించటానికి మాతృశ్రీ పేరిట తెలుగు, ఇంగ్లీషు ఉభయభాషలలోను మాసపత్రికలు ప్రచురించే బృహత్తర కార్యక్రమం 1966లో ప్రారంభమైంది. మొదట త్రైమాసికపత్రికగా ఆరంభమై అనతికాలంలోనే 'మాతృశ్రీ' మాసపత్రికగా వెలువడింది. పబ్లిషర్‌గా, మేనేజింగ్ ట్రస్టీగా శ్రీ కొండముది బాలగోపాలకృష్ణమూర్తిగారు, సంపాదకులు శ్రీ కొండముది రామకృష్ణగారు మరికొంతమంది సోదరుల సహకారంతో ఆ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇప్పుడు 'విశ్వజనని' పేరుతో ఆ మాసపత్రిక వెలువడుతూ ఉన్నది. హైదరాబాద్‌లోని సోదరులు 'Mother of All' అను త్రైమాసిక పత్రికను నడుపుతున్నారు.

అర్చామూర్తిగా హైమవతి : 1968 ఏప్రిల్ 5వ తేది అమ్మ కన్నబిడ్డ హైమ మరణించింది. అందరూ ఆప్యాయంగా ఆమెను హైమక్కయ్య అని పిలిచేవారు. హైమక్కయ్యను చూడగానే జీసస్, గౌతముడు మొదలైన కారుణ్యమూర్తులే స్ఫురణకు వస్తారు. ఎవరికి ఏ విధమైన కష్టం కలిగినా తాను విలవిలలాడిపోయేది. తన ఇరవై అయిదు సంవత్సరాల జీవితకాలంలో ఎవరిలోనూ ఏ విధమయిన దోషాన్నీ చూడలేదు. అమ్మను దర్శించేందుకు ఎవరు జిల్లెళ్ళమూడి వచ్చినా హైమక్కయ్యే ముందుగా పలుకరించేది. హైమక్కయ్య వాక్కులో రూపంలో ఆమె చిన్నతనం నుంచే అందరికీ ఏదో విశిష్టత గోచరించేది.

రమణమహర్షి తనకు జన్మను ప్రసాదించిన తల్లికి చివరి దశలో జ్ఞానాన్నీ సిద్ధినీ ప్రసాదించి ఆమె మరణానంతరం ఆమె పేర మాతృభూతేశ్వరాలయం అని ఒక ఆలయాన్ని నిర్మించారు. అలాగే అమ్మ కూడా తన గర్భవాసాన జన్మించిన బిడ్డను ఆమె జీవితకాలంలో పరిపూర్ణ మానవిగా రూపొందించి జ్ఞానాన్నీ, సిద్ధినీ

అనుగ్రహించింది. తల్లిదండ్రులకు పిల్లలు కూడా అర్చామూర్తులే అన్న అమ్మ వాక్యం మాటలలో సులభంగానే ఉన్నప్పటికీ ఆచరణలో అత్యంత కఠినమైనదే. తమ బిడ్డల పట్ల ఆరాధనా భావాన్ని చూపగలగడం సామాన్యమయిన విషయం కాదు. అమ్మ ఏం చెప్పినా ఆచరణ పూర్వకంగానే చెప్పింది. అందుకు తానే మార్గదర్శకత్వం వహించ దలుచుకుని హైమక్కయ్యను అర్చామూర్తిగా ప్రతిష్ఠించింది. అమ్మ హైమలయానికి వెళ్లినపుడు హైమక్కయ్య విగ్రహాన్ని ప్రేమతో అక్కున చేర్చుకునేది. అందరి యోగక్షేమాలను చూసే అమ్మ, భక్తుల పాలిటి కొంగు బంగారంగా హైమను అర్చామూర్తిగా నిల్పిందేమోనని ఆ కాలంలోని అక్కడ పెద్దలు భావించేవారు.

అందరిల్లు : అమ్మ 'నేను అమ్మను అన్నింటికీ, అందరికీ' అని చెప్పినట్లుగానే తన ఇంటికి 'అందరిల్లు' అని పేరు పెట్టుకున్నది. అమ్మ, 'అందరిల్లు' - అనటంలోనే అమ్మలోని విశ్వజనీనత, విశాల హృదయం స్పష్టంగా తెలుస్తున్నాయి. తన ఇంటికి 'అందరిల్లు' అని నామకరణం ఎవరు చేస్తారు? ఇది అమ్మకు మాత్రమే సాధ్యం. అందరిల్లు అని వినగానే ఎవరికి వారికి ఇది తన ఇల్లు అన్పించి స్వతంత్రంగా ఉండాలని అమ్మకోరిక. వర్గ వర్ణ భేదం లేని సమసమాజమది. అందరు, ఇల్లు అనే రెండు పదాలు అందరికీ చిరపరిచితాలే అయినప్పటికీ ఆరెంటి కలయికతో అమ్మ విశ్వజనీన తత్త్వానికీ ప్రతిబింబమయింది ఆ అపూర్వ పదం.

సంస్థల ఆవిర్భావం : 1970-71 లలో శ్రీ విశ్వజననీపరిషత్, మాతృశ్రీ విద్యా పరిషత్ అనే సంస్థలు ఆరంభమైనాయి అమ్మ పట్ల అచంచలమైన విశ్వాసం సేవాభావం కలిగి అమ్మ సందేశాన్ని ప్రబోధించడంకోసం అమ్మ ఆశయాలకు రూపకల్పన చేయడం కోసం అందరింటిలో భాగాలైన అన్నపూర్ణాలయం మొదలగు సంస్థలన్నింటినీ సమర్థంగా నిర్వహిస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థ శ్రీ విశ్వజననీ పరిషత్. అధరాపురపు శేషగిరిరావుగారు అమ్మ అనుంగు బిడ్డలలో ఒకరు. తన జీవితాన్ని అమ్మ సేవకూ, అందరింటి అభివృద్ధికీ అంకితం చేసుకొన్న నిస్స్వార్థజీవి. ఆకీర్తిశేషుని కృషి ఫలితమే మాతృశ్రీ విద్యాపరిషత్. 1970లో మాతృశ్రీ విద్యాపరిషత్ ఆధ్వర్యంలో శ్రీ అధరాపురపు శేషగిరిరావుగారి నేతృత్వంలో మాతృశ్రీ ఓరియంటల్ కళాశాల ప్రారంభమైంది. కళాశాల వ్యవస్థాపక అధ్యక్షులు డా॥పన్నాల

రాధాకృష్ణశర్మగారు, అమ్మ ఆంతరంగిక కార్యదర్శి శ్రీ కొండముది రామకృష్ణగారు అహర్నిశలు శ్రమించి కళాశాల అభివృద్ధికి దోహదం చేశారు. దానికి అనుబంధంగా 1974లో మాతృశ్రీ సంస్కృత పాఠశాల ఏర్పడింది. ఆ విద్యాలయాల్లో కేవలం చదువు చెప్పటమే లక్ష్యంకాదు. విద్యార్థులను మానవత్వం పరిధవిల్లే వ్యక్తులుగా తీర్చిదిద్దాలని నిర్వాహకుల సంకల్పం. ప్రపంచమే వర్గరహితంగా ఉండాలని ఆకాంక్షించే అమ్మ అందుకు ఆదర్శంగా జిల్లెళ్ళమూడిలో అందరింటి నిర్మాణం చేసింది. దానికి అనుగుణంగానే అక్కడి కళాశాలలో, పాఠశాలలో చదువుకునే విద్యార్థులందరికీ కలిమిలేములతో, కులమతాలతో సంబంధం లేకుండా భోజనం, విద్య ఉచితంగా అందిస్తున్నది శ్రీ విశ్వజననీపరిషత్.

వాత్సల్యయాత్ర : 1973లో స్వర్ణోత్సవం తరువాత అమ్మవాత్సల్యయాత్ర పేరుతో తన దగ్గరకు రాలేని వాళ్లకు తానే వెళ్లి దర్శనం ఇవ్వటానికి తన వాత్సల్యాన్ని ప్రకటించటానికి పర్యటన చేసింది. ఒకరు ఆ విషయాన్ని ప్రస్తావిస్తే 'బిడ్డలు తల్లిని చూడడానికి వస్తే ఏముంది ? తల్లి బిడ్డలను చూడడానికి వెళితే ఏముంది? ఏదయినా ఒకటే' నంటూ చిరునవ్వుతో సమాధానమిచ్చింది. అమ్మ ఎక్కడకు వెళ్లినా అక్కడకు ఏదయినా తీసుకు వెళ్లి పంచడం అలవాటు. అమ్మ పర్యటన చేసే కాలంలో కూడ ఎక్కడకు వెళ్లినా ఏదో ప్రసాదం తీసుకుని వెళ్లి అక్కడ అందరికీ పంచడం అమ్మకు ఆనందం. నేను బయలుదేరడానికి చాలా ఉండాలి. ఒక్క గుడిసెకు వెళితే వాడికి పెట్టడానికి తీసుకుని వెళ్లాలి. అమ్మకు ఏమీ పెట్టక పోతినే అని అనుకుని వాడు బాధపడకుండ వాడి చేత పెట్టించుకోవడానికి నేనే తీసుకుని వెళ్లాలి అని చెప్పింది. అమ్మ పర్యటనలో భాగంగా అనేక ప్రాంతాలు సందర్శించింది. ఆ సందర్భంలో నరసాపురంలో ఒక యానాదుల కాలనీకి వెళ్లింది. వారు వారిఇళ్లనే కాక వారి వీధినంతా శుభ్రంగా చిమ్మి అలంకరించి అమ్మ కోసం ఒక వేదిక ఏర్పాటు చేశారు. ఆ వేదికపై అమ్మ ఆసీన కాగానే భక్తితో అమ్మ పాదాలు కడగాలని వారు కోరారు. వెంటనే అమ్మ మీరు రోజు చేస్తున్న పని అదే. ఈ రోజు ఈ వీధినంతా మీరు శుభ్రం చేసిన దానికంటే ఈ పాదాలు కడగడం విశేషం కాదు అన్నది.

ఈ యాత్రలో భాగమే అమ్మ తమిళనాడు రాష్ట్ర పర్యటన. 1975 ఏప్రియల్ 13వ తేదీన రమణాశ్రమంలో ఉన్న గుడిపాటి వెంకటాచలాన్ని చూడడానికి

తిరువణ్ణామలైకి వెళ్లారు. అక్కడ చలాన్ని చూసి ప్రేమతో దగ్గరకు తీసుకుని ప్రసాదం పెట్టి కొత్తబట్టలు ఇచ్చి ఆయన కన్నీళ్లు తుడిచి తాను కన్నీళ్లు పెట్టుకుని ఆయనపై అనిర్వచనీయమైన వాత్సల్యాన్ని చూపింది అమ్మ. సంప్రదాయానికి దూరమైన ఆయనను సమాజం కూడ దూరంగా ఉంచింది. చలంలో ఉప్పెనలా పొంగిన మానసిక సంఘర్షణ భగవాన్ శ్రీ రమణుని దర్శనంతో ప్రశాంతత పొందింది. అందుకే ఏ శక్తికీ లొంగని చలం దివ్యశక్తికి మాత్రమే కట్టుబడి తిరువణ్ణామలైలో స్థిరపడ్డారు. అమ్మ ప్రేమకు కరిగిపోయిన ఆయన అమ్మ అలా ఎదురుగా కూర్చుని ఉంటే 'ఏడిరా నీ ఈశ్వరుడు అని ఎవరైనా అంటే ఇపుడు సమాధానం చెప్పడం చాలా సులభం' అన్నారు. మరి ప్రేమకు మించిన దైవం ఎక్కడ ఉంటాడు?

ఈ సందర్భంలో రమణాశ్రమంలోని ఎందరో సాధకులు అమ్మను దర్శించుకున్నారు. ఆ తరువాత అక్కడ నుండి బయలుదేరి అమ్మ కలవాయ్ గ్రామంలో శ్రీ చంద్రశేఖరేంద్రసరస్వతీ స్వామివారి దగ్గరకు వెళ్లారు. అప్పుడు రాత్రి 11.30 గం.అయింది. మఠంలో వారు పరమాచార్యుల వారి దర్శనానికి వచ్చారనుకొని రాత్రి స్వామిదర్శనం ఇవ్వరని, ఉదయమే రావలసిందిగా కోరారు. ఆ విషయం అమ్మకు చెప్తే "నేను వచ్చానని స్వామివారికి చెప్పమ"ని అమ్మ కబురు చేసింది. అమ్మ కబురు విని స్వామివారు దండకమండలాలతో వచ్చి అక్కడ అమ్మను చూసి 15 నిమిషాలు ముకుళిత హస్తులై నిలుచున్నారు. వారు, అమ్మ ఇద్దరూ మౌనంగానే ఉండడం అక్కడివారికి ఆశ్చర్యం కలిగించినా ఆ మౌనంలోనే వారిరువురికి ఏమి సందేశాలు అందాయో మరి ?

సమాజసేవ : 1977లో వచ్చిన పెనుతుఫానుకు అన్ని గ్రామాలకు వలెనే జిల్లెళ్ళమూడి గ్రామం తల్లడిల్లిపోయింది. ఇళ్లన్నీ కూలిపోయి గ్రామస్థులంతా నిరాశ్రయులయ్యారు. మనుష్యులకే కాదు పశువులకు కూడ నీడలేకుండా పోయింది. ఆ పరిస్థితిలో ఆవరణ అంతాకూడా నీటిమయమైపోయింది. అన్నపూర్ణాలయంలో వంట చెయ్యటానికి కూడ వీలులేని పరిస్థితి. అయినా అమ్మ అందరింటి భవనంలోనే గ్రామస్థులకు వారి పశువులకు కూడ ఆశ్రయం కల్పించి వారు తేరుకొని ఇళ్లకు తిరిగి వెళ్లేదాక అన్నపూర్ణాలయంలోనే భోజనం

ఏర్పాటు చేయించింది. ఆ తుఫానుకు దివిసీమ మొత్తం కొట్టుకుపోయింది. దగ్గరున్న పిల్లలను ఆదరించటమే కాదు దివిసీమకు వెళ్లి అక్కడ మిగిలి ఉన్న వాళ్ల దుఃఖంలో పాలు పంచుకొని వాళ్లకు ప్రేమానురాగాలను పంచి ధైర్యాన్ని కలుగచేయాలన్న ఉద్దేశ్యంతో అక్కడకు వెళ్లాలని కార్యకర్తలకు తెలియచేసింది అమ్మ. వారు 5000 పులిహోర పొట్లాలు, కొన్ని వందల దుప్పట్లు, ధోవతులు, చీరలు ఏర్పాటు చేశారు. ఈ ఏర్పాట్లలో అప్పుడు అక్కడ చదువుకునే మేమందరం పాల్గొన్నాము. అమ్మ అక్కడకు వెళ్ళి వాళ్లందరినీ దగ్గరకు తీసికొని వారి కష్టాలను విని ఓదార్చి, తీసుకెళ్లిన పులిహోర నోట్లోపెట్టి, చీరలు, ధోవతులు తానే స్వయంగా పంచి పెట్టింది. 'కష్టాలలో ఉన్న అభాగ్యుల బాధలకు స్పందించటమే మానవుని ద్వారా వ్యక్తమయ్యే దివ్యత్వం' అని దివ్యత్వాన్ని నిర్వచించింది. గతంలో వచ్చిన వరదలలోనూ ఇంకా అనేక సందర్భాల్లోనూ అమ్మ ఈ విధంగానే చేసింది. అమ్మ భౌతికంగా కనుమరుగైన తరువాత కూడా అమ్మ ఆశయాలకు అనుగుణంగా 1990లో వచ్చిన తుఫానుకు గానీ, ఆ తరువాత జిల్లెళ్ళమూడిలో వచ్చిన వరదలకు గానీ ఊరి వారందరికీ ఆశ్రయం కల్పించి మళ్లీ వాళ్లు సర్దుకునేదాక శ్రీ విశ్వజననీ పరిషత్ వారు అన్నపూర్ణాలయంలో భోజనం ఏర్పాటు చేశారు.

మానవుని కనీసావసరాలు తిండి, బట్ట, వైద్యం, విద్య, అమ్మ అన్నార్తుల ఆకలి తీర్చేందుకు అన్నపూర్ణాలయం ఏర్పాటు చేసింది. విద్యార్థులకు ఉచిత భోజన వసతులతో కళాశాల ఏర్పాటు చేసింది. మాతృయాగం పేరుతో వచ్చినవారందరికీ భోజనంతో పాటు బట్టలు పెట్టేది. జిల్లెళ్ళమూడి వైద్యసౌకర్యం లేని చిన్న పల్లెటూరు కాబట్టి స్థానికుల కోసం, యాత్రికుల కోసం, గ్రామస్థుల కోసం ఉచిత వైద్య సౌకర్యంతో 1978 లో డా.ఎ.ఇనజకుమారి ఆధ్వర్యంలో మాతృశ్రీ మెడికల్ సెంటర్‌ను ప్రారంభించింది.

అమ్మకు హోమియో వైద్యం పట్ల మక్కువ ఎక్కువేమో అన్నట్లు అంతకుముందే 1971లో హోమియో ఆసుపత్రి ప్రారంభించబడింది.

ఒక ఆధ్యాత్మిక కేంద్రంలో సామాజిక సేవాకార్యక్రమాలకు ఇంత ప్రాధాన్యం ఇచ్చి అందులో తాను పాల్గొని ఇతరులకు ప్రబోధాన్నీ, ఉత్తేజాన్నీ అందించడం అమ్మలోని మానవతావాదానికి తార్కాణం.

1980లో అమ్మ తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్నది. కర్తవ్యం తోచక డాక్టర్లు కలవర పడుతున్న స్థితి. ఆ స్థితిలో అమ్మను వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకు వెళ్ళే ప్రయత్నం చేశారు - కాని అమ్మ తనను చూడడానికి వచ్చిన వాళ్లందరికీ హైదరాబాద్‌లో కూడ భోజనాలు ఏర్పాటు చేస్తేనే తాను వస్తానన్నది. ఆ పరిస్థితిలో కార్యకర్తలు అందుకు అంగీకరించి అమ్మ కోరిక మేరకు భోజనాలు ఏర్పాటు చేశారు.

భర్తృవియోగం : అమ్మ స్వస్థత పొంది తిరిగి వచ్చిన కొద్ది నెలలకే 1981 ఫిబ్రవరిలో నాన్నగారి(బ్రహ్మాండం నాగేశ్వరరావుగారు)నిర్యాణం జరిగింది. ఆ సన్నివేశంలో అమ్మ ఆవేదనో, ఆరాధనో, మమకారమో, మమతలకు దూరమో తెలియని భావసమాధిస్థితిలో నాన్నగారి భౌతిక కాయంపై చేయివేసి కొన్ని గంటల పాటు నిస్తరంగ సముద్రంలా ఉండిపోయింది. తరువాత లేచి, 'సృష్టిలో సహజమయిన పరిణామం కలిగింది. ఎవరూ దుఃఖపడవలసిన పనిలేదు' అని ప్రకటించి అనంతర కార్యక్రమాన్నంతా నిర్వికారంగా, నిశ్చలంగా నిర్వర్తించింది.

వజ్రోత్సవం : 1983లో అమ్మకు షష్టిపూర్తి సందర్భంగా వజ్రోత్సవం జరిగింది. అప్పటి వేడుకలతో పాటు అక్కడ జరిగే సేవాకార్యక్రమాలు నిరంతరమూ కొనసాగాలనీ, దానికి తగిన ఆర్థిక పుష్టిని సంస్థకు సమకూర్చి పటిష్టం చేయాలని విశ్వజననీ పరిషత్ ఆలోచించింది. ఆ దృష్టితో ఆలోచనలు కొనసాగి అమ్మ చేపట్టిన మహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేయడమే షష్టిపూర్తి ఉత్సవ సందర్భంగా మనం అమ్మకు సమర్పించగలిగిన నిజమైన కానుక అని శ్రీ విశ్వజననీ పరిషత్ భావించింది.

1984 లో ఫిబ్రవరిలో అమ్మ వర్గ వర్ణభేదం లేకుండా ఆసక్తే అర్హతగా గాయత్రీయాగం చేయించింది. ఈ లోకమంతా గాయత్రీదేవి స్వరూపంగా అర్థం చేసుకుని లోకాన్నంతటినీ ప్రేమించమని అమ్మ ప్రబోధం. లోకంలో అన్ని విధాల అడుగు మెట్లపైనున్నవారినీ, ఆర్తులను, ఆపదల్లో నున్నవారినీ ఆదుకుని, వారికి చేయూత నిచ్చి ప్రేమతో ఆదరించడమే విశ్వాన్ని ఆరాధించడం అని అమ్మ వివరించింది. ఇదే అమ్మ నిరంతరం వినిపిస్తున్న ప్రబోధం.

అంతా దైవమే : ప్రతి మే 5వ తేది జిల్లెళ్ళమూడిలో అమ్మ కళ్యాణోత్సవం జరుగుతుంది. 1984 మే 5వ తేదీన అమ్మ జిల్లెళ్ళమూడి గ్రామస్థులందరికీ విందు చేయాలి అని చెప్పి మన ఊహకు కూడ అందని విధంగా ఒక కార్యక్రమాన్ని రూపొందించింది. గ్రామంలో ఉన్న స్త్రీలందరికి బొట్టు పెట్టి కాళ్లకు పసుపు రాసి పూలు, గాజులు ఇచ్చే కార్యక్రమమది. ప్రబోధమే కాకుండా శిక్షణలో కూడ అమ్మ ఎంతో జాగ్రత్త తీసుకుంటుంది. ఆవరణలో మరీ పెద్దవాళ్లుగా అనుకునే వాళ్లనే ప్రత్యేకంగా వాళ్ల పాదాలకు పసుపు రాయమన్నది. గ్రామస్థుల్లో అన్నికులాల వాళ్ళూ, అన్ని మతాలవాళ్ళూ ఉన్నారు. స్థాయీ భేదం లేకుండా అందరిలో దైవాన్ని చూడాలి అనే అమ్మ ప్రవచనం ఆనాడు ఆచరణలో సాక్షాత్కరించింది. ఆ తరువాత వాళ్లందరికీ భోజనం పెట్టి బట్టలు పెట్టింది అమ్మ. 'ఈ సృష్టి అనాది నాది అని ప్రకటించిన అమ్మకు మనుష్యులే కాదు పశువులూ, పక్షులూ కూడా బిడ్డలే. కనుకనే మరొకరోజు గ్రామంలోని పశువులన్నింటినీ ఒక చోటకు చేర్పించి వాటికి విందు ఏర్పాటు చేయించింది. అమ్మే స్వయంగా వాటి దగ్గరకు వచ్చి సంగం జాగర్లమూడి నుంచి ప్రత్యేకంగా తెప్పించిన దాణా వాటికి పెట్టి అవి తింటూ ఉంటే ఆనందంతో పొంగిపోయింది. ప్రపంచ చరిత్రలోనే ఇలాంటిది అపూర్వ సంఘటనగా అన్పిస్తుంది.

మహాభినిష్క్రమణానికి సన్నాహం : 1985 జనవరి నాటి నుంచి జరిగిన విషయాలు పరిశీలిస్తే అప్పుడు గుర్తించలేకపోయినా అమ్మ ఒక ప్రణాళిక ప్రకారం నడిచిందేమో ననిపిస్తుంది. ఎందుకంటే 1985 జూన్ 12వ తేది అమ్మ పార్థివ శరీరం వీడి అనంతశక్తిలో విలీనం అయినప్పుడు గాని అమ్మ మాటలు, చేష్టలు అర్థం కాలేదు. అమ్మ చిన్న కుమారుడైన బ్రహ్మాండం రవీంద్రరావుగారు 85లో జిల్లెళ్ళమూడి స్టేట్‌బ్యాంక్‌లో ఉద్యోగం చేస్తుండేవారు. అమ్మ అందరినీ కన్నబిడ్డలుగా చూసి వాత్సల్యాన్ని పంచి ఇచ్చింది. ఆ అమ్మ తనను కన్నతల్లిగా తన కుటుంబంతో కలిసి ఉండాలని ఆయన అపురూపమైన కోరిక. ఆ కోరిక మేరకు అమ్మ 85 జనవరిలో వారి ఇంటికి వచ్చి కొన్ని నెలలు గడిపింది. అమ్మ ఇంట్లో ఉన్నదన్న సంతోషంతో ఆయన వచ్చిన వారందరికీ భోజనాలు ఏర్పాటు

చేసి అమ్మ చేత బట్టలు పెట్టించేవారు. తాను కన్న బిడ్డ కోరిక తీర్చడమే కాకుండా తనను కన్నబిడ్డలను తృప్తి పరచడానికేమో అమ్మ ఆవరణలో ఉన్న అందరి ఇళ్లకూ, విద్యార్థుల గదులకూ, కళాశాల అధ్యాపకులమైన మా అందరి ఇళ్లకూ వచ్చింది.

ఆ రోజులలోనే కారంచేడు అవధూతేంద్ర భక్తమండలి వారు హరేరామ నామ సంకీర్తన 49 రోజులు నిర్విరామంగా చేశారు. ఈ నామాన్ని ముఖ్యంగా ఆంధ్రదేశంలో ప్రచారం చేసింది మాత్రం శ్రీ అవధూతేంద్ర సరస్వతీ స్వామీజీ. స్వామీజీ మొట్టమొదటిసారిగా అప్పికట్లలో 1952 లో అమ్మను చూశారు. ఆనాటి నుంచి అమ్మకు వారిపై వాత్సల్యమూ, వారికి అమ్మపై భక్తి, విశ్వాసమూ. 1954లో మొదటిసారిగా అవధూతగా ఆయన జిల్లెళ్ళమూడి వచ్చారు. అమ్మ ఎదురు వెళ్లి వారి కాళ్లు కడగటానికి ప్రయత్నించింది. వారు అంగీకరించలేదు. 'తప్పు లేదు నాన్నా! బిడ్డ కళ్లు, కాళ్లు తల్లి కడుగవలసిందే కాని ఇంకెవరు కడుగుతారు? నాన్నా! నీకు ఎపుడు అవసరం అనుకుంటే అపుడు వచ్చి నా దగ్గర ఉండు. ఇక్కడ నీ తల్లి ఉన్నదన్న విషయం మరిచిపోకు' అని చెప్పింది. ఆ మాట ప్రకారమే ఆయన అమ్మ దగ్గరకు ఎన్నో సార్లు వచ్చి అమ్మ ఒడిలో పసివాడై పరవశం చెందేవారు. ఆ క్షణాల్లో ఆయన తన వయస్సునూ, స్థితినీ అన్నింటినీ మరచి చిన్న పిల్లవానికి వలె హాయిగా ఉండేవారు. ఆయన ఆధ్వర్యంలో ఎన్నో భక్త సమాజాలు ఏర్పడ్డాయి. ఆయన శిష్యులచేతనే జిల్లెళ్ళమూడిలో రామనామ సప్తాహ కార్యక్రమం నిర్వహించబడింది. ఆ నామంతో ఆవరణ అంతా రామమయంగా మారింది. అప్పుడే కొన్ని రోజుల పాటు రామాయణమంతా రామలీలలుగానూ, అమ్మ చరిత్ర అనసూయ కళ్యాణంగానూ రూపకాలు అమ్మ ఎదుట ప్రదర్శింపబడ్డాయి. అందరి ఇళ్లకు అమ్మ ఆగమన కార్యక్రమాలతో ఆవరణ అంతా నిత్య కళ్యాణం పచ్చతోరణమై అందరికీ ఏదో దివ్యలోకంలో ఉన్నామన్న భావన కలిగింది. మధ్య మధ్యలో అమ్మకు అనారోగ్యంగా ఉంటున్నా ఏ కార్యక్రమాలకూ భంగం రాకుండా నిర్విఘ్నంగా సాగిపోయాయి ఆ రోజులన్నీ.

మహాభినిష్క్రమణం : 1985 మే నెల నుంచి అమ్మ అస్వస్థతతో బాధపడుతూ ఉండేది. 'నేను వచ్చిన పని అయిపోయింది. ఇక నన్ను పోనీయండి.

నవ్వుతూ పంపించండి' అని తరచుగా అంటూ ఉండేది. అమ్మ ఆరోగ్యం బాగా క్షీణించి జూన్ రెండవ తేది అందరింటిలోని అందరినీ పిలిపించి ఒక్కొక్కరికి ఒక్కో సందేశం ఇచ్చింది. అమ్మ పరిస్థితి చూసి అందరూ దుఃఖిస్తుంటే అమ్మ కూడ కంటతడి పెట్టింది. తాను లేకపోతే ఈ బిడ్డలంతా ఎలా తట్టుకుంటారో అన్న ఆలోచనే అమ్మ కన్నీటికి కారణం కావచ్చు. అందరిల్లు అంతా శోకసముద్రంలా ఉంది. అపుడు కూడ అమ్మ ఉదయం 10 గంటలకే అన్నపూర్ణాలయంలో భోజనం గంట ఇంకా వినిపించలేదని తపన పడింది. జూన్ 11వ తేది రాత్రి అమ్మ ఆంతరంగిక కార్యదర్శి శ్రీ కొండముది రామకృష్ణతో అన్నపూర్ణాలయ నిర్వహణ గురించి, విద్యాలయాలు, వైద్యాలయాలు, దేవాలయాలు యథావిధిగా కొనసాగాలని చెప్పింది. "ఎట్లా నడపడం అని భయపడవద్దు. ఇపుడు ఏ శక్తి జరుపుతున్నదో ఇక ముందు కూడ ఆ శక్తే జరుపుకుంటుంద"ని హామీ ఇచ్చింది. 'నిర్ణయానికి నిర్ణయించినవాడు కూడ బద్ధుడే' అని అమ్మ చెప్పినట్లుగానే కాలధర్మానికి కట్టుబడి జూన్ 12వ తేది రాత్రి 10 గం.లకు శరీర పరిత్యాగం చేసింది.

అమ్మ భౌతికంగా కనుమరుగైన తరువాత అమ్మ భావాలకు వారసులయిన కార్యకర్తలు అమ్మ ఏర్పరచిన సంస్థనే అమ్మ ప్రతిరూపంగా భావించి సంస్థను సేవిస్తే అమ్మను సేవించినట్లేనని అమ్మ ఆశయాలను నెరవేర్చడానికి నిరంతరం శ్రమిస్తున్నారు. రకరకాల పూలు కలిసి అందమైన హారం ఏర్పడినట్లుగా విభిన్న సంస్థల సమాహారమే శ్రీ విశ్వజననీ పరిషత్. పూసలలోని దారంలాగా సంస్థల నిర్వహణలో అమ్మ ఆలోచనా స్రవంతి అంతర్లీనంగా గోచరిస్తుంది. కొందరి దృష్టిలో ఇది యాత్రా స్థలం, కొందరి దృష్టిలో పుణ్యక్షేత్రం, మరికొందరి దృష్టిలో ఆధ్యాత్మిక కేంద్రం, కొందరి దృష్టిలో ఆదరణకు నెలవైన చోటు, కొందరి దృష్టిలో విద్యాదేవత కొలువున్న చోటు. ఎవరు ఏ విధంగా దర్శించినా ఈ సంస్థలన్నీ అమ్మ భావాలకు ప్రతీకలు, ప్రతిరూపాలు అని చెప్పకతప్పదు.

అమ్మ అసాధారణ వ్యక్తిత్వం

i) పరిచయం :

అవ్యాజ వాత్సల్యంతో, అకారణ కారుణ్యంతో, విశ్వజనీన మాతృత్వంతో నవశకానికి నాంది పలికిన అసాధారణ వ్యక్తి అమ్మ. ప్రేమసూత్రానికి రసవత్తర వ్యాఖ్యానమే అమ్మ జీవితం. విలక్షణమైన దర్శనం, వినూత్నమైన దృక్పథం, విశిష్టమైన సమన్వయం అమ్మ ప్రవృత్తిగా మనం దర్శించవచ్చు. చర్మచక్షువులకు గోచరించే వస్తువును కాకుండా దాని తత్త్వాన్ని దర్శించడం తాత్త్వికుల లక్షణం. కార్యకారణ విచారమే తార్కికత. తాత్త్వికత - తార్కికత అమ్మ ఆంతరధర్మాలుగా గోచరమవుతాయి. సుఖదుఖాలు, రాగద్వేషాలు, కలిమిలేములు, జయాపజయాలు అనే ద్వంద్వాలలో ఒదిగిన వ్యక్తిత్వం సామాన్యులలో కన్పిస్తే ద్వంద్వాలకు అతీతంగా ఎదిగిన అసాధారణ వ్యక్తిత్వం అమ్మలో గోచరిస్తుంది. ద్వంద్వాతీత కనుకనే మంచి చెడుల భేదాన్ని పరిగణించని అమ్మ దుష్టులను శిక్షింపక వారి దుష్టత్వాన్ని సంస్కరించటమే తన లక్ష్యంగా ప్రకటించింది.

లోకంలో ఆచారాలను, సంప్రదాయాలను అనుసరించే వారూ, వ్యతిరేకించే వారూ ఉంటారు. కాని సంప్రదాయాలను అనుసరిస్తూనే సంప్రదాయగతిని మార్చడం - అంటే మలుపుతిప్పడం అమ్మలోని ప్రత్యేకత. సేవాభావం సామాజికంగాను, ఆధ్యాత్మికంగాను ఎంతో ఉన్నతమయింది. మానవతా దృక్పథంతో సాటివారిని ఆదుకునే వారు కొందరయితే మానవ సేవే మాధవ సేవగా భావించి చేయూతనందించే వారు మరికొందరు. వారెవరైనా ఎలాంటి వారైనా తన కన్నబిడ్డలుగా భావించి అవ్యాజంగా సేవలందించడం అమ్మ విశిష్టత.

తాత్త్వికంగా ఎంత ఉన్నత స్థితిని చేరుకున్నా, ఎంత గంభీరంగా ఉన్నా చమత్కార సంభాషణలతో తన చుట్టూ ఉన్న వాతావరణాన్ని ఉల్లాస భరితంగా మార్చడం, శ్రోతలను ఉత్తేజితులను చేయడం అమ్మ సంభాషణా చతురతకు నిదర్శనాలుగా కన్పిస్తాయి.

ii) అవ్యాజ ప్రేమ

సృష్టికి మూలం ప్రేమ. విశ్వంభరా భ్రమణానికి మూలం శాశ్వత చైతన్యం. కోట్లాది సంవత్సరాలుగా అవిచ్ఛినంగా సాగే ఈ సృష్టిక్రమం కొనసాగడానికి మూలం, కరుణానిర్భరమైన సృష్టికర్త ప్రేమ సూత్రం. గాలి పాటలు పాడుకుంటూ ఎగిరే తుమ్మెదలకు పూల కంచాలలో తేనెలొడ్డించడం, కళ్ళు తెరవని పసికందు కేరుమనగానే తల్లిస్తన్యం సంసిద్ధపరచడం, ఒంటి తడిఆరని లేగదూడ తల్లి పొదుగుకై తడుముకోవడం, మొలకగా మారాలని పరితపించే విత్తనం దాహార్తికి వానచినుకు వర్షించడం-ఇవన్నీ సృష్టిలో అంతర్లయగా కొనసాగే ప్రేమతత్త్వానికి ప్రతీకలు.

అనంతమైన తత్త్వం ఆవిష్కరింపబడాలంటే ఆకృతి అవసరం. చూసే శక్తి ఉన్నా కన్నులేనిదే వస్తు దర్శనం కలుగదు కదా ! శక్తి పదార్థాన్ని ఆశ్రయిస్తేనే కార్యకారి అవుతోంది. అలాగే సృష్టికి మూలమైన ప్రేమ తత్త్వం ఆకృతి ధరించి కరచరణాదులతో సజీవంగా కదిలి వస్తే అది అమ్మ. అందుకే అమ్మ హృదయం ప్రేమతత్త్వానికి ప్రతీక. అమ్మ జీవితంలో ప్రతి సన్నివేశం ప్రేమ తత్త్వానికి పతాక.

లోకంలో మనమనుకునే ప్రేమకు అర్థం వేరు. అనుబంధాలను బట్టి అది అనేక విధాలుగా గోచరిస్తుంది. తల్లిదండ్రులకు తన బిడ్డలపై గల ప్రేమ మమకారం అనీ, భార్యాభర్తలకు పరస్పరం గల ప్రేమ అనురాగమనీ, పెద్దలపై గల ప్రేమ గౌరవమనీ, పెద్దవాళ్లకు చిన్నవాళ్లపై గల ప్రేమ వాత్సల్యమనీ, సమాన వయస్కుల మధ్య ప్రేమ స్నేహమనీ, భగవంతునిపై గల ప్రేమ భక్తి అనీ రూపాంతరాలుగా కన్పిస్తున్నా, అన్నిటా ప్రేమేమూలం. కానీ, ఇవన్నీ సవ్యాజమైనవే. సాధారణంగా ప్రేమ అంటే ఇచ్చి పుచ్చుకునేదే. ఎదుటి వ్యక్తి గుణగణాలను బట్టి వారితో మనకున్న అనుబంధాన్ని బట్టి హెచ్చుతగ్గులు ఉండవచ్చు. ప్రేమకు ప్రతిరూపాలైన తల్లిదండ్రులు కూడ తమ బిడ్డలనుండి ప్రతిఫలంగా ప్రేమను కోరుకుంటారు. కాని అమ్మ 'కారణాలతో కూడింది ప్రేమ కాదు అవసరం, అన్న ఒక్క మాటతో మనమనుకునే ప్రేమకు సరిక్రొత్త అర్థాన్ని చెప్పింది. ఎదుటి వారెవరయినా, ఎలాంటివారయినా, ఏంచేసినా మనం ప్రేమించగలిగితే అదే నిజమైన ప్రేమ అని నిర్వచించింది.

'రామో విగ్రహవాన్ ధర్మః' అని ధర్మమే మూర్తీభవిస్తే రాముడైనట్లుగా పరమ పురుషతత్త్వవర్ణన ప్రధానమైన వేదం శ్రీమద్రామాయణంగా రూపొందింది. అలాగే వాత్సల్యామృతాన్ని వర్షించడానికీ, ఆధివ్యాధులతో తపించే సమస్త ప్రాణి కోటికీ చలువ పందిరై నిలువడానికీ మూర్తీభవించిన ప్రేమావతారం అమ్మ. 'అవ్యాజ ప్రేమ కాదు ప్రేమే అవ్యాజమైంది' అని అపూర్వంగా నిర్వచించిన అమ్మ అవ్యాజ ప్రేమకు సాకారం. ప్రతిఫలాపేక్ష రహితమైన నిర్మల ప్రేమ యొక్క విరాట్ స్వరూపమే అమ్మ. ప్రేమ యొక్క సర్వాంగ సౌందర్యం అమ్మ మాటల్లో చేతల్లో ప్రకాశిస్తుంది. లోకానికి ప్రేమ ఫలాన్ని పంచి పెట్టిన వాత్సల్యమూర్తి అమ్మ. ఆ అనురాగ ప్రసారంలో హెచ్చుతగ్గులు లేవు. ఆ వీక్షణలో విచక్షణ లేదు. ఆ ఒడిలో అందరూ సమమే. అందరూ సుతులే. అక్కడ వయోభేదం కానీ, లింగభేదంకానీ, జాతి, కుల, మత, వర్గ భేదం కానీ ఏమీ లేవు. గడ్డాల తాతలు కూడా అడ్డాల బిడ్డలే. లోకంలో విశ్వజనీనమైన భావన కల్గినవారు ఉండవచ్చు. విశ్వతాదాత్మ్యస్థితి కల్గినవారూ ఉండవచ్చు. కానీ, సృష్టినంతటినీ తన కన్నబిడ్డగా ప్రేమించిన విశ్వజననీత్వం మనకెక్కడా కన్పించదు. ఇంతవరకూ చరిత్రలో కనీ వినీ ఎరుగనిది. అమ్మకు ఎపుడు ఎవరిని చూసినా తన బిడ్డయే అన్పిస్తుందట. 'నేనే కని మీ మీ తల్లులకు పెంపుడిచ్చినట్లు అన్పిస్తుంది, అనిచెప్పింది అమ్మ.

'నీవెవరివమ్మా?' అనిఎవరో ఒకసారి ప్రశ్నిస్తే 'నేను అమ్మను, నీకు, మీకూ, అందరికీ, అని సమాధానం చెప్పింది. అంటే అమ్మలో కన్పించే మాతృత్వం మానవజాతి వరకే పరిమితం గాక సమస్త జీవకోటికీ, యావద్విశ్వానికీ పరివ్యాప్తమైందని అర్థం. కనుకనే కొండముది రామకృష్ణగారు ఇలా అన్నారు.

'లోకంలో ఈ ఊరు నాది, ఈ రాష్ట్రం నాది, ఈ దేశం నాది, అన గలిగిన వారున్నారేమో కాని 'ఈ సృష్టినాది' అని అనగలిగింది అమ్మ మాత్రమే' అని.

ప్రపంచంలో ఏ స్త్రీకైనా మాతృత్వం, ఆ మాతృత్వానికి సహజమైన ప్రేమ మాధుర్యం తల్లిగా మారాక అనుభవంలోకి వస్తాయి. కానీ అత్యంత బాల్యావస్థలోనే అందరిపై అమ్మ చూపిన నిర్వ్యాజమూ, నిస్సీమమూ అయిన ప్రేమ సహజంగానే అమ్మను విశ్వజననిగా నిరూపిస్తున్నది. రెండేళ్ల వయస్సులోనే తన కంటే పెద్దవారితో

'నేను అమ్మను' అని చెప్పడం, 'అందరూ నా బిడ్డలే' అని అనడమే కాకుండా ఆ నాటి నుంచి చివరి వరకూ వాళ్ల వయస్సుతో నిమిత్తం లేకుండా పసిపాపలైనా, పండు ముదుసలులైనా, స్త్రీలైనా, పురుషులయినా, ఏ అరమరిక లేకుండా లాలించింది.

మాతృతత్త్వానికి లింగ వయోభేదాలు లేవు. అమ్మ 'వయోஉ వస్థావివర్జితా' కదా. 'సృష్టికి కారణం అకారణం అని' అమ్మ చెప్పినట్లుగానే అమ్మ ప్రేమకు కారణాపేక్షలేదు. నిప్పుకు కాలడం, గాలికి వీచడం, నీటికి ప్రవహించడం ఎంత సహజమో, అమ్మకు ప్రేమ అంత సహజం.

'ప్రపంచంలో ఏమూల కొంచెం ప్రేమ కన్పించినా, మూలం ఒకటే, ఆ మూలం ఇండియాలో ఉన్నది జిల్లెళ్ళమూడి వెళ్లి చూడు' అని పాలో అనే గ్రీకు సోదరుడికి అతని స్నేహితురాలు సలహా ఇచ్చిందట. అతడు అమ్మ దర్శనార్థం జిల్లెళ్ళమూడి వచ్చి కొన్నాళ్లు అమ్మ వద్ద ఉండి తిరిగి స్వదేశం వెళ్లేటప్పుడు కళ్ళల్లో నీళ్లు నింపుకుంటూ వెళ్లిన సన్నివేశం అపూర్వం, అనిర్వచనీయం. 'అమ్మ ప్రేమ గురించి వివరించటానికి పాలో ఉదాహరణ ఒక అనుభూతినిచ్చేది మాత్రమే' అన్నారు డా.యు.వరలక్ష్మిగారు 'అమ్మ ప్రేమ' అనే వ్యాసంలో. మరి విశ్వజనని ప్రేమకు స్వదేశం విదేశం అని భేదం ఉండదు కదా ! కంటపడిన వారందరూ అమ్మ దృష్టిలో కన్నబిడ్డలే.

ఒకసారి విదేశీ సోదరి మార్వా కొంతకాలం అమ్మ సన్నిధిలో ఉండి తిరిగి వెళుతూ 'అమ్మా ! నేను కొన్ని నెలలు ఉద్యోగం చేసి కొంత డబ్బు నిలువ చేస్తాను. ఆ పైకంతో నీకు కారు పంపమంటే పంపుతాను. లేకపోతే నేను మళ్లీ వచ్చి నీ దగ్గర కొంత కాలం గడుపుతాను, అంటే, అమ్మ వెంటనే 'నీవే రా' అన్నది. అంటే లక్షలు విలువ చేసే బహుమానం కంటె కన్నబిడ్డ పట్ల మమకారంవైపే అమ్మ మనస్సు మొగ్గు చూపింది. అమ్మ హృదయానికి అద్దంపట్టే సన్నివేశం ఇది.

రిచర్డు షిఫ్‌మన్ అమెరికా దేశస్థుడు. అతడు 1975 లో అమ్మ దగ్గరకు వచ్చి కొంతకాలం ఉన్నాడు. తాత్త్విక చింతన గల అతడు అమ్మ చరిత్రను, అమ్మ సిద్ధాంతాలను నిత్యం అధ్యయనం చేసేవాడు. అమ్మను గురించి ఒక గ్రంథం

ఇంగ్లీషులో సిద్ధం చేసి మనదేశంలో ముద్రించాలనుకున్నాడు. కాని ప్రభుత్వం ఇక్కడ నివసించడానికి అనుమతి ఇవ్వని కారణంగా అమెరికా వెళ్లి అక్కడ ప్రచురిస్తానని చెప్పాడు. అతను వెళ్లిపోతున్నాడని అమ్మ ఎంతో బాధపడుతుంటే సోదరులు రామకృష్ణగారు అమ్మతో 'అమ్మా ! - ఇదీ ఒక విధంగా మంచిదే. ఇంతవరకు నిన్ను గురించిన గ్రంథం ఒక్కటి కూడా విదేశాల్లో ప్రచురితం కాలేదు. ఇతడు అమెరికా వెళితే ఆ లోటు తీరుతుంది' అన్నారు. అపుడు అమ్మ 'అతడు ఇక్కడ ఉండగల్గితే ఆ పుస్తకం ముద్రణకాకపోయినా సరే. ఎన్ని పుస్తకాలు ప్రచురించినా అతనికి ఇక్కడ ఉన్నట్లుగా ఉండదుగా' అన్నది. అవ్యాజమైన అమ్మ వాత్సల్యాన్ని చవిచూశాడు కనుకనే, తాను రచించిన "Mother of All" అనే గ్రంథంలో అమ్మ ప్రేమను గూర్చి.

Here was the Love proclaimed from every roof top. Yet all feet extinct in practices - Love without Motives, Pure, Selfless, Without limits" అని తెలియచేశాడు.

ఒకసారి శ్రీశ్రీశ్రీ లక్ష్మణ యతీంద్రులవారు అమ్మ దర్శనార్థమై జిల్లెళ్ళమూడి వచ్చినపుడు అమ్మ సన్నిధిలో వారు రచించిన 'క్వణత్ కింకిణి' అన్న కావ్యం నుంచి కొన్ని రసవద్ఘట్టాలను గానం చేస్తున్నారు. యతీంద్రులవారు వారి ఆరాధ్యదైవం అయిన కృష్ణుని గురించి తన్మయులై పాడుతున్నారు. అంతలో అమ్మ యతీంద్రులవారి మెడలో నున్న పుష్పహారాన్ని తీసి క్రింద ఉంచింది. అది బరువుగా ఉన్నందువలన వారికి శ్రమ కలుగుతుందని అమ్మ ఆలోచన. అది గమనించి చిరునవ్వుతో యతీంద్రులవారు 'ఇదీ అమ్మ అంటే, అమ్మ అంటే నిర్వచనం కోసం నిఘంటువు చూడకండి. ఇక్కడ చూడండి' అన్నారు. మరి నిజమైన ప్రేమకు నిర్వచనాలతో పని ఉండదు కదా.

'మా మీద నీకెందుకింత ప్రేమ' అని ఒకరు ప్రశ్నిస్తే, 'మీరు నాకేదో చేయాలని నేనెప్పుడూ అనుకోను. ప్రేమ నాకు సహజం' అని ప్రకటించిన అమ్మ ప్రేమఝురికి నిర్ణీత మార్గాలు లేవు. అది అన్ని వైపులా అన్ని వేళలా ప్రవహిస్తుంది. ఏ విచక్షణా లేకుండా ఎల్లరకు తన ఎనలేని ప్రేమను పంచి పెట్టడం అమ్మతత్త్వం.

ప్రేమతో, లాలనతో, ఆదరంతో, ఆప్యాయతతో, అనురాగంతో ఈ లోకాన్ని సాకాలన్నది అమ్మ హృదయం.

అమ్మకు స్వర్ణోత్సవ సందర్భంగా బిడ్డలందరూ కలిసి 'జన్మదిన కానుక ఏం కావాలమ్మా?' అని అమ్మను అడిగితే 'లక్షమంది ఒకే పంక్తిలో భోజనం చేయాల'నీ, 'ఆ మనోహర దృశ్యం తాను చూడాల'నీ తన కోరికను వ్యక్తం చేసింది. ఆ కోరికలో ఎంత మధురమయిన మమత! ఆ మమతాబంధమే అమ్మ ప్రత్యేకత. 'లక్షమందిలో ఏ ఒక్కరు భోజనం చేయకపోయినా నాకు బాధగానే ఉంటుంది నాన్నా!' అని పలికే ప్రేమామృత వర్షిణి అమ్మ. అలౌకికమైన అసాధారణమైన ఈ వాత్సల్యం వల్లనే ఎందరో అమ్మ పట్ల ఆకర్షితులయ్యారు. లోకంలో తల్లి ప్రేమకు మించిన గొప్పతనం, పవిత్రత మరొకదానికి లేవు. నలుగురయిదుగురిని కన్న మామూలు తల్లి విషయమే అది. మరి ఎందరికో ఏ భేదం లేకుండా తల్లి ప్రేమను పంచి పెట్టి తల్లిని మరపించే వాత్సల్య జలధి అమ్మ. మాటల కందనిది ఆ విశిష్టత.

తన వద్దకు వచ్చే అందరికీ అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో అమ్మ తన ఇంటికి పెట్టిన పేరు 'అందరిల్లు' (House of All). ఈనాడు కులాలుగా, మతాలుగా, వర్గాలుగా, వర్ణాలుగా విడిపోతున్న సమాజాన్ని వాత్సల్యబంధంతో ముడివేసి వర్గంలేని స్వర్గంగా రూపొందించాలని అమ్మ కోరిక. దానికి ఆచరణ రూపమే అందరిల్లు. అక్కడ వర్గ, వర్ణ, వయోభేదం లేకుండా అందరూ సభ్యులే. 'అందరిల్లు' అన్న పదమే అమ్మ విశ్వజనీన తత్త్వానికి ప్రతిబింబం. ఈ అందరింటిని గూర్చి శ్రీ పొత్తూరి వెంకటేశ్వరరావుగారు 'విశ్వజనని' పత్రికలో ఈ విధంగా తెలియజేశారు. 'అందరిల్లు అమ్మ నిర్మించుకున్న ఒక మహా ప్రయోగశాల. అక్కడ జరుగుతున్నవి ప్రాయోజిక సంస్కరణలు. మనసులలో మమతలు కలిగి, మనుషులలో సమతలు వెలిగే వర్గాలు లేని స్వర్గం నిర్మాణమౌతున్నది' అని.

ఆ అందరింటిలో ప్రధాన భాగమే అన్నపూర్ణాలయం. ఇది అమ్మ వాత్సల్యానికి ప్రతిరూపం. ఏ వేళ ఎందరు వచ్చినా ఆదరంగా అన్నం పెట్టాలన్నది అమ్మ ఆకాంక్ష. డ్రస్, అడ్రస్ బట్టి కాక ఆకలే అర్హతగా పెట్టమని అమ్మ ఆదేశం. భావాలు కలిసిన పదిమంది నిస్స్వార్థంగా సమష్టి ప్రయోజనం ఆశించి ఏ పని

చేసినా అది యజ్ఞం. అందుకే అమ్మ నిరంతరంగా సాగే ఈ అన్నదాన కార్యక్రమానికి 'మాతృయాగం' అని పేరు పెట్టింది. దీనిని గురించే రచయిత 'నదీరా'.

ఎందరు రానీ ఎప్పుడు రానీ
ముందుగ విందులు చేయును జననీ
ఇది ఒక యాగం, ఇది ఒక యోగం.
ప్రజోపయోగం - ప్రేమ ప్రయోగం అని గానం చేశారు.

అమ్మను చూడడానికి వచ్చినవారు 'అమ్మా ! మీరు ఇంతమందికి అన్నదానం ఎలా చేస్తున్నారు?' అంటే, "తల్లి బిడ్డలకు అన్నం పెట్టుకోవడంలో విశేషమేముంటుంది నాన్నా, అయినా నేను పెట్టడం ఏముంది? వాళ్లకు అన్నం ఇక్కడ ఉండి తింటున్నారు అది లేకపోతే వాళ్లు రాలేరూ, వచ్చినా తినలేరు" అని సమాధానం చెప్పింది. అమ్మను మనం చూసినా మనని అమ్మ చూసినా వేసే మొదటి ప్రశ్న 'భోంచేశావా! నాన్నా' అని. ఇదే భావం రూపం మారవచ్చు. 'అడగందే అమ్మయినా పెట్టదు' అన్న లోకోక్తిని తారుమారు చేసి 'అడక్కుండా పెట్టేదే అమ్మ' అని అన్నపూర్ణాలయాన్ని స్థాపించి సప్రమాణంగా ఋజువు చేసింది.

విశిష్టమైన వ్యక్తిత్వం గల అమ్మ జీవిత మహోదధిలో ఎన్నో అసాధారణమైన సంఘటనలు తరంగాలుగా రూపుదాల్చాయి. పూవు పుట్టగానే పరిమళిస్తుం దన్నట్లుగా అమ్మ బాల్యం నుంచీ తన ప్రేమ పరిమళాలను లోకానికి వెదజల్లింది అనటానికి కొన్ని సంఘటనలను పరికిద్దాం.

అమ్మకు తొమ్మిదవ సంవత్సరంలో ప్రఖ్యాత పండితులు, పరివ్రాజకా చార్యులు అయిన శ్రీవాసుదాసస్వామివారి దర్శనానికి వారి బంధువులతో కలిసి అమ్మ వెళ్లింది. అప్పటికి అమ్మ తల్లిలేని బిడ్డ. అందువలన వారు అమ్మపై సానుభూతి కనబరుస్తూ 'అందరూ నిన్ను ప్రేమించేటట్లు ఆశీర్వదించేదా అమ్మా!' అని అడిగారు. అపుడు అమ్మ పలికిన మాటలు అమ్మ చరిత్రకే అలంకారాలు. 'స్వామీ ! నన్ను అందరూ ప్రేమించినా, ప్రేమించకపోయినా నేను అందరినీ ప్రేమించేటట్లు ఆశీర్వదించండి' అని కోరింది. అమ్మ జీవితంలో ఈ కోరికకు భిన్నమయిన సంఘటనలు మచ్చుకయినా కన్పించవు. కామక్రోధాది అరిషడ్వర్గాలను

జయించిన వారికైనా కలుగుతుందా ఈ కోరిక అన్పిస్తుంది. ఏ కొందరయినా ఇలా కోరుకున్ననాడు విశ్వస్వరూపమే మారిపోతుంది. లోకంలో ప్రతి మనిషీ తనను అందరూ గౌరవించాలనీ ప్రేమించాలనీ కోరుకోవడం సహజం. కానీ తాను అందర్నీ ప్రేమించాలనే ఈ కోరిక అపూర్వమే అవుతుంది.

అమ్మకు నాలుగేండ్ల వయస్సులో ఒకసారి సముద్ర తీరానికి వెళ్లగా అక్కడ ఒక జాలరి అమ్మ ఒంటి నిండా ఉన్న సొమ్ములు చూసి మనస్సులో ప్రలోభం కలిగి లాలనగా అమ్మను ఎత్తుకొని బుజ్జగిస్తూ జామపండు తినిపిస్తూ సొమ్ములన్నీ ఒలుచుకున్నాడు. ఈ పిల్ల ఎవరితోనయినా చెబితే తాను దొరికితే ఈ సొమ్ముతో బాటు తన ప్రాణం కూడ దక్కదని భయపడి ఈ పిల్లను నామరూపాలు లేకుండా చేయాలనే క్రూరమైన ఆలోచనతో రెండు చేతులా ఎత్తి సముద్రంలో విసరి వేశాడు. కాని ఆ క్షణంలో తనకు కలిగిన వింత అనుభవంతో తన తప్పు తెలిసికొని పశ్చాత్తాపంతో దహించుకుపోతూ విలపిస్తూ నగలను తిరిగి ఇవ్వబోయాడు. అమ్మ అతణ్ణి బుజ్జగిస్తూ "ఈ సొమ్ము నీవే ఉంచుకో నాన్నా! నీవు ప్రాణాలతో దక్కావు. నాకు అదే చాలు. తల్లికి బిడ్డ సొమ్ము, బిడ్డకు డబ్బు సొమ్ము" అని అవ్యాజ ప్రేమను ప్రకటించింది. ఈ విధంగా కరడు గట్టిన అతని క్రౌర్యాన్ని తన ప్రేమతో కడిగి వేసింది. ఎంతటి కఠిన పాషాణమయినా ఆ అనురాగ స్పర్శతో సచేతనమై ద్రవించవలసినదే. తనను చంపటానికి వచ్చిన క్రూరుణ్ణి సైతం బిడ్డగా చూసే ఆ మనస్తత్వం నాలుగేళ్ల వయస్సులో ఉన్న అమ్మకు ఏ సాధన ఫలితమని చెప్పగలం ?

'కుపుత్రో జాయేత క్వచిదపి కుమాతా నభవతి' అని శ్రీ శంకరాచార్యులు ప్రవచించినట్లుగా 'రావణాసురుడు దుర్మార్గుడే అయినా అతని తల్లి అతనిని ప్రేమించకుండా ఉంటుందా' అని ప్రశ్నించేది అమ్మ. 'మంచి వాళ్లను వాళ్ల మంచితనమే కాపాడుతుంది. లోకం ఎలాగూ వాళ్లని గౌరవిస్తుంది. చెడ్డవాళ్లను నేను కూడా దగ్గరకు తీయకపోతే ఎలా? అని ప్రశ్నించే కరుణారస సాగర అమ్మ.

చిదంబరరావు తాతగారి అమ్మాయి భారతీదేవిగారికి అనారోగ్యం కల్గితే ఆంజనేయ స్వామికి ప్రదక్షిణాలు చేస్తే తగ్గుతుందని ఎవరో సలహా ఇచ్చారు.

ఇంకొల్లు పావులూరుల మధ్య ఆంజనేయస్వామి ఆలయం ఉన్నది. అక్కడ ఆంజనేయస్వామి స్వయంగా వెలిశాడని ఆ ఆలయానికి ఎంతో ప్రసిద్ధి ఉన్నది. అందుకని చిదంబరరావుగారు, ఆయన భార్య అన్నపూర్ణమ్మగారు, అమ్మ, భారతి దేవిగారు అందరూ వెళ్లి అక్కడ సత్రంలో ఉంటూ ఆమెచే ప్రదక్షిణాలు ప్రారంభం చేయించారు. మిరియాలతో రెండు పూటలా 108 ప్రదక్షిణాలు చేసి పూటకు బిందెడు పానకం, 3 సోలల వడపప్పు చేసి రెండు పూటలా సహస్రనామార్చన చేయించుకుంటూ ఇద్దరు బ్రాహ్మణులకు భోజనం పెడుతూ ఉన్నారు. రోజూ నివేదన పెట్టిన తరువాత అమ్మ ఆ వడపప్పును తీసికొని ఇతరులు ప్రసాదంగా పెట్టినవి కూడా దాచుకొని అన్నీ కలిపి వంట బ్రాహ్మణుడయిన రాఘవయ్య గారినడిగి చింతపండు, పచ్చిమిరపకాయలు, ఉప్పు తీసికొని పచ్చడి రుబ్బి చెరువు కట్ట మీద కూర్చునే బాటసారులకు, పావులూరు నుండి బట్టలు ఉతకటానికి వచ్చే రజకులకు, అక్కడ పనిచేసే వాళ్లకూ అక్కడి ఉండి ప్రదక్షిణాలు చేసే పేదవాళ్లకు ఇలా ఎందరికో పెడుతూ ఉండేది. అమ్మ ఆలోచనా దృక్పథమే విలక్షణ మయినది. అన్నం ఉన్నా అందులోకి సరైన అనుపాకం లేక ఎంతో మంది కడుపు నిండా భోజనం చేయరు. మగి వాళ్ల స్థితిని గమనించిందేమో తానే స్వయంగా పచ్చడి రుబ్బి, వాళ్లకు పెట్టింది అమ్మ.

ఒకసారి అమ్మ, లోకనాధంగారు (నాన్నగారి తమ్ముడు) చెరువు కట్టమీదకు ఆడుకోవటానికి వెళ్లారు. ఆ చెరువులో పూలు ఉన్నాయి. 'ఎవరికయినా ఈ లడ్డు పెట్టి వాళ్ల చేత కోయించుకుందామ'ని అన్నది అమ్మ. 'లడ్డు ఇవ్వటం ఎందుకు? ఒక అణా ఇచ్చి కోయించుకుందాం' అని లోకనాథం బాబాయి అన్నారు. 'మనం ఇచ్చే అణాకు లడ్డు ఇవ్వరుగా, ఇవి మంచి లడ్లు. చాలా బాగున్నాయి వాళ్లు ఎపుడూ తిని ఉండరు. కావాలంటే మనకు ఇంటి దగ్గర ఇస్తారు కదా!' అన్నది అమ్మ. ఇటువంటి ఆలోచన ఆ వయస్సులో ఎవరికి కలుగుతుంది ?

ఒకసారి అమ్మ చీరాలలో తమ పినతల్లిగారింటికి వెళ్లింది. తల్లిలేని పిల్ల అని అందరూ అమ్మను వాళ్ల వద్ద కొన్నాళ్లు ఉండడానికి తీసుకు వెళుతుండేవారు.

ఒకరోజు అమ్మ పినతల్లి శేషమ్మగారు ఎంతో ప్రేమతో అమ్మకు పూరీలు చేసి పెడితే 'నాకు పెట్టేబదులు ఆ విస్తళ్లలో ఏరుకుతింటారే "వాళ్లకు పెట్టరాదూ ! వాళ్లు తింటే నేను తిన్నట్లే"నని యానాదులకు పెట్టి వాళ్ల కళ్లలో తృప్తినీ, ఆనందాన్నీ చూసి మురిసిపోయింది అమ్మ. ఎప్పుడూ ఇతరులు తినాలని కోరుకోవడం, వారు తింటే చూసి ఆనందపడే అసాధారణ వ్యక్తిత్వం అమ్మ ప్రత్యేకత. కలకండ ప్రతి అణువూ మాధుర్యభరితమైనట్లుగా అమ్మ ప్రేమ తత్త్వానికి అమ్మ జీవితంలో ప్రతి సంఘటనా నిదర్శనమే. ప్రతి క్షణమూ దృష్టాంతమే.

'మీరు నా బిడ్డలే కాదు. నా అవయవాలు కూడ, అని అమ్మ ప్రకటించింది. కనుకనే వారు, వీరు అనే భేదం లేకుండా తనను పూజించే వారినీ, ప్రేమించే వారినే కాక తనను ద్వేషించే వారిని, దూషించే వారిని సయితం ఒక విధంగానే చూసింది. దొంగతనానికి వచ్చిన వారిని కూడ ఆదరించి అన్నం పెట్టిన సంఘటనలు అనేకం ఉన్నాయి.

1976లో నేను విద్యార్థిగా ఉన్నప్పుడు చూసిన ఒక సంఘటన నా తలపులలో మెదలుతోంది. ఒకసారి నక్సలైట్లం అని చెప్పుకుంటూ వచ్చి కొందరు అందరింటిపై దాడి చేసి నగలు దోచుకొని భీభత్సాన్ని సృష్టించి వెళ్లారు. తరువాత పోలీసులు వాళ్లను బంధించి తెచ్చిన సందర్భంలో 'ముందు వాళ్ల భోజనం సంగతి చూడండి. ఆలస్యముంటే టిఫిన్ పెట్టించండి' అని అమ్మ ఆదేశించింది. ఆ మాటలు విన్న వాళ్లందరూ విస్తుపోయారు. అపుడు అమ్మ 'బిడ్డలందరూ ఒకే విధంగా ఉండరు, కొందరు అడిగి తీసుకుంటారు, కొందరు ఆకతాయి పిల్లలు ఆగడం చేసి తీసుకుంటారు. వీళ్లు ఆ కోవకు చెందిన వాళ్లు' అని వ్యాఖ్యానించింది. ఆ సన్నివేశంలో అమ్మను ఎలా అర్థం చేసుకోవాలో తెలియక అందరి మనస్సులలో అనేక ప్రశ్నలు తలెత్తుతుంటే 'తల్లికి తప్పే కన్పించదు' అన్న అమ్మ వాక్యం సమాధానమై నిలిచింది.

కల్తీయుగమైన ఈ కలియుగంలో కల్తీలేని వస్తువే లేదు, తల్లి ప్రేమ తప్ప. ఆప్యాయత, ఆర్ద్రతలే అమ్మ అంటే. అమ్మ, ప్రేమ వేరు వేరు పదాలు కావు. అమ్మ అన్నా ప్రేమ అన్నా, అర్థం ఒకటే. అవి పర్యాయ పదాలు "Love is not getting, but giving" అన్నది అమ్మ విషయంలో అన్వర్థమవుతుంది.

ఏనాడైనా సమాజ వ్యవస్థకు ప్రేమే మూలం. సమాజంలో ప్రతి ఇద్దరి మధ్య పరస్పరంగా ఉండాల్సిన ప్రేమ అవిచ్ఛినంగా కొనసాగిన నాడే సమాజ ప్రగతి సాధ్యమవుతుంది. సాటి వ్యక్తిని మనిషిగా ప్రేమించలేని నాడు విశ్వశ్రేయస్సు గగన కుసుమమే అవుతుంది. ఈనాటి సమాజ అవ్యవస్థకు మూలం ప్రేమ రాహిత్యం. ఇలాంటి స్థితిలో ప్రేమోద్ధరణకై అవతరించిన ప్రేమావతారం అమ్మ.

iii) తార్కికత - తాత్త్వికత

తార్కికత, తాత్త్వికతలే అమ్మ ఆలోచనాలోచనాలు. తత్త్వదర్శనం దార్శనిక లక్షణం. వస్తు దర్శనం సామాన్యులు చేస్తారు. లౌకికమయినా, అలౌకికమయినా ప్రతి వస్తువు యొక్క మౌలిక తత్త్వాన్ని దర్శించటం తాత్త్వికత. ఏ విషయాన్నయినా హేతుబద్ధంగా ఆలోచించటం కన్పించే చిన్న వస్తువు ఆధారంగా కనిపించని విశాలతత్త్వాన్ని నిరూపించటం, సత్యతత్త్వాన్ని హేతుపురస్సరంగా స్పష్టంగా ప్రతిపాదించటం తార్కికత. తార్కికత, తాత్త్వికత అనే ఈ రెండు లక్షణాలూ అమ్మ ఆలోచనా దృక్పథానికి రెండు రెక్కల లాంటివి. చెట్టును చూసి విత్తును గూర్చి ఆలోచించినట్లుగా వస్తువు యొక్క మూలతత్త్వాన్ని అన్వేషించటం చిన్నతనం నుంచీ అమ్మకు అలవాటు. ఈ తాత్త్వికత - తార్కికత పడుగు పేకల్లా అమ్మ ఆలోచనల్లో అల్లుకుని కన్పిస్తాయి.

అమ్మ ఒక సందర్భంలో అన్నది - 'మానవుడే తర్కం' అని. పండిత వాక్యాన్నో, ఋషి ప్రవచనాన్నో అనుసరించి విశ్వసించడాన్ని తర్కం ప్రధానమయిన మానవ మేధ అంగీకరించదు. ప్రతి అంశాన్ని స్వయంగా పరికించి, పరిశీలించి, పరిశోధించి సారం గ్రహించాలని ఆశిస్తుంది.

అమ్మకు మూడేండ్ల వయస్సులో అమ్మ తల్లి రంగమ్మగారు పోయినపుడు సీతాపతి తాతగారు అమ్మను చూసి దుఃఖిస్తూ 'మీ అమ్మ పోయిందమ్మా' అన్నారు. ఇదిగో మా అమ్మ పోలేదు. మా అమ్మ ఇక్కడనే ఉన్నదిగా అని అమ్మమ్మ మృతదేహాన్ని చూపించింది అమ్మ. అంతేకాక అపుడు అమ్మ 'చచ్చిపోవడం అంటే ఏమిటి? ప్రాణం అంటే ఏమిటి?' అని ప్రశ్నిస్తూ 'ఈ శరీరమే మా అమ్మ అయితే అది ఇపుడూ ఉన్నది. దుఃఖించడం అనవసరం. కనిపించని శక్తి మా అమ్మ

అయితే దానిని ఇదివరకూ చూడలేదు. ఇపుడు కొత్తగా నష్టమయింది ఏమిటి? అయినా దైవం పంపిన మనిషి దైవం ఇష్టం ప్రకారం దైవంలోకి పోతే మధ్యలో మనకు ఏడుపెందుకు?' అని తర్కించింది. అమ్మ తార్కిక వైభవానికి తాతగారు ఆశ్చర్యచకితులయ్యారు.

అమ్మ చిన్నతనంలో ఎక్కువగా బాపట్లలో చిదంబరరావు తాతగారి దగ్గర ఉంటూ ఉండేది. అక్కడ ఉన్న భావనారాయణ స్వామి దేవాలయానికి అమ్మ రోజూ వెళుతూ ఉండేది. ఒకరోజు కొన్ని పూలు, తులసీ దళాలు కోసుకొని గుడికి వచ్చి నేలమీద పెట్టి మౌనంగా నిల్చున్నది. అర్చకుడు అది చూసి 'క్రిందపెడితే తప్పుకాదూ! అమ్మవారి పూలు క్రింద పెట్టవచ్చునా!' అని మందలించాడు. "చెట్టు క్రిందనే మొలిచింది కదా! అని నేలమీదనే పెట్టాను. తప్పని తెలియలేదు. అయితే చెట్టుక్రింద మొలవడం కూడ తప్పేనా?" అని అమ్మ అడిగింది. అపుడే అమ్మ మనస్సులో మథనం ప్రారంభమైంది. పూజారి వెళ్ళిపోయిన తరువాత అమ్మ అమ్మవారి గర్భగుడిలో ఏకాంతంగా ఉండి విగ్రహానికి కట్టిన బట్టలు, పెట్టిన ఆభరణాలు తీసి ప్రక్కన పెడుతుంది. అమ్మ మనస్సులో ఆలోచన ఇలా సాగింది.

"దేవునికి పూజ చేసే పసుపు, కుంకుమ, పెట్టిన సొమ్ములు, నివేదనలు, ఈ పాత్రలు వీటి పుట్టుక ఎక్కడ ? అన్నీ భూమి నుండే. ఇంతకూ ఆ పూజ చేయించుకునే దేవుడు ఎక్కడ పుట్టాడు. దేవుడంటే గుళ్లో విగ్రహాలా! దేవుడు వేరు, విగ్రహాలు వేరా? ఈ సొమ్ములు చేసిన వాడు దేవుడా ! ఈ రాయి చెక్కినవాడు దేవుడా! వీటినన్నింటిని దేవుడనుకున్నవాడు దేవుడా! అసలు ఈ పదార్థాలన్నీ ఇచ్చిన భూమి దేవుడా! భూమి అన్నింటికీ ఆధారమే కదా! ఈ భూమికి ఎందుకు పూజ చేయకూడదు?' అని తనలో తానే తర్కించుకుని 'అవనియే ఆరాధ్య దైవం' అనే సమన్వయానికి వచ్చింది.

ఒకసారి ఒక ఆచార్యులవారు బాపట్లలో భావనారాయణ స్వామి ఆలయంలో రామాయణ ప్రసంగం చేశారు. అందులో అంతా ధర్మ ప్రబోధమే. అమ్మ ఆ ఆచార్యుల వారి వద్దకు వెళ్లి "ధర్మమంటే ఏమిటి? చేసేది ధర్మమా? చెప్పేది ధర్మమా? చూసేది ధర్మమా ! అసలు ధర్మమంటే ఏమిటి?"అని ప్రశ్నించింది.

ఈ విధంగా ప్రతి విషయాన్ని కార్యకారణ విచారణ చేయటం చిన్నతనం నుంచీ అమ్మకు అలవాటు. "జిజ్ఞాసకు ప్రధాన లక్షణం ప్రశ్నే కదా! ప్రశ్నించడమే ప్రగతికి మార్గం. ప్రశ్నించడంలోనే విశ్వతత్త్వం గోచరిస్తుంది. ఎందుకు? ఏమిటి? ఎలా? అనే ప్రశ్నలు అద్భుతాలు కనుగొనటానికి మూలకారణాలు. విజ్ఞాన శాస్త్ర ప్రగతికి కూడ ప్రశ్నే భూమిక. చెట్టునుండి రాలిన పండు నేలమీదనే ఎందుకు పడింది? అని న్యూటన్ ప్రశ్నించుకోకపోతే భూమికి గురుత్వాకర్షణ శక్తి ఉందని ఎలా తెలిసేది? ప్రశ్నలో నుండే సమన్వయ దృష్టి కల్గుతుంది. సమన్వయం కలిగిన ప్రశ్నే సూత్రంగా రూపుదిద్దుకుంటుంది" అని పెద్దలమాట.

'అసతో మా సద్గమయ - తమసో మా జ్యోతిర్గమయ' అని కదా! ఉపనిషద్వాక్యం. వెలుతురు జ్ఞానానికి ప్రతీక. సామాన్యంగా లోకంలో ఏది మనకు ఆనందాన్ని కలిగిస్తుందో దానిపైనే మన మనస్సు ఆకర్షితమవుతుంది. చీకటి, బాధ ఇలాంటి బాధాకరమైన రెండవ పార్శ్వాన్ని గురించిన ఆలోచన ఉండదు. వెలుగులోనే జీవిస్తున్న వ్యక్తికి చీకటి దుర్భరమన్పిస్తుంది. ధైర్యమే ఆలంబనమనుకున్న వ్యక్తికి అధైర్యం భరించరానిది అన్పిస్తుంది. మంచినే మననం చేస్తున్న వ్యక్తికి చెడు దుస్సహమన్పిస్తుంది. ఈ ఉభయ పార్శ్వాలను గురించి అమ్మ 'చీకటే వెలుతురు కాధారమని, అధైర్యమే ధైర్యాని కాధారమనీ, ఒక బాధ తగ్గాలంటే మరొక బాధ రావాలనీ చెప్పింది. చీకటే లేనప్పుడు వెలుతురు విలువ ఏం తెలుస్తుంది? దుఃఖం అనుభవించినపుడే కదా! సుఖంలో ఉన్న ఆనందం అనుభవంలోకి వచ్చేది. వెలుగు నీడలు, మంచి చెడ్డలు, సుఖదుఃఖాలు మొదలైనవి ఒక నాణేనికి రెండు పార్శ్వాలనీ రెండూ లేనిది జీవితం సమగ్రం కాదనీ, అవి అవిభాజ్యాలనీ అమ్మ ప్రబోధించింది.

చీకటిలో కూడ వెలుగు కనపడుతుందనీ, చెడ్డలో నుండి మంచి ఆవిర్భవిస్తుందనీ, అవ్యవస్థలో నుండి సువ్యవస్థ ఏర్పడుతుందనీ చేసే అమ్మ బోధలు మనం జీవితంలో అనుభవించే సంఘటనలను ఆధారంగా తీసికొని చెప్పేవి కాబట్టి సూటిగా మనస్సునకు తాకి మనకెంతో ఉపశమనాన్ని కల్గిస్తాయి.

అమ్మ బాల్యంలో రాఘవరావు మామయ్య ('అమ్మకు అన్నయ్య') పెళ్లి సందర్భంగా సీతాపతి తాతగారు అమ్మను వెంటబెట్టుకొని గ్రామంలో పెండ్లికి

ఆహ్వానించటానికి బయలుదేరారు. తాతగారు కొన్ని ఇళ్ళల్లో పిలిచారు. కొన్ని ఇళ్ళల్లో కొందరిని మాత్రమే పిలిచారు. కొన్ని ఇళ్ళు పూర్తిగా వదిలి వేశారు. ఈ ఆహ్వానంలో ఉన్న ఆంతర్యం అర్థంకానట్లుగా అమ్మ "నాన్నా! కొన్ని ఇళ్లనూ కొంతమంది మనుష్యులను వదిలి పిలిచావేమిటి ?" అని అడిగింది. మన వాళ్లందర్నీ పిలిస్తే చాల్లేమ్మా' అన్నారు తాతగారు. "మన వాళ్లంటే గుర్తు ఏంటి? మనం అనుకోవటమే కదా !" అన్నది అమ్మ. 'యద్భావం తద్భవతి' అన్న జీవన సత్యం ఆ పసి ప్రాయంలోనే అమ్మ నోటివెంట అప్రయత్నంగా వచ్చింది.

iv) సంప్రదాయానికి సరిక్రొత్త నిర్వచనం

మనం తరచుగా సంప్రదాయమనే పదాన్ని వాడుతూ ఉంటాం. సమాజపరంగా సంక్రమించే వారసత్వమే సంప్రదాయం. సమాజంలో సాంస్కృతికంగా, సామాజికంగా, కళారంగాల్లో బహుముఖాల్లో ఈ సంప్రదాయ ముద్ర కన్పిస్తుంది.

పరమార్థమున్నది అనుకున్న సంప్రదాయాన్ని ఎంతగా అనుసరించిందో సంప్రదాయం పేరిట ప్రచారంలో ఉన్న అర్థం లేని మూఢాచారాలను అంతగానూ నిరసించింది అమ్మ. సంప్రదాయాన్ని అనుసరిస్తూనే అవసరమని తోచినప్పుడు దాని గతిని మార్చడంలో అమ్మ ఏ మాత్రం సందేహించలేదు. బాహ్యంగా కట్టు, బొట్టులో ఎంత సంప్రదాయాన్ని పాటించిందో ఆంతరంగికంగా అంత పరిపూర్ణ స్వాతంత్ర్యాన్ని అవలంబించింది. జిజ్ఞాసువులు, మేధావులు అయిన వారు మొట్టమొదటగా ప్రశ్నించేది సంప్రదాయాన్నే. సంప్రదాయ మూలాలు తెలిసిన అమ్మ లాంటి వారు సరిక్రొత్త ఆలోచనలతో సంప్రదాయానికి సరిక్రొత్త ఒరవడులు సృష్టించారు.

హిందూ స్త్రీకి భర్తే దైవమని అందరూ చెప్తే, 'భార్య కూడా భర్తకు దేవతయేనని చేర్చింది అమ్మ. భర్తను గురించి సజీవ భావన, నిరంతర స్మరణ ఉన్న ఏ స్త్రీ భర్తృవిహీనకాదని చెప్పటమే కాక నాన్నగారు తనువు చాలించినా అమ్మ సుమంగళీ చిహ్నాలను విడిచి పెట్టలేదు. ఈ విధంగా అమ్మ మహిళా లోకంలో వినూత్న శకానికి తెర తీసిందేమోననిపిస్తుంది. ఉత్తమగృహిణిగా, తల్లిగా,

ఎలా నడుచుకోవాలో ఆచరించి చూపిన అమ్మ ఈ విషయంలో తాను విమర్శలకు గురి అయినా మహిళా లోకానికి ఆదర్శమై నిలిచింది.

అమ్మ స్థితిని అర్థం చేసుకోలేని కొందరు నిందించవచ్చు. కాని యావత్సృష్టిని భగవత్స్వరూపంగా భావించి ఆనందించే అమ్మను ఇవేమీ చలింప చేయలేదు.

అర్థరహితమైన ఆచారాలను, అంధ విశ్వాసాలను ఖండించి నిజం నిరూపించటానికి అమ్మ ఎపుడూ సందేహించలేదు. సాధారణంగా వితంతువులను శుభకార్యాలపుడు దూరంగా ఉంచడం, ప్రొద్దుట లేవగానే వారి ముఖం చూడకపోవడం, పెండ్లిండ్లకు, పేరంటాలకు పిలవకపోవడం చేస్తూ ఉంటారు.

వితంతువు ఎన్ని ఉపవాసాలూ, పూజలూ, జపాలూ, ధ్యానాలూ చేసినా ముత్తయిదువతో సాటిరాదని అనుకుంటూ ఉంటారు. కనుకనే వితంతువులైన వారు తాము ఏదో తప్పు చేసినట్లుగా భావిస్తూ ఆత్మ న్యూనతా భావంతో కుంచించుకుపోతూ ఉంటారు. కాని వారికి కూడ అందరితో పాటు సమానమైన స్థానాన్ని ఇచ్చింది అమ్మ. వితంతువులు కొందరు అమ్మకు పూజ చేయవచ్చునో లేదో అని సందేహిస్తూ ఉంటే 'మీరు కూడా చేసుకోవచ్చునమ్మా! రండి' అని ఆహ్వానించింది. బాల్యం నుండి ఆచారాల విషయంలో అమ్మది విశాలభావాలతో కూడిన విప్లవాత్మకమైన పంథాయే.

అమ్మ బాల్యంలో ఒకసారి ఇంట్లో జరిగే ఏదో ఒక పేరంటానికి పిలవటానికి ఊళ్లో పిలుపులకు వెళ్లాల్సి వచ్చింది. అమ్మ కుంకుమ భరిణెతో పాటు విభూతిని కూడ తీసుకువెళ్లి ముత్తయిదువలందరికి కుంకుమపెట్టి వితంతువులందరికి విభూతిని పెట్టి పేరంటానికి పిలిచి వచ్చింది.

అమ్మలోని అసాధారణ స్థితిని గమనించిన అమ్మ పిన్నత్తగారు బ్రహ్మాండం అనసూయమ్మగారు అమ్మను ఎవరైనా పెద్దవాళ్ల వద్దకుతీసికొనివెళ్లి ఉపదేశం చేయిస్తే ఇంకా ఉన్నత స్థితి వస్తుందేమోనని భావించి 1949 ఆగష్టులో బాపట్లలో దేశిరాజు రాజమ్మ గారి దగ్గరకు తీసుకొని వెళ్లింది. ఆమె ఒక యోగిని, మంత్రోపాసకురాలు. చాలామంది ఆమె వద్ద మంత్రోపదేశం పొందారు. రాజమ్మగారు పాత ఆచారాలకు, సంప్రదాయాలకు అంకితమైన వ్యక్తి.

ఏ విషయమైనా శాస్త్రం చెప్తే కాని ఒప్పుకోని మనస్తత్వం రాజమ్మగారిది. ఏ విషయాన్నయినా సిద్ధాంతీకరించగల, ఏ అంశం గురించి అయినా స్వయంగా ఆలోచించి అభిప్రాయం ప్రకటించగల అనుభవం అమ్మది. ఆనాడు అమ్మకూ రాజమ్మగారికీ జరిగిన సంభాషణ అనుభవానికీ ఆచారానికీ సంఘర్షణ.

సాధారణంగా స్త్రీలు తమ ఇంటికి ఎవరైనా వచ్చి వెళ్లేటప్పుడు బొట్టు పెట్టి పంపిస్తారు. అలాగే అమ్మ ఇంటికి తిరిగి వచ్చే ముందు అమ్మను రాజమ్మగారు బొట్టు పెట్టుకుని వెళ్లమన్నది. 'మీరే పెట్టండి' అన్నది అమ్మ. తాను వితంతువు కావడం వలన తనకు అర్హత లేదన్నది రాజమ్మగారు. "మనస్ఫూర్తిగా మీకు అర్హత లేదని తోస్తోందా, ప్రపంచ మేమయినా అంటుందనా?" అని అమ్మ అడిగితే "అనాది ఆచారం కనుక పెట్టలే"నన్నది రాజమ్మగారు. 'మీరు పెడితే కీడు అనే గదా! కీడు చేయడమయినా మీ చేతుల్లో ఉంటే అదయినా చెయ్యండి చూద్దాం. మొదటగా వివాహ సందర్భాలలో ముత్తయిదువల చేతనే బొట్టు పెట్టిస్తారు కదా! మరి కొంతమందికి వైధవ్యం ఎందుకు వస్తున్నట్లు?"అని అర్థం లేని ఆచారాలను పాటించనవసరం లేదని ఖరాఖండిగా చెప్పింది. అన్నింటికీ మించి మనస్సే ప్రధానం అని అమ్మ భావన. ఎవరయినా మరణించినపుడు అశౌచం పాటించడం మనం చూస్తూ ఉంటాం. కాని అశౌచం మనస్సుకు సంబంధించిందే కాని శరీరానికి, వస్త్రాలకు వర్తించేది కాదని అమ్మ అభిప్రాయం. అలాగే 'దయలేని మనస్సే దయ్యం' అని అమ్మ అన్న మాటలో శబ్ద చమత్కారం మనను ఆకట్టుకున్నా మూఢనమ్మకానికి గొడ్డలి పెట్టుఅయిన మాట అది.

ఈనాడు స్త్రీలు అన్ని రంగాలలో ముందడుగు వేస్తున్నారు. దేశాలనే పరిపాలిస్తున్నారు. అయినప్పటికీ కొన్ని విషయాలు పురుషులకు మాత్రమే పరిమితమైనవి. ఆలయాలలో పూజారులుగా పురుషులే ఉండడం సర్వసాధారణం. కానీ, అమ్మ జిల్లెళ్ళమూడిలోని ఆలయాలలో స్త్రీలకు కూడా అర్చకస్థానం ఇచ్చి నియమించింది. ఇంతకంటే కూడ చరిత్రలో కనీ వినీ ఎరుగనిది స్త్రీకి కర్మాధికారం ఇచ్చిన సందర్భాలు కూడ ఒకటి రెండు కనిపిస్తున్నాయి.

భౌతికశాస్త్రంలో డాక్టరేటు పొందినప్పటికి సాహిత్యంలో, సంగీతంలో, చారిత్రాత్మక పరిశోధనలో విశేష పరిశ్రమ చేసిన శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారు

1964లో బాపట్ల ఆర్ట్స్ కాలేజీలో ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. ఆ కాలంలోనే అమ్మను చూశారు. అమ్మలో మరెక్కడా ఎవరిలోనూ చూడని ప్రశాంతిని చూశానని అనేక వ్యాసాల్లో ఉపన్యాసాల్లో చెప్పారు. అమ్మ మాటల్లోని ప్రత్యేకతయే శ్రీపాద వారిని అమ్మకు సన్నిహితుణ్ణి చేసింది. అమ్మవాక్యాల్లోని నిండుతనానికి, నవ్యతకు మురిసిపోయి వాటిని అనేక గ్రంథాలుగా సంకలనం చేయడమే కాక అనేక ప్రసంగాల ద్వారా లోకానికి అందించారు.

వారు రాజమండ్రిలో మరణించినా వారి కోరిక ప్రకారం మృతదేహాన్ని జిల్లెళ్ళమూడికి తీసుకువచ్చారు. ఆయనకు కొడుకులు లేరు. కుమార్తె గాయత్రి ఒక్కరే సంతానం. తన తండ్రికి తానేమీ సేవ చేసుకొనలేక పోయానని విలపించే శ్రీమతి గాయత్రికి ఆమె కోరిక ప్రకారం, సంప్రదాయాలకు అతీతంగా కర్మాధికారం ప్రసాదించి తనయులు లేకపోయినా తండ్రి చితికి నిప్పు అంటించే అవకాశమూ అధికారమూ కూతురికైనా ఉన్నదని అమ్మ క్రియాత్మకంగా చెప్పింది.

సంప్రదాయంలోని అర్థం పరమార్థం ఎరిగిన అమ్మ అతి ప్రాచీన కాలంలో ఉండి తరువాత కాలంలో ఆచరణలో లేని కొన్ని సంప్రదాయాలను ఆచరించడం కొన్ని సన్నివేశాలలోకన్పిస్తుంది.

1984లో అమ్మ సన్నిధిలో జరిగిన గాయత్రీ యాగానికి ఆసక్తే అర్హతగా స్త్రీ పురుష వివక్ష లేకుండా వర్గ, వర్ణ విభేదం లేకుండా అందరినీ పాల్గొనమని చెప్పింది. దైవాన్ని ఒకరు అర్చించాలనీ, మరొకరు అర్చించకూడదనీ శాస్త్రంలో ఎక్కడా లేదు.

ఆచారాలు ఒక్కొక్కప్పుడు వెర్రితలలు వేసి సమాజాన్ని కలుషితం చేస్తాయి. కులం పేరుతో మతం పేరుతో జరిగే మారణ హోమాలు చూస్తూనే ఉన్నాం. ఈ స్థితిలో గుణభేదమే లేని నాకు కులభేదమెక్కడిది ? శుక్ల శోణితాలకేది కులమో అదే నా కులమని, ప్రకటించి చిన్న వయస్సులోనే ఈ వ్యవస్థలో నున్న అర్థం లేని ఆచారాలను, సంప్రదాయాలను సవరించి సరిచేసి వర్గరహిత సమాజానికి ఆనాడే నాందిపలికింది. వర్గరహిత సమాజం అమ్మ ఆకాంక్ష. దానికి రూపకల్పనే 'అందరిల్లు' కదా ! ఆ అందరింటి బీజావాపనం ఆనాడే చేసిందేమో అనటానికి అమ్మ బాల్యంలో జరిగిన ఈ క్రింది సన్నివేశమే సజీవనిదర్శనం.

అప్పుడు అమ్మకు అయిదవ సంవత్సరం. ఆ కాలంలో సంప్రదాయం కలిగిన బ్రాహ్మణుల ఇళ్ళల్లో నిప్పులు కూడ కడిగే ఆచారం ఉండేది. ఆనాటి సమాజ పరిస్థితి అది. మరి అమ్మ ఆ వాతావరణంలోనే పెరిగింది. ఒకసారి అమ్మ తెనాలిలో తన తాతగారయిన వెంకట సుబ్బారావు గారింటికి వెళ్లింది. ఒకరోజు తాతగారి వాకిట్లో బంధువులతో పాటు అమ్మ కూడా కూర్చున్నది. ఆనాడు అమ్మకు బాగా జ్వరం ఉన్నది. అపుడు ఒక పాకీ బండి, ఆ బండి వెనుక పాకీ మనిషి నడుస్తుండగా ఆమె పిల్లవాడు పరిగెత్తుతూ పడ్డాడు. అంతలో ఒక గేదె పరిగెత్తుకు వస్తుండగా అమ్మ ఆదృశ్యం చూసి చివాలున లేచి పరిగెత్తుకు వెళ్లి పిల్లవాడిని భుజాన వేసుకున్నది. తన పిల్లవాడిని అమ్మ భుజాన వేసుకున్నందుకు ఆ పాకీమనిషి బ్రహ్మానంద భరితురాలవుతుంటే అమ్మ అమ్మమ్మ గారయిన జానకమ్మగారు "ఆ! ఎత్తుకొని మా బ్రాహ్మణత్వమే మంట గలిపింద"ని వెటకారం చేసింది. అపుడు అమ్మ "అవును మీ బ్రాహ్మణత్వం మంటగలిసింది కనుక మీరు ఎత్తుకోలేదు. బ్రహ్మతత్త్వమే బ్రాహ్మణత్వ"మని ఆ పసివయస్సులో బ్రాహ్మణత్వాన్ని అపూర్వంగా నిర్వచించింది.

v) మనస్సు లోతు లెరిగిన మహనీయత

పంచేంద్రియాలను జవనాశ్వాలతో పోలుస్తారు పెద్దలు. వాటిని నడిపించే అంతరింద్రియం మనస్సు. మనిషి ప్రవృత్తికి మూలమైంది మనస్సు. మనస్సుతత్త్వం విశ్లేషిస్తే మనిషి తత్త్వం బోధపడుతుందంటారు. మనస్సుతత్త్వం తెలుసుకోవటం చాలా కష్టం.

మనస్సులోతుల్లోకి వెళ్లి ఆలోచించటం అమ్మలో కన్పిస్తుంది. అమ్మ ఆలోచనా స్రవంతిలో అంతర్వాహినిగా మనస్తత్త్వ విశ్లేషణ కన్పిస్తుంది. అలాంటి కొన్ని వాక్యాలను పరిశీలిద్దాం.

లోకంలో ఎవరికైనా కన్నవాళ్ల మీద మమకారం ఎక్కువ అనుకుంటాం. ఇక్కడ కన్నవాళ్లు అంటే తనను కన్నవాళ్లు కావచ్చు, తాను కన్నవాళ్లు కావచ్చు. అమ్మ మానవ స్వభావాన్ని సూక్ష్మంగా పరిశీలించి "తనను కన్న వాళ్ల మీద కంటే తాను కన్నవాళ్ల మీద మమకారం ఎక్కువ" అని శాశ్వత సత్యాన్ని లోకాని

కందించింది. ఇది జగద్విదితమైన సత్యమే. అందరికీ అనుభవంలో ఉన్న సార్వకాలికమైన సార్వజనీనమైన సత్యం. అయినప్పటికీ నిత్యం జరిగే సర్వసాధారణమైన విషయాల్లో మనకు ఆత్మవిశ్లేషణ జరగదు. ఆ దిశగా మన ఆలోచన ప్రసరించదు. నాటికి నేటికి ఏనాటికీ సరిపోయే శాశ్వత సత్యాన్ని మామూలు మాటల్లో చెప్పటం అమ్మ ప్రత్యేకత.

సాధారణంగా అడక్కుండానే సలహాలు ఇచ్చే అలవాటు కొంతమందికి ఉంటుంది. మరి అడిగితే చెప్పేదేమున్నది ? సలహాలు కోకొల్లలుగానే ఉంటాయి. కాని ఆలోచనకైనా, ప్రశ్నకైనా, సుఖానికైనా, దుఃఖానికైనా తనకు నచ్చిన సలహా ఇచ్చినపుడే వింటారు ఎవరయినా. ఆ విషయాన్నే అమ్మ "సలహాలు అందరూ అడుగుతారు నాన్నా! కానీ తనకు నచ్చినది చెప్పినపుడే వింటారు" అని మానవ మనస్తత్వాన్ని చక్కగా విశ్లేషించింది. పైకి సాధారణంగా అన్పిస్తున్నా అసాధారణ దృష్టికి మాత్రమే గోచరించే విషయాలివి. మానసిక పరిజ్ఞానం ఉన్నవారు తప్ప అన్యులు చెప్పలేరు. అలాగే 'తోచటం లేదు' అనే మాట పదే పదే వినవస్తూ ఉంటుంది. 'బిజీగా ఉన్నాం' అనే మాట కూడ దాని ప్రక్కనే ఉంటూ ఉంటుంది. ఎందుకు తోచడం లేదు ? అనే దాన్ని గురించి ఆలోచన అనేవాడికీ వినేవాడికీ కూడ ఉండదు. ఈ విషయాన్నే అమ్మ 'కాలం గడుస్తూనే ఉంటుంది నాన్నా! తనకు నచ్చిన విధంగా లేకపోవడమే తోచకపోవడం' అని చెప్పింది. వినటానికి చిన్న విషయం అయినా. దాని వెనుక ఉన్న ఆంతర్యం గొప్పది. మనస్తత్వ విశ్లేషణకు అద్భుతమైన ఉదాహరణగా మనం చెప్పుకోవచ్చు.

vi) సేవాపరాయణత

సేవకు మించిన ఆధ్యాత్మిక సాధన లేదు. ప్రేమకు పరాకాష్ఠ స్థితి సేవ. సేవ ద్వారా ప్రేమ అనుభూతిలోకి వస్తుంది. బిడ్డ బురదపూసుకువచ్చినా అసహ్యించుకోకుండా కడిగివేసేది తల్లి మాత్రమే. ఏ తల్లి ప్రేమ అయినా ఆ బిడ్డకే పరిమితం. కాని, వారెవ్వరయినా, ఎలాంటివారయినా, రోగగ్రస్తులయినపుడు వారిని కన్నబిడ్డలుగా భావించి అమ్మ సేవ చేసింది. తనకు అనారోగ్యంగా ఉండి

చీరాలలో హాస్పిటల్‌లో ఉన్నప్పుడు కూడ తన ఆరోగ్యం లెక్క చేయక అక్కడున్న రోగులందరికీ సేవ చేసింది. జీతగాడయిన మంత్రాయి క్షయవ్యాధి బారినపడ్డప్పుడు, బాపట్లలో హాస్పిటల్లో కుష్ఠురోగులను సందర్శించినప్పుడు - ఎందరో సామాన్యులు అసహ్యించుకునే వాటిని సైతం లెక్క చేయకుండా సకలోపచారాలు చేసింది.

అమ్మకు మనం గౌరవంతో, భక్తితో, ప్రేమతో మంచం దిగనీయకుండా సేవ చేయవచ్చు. కాని అవసరమనిపించినపుడు ఏనాడూ ఎవరికీ పరిచర్యలు చేయటానికి అమ్మ శంకించలేదు. అమ్మకూ మనకూ మధ్య మనకు కన్పించే మనమనుకునే ఈ కులమతాలకతీతంగా బాధపడే ప్రతి బిడ్డకూ మాతృమూర్తియై సేవ చేసింది అమ్మ.

మామూలుగా నాన్నగారికి ఏ మాత్రం ఆరోగ్యం బాగుండకపోయినా దగ్గరకు వెళ్లి అవసరమయిన పరిచర్యలన్నీ చేసింది. బామ్మగారు చరమాంకంలో క్యాన్సర్‌తో బాధపడుతుంటే అక్కడే ఉండి అహర్నిశలూ సేవచేసింది. తన కుటుంబ సభ్యులకు 'నేను సామాన్య గృహిణిని' అని చెప్పుకునే అమ్మ సేవచేయటంలో విశేషం లేకపోవచ్చునేమో! కాని తనను దర్శించటానికి వచ్చిన వారందరికీ అవసరమయిన పరిచర్యలు చేయడం సామాన్యమైన విషయం కాదు.

సాధారణంగా అందరింటి ఆవరణలో ఎవరు వ్యాధిగ్రస్తులైనా ప్రతివారి దగ్గరకు వెళ్లి జావ, మందులూ, సేవలు స్వయంగా అందిస్తూ ఉండేది అమ్మ. అసాధారణమైన అమ్మ స్థితికి ఇలాంటివి అత్యల్పమైనవిగా తోచవచ్చు. కాని చిన్నతనం నుంచీ అమ్మలో ఈ లక్షణం ఉంది అనటానికి అమ్మ జీవితంలో అనేక సంఘటనలు కనిపిస్తాయి.

ఒకసారి మరిడమ్మ తాతమ్మతో కలిసి గుంటూరులో బంధువుల ఇంటికి వెళ్లింది అమ్మ. అది చింతపల్లి రామచంద్రరావుగారిల్లు. ఆ ఇంట్లో రామచంద్ర రావుగారి తమ్ముడయిన గుండేలు రావు అనే ఆయన పక్షవాతంతో 20 సంవత్సరాలు నుండి బాధపడుతూ ఉంటారు. ఆయనకు భార్యాపిల్లలు లేరు. వారి అన్నగారి కుటుంబమే ఆయనకు ఆశ్రయం. ఆయనకు రెండో వివాహం కావటం వలన

రామచంద్రరావు గారిని చూడటమే అంతంత మాత్రంగా ఉంది. అమ్మ వాకిట్లో బండి దిగి వెళ్లటమే సరాసరి గుండేలు రావుగారి మంచం దగ్గరకు వెళ్లి దుర్వాసనతో, దుర్భరంగా ఉన్న వస్త్రాలు మార్చి అన్నం కలిపి నోట్లో పెట్టడం ఇంకా అవసరమయిన సేవలన్నీ చేసింది. అయాచితంగానూ, అత్యంత అనురాగంతోనూ అమ్మ చేసే ఉపచారాలకి గుండేలు రావు గారు పులకించిపోయారు. అప్పటికి అమ్మకు 7 సంవత్సరాలు. ఆయన రామభక్తుడు కావటంతో తన ఇష్టదైవమే తనను అనుగ్రహించే నిమిత్తం ఇలా ప్రత్యక్షమయినాడని భావించారు.

అమ్మకు పదిహేనేళ్ల వయస్సులో క్రొత్తగా కాపురానికి వచ్చిన రోజుల్లో మంచినీళ్ల కోసం బిందె తీసుకుని రైల్వేస్టేషన్ దగ్గర ఆస్పత్రి సమీపంలో ఉన్న కుళాయి దగ్గరకు రోజూ వస్తూ ఉండేది. ఆసుపత్రి గోడ పక్కన మూడు రోజులుగా ముసుగు కప్పుకొని ఒక మనిషి పడుకొని ఉంటాడు. ఎవరూ ఆ సంగతి పట్టించుకోరు. కాని అతని దగ్గరకు వెళ్ళి ఏమైనా కదలిక వస్తుందేమోనని అమ్మ చూస్తుండగా ఆ దారిన ఎవరో ఒక మనిషిపోతూ, "నీ కెందుకు చిన్నపిల్లవు. ఆ అబ్బాయి నాలుగు రోజుల నుండి ఉన్నాడు. చచ్చిపోయినట్లున్నాడు. పెద్ద పెద్దవాళ్లంతా ఊరుకుంటే నీకెందుకు" అని మందలించి వెళతాడు. కాని అమ్మ ఆ మాటలేమీ పట్టించుకోక, మెల్లగా అతని ముసుగు తీస్తుంది. జ్వరమండిపోతూ అతనికి కళ్ళు అంటుకుపోయి పుసులు గట్టి నీళ్లు కారుతూ ఉంటాయి. ఆ స్థితి చూసి అమ్మ తానే స్వయంగా డాక్టరుని పిలుచుకువచ్చి అతనిని ఆస్పత్రిలో చేర్పించి తన చీర పమిటి చెంగు చించి దుర్వాసనతో నున్న అతని శరీరాన్ని తడిగుడ్డతో తుడిచి లేవదీసి కూర్చోబెడుతుంది. తను ఆసరాగా నిలబడి తన వేళ్లతో పళ్లుతోమి ముఖం కడుగుతుంది. అది చూసి డాక్టర్ గారు 'అబ్బా చేతితో పట్టుకోకమ్మా మన నోట్లో నీళ్లే మన చేతిలో పోసుకోకూడదు అని ఎంతగా వద్దని వారిస్తున్నా అమ్మ ఏ మాత్రం అరమరికలు లేని ఆదరణతో దుర్వాసన కలిగి ఉన్న అతనికి అన్ని పరిచర్యల చేస్తుంది. సమాజపరంగా గానీ, కుటుంబపరంగా గానీ ఎన్నో ఆంక్షలు ఉన్న ఆ రోజుల్లోనే కులమతాలు పాటించకపోయినా వయోభేదం, లింగభేదం లేకుండా సపర్యలన్నీ చేసింది. అతని మీద మమకారాన్ని చంపుకోలేక మంచి నీళ్లకు వచ్చే వ్యాజంతో ఇంట్లో వాళ్లకి తెలియకుండా పథ్యం తెచ్చి

ఆ అన్నం కలిపి నోట్లో పెట్టేది. అతని కంటి వెంట అప్రయత్నంగా నీరు కారటం చూసి అమ్మ ఎడం చేత్తో అతని తల తన భుజం మీద ఆనించుకొని "ఎందుకు నాన్నా! గొంతు నొప్పిగా ఉందా?" అంటుంది. ఇంకా పెద్దగా ఏడుస్తాడు అతడు. అది చూసి డాక్టర్ గారు "మీ తల్లి కొడుకులను చూస్తుంటే నాకు వస్తున్నాయి కన్నీళ్లు" అని కళ్ళు తుడుచుకుంటారు. ఆ తరువాత అతని వివరాలు అడిగితే తెలుగు రాదేమో, హిందీలో "మేరా నామ్ రహి" అంటాడు. అతడు ముస్లిం. ఇంగ్లీషు ఏమయినా వచ్చేమో అని డాక్టరు గారు "మీ ఊరు ఏద"ని అడుగుతారు ఇంగ్లీషులో. "మెదక్ జిల్లా" అంటాడు. అమ్మను చూపి "ఈమె ఎవరు?" అంటారు. "మా అమ్మ" అంటాడు రహి. "ఆ అబ్బాయితో పూర్వం పరిచయముందా అమ్మా!" అని అమ్మను అడిగారు డాక్టరు గారు. "ముసుగు కప్పుకొని ఉన్న అతని రూపాన్ని మీకంటె మూడురోజులముందు నుంచీ చూస్తున్నాను. మీకంటె ఒక అరగంట ముందు ఆ ముసుగు తీసి చూశాను" అని చెప్పింది అమ్మ. "నాకు నమ్మకం లేదు బ్రతుకుతాడని". రాత్రి ఒంటిగంట రెండు ప్రాంతంలో బహుశా పోవచ్చు. నేను వెంటనే చెట్టుక్రింద పడవేస్తాను. దగ్గరకు పోవటానికి కూడ వీలులేకుండా వాసనవేస్తున్నాడు" అన్నారు డాక్టర్‌గారు.

డాక్టర్‌కే బ్రతుకుతాడని నమ్మకం లేని ఆ వ్యక్తి అమ్మ ఆదరణతో కోలుకోవడం అందరినీ ఆశ్చర్యపరిచింది. డాక్టర్ గారు అమ్మతో "ఒక అనాథకు, దిక్కులేని వాడికి, దిక్కు నీవై తల్లికంటె ఎక్కువగా సేవచేశావు. ఇదంతా నాకు పాఠంగా ఉన్నదమ్మా!" అన్నారు. ఆ తరువాత ఆ రహి జీవితం అమ్మ సేవకే అంకితం అయింది. ఎంతగా అంటే అమ్మకోసం ఏది అవసరమయితే అదినేర్చుకొని అన్నీ తానే అయి అమ్మ సేవలోనే ధన్యజీవి అయ్యాడు.

ఈ విధంగా ఒకరి దయాదాక్షిణ్యాల మీద ఆధారపడిన బాల్యంలోనే ఎంతోమందికి అవ్యాజానురాగంతో సేవచేయటం అమ్మలో కనిపిస్తుంది.

జ్ఞానానికి మరో రూపం ప్రేమ. ప్రేమకు అభివ్యక్తి మార్గం సేవ. సాటి మనిషి పట్ల మనిషిగా కారుణ్యంతో స్పందిస్తే అదే ప్రేమ. ప్రేమలో అంతర్వాహినిగా కరుణ ఉంటుంది. కరుణలో అంతర్వాహినిగా ప్రేమ ఉంటుంది.

కారుణ్యానికి ప్రతీక బుద్ధుడు అయితే, వాత్సల్యానికి పతాక అమ్మ.

ఆనాటి పరిస్థితిని బట్టి సమష్టి కోసం వ్యష్టి జీవితాన్ని సమర్పణ చేయాలన్న బుద్ధుడి దృక్పథం.

ఒక సామాన్యవ్యక్తిగా జీవితం కొనసాగిస్తూనే తన విశ్వజనీన మాతృత్వం అవ్యాజ వాత్సల్యంతో మానవతా మణిదీపాన్ని ప్రతి హృదయంలోను వెలిగించాలన్నదే అమ్మ దృక్పథం.

vii) ఉదాత్త గృహిణీ ధర్మం

భారతీయ ధార్మిక జీవనానికి పునాది వివాహ వ్యవస్థ. వైవాహి జీవితమనేది ఒక దీక్ష. ఒక యజ్ఞం. సమాజంలోని సర్వధర్మాలకూ కేంద్రబిందు గార్హస్థ్యం. పరమ పవిత్రమైన గృహస్థాశ్రమంలో ప్రవేశించడానికి చేసే వైది సంస్కారమే వివాహం. విహహ ప్రయోజనం అర్థమో, కామమో కాదు పరమార్థసాధనకు అది సోపానం. సుస్థిరమైన సంఘవ్యవస్థకు మూలస్తంభం భారతీయ వివాహ వ్యవస్థ ఇంత విశిష్టమైనది కనుకనే ఇతర దేశాల ప్రజల కొందరు ఈ వ్యవస్థ పట్ల ఆకర్షితులయి అనుసరిస్తూ ఉన్నారు. ఆదర్శవంతమై ధార్మిక జీవనానికి మూలాధారమైన ఈ వివాహవ్యవస్థ మూలాలలో ఈనాడు ఒక ప్రకంపనం కన్పిస్తోంది. తరతరాలుగా నడుస్తున్న వివాహ వ్యవస్థ ఆధుని నాగరికత అనే సునామీ తాకిడితో సమూలంగా విచ్ఛిన్నమై పోతోంది. రకరకా జీవిత సమస్యలకు, ఇంకా చెప్పాలంటే చిన్న చిన్న కారణాలకు కూడా దంపతుల విడిపోయే పరిస్థితికి నేటి సమాజం చేరుకుంది. తరతరాలుగా మనం నమ్మిన వ్యవస్థ మన కళ్లముందే పేకమేడలా కూలిపోతున్న ఈ తరుణంలో ఏ చట్టాలూ ఏమీ చేయలేవు. సమాజంలో ఒక అవ్యవస్థ ఏర్పడినపుడు సామాన్యులు చక్కదిద్దలేరు. అసాధారణ వ్యక్తులకే అది సాధ్యం. సమాజరక్షణ కోసం మానవుల మధ్య అపుడపుడు మహాత్ములు అవతరించి సమాజ పరిస్థితిని బట్టి ఒక్కొక్కరు ఒక్కో మార్గాన్ని అనుసరించి తమ ప్రబోధాలతో సామాజిక జీవితాన్ని ప్రభావితం చేస్తారు. అందుకోసం వారి జీవితాలనే ఒక సాధనగా చేసుకుంటారు.

మరి ఈనాటి పరిస్థితిని బట్టి లుప్తమైపోతున్న ప్రేమతత్త్వాన్నీ, మానవత్వాన్నీ పునరుద్ధరించడం కోసం, వివాహ వ్యవస్థలో కనుమరుగయిపోతున్న విలువలను పరిరక్షించడం కోసం, వైవాహిక బంధంలో ఉన్న పరమార్థాన్ని బోధించడం కోసం అమ్మ అవతరించింది. 'సాధ్యమైనదే సాధన' అని చెప్పిన అమ్మ వివాహాన్నే ఒక సాధనగా తీసుకున్నదేమో అనిపిస్తుంది. 'నా జీవితమే సందేశం' అని చెప్పిన అమ్మ, తన వైవాహిక జీవితాన్ని కూడా సందేశంగా అందించిందేమో అనిపిస్తుంది. తాను అసాధారణ స్థితిలో ఉన్నప్పటికీ సాధారణ వ్యక్తులవలెనే వివాహం చేసుకున్నది. ఇల్లాలుగా, కోడలుగా, తల్లిగా అనేక భూమికల్లో తన కర్తవ్యాన్ని ఎంతో సహనంతో నిర్వర్తించింది.

గృహస్థాశ్రమ ధర్మరక్షణకు కేంద్రబిందువు గృహిణి. అందుకే మన సంప్రదాయంలో వివాహం చేసుకుని భర్త ఇంట అడుగు పెట్టిన స్త్రీకి 'సహధర్మచారిణి' అనే పేరు వచ్చింది. గృహస్థాశ్రమంలో స్త్రీ ఇల్లాలుగా, అర్ధాంగిగా, సహధర్మచారిణిగా, సఖిగా, భార్యగా కర్తవ్యాన్ని నిర్వహిస్తూ తన వ్యక్తిత్వాన్ని నిలుపుకుంటుంది. అమ్మ గృహిణీ ధర్మాలను నిర్వచించడమే గాక తాను ఆచరించి ఆదర్శగృహిణిగా లోకానికి ఆరాధ్య అయింది. లోకంలో ఆదర్శగృహిణి అంటే భర్తనే దైవంగా భావిస్తూ, భర్త భావాన్ని తెలుసుకుని ప్రవర్తిస్తూ ఆ సేవలో తరించడం. ఇది ఒక మార్గం. కానీ అమ్మ ఆదర్శం ఆ పరిధిలోనే ఆగిపోక ఒక ఉన్నత లక్ష్యం వైపుగా సాగింది. 'పాతివ్రత్యానికి చరమదశ భర్త భార్యను అమ్మా! అని పిలవడం' అన్నది అమ్మ వాక్యం. ఇది విన్నవాళ్లను ఆశ్చర్యచకితులను చేయవచ్చు. ఆచరణ సాధ్యమా! అన్పించవచ్చు. కానీ అమ్మ 'అన్నింటికీ సరే మంత్రాన్ని పాటిస్తాను' అని, 'సరే' మంత్రాన్ని జపించి, నాన్నగారిని అనుసరించి తన విశ్వమాతృత్వం నేపథ్యంగా ఆచరణ సాధ్యమే అని నిరూపించింది.

అమ్మ సరే మంత్రాన్ని ప్రతిపాదించడంలో గృహిణులందరికీ ఒక సాధన క్రమాన్ని ప్రబోధించడమే లక్ష్యంగా కన్పిస్తుంది. ప్రతి గృహిణీ ముందు 'సరే' అనడం మొదలు పెడితే కొంతకాలానికి మనస్సుకు సరే అన్పిస్తుంది. అలా అన్పించడం వలన క్రమంగా భర్త ఇష్టానిష్టాలే తనవిగా అవుతాయి. ఆ క్రమంలో

అద్వైత భావన కల్గి అభేద స్థితికి దారితీస్తుంది. గృహిణులందరికీ ఈ స్థితిని ప్రసాదించడానికే ఆచరణాత్మకమయిన ప్రబోధం కోసం అమ్మ వైవాహిక జీవితాన్ని ఆరంభించింది.

మానవ మనస్తత్వాలలో ఉన్న తేడాలను గమనించిగానీ, లేక కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా గానీ, అమ్మలోని ప్రత్యేకత గుర్తించినందువల్లగానీ వివాహ విషయంలో అమ్మ తాతగారు చిదంబరరావుగారు అమ్మతో 'చూడగా చూడగా అగ్నిగుండంలో దూకబోతున్నట్లుగా ఉన్నదమ్మా!' అన్నారు. అపుడు అమ్మ 'ఒక చోట ఉంటే గదా! దూకడానికి. నా బాటే నిప్పుల బాట. ఆ బాటలో నడక సాగించబోతున్నాను. ఆరని అగ్నిగుండంలో పడి తీరని వ్యథలో చిక్కి తియ్యగా అనుభవిస్తూ సరే మంత్రంతో జీవించాలి' అన్నది. మరొకసారి అమ్మ మీద ఉన్న ఆత్మీయతతో కోరి కష్టాలు వరిస్తుందనే భయంతో 'నీకీ పెళ్ళి ఎందుకమ్మా!' అని తాతగారు అడిగితే 'లోకంలో ఉన్న కష్టాలన్నింటినీ భరిస్తూ సంసార జీవనం ఎలా సాగించాలో లోకానికి నేర్పడం కోసమేననీ, అన్ని అనుభవిస్తూ ఏదీ మనసుకు అంటకుండా ఉండడం సాధ్యమేనని నిరూపించడానికే'నని చెప్పింది. చెప్పినట్లుగానే జీవితంలో సుఖదుఃఖాల ఉభయపార్శ్వాలనూ చవి చూసింది. ఎవరు ఎట్లా తనను చూసినా, తన పట్ల ఎలా ప్రవర్తించినా భూదేవంత సహనాన్నే ప్రదర్శించింది.

ఉన్నతమైన శిఖరాలు ఉన్నచోటనే లోతైన లోయలూ ఉంటాయి. వెలుగులు వెదజల్లే దీపం చుట్టూ క్రీనీడలు తప్పనట్లు లోకానికి ఆనందాన్ని పంచి ఇచ్చే అమ్మ జీవితంలో కూడ బాధా పరిష్వంగాలు తప్పలేదు. నిత్యసమరంలా సాగిన ఆ సంఘటనలలో అమ్మ జీవితపు లోతుపాతులను తెలుసుకున్న శ్రీ మన్నవ బుచ్చిరాజుశర్మగారు (రాజు బావ) అమ్మను సహనదేవతగా ఆరాధించారు. 'బాధలే భగవంతుడ'ని, 'సహనమనే దేవతను ఆరాధించాలంటే బాధలనే పూజాద్రవ్యాలు కావాలి' అని చెప్పిన అమ్మ ఎంతగానో సహనదేవతను ఆరాధించింది.

'హృదయమున బడబానలము
మౌళిమీదను మంచుకొండలు
ఏలనో అవనీమతల్లీ ! – పాడుటకు నోరాడదమ్మా !
అమ్మ కథే అవనిగాథా –అవనే అనసూయమ్మ కాదా!' అంటూ అమ్మకు అవనికి అభేదాన్ని వర్ణించారు బుచ్చిరాజు శర్మగారు. విరుద్ధరస సంగమంలా సాగిన అమ్మ జీవితాన్ని చూసి విభ్రమానికి లోనై 'వింతైన ఇతి హాసం – పెనుగాలిలో దీప నివాసం' అని వ్రాసిన ఈ పాట సహనదేవత సహనానికే పరీక్ష ఎదురయిన ఉద్వేగభరిత సన్నివేశాలను స్మరింపచేస్తుంది. ఎన్ని అగ్నిపరీక్షలు ఎదురయినా అమ్మ మాత్రం నిర్వికారంగా నిర్వికల్పంగానే ఉన్నది. 'సర్వకాల సర్వావస్థల యందు సమానమైన స్థితిలో ఉండడమే సమాధి' అని చెప్పిన అమ్మ తాను ఆ స్థితిలోనే ఉండేది.

అమ్మ జీవితంలోని కొన్ని ఘట్టాలను పరిశీలిస్తే కులధర్మపత్నీ ధర్మాలలో 'క్షమయాధరిత్రీ' అన్న మాట గుర్తుకు వస్తుంది. 'తనకంటూ ఏ ఇష్టాలూ లేకుండా ఒకరి ఇష్టాన్ని తన ఇష్టంగా చేసికొనడమే సహనమని' చెప్పి ఆచరించి చూపింది అమ్మ. అంతేకాదు "వైవాహిక జీవితంలో కష్టాలు ఎదురయితే అవి నీ సహనానికి శిక్షణగా భావించు. నీవు పసిబిడ్డను సాకేటప్పుడు బాలకృష్ణుడనే దృష్టితో చూడు. ఆ దృక్పథంతోనే పెంచు. ఆ విధంగా గృహస్థ జీవితమంతా అనితరమైన, విశుద్ధమైన సాధనగా మారుతుంది" అని ప్రబోధించింది. 'సంసారంలో ఉండి సాధన చేయడం కోటలో ఉండి యుద్ధం చేయడం" అనీ 'చేసేదంతా భగవత్సేవే అనుకుంటే సంసారం ఆధ్యాత్మిక చింతనకడ్డుకాద' నీ వివాహాన్నే తరణోపాయంగా చూపింది.

ఏదో ఒక దేవుణ్ణి పతిగా భావించి, సేవించి, తరించిన స్త్రీలు ఉన్నారు. కానీ పతినే దైవంగా భావించి త్రికరణశుద్ధితో సేవించడం పతివ్రతాధర్మం. అది ఒక యోగసాధన.

'పాతివ్రత్యము కలిగిన
నాతియనగ దైవమనగ జనస్తుత ! వేరే?' అంటూ పతివ్రత సాక్షాత్తూ

దైవమే అని భీష్ముడు ధర్మరాజుతో అన్నాడు. పాతివ్రత్యపు మహిమతో భర్తప్రాణాలు దక్కించుకోవడం, అవసరమయితే సూర్యగమనాన్ని ఆపివేయడం మొదలయిన కథలు, గాథలు, పురాణాలు వల్లిస్తున్నాయి. పురాణకథల్లో చదివిన, విన్న పాతివ్రత్యం కలవారు ఎక్కడైనా ఎవరైనా ఉన్నారా? అని పరిశీలిస్తే ఈనాటి సమాజంలో ప్రత్యక్ష నిదర్శనంగా అమ్మ కన్పిస్తుంది. పాతివ్రత్యపు పరాకాష్ఠ స్థితి అమ్మలో గమనించవచ్చు. 'పతివ్రత అంటే పతిని ఆధారంగా చేసికొని పంచభూతాలను జయించటమే'నని అమ్మ నిర్వచించింది. స్త్రీకి పతివ్రతా ధర్మం కన్నా మించినదేదీ లేదనీ, మంగళసూత్రాలంటే భర్త రెండు పాదాలు అనీ, స్త్రీకి ఏ సూత్రం తెలుసుకోవటానికయినా ఆధారం మంగళసూత్రమేనని-నిర్ద్వంద్వంగా చెప్పింది అమ్మ.

అమ్మ రోజూ తన మెడలోని మంగళసూత్రాలను కడిగి, పూజించి ఆ తీర్థాన్ని తీసుకునేది. ఆ తీర్థం తీసుకున్నందువలననే ఇతరులకు తీర్థం వేసే అర్హత తనకు వచ్చిందని" చెప్పింది అమ్మ. తాను ఏ పనిచేయాలన్నా నాన్నగారి పాదాలకు నమస్కరించే చేసేది. నిత్యజీవితంలో అమ్మపూజ అంటూ చేయడం ఈ ఒక్క సందర్భంలోనే కనిపించింది.

అమ్మ దగ్గరకు ఎంతో మంది స్త్రీలు వస్తూ ఉండేవారు. అందరి అభిప్రాయం దాదాపు ఒకటిగానే ఉంటుంది. ఈ సంసారంలో చిక్కుకుని ఏమీ సాధించలేక పోతున్నాం. తరించటానికి మాకేదైనా మార్గం చెప్పవలసినదని ప్రార్థించేవారు. కాని అమ్మ ఎవరికి ఏం చెప్పినా తన అనుభవం నుంచే చెప్పింది. "ఏ భగవంతుణ్ణి ఆరాధిద్దాం. ఏ భక్తిమార్గాన్ని అనుసరిద్దాం అనిఆలోచించక, నీ భర్తనే దైవంగా పూజించి ఆరాధించు, కనపడని దేవునికొరకు ఏ అరణ్యాలలోనో ఘోరతపస్సు చేసి సాధించేశక్తిని పతిసేవే తనకు ముఖ్యమని నమ్మిన ఒక స్త్రీ సాధించగలదు" అంటూ ఉండేది.

ఎవరైనా అమ్మ గొప్పతనాన్ని అమ్మ ఎదుట ప్రస్తావిస్తే 'నాదేముంది నాన్నా! ఏ స్త్రీ అయినా భర్తను సేవించి ఎంతటి మహాకార్యాన్నయినా సాధించవచ్చు' అంటూ "నాకు నా భర్తను సేవించటం తప్ప మరేమీ తెలియదు" అనేది. నాన్నగారికి

అనారోగ్యంగా ఉన్నప్పుడు కావలసిన పరిచర్యలు చేస్తూ 'ఇంతకన్నా నాకు కావల్సిందేమున్నదీ' అనీ, లేవలేని వయస్సులో ఉన్న బామ్మగార్కి నడుము రాస్తూ "వారికి తనువు ఇచ్చిన తల్లికి సేవ చేయటం నా భాగ్యంగా ఎంచుకుంటాను," అనీ చెప్పిన అమ్మ జీవితాన్ని పరిశీలిస్తే స్త్రీకి పాతివ్రత్యం నేర్పటం కోసమే అమ్మ వివాహం చేసుకున్నదేమో అనిపిస్తుంది.

భారతీయ కుటుంబ వ్యవస్థలో ముఖ్యమైంది భార్యాభర్తల బంధం. ఇది తల్లి వేరు లాంటిది. ఆ తల్లివేరే లేకపోతే ఎన్ని ఆకులు, ఎన్ని కొమ్మలు ఉన్నా, ఆ చెట్టుకు ఉనికి ఏముంది ? భార్యాభర్తల బంధం సజావుగా లేకపోతే ఆ కుటుంబం అల్లకల్లోలమవుతుంది. ముఖ్యంగా పిల్లలు అనాథలవుతారు. ఈనాటి సమాజంలో ఎన్నో కుటుంబాలను చూస్తూనే ఉన్నాం.

తల్లిదండ్రుల విభేదం కారణంగా పిల్లలు ప్రేమకు కరువై సమాజానికే సమస్యగా తయారవుతున్నారు. పాశ్చాత్య నాగరికతా ప్రభావం వలన భారతీయ వివాహ వ్యవస్థ కూడ ఎంతకాలం సక్రమంగా ఉంటుందనే ఆలోచన కలుగుతోంది. నేటి సమాజాన్ని చూస్తే. సమాజ పరిస్థితులను బట్టి రానున్న కాలంలోని ప్రమాద సూచికలు ముందుగానే గమనించి అమ్మ భర్తభావాన్ని తెలుసుకుని ప్రవర్తించమని స్త్రీకి బోధించిందేమోననిపిస్తుంది. ఎందుకంటే వివాహం అంటేనే ఇద్దరు వ్యక్తులు భిన్న పరిస్థితులు, భిన్న అభిరుచులు, అలవాట్లతో కలిసి జీవించాలి. దీనికి ఎంతో సహనం, సర్దుబాటు మనస్తత్వం కావాలి. భార్యాభర్తల మధ్య సమన్వయ ధోరణి కావాలి. సమన్వయం లేకపోతే సంఘర్షణ తప్పదు. అందుకని అమ్మ 'అన్నింటికీ 'సరే' అనే మంత్రాన్ని పాటిస్తాను అని సరే మంత్రాన్ని జపించి భర్తను ఎలా అనుసరించవచ్చో ఆచరణాత్మకంగా ప్రబోధించింది.

మన సంప్రదాయ సాహిత్యంలో ఇలాంటి ఉదాత్త ధర్మాలకు ఉదాహరణగా అత్రిమహర్షి భార్య అనసూయకథను తీసుకోవచ్చు. ఆమె తన పాతివ్రత్య ప్రభావంతో త్రిమూర్తులనే పసిబిడ్డలుగా చేసి లాలించింది. అంతేకాదు పది సంవత్సరాలు అనావృష్టితో తపించిన లోకంలో గంగానదిని ప్రవహింప చేసింది. కంద మూలాదులను సృష్టించి దుర్భిక్షంతో బాధపడుతున్న లోకాన్ని కాపాడిన మహాసాధ్వి.

దేవకార్య నిమిత్తమై పదిరాత్రులను ఒకే రాత్రిగా మార్చగలిగిన మహా మహిమాన్వి
అలాగే, సుమతి భర్త ప్రాణాలు దక్కించుకోవడం కోసం పాతివ్రత్య మహిమ
సూర్యగమనాన్నే ఆపివేసింది. ఈ విధంగా విభిన్న మార్గాలు, విభిన్న మనస్తత్వా
కలిగిన ఎందరో పతివ్రతలు 'పతివ్రతాంగనాభీష్ట ఫలదాయిని' అయిన జగన్మా
అనుగ్రహంతో ఎన్నో అద్భుత శక్తులు పొంది అసాధ్యాలను సుసాధ్యాలుగా చే
తమకంటూ ఒక ప్రత్యేక చరిత్రను సృష్టించుకున్నారు. మరి అటువంటి వా
పురాణాలకే పరిమితమా! వాస్తవ జగత్తులో ఎక్కడయినా, ఎవరయినా ఉన్నారా
అని పరిశీలిస్తే ప్రత్యక్ష నిదర్శనంగా, అమ్మ కన్పిస్తుంది. ఏ విషయ
ప్రబోధించాలన్నా మనలో ఒకరిగా మనతోపాటు ఉంటేగాని మనం అర్థ
చేసుకోలేం కదా! అందుకనే పతివ్రత అంటే ఇలా ఉంటుంది అని లోకాని
దర్శింపచేయడం కోసమే ఆ పరాశక్తి అమ్మగా భూమిపై అవతరించింది. అ
జీవితంలో పంచభూతాలను స్వాధీనం చేసుకున్న సంఘటనలు అనేకం కన్పిస్తాయి

సనాతనంగా వస్తున్న కొన్ని ధర్మాలపట్ల సంప్రదాయాలపట్ల నేడు చాలా
మందికి చిన్నచూపు. అవన్నీ చాదస్తానికి ప్రతీకలుగా భావిస్తారు. అలాం
వాటిలో ముఖ్యంగా పాతివ్రత్యం ఒకటి. ఈనాటి మహిళలు భర్తను జీవితం
అవసరమైన ముఖ్య స్నేహితునిగా చూస్తున్నారే తప్ప దైవస్వరూపంగా పూజించడ
అంటే వింతగా చూస్తారు. కానీ ఏవిషయాన్నయినా లోతుగా ఆలోచిస్తే అందులో
ఔన్నత్యం అవగతమవుతుంది. అమ్మ జీవితాన్ని పరిశీలిస్తే - నేటి మహిళాలోకాని
పాతివ్రత్యం అంటే ఏమిటో ఆచరించి చూపడానికే అమ్మ వివాహం చేసుకున్నట్లు
కన్పిస్తుంది. సంసార యజ్ఞాన్ని సంరక్షించేది గృహిణే. కుటుంబంలో గృహి
స్థానం తల్లి వేరు లాంటిది.

వివాహమంటే భౌతిక బంధాల కతీతమయిన ఆత్మ సంయోగంగా చెప్తున్న
ఆర్షసంప్రదాయం. రామాయణంలో సీతారాముల ప్రేమానుబంధ
ఆత్మానుబంధంగా గోచరిస్తుంది. ఇదే రామాయణంలోని అద్వైత రససిద్ధి.

'అస్యాః దేవ్యాః మన స్తస్మిన్
తస్య చాస్యాం ప్రతిష్ఠితమ్'

సీతమనస్సు రాముని మనస్సులో రాముని మనస్సు సీతమనస్సులో లయమయిపోయాయట. వారిరువురికి గుణగణాల్లో, ఆలోచనల్లో, ఆనందంలో, ఆవేదనలో దేనిలో కూడ వ్యత్యాసం లేదట. ఆర్ష సంప్రదాయాన్ని అనుసరించే కాళిదాస మహాకవి అభిజ్ఞాన శాకుంతలంలో శకుంతలా దుష్యంతుల దాంపత్య ప్రణయాన్ని భౌతికబంధాలకంటె అతీతమైన ఆత్మబంధంగా మలిచాడు. గాంధర్వ వివాహంతో ప్రారంభమయిన శకుంతలా దుష్యంతుల దాంపత్యం దూర్వాస శాపం అనే మలుపుతో పరిణామ రమణీయంగా పర్యవసించింది. వియోగంతో దగ్ధమైన హృదయం భౌతిక బంధాలకతీతమై దాంపత్య జీవన గమ్యమైన ఆత్మ సంయోగదశకు చేరుకుంది. 'తపనే తపస్సు' అని అమ్మ చెప్పినట్లుగా జీవితకాలం తపించి తపించి తపస్వినిగా మారింది శకుంతల. ఆ స్థితిలో ఆమెను చూసిన దుష్యంతునిలో ఊహించని పరిణామం సంభవించింది. కనుకనే తపస్వినిగా ఉన్న శకుంతల వ్యక్తిత్వం ముందు తలవంచి ఆమె పాదాలకు నమస్కరించాడు. గృహస్థాశ్రమంలో స్త్రీ వ్యక్తిత్వానికి సజీవరూపకల్పన శకుంతల.

దాంపత్య ప్రణయం రెండు ఆత్మలలోని భేదాన్ని తొలగించి ఏకత్వాన్ని కల్గించే అద్వైతతత్త్వం. అమ్మ ఎప్పుడూ ఆ అభేద స్థితిలోనే ఉండేది. అందుకే అమ్మ "వివాహమంటే రెండు భిన్న అభిప్రాయాలు ఒకే చోట కలసి ఏకత్వంగా కాలం గడపటం, అంతేకాదు. ఆ రెండు భిన్నాలూ ఏకమైనపుడే వైవాహికం" అని చెప్పింది. దాంపత్యాన్ని ఆర్ష సంప్రదాయం ఆత్మ సంయోగంగా భావించింది అనడానికి ప్రబల దృష్టాంతం వివాహ మంత్రాలే.

అమ్మ వైవాహిక జీవితం కూడ రక్తిలా మొదలయి భక్తిగా పరిణమించి, ముక్తి మార్గాన్ని నిర్దేశించేదిగా ఉంది. అమ్మ దృష్టిలో భర్త అంటే భగవంతుడే. అందుకే పెండ్లి అనే పదాన్ని 'ఒక పెన్నిధి అందన చేరడమే పెండ్లి' అనీ, 'పెనిమిటే పెన్నిధి", అనీ, 'పెన్నిధంటే దైవసన్నిధి' అని నిర్వచించింది. ఒక సోదరి "భర్తే దైవం !" అంటారు అమ్మా ! అంటే "అనుకోవాల్సింది ఏమున్నదమ్మా కాకపోతేగా! అనుకోవడం అంటే ఏదో తెచ్చిపెట్టుకున్నట్లుగానే ఉంటుంది" అన్నది అమ్మ. అమ్మమాటలన్నీ అనుభవంలోంచి వచ్చినవే. భర్తే దైవం అనడమే కాదు నాన్నగారినే

దైవంగా ఆరాధించింది. ఒకసారి అమ్మ ఏదో ఆలోచిస్తూ ఉన్నట్లు కన్పిస్తే ఒక సోదరుడు 'పరధ్యాసగా ఉన్నావేమిటమ్మా? అంటే 'పరధ్యాస కాదు నాన్నా! పతిధ్యాస' అని చమత్కరించిన అమ్మకు నాన్నగారి ధ్యాసే ధ్యానం. అందుకే ఆయన పాదాల చప్పుడు నిరంతరం అమ్మ మనస్సులో మెదులుతూ ఉండేది. "నాన్నగారు వచ్చినట్లున్నారు చూడండి" అని అమ్మ అన్న మరుక్షణంలో నాన్నగారు అక్కడికి వచ్చేవారు. "నీకెట్లా తెలుసమ్మా "! అంటే "మరచిపోతేగా". "ఎపుడూ ఆ ధ్యాస ఉంటూనే ఉంటుంది" అనేది అమ్మ.

నాన్నగారు అమ్మను అమ్మగా గుర్తించారనడానికి ఒక క్రమ పరిణామం ఉన్నట్లుగా కన్పిస్తుంది. ఒకే శక్తి యొక్క రెండు రూపాలే అమ్మ, నాన్నగారు. కానీ లౌకికంగా చూస్తే మొట్ట మొదట నాన్నగారి జీవిత ప్రస్థానం ఒక కుటుంబానికి యజమానిగా ప్రారంభం అయింది. ఆ తరువాత ఆయన అందరింటి నాన్నగారుగా, క్రమంగా జగత్పితగా అందరకూ ఆరాధ్యమూర్తి అయ్యారు. అందరింటిలో అడుగుపెట్టగానే మొదటి పలుకరింపు నాన్నగారిదే. అందరింటి కార్యక్రమాల్లో అంతర్వాహినిగా నాన్నగారి పాత్ర ఉన్నా తాము కూడా. మనందరిలో ఒకరిగా మసలేవారు. విద్యార్థుల దగ్గర నుంచి పెద్దవాళ్ల వరకు ఏ స్థాయి వారితోనైనా కలిసిపోయేవారు. ఆయన సహజ స్వభావమైన నిరాడంబరత మాత్రం పెట్టని ఆభరణంగా ఉండేది.

అమ్మలోని అలౌకిక శక్తులను అనేకం నాన్నగారు దర్శించారు. ఎంత బాధనయినా అమ్మ కేవలం తన స్పర్శతో నివారించగలదని ఆయనకు పరిపూర్ణ విశ్వాసం. ఎక్కడకు వెళ్తున్నా అమ్మ చేత బొట్టు పెట్టించుకునే వెళ్లేవారు. హైమాలయం తోటలోని పూలను తీసుకువచ్చి అమ్మ పాదాలపై ఉంచేవారు. కొన్ని సందర్భాలలో 'ఆశీర్వదించమ్మా !' అని అడిగేవారు.

నాన్నగారు అనుమతించడం వలననే పసిబాలుర నుంచి పండు ముదుసలుల వరకు వయోభేదం లేకుండా అమ్మ ఒడిలో ఒదిగిపోగలిగారు. నాన్నగారు అమ్మను అమ్మగా గుర్తించారనడానికి ఇదే నిదర్శనం. 'అమ్మా' అని నాన్నగారు స్వయంగా పిల్చినపుడు ఏ ఒక్కరో ఇద్దరో తప్ప అందరూ విని

ఉండకపోవచ్చు. కాని రెండు ఆత్మలు ఒకటే అయినపుడు నాన్నగారి హృదయ స్పందన అమ్మకు విన్పించకుండా ఎలా ఉంటుంది ? వేయి గొంతులతో అమ్మకు మాత్రమే వినిపించేలా ఎన్నిసార్లు పిలిచి ఉంటారో! ఆ పిలుపును అందుకున్న అమ్మ అనుభవంలో నుంచి వచ్చినదే 'పాతివ్రత్యానికి చరమదశ భర్త భార్యను అమ్మా అని పిలవడం' అన్న వాక్యం.

ఈ విధంగా ఒక స్త్రీమూర్తి ఆదర్శగృహిణిగా జీవనం సాగిస్తూ ఎన్నో అద్భుతాలు చేయవచ్చునీ, చరిత్రగతినే మలుపులు తిప్పవచ్చునీ, కాలగతినే శాసించవచ్చునీ, అసాధ్యం అన్పించే విషయాలు సుసాధ్యం చేయవచ్చుననీ, ఆచరణాత్మకంగా ప్రబోధించింది అమ్మ. 'నాజీవితమే సందేశం' అని చెప్పిన అమ్మజీవితం ఆదర్శానికీ, ఆచరణకూ మధ్య సమన్వయాన్ని అందిస్తూ మనకు దర్పణమై నిలుస్తోంది. ఒక ఆదర్శం ఎదురుగా ఉన్నప్పుడు మనిషి ప్రవర్తనలో పరివర్తన వచ్చే అవకాశం ఎంతో ఉంటుంది. 'అద్వైతం సుఖదుఃఖయోః' అన్న దాంపత్య ధర్మం రక్షింపబడాలన్నా మన ఆర్ష సంప్రదాయం ఏం ఉద్దేశించిందో అటువంటి ఆదర్శ సమాజం ఏర్పడాలన్నా అమ్మ జీవితమే మనకు ఆదర్శం. అమ్మ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని అదే ఒరవడిలో ముందుకు సాగితే అమ్మ ఏ పరమార్థాన్ని బోధించడం కోసం వివాహం చేసుకున్నదో ఆ ప్రయోజనం నెరవేరుతుంది.

viii) సంభాషణా చాతుర్యం

సంభాషణాచాతుర్యం చమత్కార ప్రియత్వం అమ్మకు సహజాలంకారాలు. మహాత్ములు తాత్త్వికంగా ఎంత ఉన్నత స్థితిలో ఉంటారో సాధారణ విషయాలలో అంత ఉల్లాసంగానూ ఉంటూ తన చుట్టూ ఉన్నవారిని కూడ ఉత్తేజ పరుస్తారు. శ్రీకృష్ణుడు వ్రేపల్లెలో గోపాలకులతో, గోపికలతో చనువుగా స్నేహితుడిగా, గురువుగా, తల్లీతండ్రిగా కాపాడుతూ ఎలా ఆడుకున్నాడో మహాత్ములైన వారు ఆడుతూ, పాడుతూ పసివాళ్లలో పసివారై పెద్దలలో పెద్దలై ఉంటారు. రామకృష్ణ పరమహంస, రమణమహర్షి మొదలయిన వారి జీవిత చరిత్రలు పరిశీలిస్తే వారి వర్తనం ఎంత గంభీరంగా ఉన్నా సంభాషణల్లో చాతుర్యమూ, హాస్య ప్రియత్వమూ కొట్టవచ్చినట్లు

మనకు కన్పిస్తాయి. అలాగే అమ్మ కూడ సంభాషణ చతుర, హాస్యప్రియ. అమ్మ చమత్కారంగా సంభాషిస్తూనే పరమ సత్యాలను వెలువరించేది. గంభీరమయిన విషయ వివరణల్లోనూ చమత్కరిస్తూ అందరినీ మురిపిస్తూ, విస్మయ పరుస్తూ, తాను మురిసిపోతూ తనచుట్టూ వాతావరణాన్ని మైమరపింప చేస్తూ ఉండేది.

ఒకసారి ఒక తల్లి తన బిడ్డను తీసుకు వచ్చి అతని మానసిక చాంచల్యాన్ని అమ్మకు నివేదిస్తూ 'వీడు ఇంట్లో వాళ్లను వేధిస్తున్నాడమ్మా' అని చెప్పింది. 'ఇంట్లో వాళ్లనేనా?' అని అమ్మ అడిగింది. 'ఇతరులను ఏమీ అనడమ్మా! ఇంట్లో వాళ్లు కనిపిస్తే మాత్రం ఊరుకోడు' అని ఆ తల్లి బాధగా వివరించింది. వెంటనే అమ్మ 'నా కంటే వాడే నయం. వాడికి ఇంట్లో వాళ్లని, ఇతరులనీ తేడా తెలుస్తుంది. నాకు అదీ తెలియడం లేదు' అన్నది. ఆ సంభాషణ విని అక్కడ ఉన్నవారందరూ హాయిగా నవ్వుకున్నారు. అవును నిజమే. అమ్మకు ఇంట్లోవాళ్ళు అనీ బయటవాళ్ళనీ భేదమే లేదు. అందరూ ఇంట్లోవాళ్ళే. మరి అమ్మది 'అందరిల్లు' కదా!

చిన్నతనంలో కూడ అమ్మ సంభాషణా చాతుర్యానికి అందరూ ముగ్ధులైపోయే వారు. ఒకసారి చిదంబరరావుగారి గుమాస్తా శ్రీరాములు గారు అమ్మను ఎత్తుకొని వారి స్నేహితులతో 'తల్లిలేని పిల్ల. చాలా బుద్ధిమంతురాలు' అని పరిచయం చేశారు. వెంటనే అమ్మ "బుద్ధిమంతురాలిని అన్నారుగా! మీరు చెప్పినట్లు వినకపోయినా, అంటారా! బుద్ధిమంతురాలంటే ఏంటండీ? బుద్ధి కల్గిందనా! బుద్ధిలేని వారుండరుగా! కుక్కకు కూడ బుద్ధి ఉన్నదిగదా!" అని వారి వెంట ఉన్న పెంపుడు కుక్కను చూపించింది అమ్మ. 'బుద్ధి అంటే గుణమమ్మా' అన్నారు. "గుణం లేనివీ ఉండవుగా అన్నింటికీ గుణాలు ఉన్నాయిగా" అని అమ్మ అంటూ ఉండగా ఆయన "నీకు' 'కాని' ఇస్తాను కానీ, ఏమయినా కొనుక్కుని తిను. అనగానే నేనూ 'కాని'వ్వమనే అంటున్నాను" అన్నది అమ్మ. ఆయన కానీ తీసి ఇవ్వబోగా "నేను సంభాషణ కానివ్వమంటున్నాను" అని వివరించింది. ఆయన స్నేహితులు పకపకానవ్వి చిదంబరరావుగారు కవి కాబట్టి కవిగారి మనమరాలు కదూ! అంటూ అమ్మవాక్చాతుర్యానికి మెచ్చుకుంటూ వెళ్లారు.

ఒకసారి అమ్మ వద్ద కోదండరామయ్యగారు అనే వ్యక్తి ప్రస్తావన వచ్చింది. ఆయన దగ్గరకు కొంతమంది సోదరులు పనిమీద వెళ్తున్నారు. ఆయనని గుర్తు చేయటానికి 'ఆ కోదండం' యేనా అని ఒకరు ప్రశ్నిస్తే, మరొకరు ఆయనే కోదండం అన్నారు. వెంటనే "ఆయనకో దండం అనండి మీ పనులు అవుతాయి" అన్నది అమ్మ. కోదండం అన్న పదాన్ని అమ్మ విరిచిన తీరు చూసి అందరి పెదవులపై చిరుదరహాసం వెల్లివిరిసింది.

మహాత్ములందరి ప్రవర్తన ఒకే తీరుగా ఉంటుంది అనటానికి రమణమహర్షి జీవితంలో కనిపించే కొన్ని విషయాలను ముచ్చటించుకుందాం.

ఒకప్పుడు రమణ మహర్షి ఆశ్రమంలో దోమకాటు ఎక్కువయింది. అర్ధరాత్రి నిద్రపట్టక లేచి కూర్చున్న కృష్ణస్వామి అనే భక్తుడు కోపంతో దోమల్ని చంపేద్దామని ఆలోచిస్తుండగా "ఈ శరీరం నీది కాదు కదా ! నీది కాని శరీరాన్ని కుడుతుంటే అధిక్షేపించటానికి నీవెవరవు ?" అంటూ ఆధ్యాత్మిక సత్యాన్ని హాస్య సమ్మిళితం చేసి చమత్కరించారు రమణులు.

ఒకసారి మహర్షి బయటకు వెళ్ళవలసిన వేళ మించిపోతోందని శిష్యులు తొందర చేస్తుంటే, "ఆగండి ! ఆంజనేయుల అయ్యగారు వచ్చి గట్టిగా కాళ్ళు పట్టుకున్నారు" అంటూ నెమ్మదిగా లేచారు. వాయు సంబంధమైన మోకాళ్ళ నొప్పులబాధను హాస్యంగా చమత్కరించడం రమణులకే చెల్లింది.

ఈ విధంగా ఎన్నో సందర్భాలలో చమత్కారంగా తత్త్వాన్ని బోధించేవారు భగవాన్.

కొన్ని సన్నివేశాలను చూసినపుడు అమ్మ ఆలోచనా దృక్పథం విశిష్టమయిందీ, విలక్షణమైందిగా కన్పిస్తుంది. అలాంటి కొన్ని విషయాలను అవలోకిద్దాం.

లోకంలో పండితులంటే వేదాలు, ఉపనిషత్తులు, శాస్త్రాలు క్షుణ్ణంగా అధ్యయనం చేసిన వారనే అర్థం చెప్తారు. అటువంటి వారికే సన్మానాలు, సత్కారాలు చేస్తూ ఉంటారు. కాని అమ్మ దృష్టిలో పండిత పామరులనే హెచ్చు తగ్గులు లేవు. పండితులనెలా ఆదరించి శాలువాలతో సత్కరిస్తూ ఉండేదో వారితో వచ్చిన కారు

డ్రైవర్‌కు కూడా శాలువా కప్పేది. అదేమిటని ఆశ్చర్యపోయిన వారితో 'ఎవరు ఏ విద్యలో ప్రవీణులో వాళ్లే పండితులు. డ్రైవర్ కూడ అతని డ్రైవింగ్‌లో పండితుడే కదా!' అని అమ్మ వివరించేది.

అంతేగాక, "చలిబాధ ఎవరికైనా ఒకటేగా నాన్నా!" అని సమర్థించింది. తాను ఈ సత్కారానికి తగనని సిగ్గుపడుతున్న డ్రైవర్‌కు, తమతో సమానంగా డ్రైవర్‌కు కూడా అదే సన్మానమా? అనుకుంటున్న వేదపండితులకు ఒకే వాక్యంలో సమాధానం చెప్పి, తన సర్వసమ్మతాన్ని వెల్లడించింది.

1970లో ఒకసారి గుంటూరు హిందూకాలేజి ప్రాంగణంలో అమ్మ దర్శనం ఏర్పాటయింది. దాదాపు లక్షమందిజనం పాల్గొన్నారు. తీవ్రమైన ఎండ. అమ్మకు ఎండ తగలటం గమనించిన ఒక సోదరుడు గొడుగు తెచ్చి పట్టటానికి ప్రయత్నిస్తుండగా 'ఇదేమిటి?' అన్నది అమ్మ. ఎండ విషయం ప్రస్తావించగా 'మరి ఈ లక్షమందికి గొడుగులు తెప్పిస్తావా?' అని అడిగింది. "లక్షగొడుగులా!" అని నివ్వెరపోయారు కార్యకర్తలు. ఆ సమాధానం వింటే "మీరు నా బిడ్డలే కాదు, నా అవయవాలు కూడ" అని ప్రకటించే అమ్మ అందరికీ గొడుగులు పడితేకాని తాను చల్లదనాన్ని అనుభవించలేదేమో అనిపిస్తుంది.

పైకి సంభాషణా చాతుర్యంగా కనిపించే మాటలచాటున అమ్మ అవ్యాజ ప్రేమ, సర్వసమాన దృక్పథం దోబూచులాడుతూ, మనకు మార్గదర్శనం చేస్తున్నాయి.

ix) అసాధారణ ధారణ

అసాధారణ ధారణ అమ్మకు సాధారణ ఆభరణం. మనకు ఆశ్చర్యాన్ని కల్గించే అమ్మ అసాధారణ లక్షణాలలో అమ్మ జ్ఞాపకశక్తి ఒకటి. అమ్మతో అనుబంధం ఉన్నవారినెవరిని కదిలించినా అమ్మ అసాధారణమయిన ధారణను ప్రస్తావించకుండా ఉండరు. అత్యద్భుతమూ, అనుపమానమూ అయింది అమ్మ జ్ఞాపకశక్తి అని చెబుతూ ఉంటారు. అమ్మ చరిత్రను పరిశీలించినా, ఇందుకు ఎన్నో సంఘటనలు మనకు ఉదాహరణలుగా నిలుస్తాయి. అమ్మ దర్శనం కోసం దేశవిదేశాల నుంచి ఎందరో వస్తూ ఉండేవారు. వారిలో మొట్టమొదటిసారిగా వచ్చేవాళ్లు కొందరయితే తరచుగా వచ్చేవాళ్లు కొందరు, చాలా అరుదుగా వచ్చేవాళ్లు

కొందరు ఉంటారు. ఎవరు ఎపుడు ఏట్లా వచ్చినా అన్నీ అమ్మకు గుర్తే. ఎవరు ఏ సంవత్సరం ఏ వారం ఎన్ని గంటలకు ఎవరితో కలిసి వచ్చింది 50 సంవత్సరాల క్రితం చూసినా వాళ్ల పేర్లు వివరాలతో సహా అన్నీ చెప్పేది.

అమ్మ గుర్తు చేసిన సంఘటనలు వారి జీవితంలో జరిగినవే అయినా వారికి అవి సగం స్మృతిలో ఉండి సగం మరుపునకు వచ్చి, మరల అమ్మ చెప్పటంతో గుర్తు చేసుకుంటూ ఉండేవారు. అమ్మ దగ్గరకు తరచుగా వచ్చేవాళ్లలో కూడా చాలామంది వాళ్లు మొదటిసారి అమ్మను దర్శించిన తేది, అపుడు వాళ్లు ధరించిన బట్టలూ, వాళ్లు వేసిన ప్రశ్నలు గుర్తుపెట్టుకోలేరు. కాని, అమ్మ వాళ్లు వేసుకున్న బట్టలు, వాళ్లు ఎక్కడ కూర్చున్నదీ గుర్తుచేసి చివరకు ఆ రోజు తాను వాళ్లకి అన్నంలోకి ఏ పదార్థాలు తయారు చేసిందీ కూడ చెప్పేది. ఇది చాలామందికి అనుభవంలో ఉన్న విషయమే.

జీవితంలో వింతగానో, విశేషంగానో అనిపించిన క్షణాలన్నీ చిరస్థాయిగా మన స్మృతి పథంలో ఉంటాయి. జీవితంలో జ్ఞాపకం ఉన్న సంఘటనలన్నీ ఎంతో కొంత సామాన్యం కన్నా భిన్నమైనవే అనే చెప్పాలి. వేలాది జనంలో ఎవరూ, ఏమిటి, ఏమన్నారు-అన్న విషయాన్ని గూర్చి చెప్పడం మాత్రం సాధ్యం కాదు. సాధారణంగా మనిషి సర్వసామాన్యమైన సందర్భాలను గుర్తుపెట్టుకోడు. అమ్మకు అన్నీ ప్రత్యేకమే. అన్నీ విశేషమే. ఎవరయినా 'నీకెలా గుర్తుంటాయమ్మా!' అని ప్రస్తావిస్తే అమ్మ చిరునవ్వుతో 'నాకు గుర్తు ఉండటంలో విశేషం లేదు, నాకు ఎపుడో జరిగినట్లు ఉండదు, ఇపుడు జరుగుతున్నట్లే ఉంటుంది నాన్నా!' అని సమాధానం చెప్పేది. చాలాదూరం నుంచి అమ్మ దర్శనానికి వచ్చిన వాళ్లు 'అమ్మా మీ దర్శనం మళ్ళీ ఎప్పటికో, మీకు మేము గుర్తుంటామా' అని అడిగితే 'అసలు మరపుంటేగా జ్ఞాపకం పెట్టుకోవడానికి' అని అంటూ ఉండేది.

"అమ్మా! మీ దగ్గరకు ఎంతోమంది వచ్చి వారి సమస్యలు, బాధలు, చెప్పుకుంటూ ఉంటారు గదా? ఇంతమందిలో మేము మీకెలా గుర్తుంటా మమ్మా!" అని అడిగితే, "తల్లికి తన బిడ్డలు గుర్తుండటంలో ఆశ్చర్యమేముంది?" అంటుంది అమ్మ. నాది అనుకోవడమే గుర్తుకు కారణం కదా!

1962లో పుల్లయ్య అనే వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతూ ఉంటే అతని తల్లిదండ్రులు అమ్మ వద్దకు తీసుకు వచ్చారు. వారిది నరసరావుపేట దగ్గర గురువాయిపాలెం. అమ్మ అతడిని చూస్తూనే-'నాన్నా ! నీవు 1946 లో ఇక్కడకు వచ్చావు కదూ" అని అడిగింది. పుల్లయ్య మాట్లాడుతూ "కొన్ని సంవత్సరాల క్రితం బండితోలుకు వచ్చి నీ చేతి అన్నం తిన్నానమ్మా!" అన్నాడు. అపుడు అమ్మ 'ఇతడు గురువాయూరు కరణంగారి దగ్గర నౌకరుగా పనిచేసేవాడు. అప్పటికి అతనికి 14 సంవత్సరాలు. గడ్డి కొనుక్కోవటం కోసం బండి వేసుకొని జిల్లెళ్ళమూడి 1946లో వచ్చాడు. గడ్డికొనడం ఆలస్యమైంది. తెచ్చుకున్న అన్నం అయిపోయింది. హోటల్లో అన్నం దొరుకుతుంది అనుకున్నాడట. ఈ ఊళ్లో ఆ వసతి లేదు కదా బెల్లం శనగపప్పు కొనుక్కొని ఇక్కడు వచ్చి మంచినీళ్లు అడిగాడు. అన్నంతిన్నావా నాన్నా ! అంటే లేదన్నాడు. పాడి ఉండేది కదా కడుపునిండా పెరుగుతో అన్నం పెట్టాను. తృప్తిగా తినివెళ్లాడు" అని అతని కథను వినిపించింది.

ఏలూరు సోదరులైన తూనుగుంట్ల త్రిలోక అప్పారావుగారు 1958 నుంచి అమ్మ దర్శనం కోసం జిల్లెళ్ళమూడి రావడం ప్రారంభించారు. అప్పటికి ఆయన గుంటూరులో ఉండేవారు. శ్రీరామ మంత్రోపదేశం పొంది అహర్నిశలు రామనామాన్ని జపించేవారు. కారణమేదైనా, సుమారు ఒక దశాబ్దంపాటు అమ్మ దగ్గరకు రాలేకపోయారు. మళ్లీ 1971లో అమ్మ దగ్గరకు వచ్చారు. ఆ మధ్యకాలంలో, ఒకసారి అమ్మ దగ్గరకు వచ్చినా ఆయనకు ఆ సంగతి జ్ఞాపకం లేదు. అందుకని అమ్మతో 'నీదగ్గరకు వచ్చి సుమారు 12 సంవత్సరాలయిందమ్మా' అన్నారు. వెంటనే అమ్మ 'కాదు నాన్నా, నీవు వచ్చి 9 సంవత్సరాల తొమ్మిది నెలలు అయింద'ని చెప్పింది. అప్పటికీ ఆయనకు గుర్తురాలేదు. అపుడు అమ్మ 'నాన్నా నీవు ఆ రోజు వచ్చేటప్పుడు కుళ్లిపోయిన నారింజకాయలు తీసుకు వచ్చావు' అని గుర్తుచేస్తే ఆయన ఆశ్చర్యపోతూ 'కుళ్లిపోయిన నారింజకాయలు నేనెందుకు తీసుకువస్తాను' అన్నారు. 'లేదు నాన్నా! నీవు పెదనందిపాడులో తీసుకువచ్చావు' అన్నది అమ్మ. అప్పటికి మెల్ల మెల్లగా ఆయనకు ఆ నాటి సంఘటన జ్ఞాపకం రావడం మొదలయింది. ఆయన గుంటూరు నుంచి పెదనందిపాడు మీదుగా జిల్లెళ్ళమూడి వస్తున్నారు. పెదనందిపాడులో బస్సు దిగి అమ్మకు ఏమయినా

పండ్లు తీసుకువెళితే బాగుండునేమో అన్పించి చుట్టుప్రక్కల దుకాణాలన్నీ వెదికారు. ఏమీ దొరకలేదు. ఒకచోట మాత్రం పైన తొడిమదగ్గర కొద్దిగా నల్లమచ్చలు గల నారింజకాయలు కన్పించాయి. ఈ మచ్చలు పైనే కదా, కాయలోపలి దాకా వెళ్లి ఉండవు. కాయలు పాడయి ఉండవు అనే నిర్ధారణకు వచ్చి అమ్మ దగ్గరకు ఆ కాయలనే తీసుకువచ్చారు. ఈ విధంగా వారు మరచిపోయినా అమ్మ జ్ఞాపకం చేసిన సంఘటనలు ఎంతమందికో ఉన్నాయి.

అమ్మకు 12 సంవత్సరాల వయస్సులో అంటే 1935లో చిదంబరరావుగారి ఇంట్లో ఉండగా తహశీల్దారు గారి కుటుంబంతో పరిచయం ఏర్పడింది. ఆ తరువాత అమ్మ జిల్లెళ్ళమూడి వచ్చి అమ్మగా అందరికీ వెల్లడి అయ్యాక 1968లో ఆ తహశీల్దారు గారి అబ్బాయి రేడియో ఇంజనీరుగా పనిచేస్తూ కొంతమంది సోదరులతో కలిసి అమ్మ దర్శనానికి వచ్చారు. ప్రక్కనే ఉన్న అమ్మ ఆంతరంగిక కార్యదర్శి కొండముది రామకృష్ణగారు ఆయనను గూర్చి పరిచయం చేయబోగా అమ్మ, వారు తనకు తెలుసునని వారి వివరాలన్నీ చెప్పింది. వారి తండ్రి బాపట్లలో తహశీల్దారుగా పనిచేసింది 1935లో, ఆయన కుమారుడు అమ్మ దగ్గరకు వచ్చిన సంవత్సరం 1968. మధ్యలో 33 సంవత్సరాల సుదీర్ఘమయిన కాలం గతించింది. కాని అమ్మ ఆయనను చూసి పోల్చుకోవడమే కాక వారి కుటుంబంలోని ప్రతి ఒక్కరి పేరు చెప్పి వారి గుణగణాలను వర్ణించింది. వారి బంధువుల విషయాలు, వారు ఒకప్పుడు గుంటూరులో అద్దెకు ఉన్న ఇంటి సంగతులు చెప్తుంటే ఇన్నేళ్లయినా అమ్మ హృదయంలో తమకు ఇంత స్థానం ఉన్నదా అని ఆయన ఎంతో ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు. ఈ విధంగా వారి విషయాలన్నీ అమ్మ, పూస గ్రుచ్చినట్లుగా చెప్పుతుంటే అమ్మ దగ్గర మాకే ప్రత్యేక స్థానమున్నది అని ఎవరికి వారు ఆనందపడేవారు.

సాధారణంగా చిన్నతనంలో జరిగిన విషయాలు ఎంతో ముఖ్యమైనవి అయితే తప్ప గుర్తుండవు. ఏ వయస్సులో ఏ పండుగకు ఏ బట్టలు కట్టుకున్నదీ వాటి రంగు విషయం గుర్తుండడం సగటు మనుషులకు అసలు సాధ్యం కాదు. మరి మామూలు రోజుల్లో ధరించినవి ఇంకా ఏం గుర్తుంటాయి. కాని అమ్మ

తాను నాలుగైదేండ్ల వయస్సులో ఉన్నప్పుడు కూడా ఏ సమయంలో ఏమేమి బట్టలు ధరించిందీ, నగలు ఏం పెట్టుకున్నదీ సవివరంగా చెప్పేది. 1985 మార్చిలో అమ్మ జీవితచరిత్రలో బాల్యంలో జరిగిన కొన్ని సంఘటనలతో 'అనసూయా కళ్యాణం' అనే నాటక ప్రదర్శన జరిగింది. ఆ సందర్భంలో అమ్మ పాత్రధారిని అమ్మే సూచించింది. కోగంటి సత్యప్రసాద్, వరలక్ష్మిగార్ల కుమారుడు చి.శశికాంత్‌ను ఎంపిక చేసింది. అపుడు అమ్మ వరలక్ష్మి గారిని పిలిచి బాల్యంలో అంటే 1927లో జరిగిన ఆయా సన్నివేశాలలో ఏరోజు ఎవరితో సంభాషించేటప్పుడు ఏం ధరించిందీ ఆ రంగులతో సహా వివరించింది. ఆమె ఆ ప్రకారమే బట్టలు కుట్టించి ప్రదర్శనకు ఉపయోగించారు.

1939లో అమ్మ అనారోగ్యంతో చీరాల బేర్ హాస్పిటల్‌లో ఉండగా అక్కడ రెండు రోజులు పరిచయమైన కమలమ్మ అనే ఆమె 1966లో ఒక రోజు మరికొందరి బంధువులతో కలిసి అమ్మ దగ్గరకు వచ్చింది. "నీ పేరు కమలమ్మ కదూ !" అని అడిగి ఇంకొక ఆమెకు గుల్లపు వాతం చేసి బెడ్ మీద ఉంటే అమ్మ బార్లీ కాచి ఇచ్చానని గుర్తు చేస్తే ఆమె చాలా ఆశ్చర్యపోయింది.

1963లలో దుగ్గిరాల నుంచి మొదటిసారి అమ్మ వద్దకు వచ్చిన ఒకామె అమ్మకు పూలు పండ్లు ఇస్తుండగా "మీరు పిచ్చమ్మగారు కదూ !" అని అడిగింది అమ్మ. ఆమెను అమ్మ 1948లో చూసిందట.

1974లో ఒక సోదరి అమ్మ దగ్గరకు వచ్చి 'నాకు చాలా తృప్తిగా ఉన్నదమ్మా ఎన్ని సంవత్సరాలయిందో తల్లీ నిన్ను చూసి' అన్నది. 'ఇరవై సంవత్సరాల క్రిందట చూశావు. 1949 డిసెంబరు 14న నేను మీ ఇంటికి వచ్చాను. 25 సంవత్సరాలయింది' అన్నది అమ్మ.

ఎక్కిరాల భరద్వాజగారు జిల్లెళ్ళమూడి వెళ్లటమారంభించిన మూడున్నర సంవత్సరాల తరువాత కూడ ఆయన వచ్చిన తేది, ఆ రోజు అక్కడ ఎవరున్నది. ఆయన ఏం ప్రశ్నలు వేసిందీ, అమ్మ ఏం సమాధానాలు చెప్పిందీ వివరిస్తూ, 'నాకు మరుపేలేదు - అమ్మ' అన్న వ్యాసంలో భరద్వాజగారు తెలియచేశారు.

సోదరి బ్రహ్మాండం వసుంధరగారిని ఇంటర్వ్యూ చేసినపుడు అమ్మ జ్ఞాపకశక్తికి సంబంధించిన ఒక విషయాన్ని ప్రస్తావించారు.

ఒకరోజు అమ్మ హాల్లో కూర్చున్నది. దర్శనానికి వచ్చిన సోదరులలో ఒకరు అమ్మ పాదాలకు నమస్కరించి "అమ్మా గుర్తున్నానా! నేను మూడు సంవత్సరాలయింది వచ్చి" అన్నారు. అమ్మ వెంటనే మూడు సంవత్సరాలు కాలేదని చెప్పి అతను వచ్చినపుడు కూర్చున్న ప్రదేశం చెప్పి, కూర్చున్న విధానం చూపి ఆనాటి సంఘటన మొత్తం అతని సంభాషణతో సహా వివరంగా చెప్పింది.

అతను ఆశ్చర్యపోయి "నాలో ఏమీ ప్రత్యేకత ఉన్నదని మీకింతగా గుర్తున్నాను" అని అంటూ ఉండగానే అతనికి ఆనందంతో కన్నీళ్లు వచ్చాయి. అపుడు అమ్మ....

'నీవేకాదు నాన్నా ! అందరూ గుర్తు ఉంటారు. పిల్లల ప్రత్యేకతను బట్టి కాదుగా, తల్లికి గుర్తు తన పిల్లలు కాబట్టే' అన్నది అమ్మ.

ఎన్ని సంవత్సరాలైనా గడవనీ, అది చిన్న విషయమయినా కానీ, పెద్ద సంఘటనైనా కానీ, కొన్ని లక్షలమంది జనానికి ఎవరికి వారికే అన్ని సంగతులు అమ్మ వివరించి చెబుతుంటే ఎలా అర్థం చేసుకోవాలో ఏమని నిర్వచించాలో తెలియక నిరుత్తరులం కావడం మన వంతు అవుతుంది.

ఈ అసాధారణ ధారణే అమ్మ అసామాన్య స్థితికి నిదర్శనంగా భావించవచ్చు.

x) శిక్షకాని శిక్షణ

శిక్ష కాని శిక్షణ అమ్మ ప్రత్యేక లక్షణం.

"పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతాం
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే."

అన్న గీతా వచనం ప్రకారం దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసం మహాత్ములు అవతరించి దుష్టశిక్షణ గావించడం యుగయుగాల్లో జరిగినట్లు తెలుస్తోంది.

ధర్మసంస్థాపనకు ఆలంబనం సాధురక్షణ. అందుకోసం ధర్మానికి విరుద్ధంగా ప్రవర్తిస్తూ లోక కంటకులుగా ఉన్న దుర్మార్గుల్ని సంహరించవలసిన అవసరం

రావచ్చు. నాటిన పైరు పైకి ఎదిగి మంచి పంట పండాలంటే కలుపు మొక్కలను ఏరి పారెయ్యాలి కదా ! కలుపు మొక్కలను ఏరటం కోసం పంట వేయరు. దుష్టశిక్షణ చేయటమే వారి ఉద్దేశం కాదు. సమాజస్థితిని కాపాడటమే మహనీయుల ఉనికికి పరమార్థం. ఆయా యుగధర్మాలను బట్టి సమాజ పరిస్థితిని బట్టి ఒక్కొక్కరు ఒక్కొక్కమార్గాన్ని అనుసరించారు.

దుష్టశిక్షణ పేరిట వరుసగా అందరినీ సంహరించుకుంటూ పోతే సమాజంలో ఏం మిగులుతుంది ? ఈనాడు సమాజంలో మతం పేరుతో మారణ హోమాలూ, రాజకీయం పేరుతో రణరంగాలూ, కులం పేరుతో కుమ్ములాటలు మనం చూస్తూనే ఉన్నాం. సాంకేతికంగా, వైజ్ఞానికంగా ఎంత అభివృద్ధి సాధించినా అందరు సౌభ్రాత్ర భావనతో లేనినాడు ఆ నాగరికతే వినాశనాన్ని కల్గిస్తోంది. ఈనాడు అగ్రరాజ్యాలుగా ప్రసిద్ధి చెందిన దేశాల్లో ఉగ్రవాదులు జరిపిన దాడులు వింటూనే ఉన్నాం. ఈనాడు సమాజంలో అన్నీ ఉన్నా బ్రతుకు భయం ఏర్పడింది. మనిషికి సాటి మనిషి వల్లనే ప్రమాదం సంభవిస్తోంది. ఏ క్షణానికి ఆ క్షణం భయంభయంగా బ్రతుకు వెళ్లబుచ్చే పరిస్థితి నేడు. ప్రేమ, కరుణ, వాత్సల్యం లాంటి మాటలీనాడు నిలువనీడ లేక నిఘంటువులలో తలదాచుకుంటున్నాయి. ధనదాహం, పదవీవ్యామోహం, కులమత రాజకీయాలు నానాటికీ పెచ్చు పెరిగి తమ విశ్వరూపాన్ని ప్రదర్శిస్తున్నాయి. స్వార్థం వెర్రి తలలు వేసి జాతి జీవనాన్నే స్తంభింప చేస్తున్న కాలమిది. మరి ఇలాంటి సమాజ అవ్యవస్థకు కారణం ఏమిటి? అని ఒక్కసారి పర్యాలోచిస్తే ప్రేమరాహిత్యమే దానికి మూలం అని అర్థమవుతుంది. విశ్వమనే రథానికి ఇరుసు ప్రేమ. రథచక్రాలెంత బలంగా ఉన్నా ఇరుసు విరిగితే రథం ముందుకు సాగదనేది జగమెరిగిన సత్యం.

ఈనాటి సమాజస్థితిని కాపాడటానికి అత్యంత బలమైన శక్తిమంతమైన సాధనం ప్రేమ ఒక్కటే. కనుక ఈ యుగధర్మాన్ని అనుసరించి దుష్టులలోని దుష్టత్వాన్ని సంస్కరించాలంటే క్షమారూపిణియైన తల్లికే సాధ్యం. యోగ్యతా యోగ్యతలతో నిమిత్తం లేని అవ్యాజ ప్రేమ తల్లిలో మాత్రమే కన్పిస్తుంది. కనుకనే ఈ యుగధర్మాన్ని బట్టి అమ్మ ప్రేమతత్త్వాన్నే దివ్యోపకరణంగా ఎంచుకున్నది.

ఎందరో యోగులు, సిద్ధులూ, కారణజన్ములుగా కాలగమనంలో ముందుకు సాగి ఉండవచ్చు కాని

"నేను గురువును కాను – మీరు శిష్యులు కారు
నేను దైవాన్ని కాను – మీరు భక్తులు కాదు"

'నేను అమ్మను – మీరు బిడ్డలు' అని తన అసాధారణ మాతృత్వాన్ని ప్రకటించింది అమ్మ మాత్రమే. అలాగే ప్రజలు ఆమెను అమ్మ అంటూ – మాతృస్వరూపిణిగా భావించడం అపురూపమైన విషయం.

దుర్మార్గులలో ఉన్న దుష్టత్వాన్ని హరించటమే సంహరణ. కనుకనే అమ్మ 'దుష్టశిక్షణ కాదు దుష్టత్వ శిక్షణ' అని ప్రకటించింది.

దోషులను సానుభూతితో అర్థం చేసికొని ప్రేమతో వాళ్లలో పరివర్తన తీసుకురావాలన్నదే అమ్మ ఆశయం; ఆరాటం. తప్పు చేసిన వాళ్లను జైళ్లలో పెట్టి శిక్షించినంత మాత్రాన వాళ్లలో ఏ మార్పూ రాదు. ఈనాడు మానవ హక్కుల కమీషన్ గాని మరెన్నో స్వచ్ఛంద సంస్థలు గానీ నేరస్థులలో పరివర్తన తీసుకురావటానికి ఎన్నో ప్రయత్నాలు చేస్తుండడం మనం గమనిస్తున్నాం. ఏ వ్యక్తీ పుట్టుకతోనే చెడ్డవాడిగా పుట్టడు. అతని కుటుంబం, చుట్టూ ఉన్న పరిస్థితులు అన్నీ కారణమవుతాయి. వారి పరిస్థితులను అవగాహన చేసికొని వారి పట్ల సానుభూతి చూపిస్తూ వాళ్ల మనస్సు మారటానికి సాటి మనిషి తోడ్పడుతూ ఉండాలి. తమ కర్తృత్వం ఏమీ లేకుండానే చెడ్డవాళ్లుగా మారిన వాళ్లూ ఉంటారు. వాళ్లను అలక్ష్యం చేస్తే వాళ్లలో నేర ప్రవృత్తి పెరిగిపోయి సమాజానికి సమస్యగా మారతారు. అలా కాక ప్రేమతో ఆదరించగల్గితే వాళ్ళలో కొంతైనా మార్పు వస్తుంది. అలా ప్రతివారూ ఏ ఒక్కరినైనా ఆదరించగల్గితే సమాజంలో క్రమంగా నేరస్థుల సంఖ్య తగ్గిపోయి సమాజ స్వరూపమే మారిపోతుంది. "తప్పు అని తెలిసి మనిషి తప్పులు ఎందుకు చేస్తాడు ?" అని అడిగితే 'తప్పించుకోలేకనే' అన్న అమ్మ సమాధానం తప్పొప్పులకు మానవుడు కర్తకాదని, అవి విధి నిర్ణయం ప్రకారం మాత్రమే జరుగుతున్నాయని అమ్మ ఇచ్చిన తీర్పు ఈ మాటలో వ్యక్తం అవుతుంది. కనుకనే నేరస్థులను సమాజాన్నుండి దూరం చేయకుండా మానవతా దృక్పథంతో

వారిలోని నేరప్రవృత్తిని మార్చటానికి తోడ్పడాలన్నది అమ్మ ఆలోచన. శిక్ష అంటే మనిషిని సంహరించటం కాదు కదా! గుణాన్ని మార్చటమేనంటూ అమ్మ పాపులను, పతితులను ప్రేమతో ఆదరించి సన్మార్గంలోకి మళ్లించిన సంఘటనలు అనేకం ఉన్నాయి.

అమ్మను కూడా కేవలం స్త్రీగా భావించి అనుచితంగా ప్రవర్తించటానికి సిద్ధపడిన ఒకరు, తరువాత కాలంలో పశ్చాత్తాపంతో అమ్మ పాదాల నాశ్రయించగా అమ్మ అతని కన్నీళ్లు తుడిచి పసిబిడ్డకు వలె అరటిపండు ఒలిచి నోటికి అందించి నూతన వస్త్రాలు పెట్టి పంపింది. ఎంతో ఘోరమయిన తప్పులు చేసిన వారిని కూడా క్షమాగుణంతో మన్నించడం, తనమీద కత్తిదూసిన వారిని కూడ 'వాడూ నా బిడ్డేగా' అని అనడం అమ్మకే చెల్లింది.

అందరినీ బిడ్డలుగా చూసే మాతృభావనతో బిడ్డల తప్పు గ్రహించినా శిక్షించకుండా ప్రేమతో వారికున్న మనోవైకల్యాన్ని సరిచేసి అద్భుతమైన పరిణామం తీసుకువచ్చింది అమ్మ.

'యద్య దాచరతిశ్రేష్ఠః తత్తదేవేతరో జనః
స యత్ర్పమాణం కురుతే లోక స్తదనువర్తతే' అన్నట్లుగా ఆచరణాత్మకంగా ప్రబోధాన్ని అందించే అమ్మ జీవితమే సందేశం. కనుక అమ్మనే ఆదర్శంగా తీసికొని తనకపకారం చేసిన వ్యక్తిని క్షమించి అతనిలో పరివర్తన తీసుకు వచ్చారు కొందరు సోదరులు. ఇలా అమ్మను ఆరాధించి అనుసరించే సోదరులకు పరివర్తన పరిణతి కలగటం జిల్లెళ్ళమూడి చరిత్రలో కన్పిస్తుంది.

అమ్మజీవితాన్నీ, అమ్మసూక్తులనూ, అనుక్షణం అధ్యయనం చేస్తూ అమ్మ సందేశాన్ని ఆచరణలోకి తెచ్చుకోగల్గితే ఎంతో మంది నేరస్థులలో క్రమంగా మార్పు తీసుకు వచ్చి నేరరహితమైన సమాజాన్ని రూపొందించవచ్చు. అపుడు సమాజ చిత్రమే మారిపోతుంది. అమ్మ అందరికీ అమ్మగా ప్రకటితమయినపుడే కాదు ముక్కుపచ్చలారని వయసులో కూడ ఎంతో మందిని సంస్కరించిన విషయం అమ్మచరిత్ర మనకు చెప్తోంది.

బాల్యంలో ఒకసారి అమ్మ, మరిడమ్మ తాతమ్మా పెనుగుదులపాడు వెళ్తూ మార్గమధ్యంలో శ్రీరంగపురం చేరుకున్నారు. ఆ రాత్రి అక్కడ చిదంబరరావు తాతగారికి తెలిసిన రామయ్య ఇంట్లో ఉన్నారు. ఆయనకు పిల్లలు లేరు. ఆస్తి లేనందువలన దత్తతకు పిల్లల్ని ఇవ్వడానికి కూడ ఎవరూ ఇష్టపడలేదు. ఆయన భార్య రంగమ్మ, ఆమె అక్క రాజమ్మ. చిన్నతనానే భర్త పోవటం వలన వారి వద్దనే ఉంటూ చెల్లెలు అమాయకత్వాన్ని, మరిది బలహీనతని ఆసరాగా తీసుకొని ఇంటి పెత్తనం అంతా తానే చేస్తోంది. అమ్మను, అమ్మ ఒంటి మీద బంగారాన్ని చూడగానే రాజమ్మ ఆలోచన పరిపరి విధాలుగా పోయి ఒక దురూహ తలెత్తింది. అమ్మాయి ఒంటి నిండా బంగారమే. ఎలాగైనా ఆ బంగారాన్ని తీసుకోవాలి అని రంగమ్మతో చెప్పింది.

'అమ్మాయి దేవతలా ఉంది. నీ మాటలు వింటే శపిస్తుంది' అన్నది రంగమ్మ తాతమ్మ. నిద్రపోతూ ఉన్నా, మెలకువగానే ఉన్న వారి సంభాషణ విన్నది అమ్మ.

మంచితనానికి మారుపేరైన రంగమ్మ చాటున పాములాంటి రాజమ్మ సుఖంగా బ్రతుకుతోంది. తాను నోరు తెరిస్తే భర్త, అక్క ఎక్కడ భంగపడతారోనని విషం లాంటి సత్యాన్ని కడుపులో దాచుకుని పెదవి దాటనివ్వకుండా జీవనం సాగిస్తోంది రంగమ్మ.

అందరూ నిద్రపోయారనుకొన్న రాజమ్మ లేచి అమ్మ దగ్గరకు వెళ్లి అమ్మ మెడలో ఉన్న హారాన్ని తీసింది. వెంటనే అమ్మ లేచి కూర్చుని తన ఒంటిమీద నగలన్నీ తీసి దోసిట్లో పోసుకుని బయలుదేరి రంగమ్మ వద్దకు వచ్చి ఆమె దోసిట్లో ఈ నగలన్నీ కుమ్మరించింది. తరువాత ఆ నగలను రామయ్యకిచ్చి రంగమ్మను నమస్కారం చేయమని రామయ్యనుద్దేశించి తనకు తల్లిలేదని, ఆమెకు పిల్లలు లేరు కాబట్టి తనకు తల్లిమీద, మీకు వదినమీద, ఆమెకు ధనం మీద ఉన్న మోజులు అన్నీ ఈ రోజుతో తీరాయి. అంతకు ముందే రామయ్య రంగమ్మను కొట్టటం చూసింది అమ్మ. కనుకనే "మీరు ఇందాక ఆమెను తన్నారు కదా ! దానికి ఏమి శిక్ష వేసుకుంటారు ? మీరు తన్నితే పడివుండటం ఆమెకు ఎట్లా ధర్మమో మీరు తన్నకుండా మీకు ధర్మాలు అనేకం ఉన్నాయి" అని మందలించింది.

అంత చిన్న పిల్ల అంత చురుగ్గా పదునుగా మాట్లాడుతుంటే వారు ముప్పురూ నిర్విణ్ణులై నిలబడిపోయారు. రామయ్య తేరుకుని 'నన్ను దండించటానికే వచ్చావా! నీవెవరమ్మా ! అని అడిగారు. అతని తప్పును ఖండించటానికి వచ్చానని అమ్మ చెప్పి రామయ్య తన్నినపుడు రంగమ్మ మెడలో పెరిగిన మంగళసూత్రాన్ని తన ఎదుటనే రామయ్య చేత రంగమ్మ మెడలో కట్టించింది. రామయ్య రంగమ్మ మెడలోపాత మంగళసూత్రాన్నే కొత్తగా కట్టాడు. అమ్మ నగలన్నీ రామయ్యే స్వయంగా అమ్మ మెడలో అలంకరించి పాదాభివందనం చేశాడు. పెనుగుదులపాడు వెళ్లి తిరిగి వస్తూ అమ్మ రామయ్య గారింటికి మళ్లీ వెళ్ళింది. అక్కడ భార్యాభర్తలిద్దరూ ఎంతో అన్యోన్యంగా కనిపించారు కాని, రాజమ్మ మాత్రం ఆ ఇంటి నుండి నిష్క్రమించింది.

ఈ సన్నివేశంలో అమ్మ ఆరేళ్ల బాలికలా కాకుండా అనుభవం పండిన అరవై ఏళ్ల ముత్తయిదువులా కన్పిస్తుంది. వయస్సు చిన్నదయినా పెద్ద మనస్సుతో అమ్మ చేసిన సంస్కరణకు ఇది ఒక ఉదాహరణ మాత్రమే. ఇలాంటి ఉదాహరణలు అమ్మజీవిత సన్నివేశాలలో కోకొల్లలుగా కన్పిస్తాయి. అమ్మకు పదమూడేండ్ల వయస్సున్నప్పుడు తెనాలిలో రైల్వేస్టేషన్‌కు వెళుతుంది. అక్కడ స్టేషన్ మాష్టరు అమ్మను చూసి "ఎప్పుడో ఒకప్పుడు పరిచయం అయిన ముఖంగా ఉన్నది నీవెవరో చెప్పమ్మా" అని అడిగాడు. "నీకు ఎప్పుడో చూసినట్లు అనుమానం. నాకు ఆ అనుమానం లేదు. ఎపుడూ చూస్తున్నట్లే ఉన్నది" అని "మీకు ఏడు సంవత్సరాలకే ఇంత మరుపు వచ్చిందా" అన్నది అమ్మ. "ఏడేళ్ల క్రితం చూశావా? ఎక్కడ ఏ ఊళ్లో" అని స్టేషన్ మాష్టరు అడిగాడు. "ఏలూరులో మీ దొడ్లో తులసిదళాలు కోస్తుండగా, జడ చూడు ఎట్లా ఉందో త్రాచుపామల్లే అని అన్నావు గదా" అన్నది అమ్మ. అప్పటికీ ఆయనకు గుర్తురాక "ఎవరింటి దగ్గర ? ఎప్పుడు ?" అని వివరాలడిగారు. అమ్మ ఆయన గురించి, వివరాలన్నీ చెప్పటం ఆరంభించింది.

"ఏలూరులో ఎల్లంరాజు హరినారాయణగారి ఇంటి దగ్గర మీ ఇల్లు ఉండేది. మీ నాన్న ఓవర్సీలు, మీ నాన్న చౌడేశ్వరీ పూజ చేస్తుండేవారు. నీవు నన్ను కొట్టగానే మీ నాన్నగారు వచ్చి నిన్ను వెనక్కు లాగి నన్ను తీసుకెళ్లి ఇంట్లో

కూర్చోబెట్టుకున్నారు. మీ అమ్మగారు ఆ సమయంలో నివేదనకు రవ్వకేసరి చేస్తున్నది. ఆ రోజు మంగళవారం. మీ అమ్మగారి పేరు శ్రీలక్ష్మి. ఆ కేసరికాగానే ముందు అమ్మాయికి పెట్టవే" అన్నారు మీ నాన్నగారు. 'నివేదన కాకుండా ఎట్లా' అన్న మీ అమ్మగారితో చౌడేశ్వరి 'మంగళవారం పూట ప్రొద్దునే ఈ రూపంగా వచ్చింది. ఆ ముఖం చూడు సాక్షాత్తూ అమ్మవారల్లే ఉంది' అన్నారు మీ నాన్నగారు అని అమ్మ వివరిస్తుంటే ఇదంతా నిజమేనన్నట్లుగా జ్ఞాపకం తెచ్చుకుంటున్న వాడివలె తల ఊపుతూ వింటూ ఉంటాడు. అమ్మ పట్ల అతడు ప్రవర్తించిన తీరును అమ్మ వివరిస్తుంటే "క్షమించు తల్లీ క్షమించు" అని అమ్మ పాదాలపై పడతాడు. 'క్షమించే దేముంది, నీవు గుర్తుచేయమని అడిగితే గుర్తుచేశాను' అన్నది అమ్మ. అతడు పెద్దగా ఏడుస్తూ "ఈ దుర్మార్గుడికి ఏదైనా శిక్ష వేయమ్మా!" అన్నాడు. 'దుర్మార్గుడు తన దుర్మార్గాన్ని గుర్తించి సన్మార్గంలోకి మారి నాకు శిక్షవేయమని అడగడమే వాడికి శిక్ష' అన్నది అమ్మ. ఈ సన్నివేశంలో దారి తప్పిన 'తనబిడ్డ'ను ఆత్మ విమర్శ చేసుకునే స్థితికి తీసుకు వచ్చిన అమ్మలోని అరుదైన ప్రేమతత్త్వం కనిపిస్తుంది.

అమ్మ బాల్యంలో ఒకసారి బంధువులతో కలిసి బ్రాహ్మణ కోడూరులో ఉన్న శ్రీవాసుదాసస్వామి వారి దగ్గరకు వెళ్లి తిరిగి వచ్చేటప్పుడు దొప్పలపూడికి చెందిన బ్రహ్మయ్యగారి బండి ఎక్కి రావడం తటస్థించింది. వారి జీతగాడు మంత్రాయి. బ్రహ్మయ్యగారు అమ్మను మన్నవలో అమ్మ ఇంటి దగ్గర దించి రమ్మని అతడిని పంపారు. మార్గమధ్యంలో మాటల సందర్భంలో అమ్మ అతడి వివరాలన్నీ అడిగింది. తన బంధువులు తీసుకు వచ్చి తనను పనిలో ఉంచారనీ, జీతం పదిహేను రూపాయలు ఇస్తారని చెప్పాడు. ఆ డబ్బుతో ఈ సంవత్సరం తన చెల్లెలికి పెళ్ళిచేస్తానని చెప్పాడు. ఆ కొద్దిసేపటిలోనే అమ్మకు అతడి పట్ల తెలియని ఆత్మీయత ఏర్పడింది. ఆ తరువాత అమ్మను వారి ఇంటి దగ్గర దింపి వెళ్ళేటప్పుడు అమ్మ ఆ జీతగాడితో 'నాకు నిన్ను వదలి పెట్టి వెళ్లాలంటే పురిట్లో బిడ్డను వదిలిపెట్టినట్లుంది నాన్నా' అంటూ అతని చెల్లెలు పెళ్లికని తన చేతిని ఉన్న ఉంగరం తీసి ఇచ్చింది. అవ్యాజమైన అమ్మ ప్రేమను గూర్చి ఆలోచిస్తూ అతడు 'అమ్మా! నా మీద నీకెందుకింత ప్రేమ' అని అడిగితే 'నాకు ప్రేమ

ఉండటం సహజమే నాన్నా! నా ప్రేమను నీవు గుర్తించడం విశేషం! అని అప్పుడపుడు వస్తావు గదూ' అని అడిగింది అమ్మ.

ఆ తరువాత ఎన్నోసార్లు తనకు ఇంట్లో పెట్టిన అన్నం తీసుకువెళ్ళి అతడికి స్వయంగా తినిపిస్తూ ఉండేది. అంతేకాక అతనికి ఇష్టం అయినవి తెలుసుకుని మరీ పెట్టాలని తహతహలాడేది. "ఎందుకమ్మా ఈ మాలవాడి మీద ఆదరణ?" అంటే 'నాన్నా నీవు మాలవాడివి కాదు. మావాడివి' అని చెప్పింది. మరొకసారి ఆ మంత్రాయి అమ్మను కలుసుకున్నప్పుడు తనకు ఎందుకో అమ్మ పాదాల దగ్గరే పడి ఉందామనిపిస్తోందనీ, కాని తాను చెడ్డవాడిననీ, అన్నీ తప్పుడలవాట్లేననీ, తాను చేసే పాడు పనులన్నింటికీ ఏదైనా శిక్షవేసి మాన్పించమని అమ్మను కోరాడు.

మంచి అలవాట్లు ఏమీ లేవా? అని అడిగింది అమ్మ. అతడు ఆలోచించి "ఒక్కటుందమ్మా! ఎవరు తినలేదన్నా సహించలేను. నేను మానుకుని అయినా వాళ్లకు పెడతా"నన్నాడు. "అంతేనా?" అని అమ్మ ప్రశ్నించింది. కొంచెం సేపు ఆలోచించి "అబద్ధమాడనమ్మా!" అన్నాడు. 'ఇవి కూడా నీ దృష్టిలో చెడు అలవాట్లేనా' అని నవ్వుతూ అడిగి మళ్ళీ అమ్మే ఈ విధంగా అన్నది. "మనుష్యులందరు మంచివాళ్లే నాన్నా, చెడ్డవాడు ఎవరయినా ఉంటే మనం అనుకునే ఈ చెడ్డతనాన్ని మనకు ఇచ్చిన భగవంతుడు మాత్రమే. అయినా ఎవరి పనులకు ఎవరు మాత్రం బాధ్యులు. అందరూ ఇంకెవరో ఒకరు నడిపితే నడిచేవాళ్లు గదా!" అని అతడిని ఓదార్చింది. ఆ తరువాత అతడు 1942లో జిల్లెళ్ళమూడిలో అమ్మ ఇంట పాలేరుగా చేరాడు. అమ్మ దగ్గరకు వచ్చాక అతని జీవన విధానమే మారిపోతుంది. అంతకు పూర్వం అతణ్ణి తెలిసిన వారు ఆ మార్పును చూసి ఆశ్చర్యపోయేవారు. ఆ తరువాత చాలా కాలం అమ్మ సేవ చేసుకుని 1950లో స్వర్గస్థుడైనాడు.

సామాజిక పరంగా చూసినా సంస్కారపరంగా చూసినా కొందరి దృష్టిలో అంటరానివాడిగా భావించబడే అతడు అమ్మ ఆదరణతో సంస్కారవంతుడై పలువురి ప్రశంసలందుకున్నాడు. నేరస్థులుగా పరిగణింపబడే వారి విషయంలో అమ్మ పరివర్తననే కోరుకున్నది గాని, వారిని శిక్షించాలని ఎన్నడూ అనుకోలేదు. దోషాన్ని సంస్కరించడమే కాని దోషులను సంహరించడం అమ్మ విధానం కాదు.

XI) ద్వంద్వాతీత స్థితి

ద్వంద్వాతీతస్థితికి నిలువెత్తు నిదర్శనం అమ్మ జీవితం. మానావమానాలు, సుఖదుఃఖాలు, శీతోష్ణాలు, దూషణ భూషణాలు మొదలగు సర్వ ద్వంద్వాలకు అతీతంగా ఉండాలన్న భారతీయ తాత్త్విక సిద్ధాంతానికి ఆచరణ రూపమే అమ్మజీవితం. అమ్మ చిన్నతనం నుంచీ తన పట్ల ఇష్టాన్ని ప్రకటించినా, విముఖతను ప్రకటించినా, భూషించినా, దూషించినా, ప్రేమించినా, ద్వేషించినా ఒకటిగానే స్వీకరించింది. అమ్మ జీవితంలో దారిద్ర్యం, హింస అన్నింటినీ నిండుగా అనుభవించింది. ఎపుడూ నిశ్చలతను కోల్పోలేదు. అమ్మ జీవితంలో సహనాన్ని పరీక్షించే ఘట్టాలు ఎన్నో ఎదురయినాయి. కాని అమ్మ తాను అనుభవిస్తున్న దానికి ఇతరులు కారణం అని కానీ, కర్తలు అని కానీ అనుకోలేదు. ఆ పరిస్థితుల నుంచి పారిపోలేదు. ఈ లక్షణం అమ్మ చరిత్ర అంతటా పరచుకొని ఉంది. అమ్మ తనను పూలతో పూజించినా, పిడకలతో పూజించినా, పూజపేరుతో హింసించినా అందరినీ సమంగానే ఆదరించింది. కొంతమంది అమ్మను పరీక్షించటం కోసం దురదగుంట ఆకుతో పూజచేసేవారు.

ఒకసారి అమ్మకు క్షీరాభిషేకం జరుగుతోంది. ఆ కార్యక్రమంలో తానూ పాలు పంచుకోవాలన్న ఆరాటంతో ఒక భక్తురాలు అభిషేకం అయిపోతుందేమోనన్న ఆదుర్దాతో పొయ్యిమీద కుండలో మరుగుతున్న పాలు ఒక పాత్రలో తీసికొని అమ్మ దగ్గరకు వచ్చి అమ్మను చూసిన ఆనందంలో ఆ వేడిపాలు అమ్మ తలపై కుమ్మరించింది. అమ్మ శరీరం చాలా మృదువుగా ఉంటుంది కనుక అమ్మ కేమవుతుందోనని అక్కడున్న వారందరూ చాలా భయపడ్డారు. కాని అమ్మ ఒకసారి తలపైకెత్తి భయపడుతూ ఉన్న ఆమె వంక చూసింది. ఆ చూపులో ఆగ్రహం లేదు, అనుగ్రహమే. తరువాత కొందరు 'ఎలా ఉన్నదమ్మా నీకు?' అని అడిగితే 'నాకేం లేదు బాగానే ఉన్నాను. త్వరగా అభిషేకానికి రావాలన్న ఆరాటమే తప్ప ఆలోచన లేదు', పాపం ముగ్ధభక్తి' అని ఆమెను సమర్థించింది. కొన్ని పరిస్థితులలో నిప్పుల బాటలో నడచిన అమ్మకు ఇలాంటి శారీరక బాధలు ఏపాటి ?

లోకంలో ఎంతటి బలవంతుడయినా, విద్యావంతుడయినా, శ్రీమంతుడయినా కొన్ని అవాంతర పరిస్థితులలో ప్రతికూలతలు సంభవించినపుడు

బలహీనుడై కృంగి కృశించిపోవడమూ, సంతోషకరమైన విషయాలలో పొంగిపోవడం సహజం. ద్వంద్వాలలో చిక్కుకున్న మనిషి దాని కనుగుణంగానే స్పందిస్తాడు. కష్టం లేకుండా సుఖం లభించడం కల్ల. కనుక మానవ జీవితమంటే సుఖదుఃఖసమ్మేళనమే. అంటే సుఖదుఃఖాలకు మూలకారణం రాగద్వేషాలే. నాణేనికి బొమ్మా, బొరుసూ ఎలాంటివో జీవితానికి సుఖదుఃఖాలు అలాంటివి. సుఖాన్ని కల్గించే వాటి పట్ల రాగమూ, దుఃఖాన్ని కల్గించే వాటి పట్ల ద్వేషమూ సహజం. గాలి వీచకుండా ఎలా ఉండదో, సూర్యుడు ఉదయించకుండా ఎలా ఉండడో అలాగే మానవుడు రాగద్వేషాలకు లోబడకుండా ఉండడు.

మానవరూపంలో ఉండి ఒక గృహిణిగా, కొంతమంది పిల్లలకు కన్నతల్లిగా పరిమితంగా కన్పించే అమ్మకు సుఖదుఃఖాతీత స్థితి ఎట్లా సాధ్యమయింది? సాధారణంగా ఎవరికైనా స్థితప్రజ్ఞ అనే పదం వినగానే గగన కుసుమంలా ఆదర్శం కోసం సాహిత్యంలో ప్రయోగింపబడే అందమైన పదబంధమా? లేక ఆచరణ యోగ్యమై వాస్తవ జగత్తులో స్థిత ప్రజ్ఞులైన వారు ఎవరైనా ఉన్నారా అనే ఆలోచన వస్తుంది. అమ్మ స్థితినీ, అమ్మ చేస్తున్న ప్రవచనాలను అవగాహన చేసుకుంటే,

'దుఃఖే ష్వనుద్విగ్న మనాః సుఖేషు విగతస్పృహః
వీతరాగ భయక్రోధః స్థితధీ ర్ముని రుచ్యతే'
'యస్సర్వత్రానభి స్నేహః తత్తత్ ప్రాప్య శుభాశుభం
నాభినందతి నద్వేష్టి తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా.'

అని భగవద్గీతలో చెప్పబడిన స్థితప్రజ్ఞ లక్షణాలు అమ్మ పట్ల సర్వధా సార్థకమవుతాయి. నిజానికి భూత భవిష్యత్తులు, వెలుగు నీడలూ, సుఖదుఃఖాలు చివరికి జననమరణాలు, సర్వద్వంద్వాలూ దైవస్వరూపమే అనుకొని నిరంతర విశ్వతాదాత్మ్య జాగృతిలో ఉన్న సర్వజ్ఞ అయిన అమ్మలో ఈ వ్యత్యాసాల ప్రభావం ఉండదు. ఈ తాదాత్మ్యస్థితి భక్తి వల్ల రావచ్చు, యోగం వల్ల రావచ్చు, జ్ఞానం వల్ల రావచ్చు, ఏ సాధన లేకనూ రావచ్చు. కాని అమ్మ జీవితంలో ఏ సాధన చేసినట్లుగానూ కన్పించదు. సమస్త సాధనల వలన కలిగే ప్రయోజనం అమ్మకు ఆజన్మసిద్ధమే.

అమ్మ నిఘంటువులో ద్వేషమనే పదానికి తావులేదు. "మీరు కానిది నేనేదీ కాదనీ, మీరంతా నా బిడ్డలే కాదు, నా అవయవాలు కూడ" అని ప్రకటించింది అమ్మ. జగత్తే అమ్మ శరీరమయితే అందులోని సమస్త ప్రాణికోటి అమ్మ అవయవాలే. తన అవయవాలైన సమస్త ప్రాణికోటి యందు భిన్నత్వం అమ్మకు కన్పించదు. ఉదాహరణకు మన శరీరమే తీసుకుందాం. దానిలో ఒక చేతి వేళ్లే సమానంగా ఉండవు. ఆ వ్యత్యాసాన్ని మనం లోపంగా భావించకుండా సృష్టి సహజం అనుకుంటాం. అలాగే భేదం కన్పిస్తేనే గదా అమ్మకు ఒకదాని యందు రాగమూ మరొక దానియందు ద్వేషమూ ఉండేది. మరి ద్వేషమే లేనపుడు దాని కతీతమయిన స్థితి ఏమున్నది ? అంటే అమ్మలో ఉన్న ఈ రాగద్వేషాతీతస్థిత సహజమైనదని మనం భావించవచ్చు.

సాధారణంగా మానవులు సాంసారిక బంధాల్లో బాధ్యతల్లో మునిగిపోయి కన్పిస్తారు. కాని అమ్మ తనదంటూ సంసారం ఉండి తనకంటూ పిల్లలుండి తాను సంసారంలో ఉన్నట్లు కన్పిస్తూ దానికతీతంగా ఉండగల్గింది. ఇది ఎట్లా సాధ్యం? ప్రవాహంలో దిగిన గజ ఈతగాడయినా దాని తడి అంటకుండా బయటకు రాలేడు కదా! అందుకే అమ్మ అంటుంది. 'తాను సంసారంలో ఉండవచ్చు కాని తనలో సంసారం ఉండకూడదు' అని. పడవనీటిలో ఉండవచ్చు కాని పడవలో నీరు చేరితేనే ప్రమాదం. మరి సంసారంలో ఉంటూ దానికతీతంగా ఉండటం సాధ్యమా? సాధ్యమేనని ఆచరణలో నిరూపించింది అమ్మ.

'వికారహేతౌ సతి విక్రియన్తే ఏషాం న చేతాంసి త ఏవ ధీరాః'

"మనస్సు చెదిరిపోవడానికి తగిన సన్నివేశాలు తన జీవితంలో తటస్థించినా, చెదిరిపోకుండా నిజస్థితిలో నిబ్బరంగా నిలిచి ఉంటారు ధీరులు" అన్నాడు మహాకవి కాళిదాసు.

అనుభవించేదంతా సుఖమేననీ, బాధల్లేని బ్రతుకు వ్యర్థమనీ ప్రవచించే అమ్మకు బాధలపై ద్వేషమూ సుఖాలపై రాగమూ ఉండవు. ఈ అతీత స్థితి అమ్మకు సహజమే అనటానికి 1981 ఫిబ్రవరి 16న జరిగిన (నాన్నగారు) శ్రీ బ్రహ్మాండం నాగేశ్వరరావుగారి నిర్యాణ సన్నివేశమే ప్రత్యక్ష తార్కాణం. కొందరు పతివ్రతలు సూర్యగమనాన్ని ఆపేశారని పురాణాల్లోనూ, సహగమనం చేశారని చరిత్రలోనూ వింటూ ఉంటాం. కాని ఆ సన్నివేశంలో అమ్మ నిర్వర్తించిన కార్యక్రమం

అత్యంత కఠినమైనదీ, అనన్యసాధ్యమైనదీ. నాన్నగారి భౌతిక కాయానికి అనంతర కార్యక్రమాన్నంతా తానే స్వయంగా నిర్వర్తించింది.

నిలువునా చలించిపోదగిన ఈ సంఘటనలో నిండుగా నిశ్చలస్థితిని చూపగల్గిన అమ్మ ద్వంద్వాతీత అనడానికి ఇంతకన్నా నిదర్శనం ఏం కావాలి? ఈ సమయంలో భవభూతి మహాకవి మహాత్ముల మన స్థితిని గూర్చి చెప్పిన

'వజ్రాదపి కఠోరాణి మృదూని కుసుమాదపి
లోకోత్తరాణాం హి చేతాంసి కోహి విజ్ఞాతు మర్హతి ?

అన్న మాటలు మన మదిలో మెదులుతాయి. సామాన్యంగా అతి మృదువుగా ఉండే అమ్మ మనసు సందర్భానుసారంగా వజ్రం కంటే కఠినంగా పరిణమించడం అమ్మ జీవితంలో అనేక సందర్భాలలో గోచరమవుతుంది.

కట్టుకున్న భర్త కళ్లముందే కడతేరినా, కన్నబిడ్డ కాలసర్పంకాటుకు బలి అయిపోయినా కదలక నిలబడగల్గిన స్థిత ప్రజ్ఞ అమ్మ.

నాన్నగారి నిర్యాణ సన్నివేశంలోనూ హైమక్కయ్య విషయంలోనూ అమ్మకు వయః పరిణతిద్వారానో లేక సాధన వల్లనో, అతీత స్థితి వచ్చిందేమో అని మనం అనుకోవచ్చు. కానీ తన తల్లి రంగమ్మగారు మరణించినప్పుడు నాలుగేండ్ల వయస్సులోనే అంత నిశ్చలంగానూ అమ్మ ఉండగల్గింది. తల్లి వియోగం తెలియక మరణమంటే ఏమిటో తెలియని వయస్సులో అలా ఉన్నదేమోనని అనుకుందామంటే అప్పటికే తన వయస్సుకు మించిన మానసిక పరిణతితో చిదంబరరావుతాతగారికీ ఇంకా మరెందరికో కర్తవ్యాన్ని ప్రబోధించిన అమ్మకు మరణమంటే తెలియదని ఎలా అనుకోగలం ? మరి ఆ నిర్వికార స్థితి ఎక్కడిది? అంటే అమ్మకు పుట్టుకతోనే వచ్చినదని అమ్మ జీవితంలోని ప్రతి సంఘటన మనకు వివరిస్తుంది.

ప్రతి స్త్రీ జీవితంలో అన్ని అనుబంధాల్లోకి కన్నతల్లి, కట్టుకున్న భర్త, కన్నబిడ్డల అనుబంధం గాఢమైంది. ఒకదానికంటె ఒకటి బలవత్తరమయింది. భిన్న వయస్సులలో భిన్న పరిస్థితులలో ఈ మూడు సన్నివేశాలలో అమ్మ ప్రవర్తించిన తీరు అమ్మను ద్వంద్వాతీతగా దర్శింప చేస్తుంది.

ద్వంద్వాలలో చిక్కుకున్న మనకు శుభాశుభాలు వేరు వేరుగా ఉంటాయి. ఎవరైనా మరణించినపుడు ఆ అశుభం మనకు అంటుతుందేమోనని అత్యవసర పరిస్థితుల్లో అగ్గిపెట్టె ఇవ్వడానికి కూడా ఇష్టపడం. కాని, విశ్వతాదాత్మ్యం పొందిన మహనీయులను ఈ విధి నిషేధాలు బంధించవు. అందుకనే అమ్మ ఒకవంక మరణించినవారికి అంత్య సంస్కారాలను నిర్వహిస్తూనే మరొకవంక మరొకరిని మంగళగీతాలతో కళ్యాణవేదిక మీదికి పంపేది. రెండు పనులనూ ఒకే నిర్లిప్త నిర్మల హృదయంతో అవలీలగా చేసేది. ఏదీ అమ్మకు విశేషంగా తోచదు. అందుకే "నాది సర్వసామాన్యమైన స్థితి" అని చెప్పింది అమ్మ. అంటే సర్వమూ సామాన్యమయిన స్థితి.

సామాన్యుల దృష్టికి సుందరమైనది, హేయమైనది అని ద్వంద్వ దృష్టి ఉంటుంది. ఉన్నదంతా అదే అనీ, తన ఆత్మయే ఈ విశ్వమంతా అని దర్శించిన వారికి జుగుప్స లేదు. గుడిలో అభిషేకం చేసేవాడు, పాకీదొడ్డి కడిగేవాడూ వారికి సమానమే. జుగుప్సకు మూలం తనది కాదన్న ఆలోచన. 'మీరంతా నేనే ఇదంతా నేనే' అనే అభేద దృష్టి అమ్మది. పందిపిల్లను కూడా పసిపిల్లగా భావించి లాలించింది.

'విద్యా వినయ సంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని
శుని చైవ శ్వపాకే చ పండితాః సమదర్శినః" అని భగవద్గీతలో చెప్పినట్లుగా అమ్మలోని సమదర్శిత్వం అమ్మ జీవితంలో అడగడుగునా ద్యోతకమవుతూనే ఉంటుంది.

సుఖాన్నీ, దుఃఖాన్నీ అనుభవించడంలో జ్ఞాని, అజ్ఞాని సమానమే. సామాన్యుల కయితే ఆ సన్నివేశాల ప్రభావం మనసు మీద చెరగని ముద్ర వేస్తుంది. అదే జ్ఞానులయితే ఆ సంఘటనల ప్రభావం మనస్సు మీద పడక అతీతంగా ఉంటారు. సమస్తమైన ఆధ్యాత్మిక సాధనల పరమ ప్రయోజనం ఏమిటి? సుఖ దుఃఖాల పట్ల సమదృష్టి కల్గి - ద్వంద్వాతీతంగా ఉండగల్గడం. భిన్న దృష్టి లేకపోవడం. అన్నీ ఒకటిగానే కనపడటం. ఇదే ఆత్మ సాక్షాత్కారమనవచ్చు. సర్వమానవకోటికి ఇదే అసలైన గమ్యం. ఈ లక్ష్యాన్ని అమ్మ మాటలలో గాక చేతలతో విస్పష్టంగా ప్రకటించింది.

సాహిత్య సౌందర్య దర్శనం

(అమ్మ వాక్యాలు - విజ్ఞాన వీచికలు)

పరిచయం :


స్వీయ అనుభవ సాగరంలో ఆలోచనా మథనంతో ఆవిర్భవించిన అమృత బిందువులే అమ్మ వాక్యాలు. అపూర్వమైన నిర్వచనాలతో, అద్భుతమైన ప్రవచనాలతో భాషకే ఒక సౌందర్యాన్నీ, పరిపుష్టినీ ప్రసాదించాయి అమ్మ వాక్కులు. సాహిత్యమే తానైన అమ్మ మాటల్లో భాష భావాలకనుగుణంగా ఒదిగిపోవడం కన్పిస్తుంది. అమ్మ ఏ విషయం వివరిస్తున్నా ఆ విషయం గంభీరంగా, సార్థకంగా ఉండడమే కాక ఆ వాక్కులలోని సౌందర్యం పరిమళంలా శ్రోతల మనస్సులను ఆక్రమించుకుంటుంది.

శబ్దసౌందర్యంతో ఆకర్షించడం, జీవిత సత్యాలను అందంగా ఆవిష్కరించడం, ఆ ఆవిష్కరణ స్ఫూర్తిప్రదం కావడం సాహిత్యానికి పరమార్థం - అలాంటి పరమార్థం 'అమ్మ' వాక్యాలలో ప్రత్యక్షరం లోనూ ప్రత్యక్షం అవుతుంది.

మాట్లాడటం మానవ సాధారణమైనా కొందరి మాటలు ఎపుడూ వింటూ ఉండాలనిపిస్తుంది. ఎన్నిమార్లు విన్నా మళ్లీ మళ్లీ వినాలనిపిస్తూ అంతులేని ఆనందానుభూతిని కల్గిస్తూ ఉంటాయి. ఈ వాక్చమత్కృతే వారిని విశిష్టవ్యక్తులుగా గుర్తింపచేస్తుంది. మరి కొంతమందితో జరిగిన సంభాషణలు అనుభవంతో నిండి ఉండి మనలను ఆలోచింపజేసేవిగా ఉంటాయి. కొంతమంది మాటలు మన మనస్సులపై చెరగని ముద్రవేస్తాయి.

ఏ వ్యక్తి అయినా ఏ వస్తువయినా ఏ విషయమయినా మళ్లీ మళ్లీ కావాలన్పించే ఔత్సుక్యాన్ని కల్గిస్తే అది సౌందర్యమే.


సౌందర్య పరమ ప్రయోజనం ఆనందమే. ఆ ప్రయోజనాన్ని అక్షరాక్షరంలో సాధించేవే అమ్మ వాక్యాలు. అనిర్వచనీయమైన సౌందర్యానుభూతికి అక్షరరూపాలే



అమ్మ సన్నిధిలో అధ్యాపకులు



అన్నపూర్ణాలయం



విద్యార్థినిగా రచయిత్రి



కళాశాల అధ్యాపకులు

అమ్మవాక్యాలు. మూర్తీభవించిన సౌందర్యమే అమ్మ - అమ్మవాక్కు. కనుకనే మాతృశ్రీ సాహిత్యంలో ప్రత్యంశమూ సౌందర్యభరితంగా గోచరిస్తుంది. అమ్మ వాక్కులలోని సౌందర్యం బహుముఖాలుగా ఉంటుంది. ఏం చెప్పినా అమ్మ తన అనుభవమే ప్రమాణంగా చెప్పింది. కనుక అనుభవంలో నుంచి ఉద్భవించిన అమ్మ వాక్యాలు సూటిగా హృదయాన్ని తాకుతూ కర్ణామృతాలై మనసుకు రసాయనాలై అనిర్వచనీయమైన హాయినీ, ధైర్యాన్నీ కల్గిస్తాయి.

'అందరికీ సరిపోయేది సూక్తి' అని అమ్మ నిర్వచనం. ఏది ఏమైనా జీవిత సత్యాలను నిర్వచిస్తూ, అల్పాక్షరాలలో అనల్పార్థాన్ని అందిస్తూ త్రికాలాబాధ్యమయిన సత్యాన్ని ప్రబోధిస్తున్న అమ్మ సూక్తులు అజ్ఞానాంధకారంలో చిక్కుకున్న ఎందరి జీవితాలలోనో అక్షర దీపాలయి వెలుగులు నింపాయి.

విన్నంత మాత్రాననే మనస్సుకు తృప్తినీ, ధైర్యాన్నీ కలిగించేది సార్వకాలికమూ సార్వజనీనమూ అయినదీ. సత్యజ్ఞానాలను సూటిగా అందించి ఆనందం కలిగించేది సూక్తి.

రమణీయార్థ ప్రతిపాదకమై వెలువడిన అమ్మవాక్యాలు నిత్య నూతనాలు, ఆపాతమధురాలు, ఆలోచనామృతాలు, సార్వకాలికాలు, విశ్వజనీనాలు. అమ్మ వాక్యాలు వింటున్నప్పుడు సత్కావ్య రసాస్వాదనం చేసిన దివ్యానుభూతి మనకు కలుగుతుంది.

అమ్మ ప్రతిమాటలోనూ అద్వితీయమైన వ్యంగ్యవైభవమో, అనంతమైన తత్త్వజ్ఞానమో ఇమిడి ఉంటుంది. పదలాలిత్య శోభితాలూ, గంభీరార్థ భాసురాలూ అయిన అమ్మ మాటలు వినగానే శబ్ద చమత్కారం ఆహ్లాదం కల్గించినా, భావ గర్భితమైన ఆ మాటలు అర్థగాంభీర్యంతో శ్రోతలనూ, పఠితలనూ ఆకట్టుకుంటాయి.

సంభాషణల్లోనూ, సంవాదాల్లోనూ అనేక అపూర్వ సత్యాలను ఉద్ఘాటించింది అమ్మ. ఎన్నో క్రొత్త నిర్వచనాలను, ప్రవచనాలను లోకానికి ప్రసాదించింది.

ఒక్కొక్క విషయాన్ని సోదాహరణంగా పరిశీలిద్దాం.

i) అపూర్వ నిర్వచనాలు

భార్య - భర్త :

తన వివాహ సందర్భంగా లోకానికి అనేక అపూర్వ నిర్వచనాలను ప్రసాదించింది అమ్మ. అమ్మకు గార్హస్థ్యమంటే అమిత ప్రేమ. ఆధ్యాత్మిక సాధన విషయంలో 'గృహస్థుగా ఉండి సాధన చేయడం కోటలో ఉండి యుద్ధం చేయడమ'ని వివరించింది.

లోకంలో భార్యాభర్తలను గూర్చి 'భరించేవాడు భర్త, భరింపబడేది భార్య' అనడం సర్వసామాన్యం. కాని ఇలా ఆలోచిస్తే భరిస్తున్నాననుకునే వాడికి ఎపుడైనా తాను బరువు మోస్తున్నట్లేననిపిస్తుంది. భరింపబడుతున్నానని భార్య అనుకున్నప్పుడు తాను బానిసననే భావం కల్గుతుంది. బాధ్యతలేని భర్తలు, భర్తభావాన్ని తెలుసుకోలేని భార్యలవలన భార్యాభర్తల మధ్య గొడవలు బయలుదేరి కుటుంబ విచ్ఛిత్తి ఏర్పడుతోంది. అందుకే అమ్మ

'భావం తెలుసుకుని ప్రవర్తించేది భార్య
బాధ్యత తెలుసుకుని ప్రవర్తించేవాడు భర్త' అని నిర్వచించింది.

సామాజికంగా గాని, వ్యక్తిగతంగా గాని సమాజంలో వివాహం అతి కీలమైంది. వివాహం కేవలం ఆ స్త్రీ పురుషుల జీవితాలకే పరిమితమై ఉండదు. తరతరాల సంప్రదాయాన్ని, వంశగౌరవాన్ని నిలబెట్టేదిగా ఉండాలి. ఈ వివాహం ద్వారా ఏర్పడిన అనుబంధం జీవితాంతం అవిచ్ఛిన్నంగా సాగిననాడే ఆ కుటుంబం సఫలమవుతుంది.

'కళంకరహితమైన మనస్సును కళంకరహితంగా అర్పించటమే కళ్యాణం', 'ఒక పెన్నిధి అందన చేరడమే పెండ్లి' అని, 'ఆ అందను చేరే పరిణామమే పరిణయమ'ని అమ్మ వివాహానికి ఇచ్చిన నిర్వచనాలు.

పురుషుడికైనా, స్త్రీకైనా నిబద్ధత కావాలి. భావనలోనూ, బాహ్యంలోనూ తన భర్తను వీడని భార్య, భార్యను వీడని భర్త, వీరి ఐక్యత ఉత్తమ సమాజానికి పునాది అవుతుంది. స్త్రీకి ఎన్ని నారీ ధర్మాలు చెప్పారో పురుషునికీ అన్ని పురుష

ధర్మాలు చెప్పారు. కానీ రకరకాల జీవిత సమస్యలకు ఇంకా చెప్పాలంటే చిన్న చిన్న కారణాలకు కూడ దంపతులు విడిపోయే పరిస్థితికి నేటి సమాజం చేరుకుంది.

సంసార రథానికి స్త్రీ పురుషులిద్దరూ రెండు చక్రాలు. అవి సక్రమంగానూ సమానంగానూ ఉన్నప్పుడే సురక్షితంగా గమ్యం చేరుకుంటుంది ఆ రథం. భార్యాభర్తల సంబంధాన్ని గూర్చి అమ్మ ఒకసారి సంభాషణా పూర్వకంగా 'తలవంచి తాళి కట్టించుకునేది భార్య, నడుం వంచి తాళి కట్టేవాడు భర్త' అని చెప్పింది. ఇద్దరికీ సమానమైన బాధ్యత ఉంది. కనుక అమ్మ చెప్పినట్లుగా స్త్రీలందరూ భావం తెలుసుకుని, పురుషులందరూ బాధ్యత తెలుసుకుని ప్రవర్తిస్తే అటువంటి వివాహ వ్యవస్థ సర్వాంగీణంగా శోభిల్లుతుంది. వైవాహిక బంధానికి కట్టుబడి ఎవరి కర్తవ్యాన్ని వారు నిర్వర్తిస్తే సమాజ స్వరూపమే మారిపోతుంది.

మానవత్వం - మాధవత్వం :

ఈనాడు సమాజంలో స్వార్థం బహుముఖాలుగా దర్శనమిస్తోంది. ఆ స్వార్థం మితిమీరి ఈనాడు ప్రపంచం నుండి దేశం, దేశం నుండి రాష్ట్రం, రాష్ట్రం నుండి గ్రామం, గ్రామం నుండి కుటుంబం, అన్న దశలన్నీ దాటి 'తాను' అనే పరిధిలో నిల్చిపోయింది. ఈ ప్రపంచంలో మనమంతా ఉన్నా ఇందులో ఎవరి ప్రపంచం వారిదే. గిరిగీసుకుని ఎవరి పరిధిలో వాళ్ళు ఉంటారు. అంతకు మించి ఆలోచించే శక్తిగానీ, అనుభవంలోకి తెచ్చుకునే ఆసక్తిగానీ ఎవరికీ లేదు. ఇది మానవలక్షణం. అందుకనే అమ్మ ఆ పరిధుల నుండి మానవుణ్ణి బయటకు తీసుకు వచ్చే ప్రయత్నంలో 'పరిమితమైన మమకారం మానవత్వమనీ అదే అపరిమితమైతే మాధవత్వమనీ' నిర్వచించి మానవత్వ మాధవత్వాలకు తారతమ్య నిరూపణగావిస్తూ ప్రతి మనిషీ మానవత్వ పరిధి నుండి మాధవత్వానికి చేరుకోవాలనే సందేశాన్ని ధ్వనింప చేసింది. మానవత్వంలో కొట్టవచ్చినట్లు కన్పించేది పరిమితమైన మమకారం, అదే వృద్ధి చెంది అపరిమితమై సర్వత్ర అల్లుకుని పోయి సర్వజీవరాసులపైన సమానంగా ప్రసరిస్తే దైవత్వం అవుతుంది. సామాన్య మానవుడికున్న మమకారం ఒక వస్తువు వరకో ఒక బిడ్డవరకో లేదా సంసారం వరకో పరిమితమై ఉంటుంది. దైవానికుండే మమకారం సర్వత్రా నిండి ఉంటుంది.

పరిమితమైన మమకారానికే మాయ అనీ, అవిద్య అనీ, భ్రాంతి అనీ, బంధమనీ ఏమైనా పేర్లు పెట్టుకోవచ్చు.

అతి బాల్యావస్థలోనే అమ్మ తన తాతగారైన చిదంబరరావుగారికి ఈ విషయాన్ని బోధించింది. చిన్నతనంలో ఒకసారి అస్వస్థతతో నానాటికీ శుష్కిస్తున్న అమ్మను చూసి తాతగారు బాధపడుతూ ఉంటే 'లోకంలో ఎందరో బాధపడుతున్నారు. నామీద మీకు గల ప్రేమ అందరిమీద చూపించగల్గితే - అందరి గురించి ఈ దుఃఖం పొందగల్గితే మీ దుఃఖం తొలగుతుంద'నీ, 'మమకారాన్ని పెంచుకోమ'ని అవధులు లేని ప్రేమను ఉపదేశించింది.

ముముక్షుత్వమే మోక్షం :

మోక్షేచ్ఛతో జపమో, ధ్యానమో, యోగాభ్యాసమో సాధనగా గ్రహించి కొంతకాలం ప్రయత్నిస్తే కాని మోక్షం కలుగదు కదా ! మరి 'ముముక్షుత్వమే మోక్షం' అనే అమ్మ నిర్వచనం ప్రకారం ఇచ్ఛే మోక్షం ఎట్లా అవుతుంది? అని సామాన్యంగా సందేహం కలుగుతుంది.

చతుర్విధ పురుషార్థాలయిన ధర్మార్థ కామ మోక్షాలలో అగ్రేసరమయినది మోక్షం. ప్రతిమనిషికి చివరిగమ్యం మోక్షమే. అసలు మోక్షమంటే ఏమిటి? మోక్షాన్ని గురించి మన సంప్రదాయం ఏం నిర్వచించిందో ఒకసారి పరిశీలిద్దాం.

'దుఃఖాత్యంత నివృత్తిః మోక్షః' అని వేదాంతులు మోక్షలక్షణం చెప్తూ ఉంటారు. ఆధ్యాత్మిక, ఆధిదైవిక, ఆధిభౌతికాలైన దుఃఖాల అత్యంత నివారణమే మోక్షం.

సాధారణంగా మోక్షేచ్ఛ రెండు విధాలుగా ఉంటుందని పెద్దలు చెప్తూ ఉంటారు. లౌకికమైన సాంసారిక బంధాలలో ఉంటూ తన కర్తవ్యాలను నిర్వహిస్తూ చిట్ట చివరి లక్ష్యం మాత్రం మోక్షమందు ఉంచడం సాధారణ మోక్షేచ్ఛ. అలా కాక ఇహపరభోగాల పట్ల ఏవగింపు కలిగి ఈ భవ బంధాల నుండి ఎప్పుడు విముక్తి కలుగుతుందా అనే ఆరాటంతో చావు పుట్టుక లేని శాశ్వతమైన మోక్షం పొందాలన్నది తీవ్ర మోక్ష వాంఛ.

'తపోభిః క్షీణ పాపానాం శాంతానాం వీతరాగిణాం
ముముక్షూణా మపేక్ష్యోఽయ మాత్మబోధో విధీయతే'

అని శంకరాచార్యులు సాధన చతుష్టయ సంపత్తి కలవానికే ఆత్మానాత్మ విచారణ చేసే అధికారం ఉంటుందని బోధించారు. ముముక్షుత్వం సాధన చతుష్టయంలో నాల్గవది. మోక్షం పొందాలనే తీవ్రమైన ఉత్కంఠ కల్గి ఉండటమే ముముక్షుత్వం. కాని అమ్మ ఆ కోరిక కల్గి ఉండడమే మోక్షం అని నిర్వచించింది. నేను ముక్తుణ్ణి కావాలి అని అనుకున్నంత మాత్రాన ముక్తి లభిస్తుందా?

ఈ సందర్భంలో 'ముముక్షుత్వమే మోక్షం' అనే వ్యాసంలో శ్రీ విఠాల రామచంద్రమూర్తిగారు ఇచ్చిన వివరణ చూద్దాం.

"విత్తనమే చెట్టు, బంగారమే ఆభరణం, మట్టేకుండ అంటే ఎలా కుదురుతుంది? మధ్యలో కొంత ప్రయాణం, ప్రయత్నం, ఉపకరణాలు కావాలి కదా! అనేది సామాన్య అభిప్రాయం. పిందెయే పండు అంటే ఎలా సరిపోతుంది. పిందెకు పండుకు స్థితుల్లో పోలిక లేదు. ఎంతో భేదముంది. అలాంటిది నేను ముక్తుణ్ణి కావాలి అనుకున్నంత మాత్రాన ముక్తుడౌతాడా ? అన్పిస్తుంది. కాని అమ్మ చెప్పిన సూక్తి పరమ సత్యం. శాస్త్రాల్లో కూడ 'కార్యం కారణాభిన్నము, కార్యకారణాలకు ఏమీ భేదం లేదని చెప్పబడింది. అవస్థా భేదం తప్ప పిందెకు పండుకు భేదం ఏముంది ? పరిణామ శీలమైన జగత్తులో అన్ని మారేవే. మార్పును బట్టి అవస్థలను బట్టి వ్యవహారం. మోక్షానికి ముముక్షుత్వమే కారణం కనుక అదే మోక్షమని ఈ సూక్తి చెబుతోంది."

మోక్షం కావాలనే ప్రబలమైన ఇచ్ఛ ఉంటే పండుటాకులు రాలినంత సహజంగా బంధవిముక్తి సిద్ధిస్తుంది అని చెప్పుకోవచ్చు. ఇందులో ఉన్న సత్యాసత్యాలు సాధ్యాసాధ్యాలు ప్రక్కన ఉంచితే మోక్షమార్గం దుర్గమం అనుకునే సామాన్యుడికి చేయూతనిచ్చి నడిపిస్తుంది అమ్మ మాట.. అమ్మ వాక్యాలు కొన్ని అందుబాటులో లేని విషయాలను అందుబాటులోకి తేవడం, దుర్గమమైన విషయాలు సుగమం చేయడం లక్ష్యంగా వెలువడ్డాయి.

ప్రయత్నమే విజయానికి తొలిమెట్టు అంటారు. కాని ప్రయత్నమే విజయమని సూచించింది అమ్మ. సర్వాత్మనా మోక్షం కావాలనే ప్రయత్నమే ఫలితాన్ని ఇస్తుంది. ఏ విషయమయినా మనం ముందు అనుకోవడం మొదలు పెడితే అదే జరుగుతుంది.

అందుకే మానవ మనస్తత్వాన్ని పరిశీలించిన మనస్తత్వ శాస్త్రవేత్తలు పాజిటివ్‌గా ఆలోచించమని చెప్తున్నారు.

మృత్యుభయం లేనివాడే మృత్యుంజయుడు :

'జాతస్య హి ధ్రువో మృత్యుః
ధ్రువం జన్మ మృతస్య చ' అని భగవద్గీత. ఇది శాశ్వత సత్యం.

పుట్టిన ప్రతి ప్రాణి మరణించక తప్పదు. మృత్యుంజయుడు అన్న పదానికి మృత్యువును జయించినవాడనే అర్థం చెప్తారు. మృత్యువును జయించడం ఎలా సాధ్యం? మరి పురాణాల్లో మార్కండేయుడు మొదలైన వారు మృత్యుంజయులని చెప్పగా వింటూ ఉంటాం. అది ఎంతవరకు సాధ్యమో ఊహకందని విషయం. వాస్తవానికి వస్తే సామాజికంగా చూసినా, వ్యక్తిపరంగా చూసినా మృత్యువు అవసరమే. జీవితానికి మృత్యువనే సరిహద్దే లేకపోతే జీవితం మందగమనమే అయి స్తంభించిపోతుంది. వృద్ధాప్యంలో శక్తి నశించి శరీరం శిథిలమయిపోయి, అసహాయ స్థితిలో ఎవరూ చూసే దిక్కులేక మృత్యువు కోసం ఎదురు చూసే వాళ్లని ఎంతోమందిని మనం గమనించవచ్చు. కొందరి బాధల్ని చూడలేక వారికి తొందరగా విముక్తి లభిస్తే బాగుండునని కూడ అనుకుంటూ ఉంటాం. ఇలాంటి పరిస్థితుల్ని గమనిస్తే మృత్యువు ఎంత భయంకర మయిందో అంత అవసరమైంది కూడ. జీవితానికి వేగాన్ని అందించేది మృత్యువే. ఆ వేగం లేకపోతే జీవితానికి రుచేలేదు. మృత్యువే లేని సమాజం ఊహకు కూడా అందదు. మృత్యువు నీడలా మన వెన్నంటి ఉంటూనే ఉంటుంది. 'మృత్యువనే గమ్యం చేరడానికి జీవనమనే వాహనాన్ని ఎక్కటం లాంటిదే మానవజీవితం' అని పెద్దలు చెప్తూ ఉంటారు. కాని మరణం తప్పదనుకుంటూనే ప్రతివారూ మృత్యువు నుండి తప్పించుకోవటానికే ప్రయత్నిస్తూ ఉంటారు. మృత్యువు నుండి కాపాడుకోవటానికి ఎన్నో ప్రయత్నాలు చేస్తారు. ఎంతో డబ్బు ఖర్చు పెడతారు. వైద్యులు కూడ ప్రాణం పోయేంతవరకూ ప్రాణాలు నిలబెట్టటానికే తమ శాయశక్తులా కృషి చేస్తారు. లోకంలో చాలామంది మృత్యుభయం వలన మృత్యుంజయ జపాలు చేయడం మనకు కన్పిస్తూనే ఉన్నది. కనుక ఏ విధంగా చూసినా అందరూ మృత్యువు నుండి దూరంగా పారిపోవాలనే కాంక్షిస్తారు. అందుకే అన్నారు డాక్టర్ దాశరథి.

'అనుక్షణం వెంటాడే మృత్యువు
అవనీ చక్రానికి ఆజన్మ శత్రువు' అని.

కాని ఏ మనిషికైనా మృత్యువులేకపోవడమనేది సంభవిస్తే మృత్యుంజయత్వ మనేది వరంలాంటి శాపమని సంభావింపవచ్చు.

లోకంలో ఏ పని చేయాలన్నా మృత్యుభయమే వెన్నాడుతూ ఉంటుంది. ఇంటి నుండి బయటకు వెళ్ళినవాడు ఇంటికి తిరిగి వస్తాడనే నమ్మకంలేదు. ఏదో ఒక రూపంగా మృత్యువు తొంగి చూస్తూనే ఉంటుంది. వైద్యులు కూడ రోగి చనిపోతాడని తెలిసినా నిజం చెప్పడానికి ఇష్టపడరు. నిజం తెలిస్తే ఆ భయంతో రోగి ఆ క్షణమే మరణించవచ్చు. చావు సమీపిస్తున్నదంటే మనిషిలో ఒక భయం ఏర్పడుతుంది. ఆ భయం వలన మనిషి చస్తూ బ్రతుకుతూ ఉంటాడు. అందుకే అమ్మ 'మృత్యువు ఎప్పుడు వచ్చినా నిర్లిప్తంగా నిర్భయంగా స్వాగతం చెప్పగల్గడమే మృత్యుంజయత్వ'మనీ, 'మృత్యుభయం లేని వాడే మృత్యుంజయుడ'ని సరిక్రొత్తగా నిర్వచించింది.

సంకల్పరాహిత్యం :

సాధారణంగా ఏ మనిషికయినా కొన్ని విషయాలు సుఖాన్ని కల్గిస్తాయి. కొన్ని విషయాలు దుఃఖాన్ని కల్గిస్తాయి. ఈ సుఖదుఃఖాలకు మూలం రాగద్వేషాలు. వీటివలన అనుకూల ప్రతికూల భావాలు కల్గుతూ ఉంటాయి. 'సంకల్ప వికల్పాత్మకో మనః' అన్నట్లుగా మనస్సులో అనేక అభిప్రాయాలు చోటు చేసుకుంటూ ఉంటాయి. అలలు లేని సముద్రంలాగా సంకల్పం లేని మనిషి ఉండడు. ఆలోచనల్లో మార్పు తప్ప సంకల్పాలు లేని స్థితి ఎప్పుడూ ఉండదు. 'నహ్యసన్న్యస్త సంకల్పో యోగీ భవతి కశ్చన' సంకల్పత్యాగం చేయనివాడు యోగి కాజాలడని భగవద్గీతా ప్రవచనం. సంకల్పరాహిత్యం కావాలని అందరూ కోరుకుంటారు. కాని సంకల్పరాహిత్య స్థితి రాలేదనే తపనతోనే జీవితమంతా గడుస్తుంది తప్ప ఆ స్థితి అందుబాటులోకి రాదు. ఎన్నో సాధనలు చేసే ఏ మహర్షులకో మాత్రమే సాధ్యం కావచ్చు. కానీ మహర్షుల అనుభవానికి మన అనుభూతికి పొంతన కుదరదు. సంకల్పరాహిత్యం కోసం తపనపడే మానవాళికి తనకు వచ్చే సంకల్పాలకు తాను

కర్తను కాననీ తనకు వచ్చే సంకల్పాలన్నీ దైవ సంకల్పాలనీ తెలుసుకోవడమే సంకల్పరాహిత్యమని అమ్మ నిర్వచించింది.

సంకల్పాలు మనవి కానపుడు జరిగే పనులందు మనం నిమిత్తమాత్రులం. ఏది జరిగినా ఏంచేస్తున్నా అంతా భగవంతుడే చేస్తున్నాడనీ, తనకు కష్టం వచ్చినా, సుఖం వచ్చినా అది భగవదనుగ్రహమే, అని భావించడమే సుఖానికి మార్గం అవుతుంది. నేను చేస్తున్నాను అని ప్రతి పనికీ తాను కర్తనని భావిస్తే, అనుకున్నది జరుగకపోతే దుఃఖాన్ని పొందడం. తనకు సంబంధించినవి తన నుండి దూరమయితే బాధపడడం జరుగుతుంది. కాని దేనికీ నేను కర్తను కాను అనుకున్నప్పుడు సుఖదుఃఖాలకు పొంగిపోవడం, క్రుంగిపోవడం ఉండదు. అదే స్థిత ప్రజ్ఞ లక్షణం. అదే నిశ్చలస్థితి. ఉదా: ఒక సరస్సునే తీసుకుందాం. వెన్నెల రాత్రి, పండు వెన్నెల కాస్తూ ఉంటుంది. ఆకాశంలోని నక్షత్రాలు, చంద్రుడు సరస్సు ఉపరితలంపై ప్రతిబింబిస్తూ కన్పిస్తూ ఉంటాయి. ఇంతలో గాలి తాకిడికో, ఏ రాయి విసిరితేనో ఆ సరస్సు చెదిరి కన్పించే ఆ దృశ్యమంతా ఛిన్నా భిన్నమవుతుంది. కాని ఇది యథార్థం కాదు. యథార్థమైన వస్తువు అలానే ఉన్నది అన్న జ్ఞానం కలగగానే ఆభ్రాంతిపోతున్నది. అలాగే మనకు కలిగే అభిప్రాయాల తాకిడికి మనస్సు అనే సరస్సు చెదరిపోతుంది. కానీ వీటన్నింటికీ కర్తను నేను కాదు ఇవన్నీ దైవసంకల్పాలే అని తెలుసుకున్నప్పుడు నిశ్చలస్థితి కల్గుతుంది. గాలికి రెపరెపలాడుతున్న దీపం మనకు వెలుగును సరిగా అందించలేదు. ఆ దీపం ఎంత పెద్దదయినప్పటికీ కదలిపోతున్నపుడు అది చేయగల్గింది లేదు. అదే గాలిలేని చోట దీపం పెట్టినపుడు అది నిలిచి మనకు వెలుగును అందిస్తుంది. మనస్సు దీపం లాంటింది. సంకల్పాల తాకిడికి చెదిరిపోతుంది. అపుడు ఇవన్నీ దైవసంకల్పాలే అని గుర్తించగల్గినపుడు నిశ్చలస్థితి ఏర్పడుతుంది. ఇది అనుభవంలోకి రావడమే సంకల్పరాహిత్య స్థితి. మరి ఇది సాధ్యమేనా? అందుకే 'వచ్చే సంకల్పాలన్నీ దైవసంకల్పాలుగా భావించడమే సంకల్పరాహిత్యం అనే నిర్వచనాన్ని సాధనగా చెప్తున్నది అమ్మ. తనకు వచ్చే సంకల్పాలకు తాను కర్తనుకాను అన్నది సాధనలో మొదటి దశ. తద్వారా ఎదుటివారి సంకల్పాలకు కూడ వారు కర్తలు కారు అనేది సాధనలో తరువాతి మెట్టు.

ఆ క్రమంలో అందరి సంకల్పాలకు మూలం ఆ భగవంతుడే అనే దర్శనం కల్గడమే చేరుకోవలసిన గమ్యం.

ఆ గమ్యం చేరుకోవడానికి మార్గాన్ని అమ్మ సంకల్పరాహిత్య నిర్వచనం ద్వారా సూచిస్తున్నది. సంకల్పరాహిత్యం అనుభూతికి రాక కలవరపడే సామాన్య మానవుడికి అమ్మ ఇచ్చిన నిర్వచనం హామీ లాంటిది.

సన్యాసం

సమ్యక్ న్యాసం – సన్యాసం. సర్వాన్ని పరిత్యజించి ఏకమైన పరమాత్మయందే మనస్సు లగ్నం చేయడం. ఒక పని చేసినపుడు అది ఫలించినా ఫలించకపోయినా ఒక్కటేననే సమదృష్టి కల్గడమే యోగం. అది ఎపుడు సిద్ధిస్తుంది? చేసే ప్రతిపనికీ నేను కారణం కాదు. ఒకానొక అఖండ చైతన్యమే నా చేత చేయిస్తున్నది అనే జ్ఞానం కల్గి ఉండడం.

ఏది సన్యాసమో అది యోగం కూడ. బాహ్యావేషం మారినంత మాత్రాన సన్యాసి కాజాలడు. సన్యాసమంటే భౌతికమైంది కాదు. మానసికమైంది. మనస్సన్యాసమే నిజమైన సన్యాసం. అందుకే అమ్మ 'సన్యాసం పుచ్చుకునేది కాదనీ దానికై అది రావాల'నీ చెప్పింది.

ఏదైనా ఒక వస్తువుగానీ, ఒక విషయంగానీ కావాలనుకోవడమూ కోరికే, వద్దని నిషేధించుకోవడమూ కోరికే. అందుకే అమ్మ 'మంచం మీద వద్దు చాప మీద పడుకుంటాననడమూ కోరికే. తెల్లగుడ్డ వద్దు కాషాయగుడ్డ కావాలను కోవడమో కోరికే. ఆ కోరికలేని స్థితిని సంపాదించుకోవడానికి చేసే ప్రయత్నమే సన్యాసం' అని వివరించి 'లింగభేదం, రూపభేదం, స్పర్శభేదం లేనివాడే సన్యాసి' అని నిర్వచించింది. ఇది ఎపుడు సాధ్యం? ప్రపంచాన్ని ప్రపంచంగా కాక ఆత్మగా దర్శించాలి. నామరూపరహితంగా జగత్తును దర్శించాలి. అలా చూడగలిగితే అది ప్రపంచం కాదు, శుద్ధమైన ఆత్మ తత్త్వమే అవుతుంది. ఒకే ఆత్మగా సర్వప్రపంచమూ అనుభవానికి వస్తే అమ్మ చెప్పినట్లుగా లింగభేదం, స్పర్శభేదం, రూపభేదం ఏమీ ఉండవు. అదే నిజమైన సన్యాసం. అమ్మ ఏం చెప్పినా ఆచరణలో ఉన్న అనుభవంతోనే చెప్పింది. అమ్మ జీవితంలో ఏం వచ్చినా కష్టమైనా, సుఖమైనా,

దూషించినా, ప్రశంసించినా సమానంగానే స్వీకరించింది. ఇది కావాలనీ లేదు. ఏదీ అక్కరలేదనీ లేదు. ఏది తటస్థపడితే అది అనుభవించింది.

అమ్మ వివాహ పదాన్ని 'సర్వాన్నీ అనుభవిస్తూ సర్వాన్నీ వదిలివేయడమే వివాహమ'ని నిర్వచించింది. ఇంతకంటె సన్యాసానికి నిర్వచనం ఏం కావాలి? మరొక సందర్భంలో అమ్మ 'వైరాగ్యం అంటే వేపాకు తిని ఉండడమే కాదు ఏది దొరికితే అది స్వీకరించటమే' అనీ, 'సర్వభక్షకుడైనవాడే భిక్షుకుడ'ని చెప్పింది. భిన్నధ్రువాలైన వివాహ సన్యాసాశ్రమాలకు ఆచరణాత్మకమైన సమన్వయం అమ్మ జీవితంలో మనం చూడవచ్చు.

జిడ్డు కృష్ణమూర్తి గారు 'సన్యాసం' అంటే ఎలా నిర్వచించారో ఇచ్ఛాపురపు రామచంద్రంగారు ఈ విధంగా తెలియచేశారు.

"సన్యాసమంటే మనలో చాలామంది అనుకునేటట్లు భార్యాబిడ్డల్నీ, ప్రపంచాన్ని దూరం చేసుకుని ఒంటరిగా ఉండటం కాదు. యావత్ ప్రపంచాన్నీ తన గృహమే అని భావించుకుంటూ ప్రతి మనిషినీ తన వారిగానే భావిస్తూ అందర్నీ మనస్ఫూర్తిగా ప్రేమించగలగడం ! వారికోసం తాపత్రయపడడం. ఇదీ సన్యాసం, ఇదీ ప్రేమ. సన్యాసమంటే తన ప్రేమని ఒక వ్యక్తికో కుటుంబానికో పరిమితం చేయడం కాక, ప్రపంచానికే వ్యాపింపజేసుకుంటూ హృదయాన్ని విశాలతరం గావించుకోవడం". ఎంత అద్భుతమయిన నిర్వచనమిది? విశ్వజనీనమైన ప్రేమకంటె, విశుద్ధమయినదీ, విశేషమయినదీ మరేముంటుంది?" అని వివరించారు. విశ్వంలో జడచైతన్యాల భేదం చూడకుండా అందరినీ అన్నింటినీ సమంగా కన్నబిడ్డలవలె ప్రేమించిన విశ్వజనని అయిన అమ్మ జీవితమే ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణగా మనం చెప్పుకోవచ్చు.

భక్తి–జ్ఞానం :

జ్ఞానం : భక్తి పరాకాష్ఠ స్థితికి చేరితే జ్ఞానం అవుతుంది.

'భక్తికి, జ్ఞానానికి గల అనుబంధమేమిటి? అని ఒకరు ప్రశ్నిస్తే, 'భక్తి బాల్యం వంటిది, జ్ఞానం వృద్ధాప్యం వంటిది' అని అమ్మ వాక్యం.

జీవితంలో ప్రారంభదశ బాల్యం. అలాగే ఆధ్యాత్మిక సాధనలోమొదటి మెట్టు భక్తి. పరిణత రూపం జ్ఞానం. మరొక సందర్భంలో

'నాట్యం దర్శించేవాడు భక్తుడు

నాట్యం తానైన వాడు జ్ఞాని'

'భక్తుడికి దైవం తప్ప అన్యం లేదు

జ్ఞానికి 'తాను' తప్ప ఇతరం లేదు' అని నిర్వచించింది అమ్మ. భగవంతుడు వేరుగా తాను వేరుగా ఉండి భగవంతుని అర్చించి రమించేవాడు భక్తుడు. అంతా నిండి ఉన్నది పరమాత్మే అని ఆత్మ కంటె భిన్నంగా ఏదీ లేదు అన్నది జ్ఞాని స్థితి. సగుణమయితే భక్తి, నిర్గుణమయితే జ్ఞానం. కనుక అద్వైత భావమే జ్ఞానమని తోస్తున్నది.

అద్వైతం :

అద్వైతాన్ని గురించి అమ్మ అనేక సందర్భాలలో అనేక రీతులలో వివరించింది. 'నీ చుట్టూ ఉన్నదానిని నీలాగా చూసుకోవడం అద్వైతం' అని, ఒక సందర్భంలో చెప్పింది. మరోసారి మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన ఒక యువకుడు 'అమ్మా! రామకృష్ణ పరమహంస వివేకానందుడికి భగవంతుణ్ణి చూపించారు కదా! మీరు నాకు చూపించరా' అని అడిగాడట. దానికి 'కనపడేదంతా వాడే అయినపుడు దేనినని ప్రత్యేకంగా వేలు పెట్టి చూపించమంటావు నాన్నా!' అనీ 'ఈ జగత్తు సర్వమూ ఈశ్వరుడే' అని సర్వకాల సర్వావస్థలయందు సంభావన చేసే అద్వైతమూర్తి అమ్మ ఇచ్చిన సమాధానం. దైవం సర్వాంతర్యామి. అన్నింటిలోనూ అంతటా ఉండడమే కాదు. ఆ దైవం అమ్మ దృష్టిలో అన్నీ తానై ఉన్నాడు. మరొక సందర్భంలో 'సరైన కమ్యూనిజం అద్వైత'మనీ, 'అంతా అయినదీ, అర్థం కానిదీ అద్వైతం' అనీ నిర్వచించింది అమ్మ. మరి ఎన్ని నిర్వచనాలు చెప్పినా ఇవి సామాన్యుడికి అంతుపట్టేవి కావు. అనుభవంలోకి వచ్చేవీ కావు. ఏ నిర్వచనాలకయినా ఆచరణలో పెట్టగలిగితేనే ప్రయోజనం కదా. అమ్మ ఆచరణశీల కాబట్టి నిర్వచనాలతో ఆగిపోకుండా తన అనుభవంలోనుంచి వారి వారి స్థాయిని బట్టి అతి సామాన్యమైన వాళ్లకు కూడ అర్థం అయ్యేటట్లుగా అద్వైతస్థితిని

స్పష్టపరిచింది. ఒక సామాన్య గృహిణి "సంసారంలో ఉండి అద్వైతస్థితిని పొందడం ఎట్లా ?" అని ప్రశ్నించింది. ఎంత మహాపండితులయినా అద్వైత సిద్ధాంతాన్ని ఏ మాత్రం చదువురాని ఆమెకు అర్థం అయ్యేట్లుగా ఏ మాటలలో చెప్పగలరు ? కానీ అమ్మ "కూతుర్నీ, కోడల్నీ ఒకే విధంగా చూసుకుంటే సరి" అని అద్వైత తత్త్వాన్ని ఆచరణయోగ్యంగా అందించింది.

సాధారణంగా అత్తా, కోడళ్లమధ్య బద్ధ శత్రుత్వం అమ్మాయి మెట్టినింట్లో కాలు పెట్టినపుడే ప్రారంభం కావడం లోకం పోకడ. సమాజంలో ఈ నాడు అత్తా కోడళ్ల మధ్య సమన్వయం కుదరకనో, వరకట్నం వేధింపులో కాని సజీవ దహనాలు, ఆత్మహత్యలు ఎక్కువవుతున్నాయి. సమాజపరిస్థితిని బట్టి అమ్మ తన మాటల ద్వారా, చేతల ద్వారా మార్పు తీసుకురావాలని అద్వైత వివరణ ద్వారా సమాజానికి ఆచరణాత్మకమైన సందేశాన్నందించింది. దీనిని ఏ కొద్దిమందైనా ఆచరించగల్గిననాడు గృహం నుండి గ్రామం, గ్రామం నుండి రాష్ట్రం, రాష్ట్రం నుండి దేశం, దేశం నుండి ప్రపంచం, శాంతినిలయం, ప్రేమ మందిరం అవుతుందనడంలో సందేహం లేదు.

తల్లి తన కూతురిలో తననే చూసుకుంటుంది. తన కూతురు కావడం వల్లనే కదా తల్లికి బిడ్డ మీద ప్రేమ. కోడలు ఇంకొక అమ్మ కన్నబిడ్డ. కోడలులో తనను చూసుకోదు అత్తగారు. కూతుర్నీ కోడల్నీ ఒకేలాగ చూడడం అంటే కూతురులోనూ, కోడలులోనూ తననే చూసుకోవడం. ఇంకొక అమ్మ కన్నబిడ్డలోనూ తన్ను చూసుకోగల్గడమే అద్వైత స్థితికి నాంది.

ఇలాగే, కొన్ని సందర్భాల్లో అమ్మ ఇచ్చిన నిర్వచనాలు విలక్షణంగా ఉంటాయి.

'ఆంతరంగిక కార్యదర్శి' అనే మాటకు అమ్మ ఇచ్చిన నిర్వచనం ఎంత విలక్షణంగా ఉందో చూద్దాం. కార్యదర్శి అంటే సెక్రటరీ. ఆంతరంగిక కార్యదర్శి అంటే పర్సనల్ సెక్రటరీ అనే అర్థంలో ప్రయోగిస్తూ ఉంటాం. కాని 'అంతరంగ కార్యం ఆలోచన. ఆ ఆలోచనను గ్రహించి మెలిగేవాడు' అని నిర్వచించింది అమ్మ.

అమ్మ ఇచ్చిన ఈ సరిక్రొత్త నిర్వచనం ఆ పదానికి వన్నె తెచ్చిపెట్టింది. అంతేకాక, ఆ పదవిని నిర్వహించే వారి కర్తవ్యాన్ని వివరించింది.

"మనః ప్రసాద స్సౌమ్యత్వం మౌనమాత్మ వినిగ్రహః
భావసంశుద్ధి రిత్యేత త్తపో మానస ముచ్యతే' అని గీతాచార్యుని ప్రవచనం. పవిత్రమైన భావనలతో నిరంతరం ఉంటే ఆ మనస్సు నుంచి వచ్చే ఆలోచనలు కూడ సవ్యమైనవి, దివ్యమైనవి అయి ఉంటాయి. మంచి పూవు వికసిస్తే చుట్టూ వాతావరణం పరిమళించినట్లుగా పవిత్రభావన కల్గిన వాళ్లు తాము పవిత్రంగా ఉండటమే కాక ఆ పరిసరాలను, తమ చుట్టూ ఉన్నవారిని కూడ పవిత్రులుగా చేయటానికి ప్రయత్నిస్తారు. వారి ఆలోచనలు క్రియలు లోకశ్రేయస్సును ఒనగూర్చకల్గినవై ఉంటాయి. కనుకనే అమ్మ మంచితనం అంటే **'సర్వత్ర మంచిని చూడడమే మంచితనమని'** పవిత్రులు అంటే అందరినీ పవిత్రులుగా భావించేవారనీ, నిర్వచించింది.

విశ్వరూప సందర్శనమంటే విశ్వంలోని సర్వవస్తువులునూ ఒకే శక్తి యొక్క భిన్న రూపాలుగా దర్శించడమే **'విశ్వరూప సాక్షాత్కారమ'**నీ అమ్మ నిర్వచనం.

సర్వత్రా పూజ్య భావం కలవారే **పూజ్యులనీ, పాతివ్రత్యం** అంటే పతిని ఆధారంగా చేసికొని పంచభూతాలను జయించడం అనీ

'సాధ్వి అంటే సర్వాన్నీ స్వాధీనం చేసుకున్నదనీ,
సత్రం అంటే సర్వులకూ స్వతంత్రమయినదనీ - నిర్వచించింది. అలాగే పంచామృతాలు అంటే అయిదు అని అర్థం చెప్తాం. కాని అమ్మ **పంచబడ్డ అమృతాలు** అని విడగొట్టింది. పాలుగా, పెరుగుగా, మీగడగా, వెన్నగా, నెయ్యిగా ఒకే అమృతం పంచబడిందట.

సమాధి అంటే ఒళ్లు మరచిపోవడం కాదు. వచ్చే ఒడిదుడుకులను ఏ వికారం లేకుండా భరించడమే సమాధి అనీ, **సర్వకాల సర్వావస్థలయందు సమానమయిన స్థితియే సమాధి** అని నిర్వచించింది.

'స్వయం ప్రకాశకుడు అంటే అంతటా ప్రకాశం ఎవరు చూస్తారో వాడే స్వయం ప్రకాశకుడు' అనీ, **'ఇష్టదైవం అంటే ఏం చేసినా ఎవరిమీద అయిష్టత కలుగదో వాడే ఇష్టదైవం'** అనీ, **బ్రహ్మానందం గురించి ఒక జిజ్ఞాసువు ప్రశ్నిస్తే "ఈ ద్వంద్వాలు ఆ బ్రహ్మే** అని గుర్తించడమే బ్రహ్మానందమ"ని నిర్వచించింది అమ్మ.

తనను తాను విమర్శించుకోవడం వివేకం

ఇతరులను విమర్శించడం అవివేకం

ఇతరులతో తగాదా ఆడడం పోరాటం

తనలో తాను తనతో తాను పోరాడటమే ఆరాటం అని విశ్లేషణాత్మకంగా సాగిన ఇలాంటి నిర్వచనాలు శ్రోతల మనస్సులను అలరిస్తున్నాయి.

ii) పదకేళీ విన్యాసాలు

పదప్రయోగంలో అమ్మ చూపే నేర్పు శ్రోతల్ని ఎపుడూ విస్మితులను చేస్తుంది. పదాలనెవరూ క్రొత్తగా సృష్టించలేరు. అప్పటికి వ్యవహారంలో ఉన్న మాటల్నే ప్రతిభావంతుడైన కవి క్రొత్త అర్థాలనిచ్చే పద బంధాలుగా రూపొందిస్తాడు.

నిశితంగా పరిశీలించి కొన్ని నిర్వచించినట్లుగా, కొన్ని సందర్భాలలో విషయం అడిగిన మరుక్షణంలో ఒక్క అక్షరం మార్పుతో విలక్షణమయిన సమాధానాలందించే సద్యఃస్ఫూర్తి అమ్మలోని ప్రత్యేక లక్షణం.

ఒకసారి ఎవరిదో ఆబ్దికం జరుగుతున్నది. వండిన అన్నాన్ని పిల్లి ముట్టుకోగా వారు వచ్చి 'పిల్లి ముట్టుకున్నదమ్మా' అన్నారు. అమ్మ 'పిల్లికాదు నాన్నా ! పిల్ల ముట్టుకున్నది' అన్నది. ఒక్క అక్షరం మార్పే మనకు కన్పిస్తోంది కానీ అమ్మ సమదృష్టికి నిదర్శనమే ఈ వాక్యం. ఒకసారి అమ్మ తన పర్యటనలో భాగంగా పాలకొల్లు వెళ్లింది. ఒక సోదరుడు హాస్యంగా 'పాపాల కొల్లు వచ్చావమ్మా' అనగా 'పాపాల కొల్లుకాదు నాన్నా ! నా పాపల కొల్లు' అన్నది. ఈ మాట వినగానే శబ్ద చమత్కారం ఆహ్లాదాన్ని కల్గించినా ఈ చరాచర జగత్తుకు తాను తల్లిననే అమ్మ విశ్వమాతృత్వమే మనకు సాక్షాత్కరిస్తోంది.

అమ్మ సన్నిధిలో ఎందరో తల్లిదండ్రులు తమ బిడ్డలకు నామకరణాలు, అన్నప్రాశనలూ, అక్షరాభ్యాసాలు, కేశఖండనలు జరుపుకునే వారు. ఒకసారి ఒక పిల్లవాడికి కేశఖండన చేసే సమయంలో అమ్మ నోటి నుంచి క్లేశఖండన అని విన్పించింది. అదేమిటమ్మా అని అందరూ ఆశ్చర్యపోతే "ఔను నాన్నా ! ఇక్కడ కేశఖండన కొందరికి మాత్రమే. క్లేశ ఖండన అందరికీ" అని వివరించింది.

ఒకరు 'రిక్తహస్తాలతో వచ్చానమ్మా!' అని బాధపడుతుంటే అమ్మ 'రక్త హస్తాలతో వచ్చావు నాన్నా' అని బుజ్జగించి తన అనురక్తిని ప్రకటించింది. సంస్థ నిర్వహణ కోసం 'రూపాయిల గురించి ఆలోచించమ్మా' అని ఒక సోదరుడు అర్థిస్తే 'రూపాయిల గురించి కాదు పాపాయిల గురించే' అన్నది. ఈ విధంగా ఎపుడు చూసినా 'నేను తల్లిని మీరు బిడ్డలు' అన్న సర్వమాతృత్వమే మనకు గోచరమవుతూ ఉంటుంది.

అలాగే 'కైవల్యం అంటే ఏమిటమ్మా' అని ప్రశ్నిస్తే 'వైకల్యం లేనిది కైవల్యం' అని అమ్మ సమాధానం.

వేదాంత శాస్త్రాన్ని అనుసరించి సాలోక్య, సామీప్య, సారూప్య సాయుజ్యాలని ముక్తి నాలుగు విధాలు. సాయుజ్యమంటే అఖండమైన పరమాత్మలో ఐక్యం కావడం. స్వస్వరూపమే కైవల్యం. కైవల్య పదం చేరిన వారికి పునరావృత్తి లేదు. పునర్జన్మ లేని శాశ్వతమైన మోక్షపదవి కైవల్యం. దానినే అమ్మ వైకల్యం అనే పదంలోని వర్ణవ్యత్యయంతో 'వైకల్యం లేనిదే కైవల్యం' అని అలవోకగా చెప్పింది.

ఇలాంటివే 'వర్గం లేనిదే స్వర్గం' 'ఇష్టం లేనిదే కష్టం' మొ॥ కొన్ని జంట పదాలను పర్యాయపదాలుగా వాడుతుంటాం. కాని వాటికి సూక్ష్మమైన అర్థభేదం ఉంటుంది. అమ్మ ఆ అంతరాన్ని ఎలా తెలియచేసిందో పరిశీలిద్దాం.

కోపం-క్రోధం : తాత్కాలికమైన భావం - కోపం, శాశ్వతమైన కక్ష సాధించడం - క్రోధం.

భ్రమ - భ్రాంతి : లేనిదానిని ఊహించడం - భ్రమ, ఉన్నదానిని లేదని భావించడం - భ్రాంతి.

ఆరోగ్యం-కులాసా : శారీరకమైంది - ఆరోగ్యం, మానసికమైంది- కులాసా.

గురువు-దైవం : తెలియచెప్పేవాడు గురువు, తెలియజేసేవాడు దైవం - తెలియచెప్పడానికీ, తెలియజేయడానికీ ఎంత సూక్ష్మమైన అంతరం?

ఎడిటరు - ఆడిటరు : అక్షరాలను ఎడిట్ చేసేవాడు - ఎడిటర్, అంకెలు ఎడిట్ చేసేవాడు - **ఆడిటరు.**

సవరణ అవసరంలేనిదే వివరణ : శబ్దాలంకారంతో చెప్పినట్లుగా ఉన్నా భావార్థ బంధురంగా ఉన్న వాక్యం. చిక్కనైన అర్థం చిన్నపదాల్లో చెప్పడం వలన శబ్దం అర్థం అహమహమికతో పోటీ పడుతూ ఉన్నాయి. అర్థవంతమైన అక్షరం మార్పుతో వివరణకే సవరణ అవసరం లేని సరిక్రొత్త వివరణ ఇచ్చింది అమ్మ.

చిన్నతనం నుండీ భాషపై అమ్మకు ఎంతో అధికారం కన్పిస్తుంది. అమ్మ ప్రాథమిక పాఠశాలకు కూడా వెళ్లలేదు. కాని తెలుగులోనే కాక ఇతర భాషా పదాలతో కూడ అమ్మ చమత్కారంగా సంభాషణ చేసేది.

డ్రస్, అడ్రసుకాదు ఆకలే అర్హత : అమ్మ తనను దర్శించటానికి వచ్చిన వాళ్ల ఆకలి గురించి ఆలోచించి అన్నపూర్ణాలయం స్థాపించింది. కుబేరుడికయినా, కుచేలుడికయినా ఆకలి సమానమే కదా ! ఆగర్భ శ్రీమంతుడికయినా అవసరానికి ఏమీ దొరకని పరిస్థితి ఏర్పడవచ్చు. అన్నపూర్ణాలయంలో భోజనం ఎవరికి పెట్టాలి అనే చర్చవస్తే, 'డ్రస్, అడ్రస్ కాదు ఆకలే అర్హతగా భోజనం పెట్టమ'ని తీర్పునిచ్చింది అమ్మ.

ఆకలి బాధ గుర్తించిన అమ్మ దానిని రూపుమాపాలని సంకల్పించింది. ఈ ప్రపంచంలో ఆకలిబాధ పోయే రోజు ఎపుడు వస్తుంది?" అంటూ తన్ను దర్శింప వచ్చిన ఒక జ్యోతిషశాస్త్రవేత్తను అమ్మ ప్రశ్నించింది. ఈ ప్రశ్నకు సమాధానం ఎక్కడుంటుంది? కాని అమ్మ దానికి సమాధానంగా అన్నపూర్ణాలయాన్ని స్థాపించి వాళ్ల చిరునామాలతో ప్రసక్తి లేకుండా భోజనం పెట్టి ప్రతి ఇల్లు అన్నపూర్ణాలయమై ఆకలి లేని సమాజాన్ని కోరుకున్నది.

అమ్మ చిన్నతనంలోనే ఒకరు ఒక సందర్భంలో 'లోపలగానా' అని ప్రశ్నించగా 'లోపలగానా బయట బజానా' అని అమ్మ చమత్కారంగా పలికితే విన్నవాళ్లందరూ నివ్వెరపోయారు. ఒకే పదం భాషమారే సరికి మరొక అర్థాన్నిస్తుంది గదా. ఒక సందర్భంలో కమిటీ మెంబర్ల ప్రసక్తి వచ్చినపుడు 'కమిటెడ్ మెంబర్లు కావాలి కానీ కమిటీ మెంబర్లు కాదు' అని చమత్కరించింది. ఒక సోదరుడు 'మీకు చర్చలంటే ఇష్టమా' అని అడిగితే 'చర్చలు కాదు నాన్నా చర్చిలంటే ఇష్టం'

అన్న అమ్మ వాక్యంలో శబ్ద చమత్కారం మనలనాకట్టుకున్నా 'సర్వ సమ్మతమే నా మతమని' ప్రకటించిన అమ్మ తత్త్వం గోచరమవుతుంది.

ఒకసారి ఒక సోదరుడు 'అమ్మా, సందేహం తీరడం లేదు' అన్నారు. 'దేహం ఉన్నన్నాళ్లూ సందేహం ఉంటుంది నాన్నా' అన్నది అమ్మ. అమ్మ ఇవల్యూషన్ అంటే ఏమిటి అంటే 'ఇన్ వల్యూషన్ లోదేగా నాన్నా ! ఇవల్యూషన్' అన్నది. శక్తి సృష్టిగా దిగి వస్తే అది ఇన్‌వల్యూషన్. మళ్లీ సృష్టిశక్తిగా పరిణామం చెందే పద్ధతి ఇవల్యూషన్.

అమ్మ ఇంటిపేరు బ్రహ్మాండం. ఒకసారి ఒక సోదరుడు హాస్యంగా 'బ్రహ్మాండం వాళ్లంటే ఇష్టం కదా అమ్మా!' అనగానే వెంటనే అమ్మ 'బ్రహ్మాండంలో వాళ్లంటే' అని సరిచేసింది. ఈ విధంగా అమ్మ సంభాషణల్లో ఏ వాక్యం తీసుకున్నా శబ్ద చమత్కారంతో పాటు అమ్మ విశ్వజననీత్వం స్పష్టమవుతూ ఉంటుంది.

కొన్ని సందర్భాల్లో అమ్మ, కేవలం పదాలతోనే కాక వాక్యాలలో కూడ చక్కని విన్యాసాలు చేసి విశేష సందేశాలను అనుగ్రహించింది.

'ఒకటి అనేకమయింది గనుక అనేకంలో ఆ ఒక్కదాన్ని చూడడం సాధన' అనీ 'అనేకం ఒకటిగా తోచడమే ఆత్మ సాక్షాత్కారమ'నీ అద్భుతంగా ప్రవచించింది అమ్మ.

అమ్మ చేసే ఆధ్యాత్మిక ప్రవచనం సంప్రదాయబద్ధమని కొందరూ, కేవలం వినూత్నమైనదనీ, విప్లవాత్మకమైనదనీ కొందరూ చెబుతూ ఉంటారు.

కొన్ని భావాలను బలంగా చెప్పదలచుకున్నప్పుడు అమ్మ వాక్య విన్యాస వైఖరి ఎంత విలక్షణంగా ఉంటుందో చూద్దాం.

'మీరూ, నేనూ ఒకటే' అన్న భావం చెప్పవలసివస్తే 'మీరు కానిది నేనేదీ కాదు నాన్నా!' అంటుంది అమ్మ.

'అంతా అదే' అని చెప్పదలచుకుంటే 'అది కానిది కన్పించటం లేదు' అంటుంది. అమ్మ చిన్నతనంలో ఒక స్వామీజీ 'ఏం కావాలో కోరుకో అమ్మా!'

అంటే ఏమీ వద్దు - అనటానికి 'ఏమన్నా కావాలనేది అక్కర్లేకుండా కావాలి' అన్నది అమ్మ. స్వామివారు ఎన్నో శాస్త్రాలు చదివారు. ఎన్నో వేదాంత గ్రంథాలు పఠించారు. కాని వారి కెక్కడా ఆ మాట కనిపించలేదు. ఆ చిన్నపిల్లహృదయం నుండి వెలువడిన పెద్ద కోరికకు విస్మయం చెందారు స్వామీజీ. భాషాశాస్త్రం దృష్ట్యా పరిశీలించినా విలక్షణమైన నిర్మాణ సౌందర్యానికి సంబంధించినవీ వాక్యాలు.

iii) జీవన సత్యాలు

జీవన సత్యాలెన్నింటినో అలతిఅలతి మాటలతో సులలితంగా మృదు మధురంగా, అందరికీ అందుబాటులో ఉండే విధంగా చెప్పడం అమ్మకు వెన్నతో పెట్టిన విద్య. జీవితం గురించి 'ఆశా అసంతృప్తుల కలయికే జీవితం' అని అమ్మ వాక్యం.

మానవుని సమున్నతికి, సమృద్ధికి, ప్రగతికి కారణమైంది ఆశ. నిరాశ అనే చీకటిని ప్రకాశింప చేసే జ్యోతి ఆశ. రాత్రి గడవగానే ఉషోదయం అనివార్యమైనట్లుగా ఆపదలు వచ్చినపుడు అవి తీరిపోయి సుఖాలు కూడా క్రమంగా వస్తాయనే ఆలోచనతో ధైర్యాన్ని కల్గించేది ఆశ.

జీవితానికి ఆశ అత్యంతావశ్యకమైనా అసంతృప్తి కూడ నీడలా వెన్నంటి ఉంటుంది. జీవితాన్ని ముందుకు నడిపించేది ఆశ అయితే అన్వేషణ సాగింపచేసేది అసంతృప్తి. అన్వేషణ లేకపోతే ప్రగతే లేదు. లక్ష్యమూ లేదు.

అమ్మ 'ఆశాఅసంతృప్తుల కలయికే జీవితం' అని సమన్వయాత్మకంగా, అపూర్వంగా నిర్వచించింది. జీవితంలో అనుకున్నది జరగకపోయినా బాధే. అనుకోనిది జరిగినా బాధే. జీవితంలో అనుకున్న కోరికలన్నీ ఈడేరి భద్రతకు లోటులేని వారంతా ఏ చీకూ చింతా లేకపోయినా ఏం చేయాలో తోచక తమకు తామే బాధపడుతుంటారు. అందుకే జీవితంలో కొన్ని విషయాలు అందీ, కొన్ని విషయాలు అందకుండా ఉంటేనే అందం. ఆశతో బ్రతుకుతాం, అసంతృప్తితో వెదుకుతాం. మనిషి ఆశలేకపోతే బ్రతకలేదు. అసంతృప్తి లేకపోతే ముందడుగు

వేయలేదు. అసంతృప్తికి ఉతకర్ర ఆశ. జీవికి ఉచ్ఛ్వాస నిశ్వాసాలు ఎంత ప్రధానమో జీవితానికి ఆశా అసంతృప్తులు అంత అవసరం.

అమ్మను ఒక సోదరుడు 'ఈ నిర్వచనం నీకు కూడ వర్తిస్తుందా అమ్మా!' అని అడిగితే అమ్మ 'మీకు పెట్టుకోవాలనే ఆశ - బాగా పెట్టుకోలేకపోతున్నాననే అసంతృప్తి నాకూ ఉంటాయి నాన్నా!' అని సమాధానం చెప్పింది.

బాధల్లేని బ్రతుకు వ్యర్థం : బాధలేకపోతే బ్రతుకు అనవసరమని చెప్పింది. అమ్మ. సామాజికంగా గానీ, ఆర్థికంగా గాని ఏ రంగంలోనైనా ఎదిగిన మహాత్ముల జీవితాలను పరిశీలిస్తే కష్టాలే పెట్టుబడిగా కన్పిస్తాయి. మనిషికి వెలుగు, జ్ఞానం, సుఖం, ఆనందం కావాలి. కానీ సృష్టిలో చీకటీ, అజ్ఞానమూ, బాధ, అశాంతి దుఃఖం అన్నీ ఉన్నాయి. సాధారణంగా లోకంలో మనకు సుఖాన్నీ, ఆనందాన్నీ ఏది కల్గిస్తుందో దానిమీద మన దృష్టి నిలుస్తుంది. లోకంలో బాధలనెవ్వరూ ఆహ్వానించరు. కాని అమ్మ ఆలోచనా దృక్పథమే విలక్షణమైనది. 'అందుకే బాధల్లేని బ్రతుకు అనవసరం' అంటూ ఎవరూ చూడని ఆ రెండో కోణాన్ని దర్శిస్తుంది. కణ కణ మండే అగ్నిలో పుటం పెట్టబడిన బంగారం శుద్ధమైనట్లు బాధానల జ్వాలాపరితప్తుడయిన మనిషి కూడా రాణింపు పొందుతాడు. 'శిల్పానికి అందం రావాలంటే ఉలి దెబ్బలు అవసరం' అని అమ్మే చెప్పింది. ఏది ఏమైనా కష్టాలు శాశ్వతం కాదు. ప్రకృతిని పరిశీలించినా, చీకటి శాశ్వతం కాదు. వెలుతురు వస్తుంది. శిశిరం శాశ్వతం కాదు - వసంతం తొంగి చూస్తుంది. జీవితం సమస్యలతోరణం అయినా సమస్యల మేఘాలే సమాధానాలను వర్షిస్తాయి. దైవకృప ఉండాలిగానీ - భస్మరాసుల నుండే బంగారం పండుతుంది. మట్టిలో నుండే మాణిక్యాలు మందహాసం చేస్తాయి. పెనుతుఫానులు సర్వనాశనం చేసిన చోటనే సర్వసమృద్ధి జరిగి ప్రకృతిని పరవశింప చేయటం లోకానికి పదే పదే అనుభవమే.

జీవన తత్త్వాన్ని ఆకళింపు చేసుకున్న వ్యక్తిని బాధ ఉన్నతంగా తీర్చి దిద్దుతుంది. భూమి అట్టడుగు పొరల్లో కొన్ని శతాబ్దాల సంఘర్షణ ఫలితంగా శిల జాజ్వల్యమైన వజ్రంగా మారినట్లు జీవితంలో ఏర్పడిన సన్నివేశాల సంఘర్షణ

వలన మనిషి వ్యక్తిత్వం ఉద్దీప్తమవుతుంది. సంఘర్షణ మనిషి ఎదుగుదలకు నాంది. అన్నం విలువ తెలియాలంటే ఆకలి బాధ కావాలి కదా!

శిల శిల్పంగా మారాలంటే ఎన్నో ఉలిదెబ్బల్ని భరించాలి. అలాగే జీవితంలో రాణించాలంటే బాధలే సోపానాలు. బాధవల్లనే వ్యక్తిలో చైతన్యం ఉద్దీప్తమవుతుంది. 'తుఫానుకు దడిసే వాళ్లు జీవన్మృతులు. తుఫానులో నడిచే వాళ్లు చైతన్యవ్రతులు' అని ఖలీల్ జిబ్రాన్ చెప్పారు. వ్యక్తిత్వ నిర్మాణానికి, చుట్టూ ఉన్న సమాజాన్నీ, సాటి మనిషిని ఆకళింపు చేసుకోవటానికి, వారి కష్టాన్ని చూసి స్పందించటానికి బాధ అవసరం. అందుకే అమ్మ చెప్పిన ఈ వాక్యం సమున్నత జీవితానికి సమగ్ర వ్యాఖ్యానం. బాధలు పడడంతో ఔన్నత్యం పెరుగుతుందనీ సహనంలోనే జీవన పరమావధి ఉందనీ బాధలే లేనపుడు ఆ జీవితం నిరర్థకం అని స్ఫురింప చేస్తుంది ఈ ప్రవచనం.

తను మూలమిదం జగత్ : సాధారణంగా లోకంలో 'ధనమూలమిదం జగత్' అని పెద్దలమాట. మనిషి బ్రతకటానికి గాలి ఎంత అవసరమో ధనం అంత అవసరం. అన్ని విద్యలకూ లక్ష్యం ధనార్జనమే. లౌకికాభ్యుదయం, లోకప్రియత్వం, నేతృత్వం, మంత్రిత్వాది పదవీ ప్రాప్తి ధనం మూలంగానే సాధ్యం,

కోటిరూపాయలున్నా తానంటూ లేకపోతే అవి వ్యర్థమే కదా! ప్రపంచమంతా తాను మూలంగా ఉన్నది కనుకనే అమ్మ 'తనుమూలం మిదం జగత్' అన్నది. మనిషి ఏం చేసినా తనకొరకే చేస్తాడు. ప్రేమించటం, ద్వేషించడం తన కొరకే. అర్చన చేసినా, అన్నం పెట్టినా, దేశసేవ చేసినా, దేవుని సేవ చేసినా, ఏం చేసినా తన కోసమే. ఎవరూ ఇతరులకొరకై చేసేదంటూ ఏమీ లేదు. బిడ్డకు చేయనీ, భార్యకు చేయనీ, తల్లిదండ్రులకు చేయనీ, తదితరులకు చేయనీ అంతా తన తృప్తి కొరకే. మరి మనకు పురాణాల్లోనూ, చరిత్రలోనూ లోకం కోసం త్యాగం చేసిన వాళ్లు అనేకమంది కన్పిస్తారు.

దధీచి దేవతల కోసం వెన్నెముకనిచ్చాడు. శిబి పావురం కోసం తన శరీరంలో మాంసం కోసి ఇచ్చాడు. జీమూతవాహనుడు నాగులను రక్షించడం కోసం తాను గరుడిడికి ఆహారమయ్యాడు. వీరిలో ఎవరూ తమ కోసం ఆయా

త్యాగాలు చేయలేదు కదా ! మరి వీళ్లది స్వార్థం అవుతుందా, త్యాగం అవుతుందా? అనే సందేహం కలిగి తీరుతుంది. అలాగే దేశ స్వాతంత్ర్యం కోసం మహాత్మాగాంధీ మొదలగు వారెంతో మంది ఎన్నో కష్టాలననుభవించారు. మరి ఇందులో వాళ్ల స్వార్థం ఏముంది? పదిమందికీ ఉపయోగపడే పనిలో స్వార్థమేముంది – త్యాగం, పరోపకారం తప్ప అని తోస్తుంది. ఇది స్థూల దృష్టికి మాత్రమే. వారు తమ తమ తృప్తి కోసమే ఆయా పనులు చేశారన్నది యథార్థం. తన కోసం కాకుండా, తన మనశ్శాంతి కోసం కాకుండా ఎవరూ ఏ పనీ చేయరు అనేది సిద్ధాంతం. 'ఆత్మనస్తు కామాయ సర్వం ప్రియం భవతి' అని ఉపనిషత్తు". ఒకరు చేసిన పని తన వరకే పరిమితమైతే స్వార్థం అంటున్నాం, చాలామందికి ఉపయోగిస్తే త్యాగం అనో, పరోపకారం అనో అంటున్నాం. కాని ఈ పరోపకారం కూడ స్వార్థమే. తాను లేనిదే ప్రపంచం లేదు. అందుకే అమ్మ ప్రసిద్ధమైన "ధనమూల మిదం జగత్" అన్న సూక్తిని 'తనుమూల మిదం జగత్' అని ఒక్క అక్షరం మార్పుతో సామాన్యమయిన ఒక ప్రాపంచిక సత్యాన్ని క్రొత్త కోణంలో ఒక ఆధ్యాత్మిక సత్యంగా ధనం కంటె తానే ప్రధానమని ఆవిష్కరించింది.

"నవ్వుతూ అనుభవించేవాడి దగ్గరకు ఏడుస్తూ అనుభవించేవాడు సలహాకు వస్తాడు" అని అమ్మ వాక్యం మరొకటి. ఇది శాశ్వతమైన జీవిత సత్యం. మనిషికి జీవితంలో సుఖదుఃఖాలు, జయాపజయాలు తప్పవు. ఏదైనా కష్టం కల్గినప్పుడు దీనికంతటికి కర్తను నేను అనుకునేవాడు క్రుంగిపోతాడు. ఎవరో చేస్తున్నారు అనుకునేవాడు క్రోధంతో ద్వేషంతో రగిలిపోతాడు, తన ప్రాప్తం ఇంతే అనుకునేవాడు అనుభవిస్తూనే నిమిత్తమాత్రంగా ఉండగల్గుతాడు.

ఇష్టమో, కష్టమో, బాధో, ఆనందమో నేను కర్తను కాదు అనుకునేవాడు నవ్వుతూ అనుభవిస్తాడు. అనుభవించడం అందరికీ ఒకటే. మానవ మనస్తత్వాన్ని విశ్లేషిస్తూ చెప్పిన జీవనసత్యం. జీవితాన్ని సారవంతంగా మలచుకునే సూత్రం. ఎంత చెట్టుకు అంత గాలి అని ఎవరి కయినా వాళ్ల స్థాయిని బట్టి బాధలు తప్పవు. కాని ఆ సన్నివేశానికి అతని స్పందన ఎలా ఉన్నదనే దాని మీద అతని వ్యక్తిత్వం ఉంటుంది.

ఒక సంవేదన కలిగితే ఎలా అనుభవించాలో ఎలా సర్దుకుపోవాలో అందులో నుండి జీవితాన్ని ఎలా మలచుకోవాలో అనేది అతని సంస్కారం మీద ఆధారపడి ఉంది. వేదాంతం, మనస్తత్వ విశ్లేషణ అన్నీ ఇమిడి ఉన్న వాక్యం ఇది. వేదాంత విషయాన్ని సరళ సుందరంగా చెప్తూ జీవితాన్ని సుగమం చేసుకునే మార్గాన్ని అమ్మ ప్రబోధించింది. "జీవితంలో ఏదీ తప్పదు నాన్నా! నవ్వుతూ అనుభవించు!" అనే అమ్మ ప్రబోధం కన్పిస్తోంది పై వాక్యంలో. అందుకే ఒక కవి "ఆనందంగా పాడుకొనెడి అత్యద్భుత విషాదగీతి జీవితం" అన్నాడు. కష్టసుఖాలు రెండూ దైవ ప్రసాదాలేనని ప్రవచిస్తూ మనిషి కష్టాలను ఎలా నవ్వుతూ అనుభవించాలో వివరించి మనిషి వ్యక్తిత్వానికి క్రొత్త కాంతులు అందిస్తున్నది అమ్మ.

అనుకున్నది జరుగదు - తనకున్నది తప్పదు : మనిషి జీవితంలో అనుకున్నవన్నీ జరుగవు. మానవులకే దేవతలకైనా విధినతిక్రమించడం సాధ్యం కాదు. అమ్మ కూడా నిర్ణయానికి "నిర్ణయించిన వాడూ బద్ధుడే అని" చెప్పింది.

పురుష ప్రయత్నమూ, దైవానుగ్రహం అని రెండు లేవు. ఒకటే నిర్ణయం ప్రకారం విశ్వమంతా నడుస్తున్నది. ఈ సందర్భంలోనే అమ్మ 'తిథులు విధిని మార్చలేవు', 'పెట్టింది ముహూర్తం కాదు జరిగిందే ముహూర్తం', 'సర్వదినాలూ పర్వదినాలే' అని ప్రబోధించింది. 'అనుకున్నది తనకున్నది' అంటూ శబ్ద సౌందర్యంతో చెప్పినా దాని వెనుక తాత్త్వికత గర్భితమై ఉంది.

ప్రతి వ్యక్తి తనకు నచ్చిన విధంగా జరగాలని ఎన్నో కలలు కంటాడు. ఆ విధంగా జరిగితే బాగుండునని అనుకుంటాడు. కానీ మనం అనుకున్నవన్నీ జరగకపోవడమూ, అనుకోనివి ఎదురుకావడం అన్నది అందరికీ అనుభవమే. ఆ అనుభవం రైలు అందడం దగ్గర నుండి ఉత్తమ కార్యసాధన వరకూ ఉంటుంది. అనుభవం శాస్త్రాన్నిస్తుంది అని అమ్మ చెప్పినట్లుగా ఎందుకు ఇలా జరిగింది అని కారణం అన్వేషిస్తుండగా సకల శాస్త్రాలసారం అయిన ఈ వాక్యం ప్రతివారి ఆంతరంగంలో సమాధానమై నిలుస్తుంది. అనుకోవడానికీ, అనుభవానికీ మధ్య నిలిచే సమన్వయ సూత్రం ఈ వాక్యం. అమ్మ చెప్పిన ఈ వాక్యం ప్రతి వ్యక్తికీ అనుభవంలో అడుగడుగునా ఎదురయ్యే జీవిత సత్యం.

iv) అల్పాక్షరాలలో అనల్పార్థాలు

కొండంత భావం చిన్న చిన్న మాటలలో ఒదిగిపోవడం అమ్మ వాక్యాలలో కన్పిస్తుంది.

తృప్తే ముక్తి : సర్వకాల సర్వావస్థలయందు చెదరని సంతృప్తే ముక్తి. సాధారణంగా లోకంలో మనకు సుఖాన్నీ, ఆనందాన్నీ ఏది కల్గిస్తుందో దాని మీద మన దృష్టి నిలుస్తుంది. దుఃఖాన్ని ఎవరూ ఆహ్వానించరు. మనకు దుఃఖాలయినవి ఇతరులకు సుఖాలు కావచ్చు. ఇతరులకు దుఃఖాలయినవి మనకు సుఖాలు కావచ్చు. అంటే సుఖదుఃఖాలు మన భావనలో ఉన్నాయే కాని వస్తువులో లేవు. అందుకే అంటారు 'మన ఏవ మనుష్యాణాం కారణం బంధ మోక్షయోః' అని. అన్నింటికీ మనస్సే కారణం. ఏది అందలేదో దాని గురించే ఆలోచన, ఆరాటం. అందని దానిపట్ల ఆకర్షణ. అందుబాటులో ఉన్నదాని పట్ల అసంతృప్తి అసంతృప్తే అశాంతికి దారితీస్తుంది. అందుకే అమ్మ చెప్పింది అసంతృప్తికి మించిన దారిద్ర్యం లేదు. సంతృప్తికి మించిన సంపద లేదు' అని. సంతృప్తిలో ఉన్న సంతోషం కోరికలో ఉండదు.

ఒక కోరిక పది కోరికలకు దారి తీస్తుంది. కోరికల వలయంలో చిక్కుకున్న మనిషి ఆశా అసంతృప్తుల మధ్య నలిగిపోతూ ఉంటాడు. అందుకే మనకన్నా ఉన్నతస్థితిలో ఉన్నవారిని గూర్చి ఆలోచించి మనకు లేదే అని అసంతృప్తి చెందడం కన్నా మనకంటె తక్కువ స్థితిలో ఉన్నవారిని చూసి వారి కంటె మనం ఉన్నతస్థితిలో ఉన్నాం కదా అని తృప్తి చెందాలి.

శాశ్వత సుఖం తృప్తివల్లనే కలుగుతుంది. అదే ముక్తి. ఈ విషయాన్నే అమ్మ 'తృప్తేముక్తి' అని సూత్రీకరించింది.

'వ్యాప్తిం బొందక వగవక
ప్రాప్తంబగు లేశమైన పదివేలనుచున్
తృప్తింజెందని మనుజుడు
సప్తద్వీపములనైన చక్కంబడునే.

అన్న పోతన మహాకవి మాటలు తృప్తే ప్రధానమని చెప్తున్నాయి. 'యదృచ్ఛా లాభ సంతుష్టః' అని భగవద్గీతలో చెప్పినట్లు ఫలితం మీద దృష్టి పెట్టకుండా తమ పని తాము చేసుకుంటూ పోయే వారికి తగిన ఫలితం ఎపుడూ లభిస్తుంది. భగవంతుడు ఇచ్చిన దానితో తృప్తిచెంది జీవించే వారికి ఈ లోకమే స్వర్గం.

"సంతుష్టు డీ మూడు జగముల పూజ్యుండు
సంతోషి కెప్పుడు జరుగు సుఖము
సంతోషి కాకుంట సంసార హేతువు
సంతసంబున ముక్తి సతియు దొరకు...."

అన్నాడు పోతన మహాకవి. తృప్తి లేకపోతే ముక్తిలేదు.

కాని తృప్తి అన్న పదానికి అమ్మ ఇచ్చిన వివరణ వేరు. లోకకల్యాణం కోసం చేసే పనివలన కలిగే తృప్తే ముక్తి. సాటివాడి కష్టాన్ని చూసి స్పందించి అతనికి కావలసిన సహాయం చేసి సంతోషపడడమే నిజమైన సంతృప్తి. అందుకే అమ్మ అంటుంది. 'లోకంలో వికలాంగులయిన వాళ్లు తమబ్రతుకు తాము బ్రతకలేని ఎటువంటి ఆధారం లేని వాళ్ళు ఎందరో ఉన్నారు. వారిని భగవత్స్వరూపులుగా భావించి వాత్సల్య భావంతో ఆదుకోవాలి. 'కనిపించని దేవునిపై మనస్సు నిలవడం లేదనీ, ఏకాగ్రత కుదరడం లేదనీ బాధపడక కన్పించే ఈ దేవుళ్లను ప్రేమతో ఆరాధించండి. ఆ సేవలో కలిగే తృప్తే ముక్తి' అని వివరించింది అమ్మ.

సహించలేనిదే హింస : ధర్మాధర్మ విచారణ ఎంత కష్టమయినదో, ఏది హింస ? ఏది అహింస అని నిర్ణయించడం కూడ కష్టమైన విషయమే. ఒకే విషయం ఒకరికి హింసగాను మరొకరికి అహింసగానూ తోస్తుంది. పూర్వం యజ్ఞయగాదులలో జంతుబలి ఇచ్చేవారు. అప్పటి కాలాన్ని బట్టి అది హింస కాకపోవచ్చు. ఇప్పటికీ కొన్ని క్షుద్రవిద్యలకు నరబలి ఇవ్వడం జరుగుతూనే ఉన్నది అది వాళ్లు హింసగా భావించరు.

ఎవరైనా ఒక వ్యక్తి లోకహితానికి విరుద్ధంగా ప్రవర్తించి ప్రజలకు హాని చేస్తున్నప్పుడు అతనిని ఉపేక్షించక శిక్షించటం ధర్మం. శిక్షించక పోవటం అధర్మం. అలాంటి వారి విషయంలో హింస ధర్మం - అహింస అధర్మం.

యుద్ధం క్షత్రియ ధర్మం అంటారు. ధర్మపరిరక్షణ దృష్టితో చూస్తే యుద్ధం హింసగా తోచక పోవచ్చు. కాని కవి యుద్ధరంగాన్ని వర్ణిస్తే అక్కడ పరిస్థితి మన కన్నులకు కట్టి కరిగి కన్నీరై ప్రవహిస్తుంది. ఈ విధంగా ఒక మనిషి ఒకే విషయాన్ని అన్ని సందర్భాల్లోనూ ఒకటిగా తీసుకోడు.

ఇతరులకు అపకారం చేయాలనే ఆలోచన గానీ, కటువుగా మాట్లాడటం గానీ హింసగానే పరిగణింపబడుతుంది. లోకంలో హింస చేయనివాడు ఉండనే ఉండడు. గాలి పీల్చినా, నీరు త్రాగినా, నడచినా, నాగలి దున్నినా, అజ్ఞాతంగా హింస జరుగుతూనే ఉంటుంది. కాని ఎవరూ తాము చేసింది మాత్రం హింసగా భావించరు. ఉదాహరణకు ఏ ఆకు కూరో తరుగుతున్నాం అనుకోండి అది హింసగా భావించం-కాని ఏ పశువుల్ని చంపడమో హింసగా అన్పిస్తుంది. అది వృత్తిధర్మంగా భావించే వారికి మనుష్యుల్ని చంపడం హింసగా తోస్తుంది. ఒక మనిషిని చంపేవాడికి పదిమందిని చంపడం హింసగా తోచవచ్చు.

అహింసా 'పరమోధర్మః'అన్నారు. కాని అది సార్వకాలికమూ, సార్వదేశికమూ కాజాలదు అని మన అనుభవమే చెప్తున్నది. హింసకు దూరంగా ఉండాలంటే జీవయాత్రే కష్టమనిపిస్తుంది.

భారతంలో అరణ్య పర్వంలో ధర్మవ్యాధుడు కౌశికుడికి అహింసా స్వరూపాన్ని తెలియచేశాడు.

'హింస చేయనివాడు లే డిజ్జగమున
ఒక్కడైనను, తమ తమ ఓపినట్లు
హింస తెరువున కెడగల్గి యేగవలయు
అదియ చూవె అహింస నా నతిశయిల్లు"

హింస అహింసల నిర్ణయం వారి మనస్థితిని బట్టి ఉంటుంది. అందుకే అమ్మ 'సహించలేనిదే హింస' అని సూత్రీకరించింది.

ధ్యాసే ధ్యానం : ధ్యానం చేయాలన్న ధ్యాస ఎంతగా ఉన్నా, ఆచరణలో సాధ్యం కావడం లేదని ఆవేదన చెందుతున్న సోదరులను ఊరడిస్తూ, అమ్మ చెప్పిన నిర్వచనం ఇది.

ఆవేదనే ఆరాధన : అనన్య భక్తితో భగవత్సాక్షాత్కారానికై నిరంతరం పొందే ఆవేదనే ఆరాధన. రకరకాల పనుల వత్తిడుల వల్ల తరచుగా జిల్లెళ్ళమూడి రాలేక పోతున్నామని, అమ్మను ఆరాధించుకోలేకపోతున్నామని ఆవేదన చెందే సోదరులు కొందరున్నారు. వారికి ఊరట కలిగిస్తూ, ఆరాధించుకోలేక పోతున్నామని బాధపడవద్దని, ఆ ఆవేదనే చాలునని, అదే ఆరాధన అని ఈ వాక్యం ద్వారా వివరించింది అమ్మ.

ఇటువంటి వాక్యాలే మరికొన్ని : 'తపనే తపస్సు', 'దిగులే జిజ్ఞాస', 'మనస్సే మంత్రం' మొదలైనవి. ఈ విధంగా అల్పాక్షరాలలో అనల్పమైన సత్యావిష్కరణ జరగడం వలన సత్కావ్య ప్రయోజనం సిద్ధించినట్లుగా మనం గుర్తించవచ్చు.

v) తత్త్వజలధిలో ఆణిముత్యాలు

మానవుల మధ్య అప్పుడప్పుడు అక్కడక్కడ మహాత్ములు జన్మించి మహాకార్యాలను సాధించి మనుగడ సాగిస్తూ ఉంటారు. వారి జీవితాలు లోకానికి మార్గదర్శక సూత్రాలు. స్వార్థం మితిమీరి సమాజం అల్లకల్లోలం అయినప్పుడు సామాన్యులు చక్కదిద్దలేరు. అసాధారణ వ్యక్తులకే అది సాధ్యం. ప్రజలకు ఏది శుభాన్నీ, సుఖాన్నీ, శాంతినీ, మేలునూ, అభివృద్ధినీ కల్గిస్తుందో దానిని వారు సమకూరుస్తారు. ఆయా ప్రదేశాల్లో ప్రజల విశ్వాసాలననుసరించి కొందరు ఆరాధ్యమూర్తులవుతారు. అలాంటి మహనీయులు లోకకల్యాణం కోసం ఎన్నో మహత్తర సత్యాలను ఆవిష్కరిస్తూ ఉంటారు.

ఉపనిషత్తులలోనూ, వేదాలలోనూ ఉన్న విషయాలను అందరికీ అర్థమయ్యే రీతిలో అలతి అలతి మాటలతో సరళంగా, సులభంగా అందించడం అమ్మ ప్రత్యేకత. "సర్వం ఖల్విదం బ్రహ్మ" అన్నది వేదవాణి. ఇదంతా అంటే దృశ్యమానమైన విశ్వమంతా బ్రహ్మస్వరూపమే అని అర్థం. ఈ భావమే సకలోప నిషత్సారభూతమైన భగవద్గీతలో

'యచ్చాపి సర్వభూతానాం బీజం త దహ మర్జున !

న తదస్తి వినా యత్ స్యాత్ మయా భూతం చరాచరం' అన్న శ్లోకంలో గోచరిస్తుంది. పై భావమే 'అంతా అదే' అనే చిన్నమాటలో వ్యక్తపరిచింది అమ్మ.

'పితాహమస్య జగతః మాతాధాతా పితామహః

అహ మాత్మా గుడాకేశ ! సర్వభూతాశయ స్థితః' అని గీతాచార్యుని ప్రవచనం. ఈ భావమే 'నేను తల్లిని. మీరు బిడ్డలు. మీరే కాదు ఈ చరాచరజగత్తూ' అని అమ్మ తన జగన్మాతృత్వాన్ని సూచించిన వాక్యాల్లో కన్పిస్తుంది.

తనకు వచ్చే సంకల్పలాలకు తాను కర్తను కాననీ, సంకల్పాలన్నీ దైవ సంకల్పాలని తెలుసుకోవడమే సంకల్పరాహిత్యం' అని అమ్మ ఇచ్చిన నిర్వచనం అద్భుతం.

సదృశం చేష్టతే స్వస్యాః ప్రకృతేః జ్ఞానవానపి

ప్రకృతిం యాంతి భూతాని నిగ్రహః కిం కరిష్యతి' ఎంతటి జ్ఞానవంతుడైనా తన స్వభావాన్ననుసరించే ప్రవర్తిస్తాడు. ఈ ప్రాణికోటి సమస్తం స్వభావాని కనుగుణంగానే గాని విరుద్ధంగా ఎప్పుడూ మెలగదు. ప్రకృతిని నిరోధించటం సాధ్యం కాదు. ఈ భావమే 'చేతలు చేతుల్లో లేవు' అన్న అమ్మ వాక్యంలో వ్యక్తమవుతోంది.

శ్రీదేవీ ఉపనిషత్తులో దేవతలందరూ పరాశక్తిని సమీపించి 'కాసి త్వం మహాదేవి?' అని ప్రశ్నిస్తే 'అహం బ్రహ్మ స్వరూపిణి' అని మహాదేవి సమాధానం చెప్పినట్లుగా ఉన్నది. ఈ ప్రశ్న అమ్మకు ఎంతమందిద్వారా ఎన్నిసార్లు ఎదురయిందో.

ఈ సృష్టి అనాది, నాది, మీరుకాకుండా నేను లేను మీరంతా నేనే' మీదంతా నేనే 'ఇదంతా నేనే' అని చెప్పింది అమ్మ.

'అహం బ్రహ్మాస్మి, తత్త్వమసి, అయ మాత్మా బ్రహ్మ, ప్రజ్ఞానం బ్రహ్మ' అనే నాలుగు వేదాల నుంచి నాలుగు మహావాక్యాలను లోకానికి అందించారు మన మహర్షులు.

ఈ నాలుగు వాక్యాలను 'తత్త్వసార మందిరానికి నాలుగు వాకిళ్ళుగా' అభివర్ణించారు మాతృసంహితలో రామకృష్ణగారు. అంతేకాకుండా ఈ నాలుగు వాక్యాలు అమ్మలో సరళ సుందరంగా ప్రతిధ్వనించి లోకాన్ని ఆనంద తరంగితం చేశాయనీ, తత్త్వవేదికపై అమ్మకు ఒక అద్భుత సింహాసనాన్ని ఏర్పరచాయని అన్నారు.

ఆ వాక్యాల సారం అమ్మ నోటి వెంట అలతి అలతి మాటలతో సరళ సుందరంగా ఎలా వెలువడిందో పరిశీలిద్దాం.

'నేను నేనైన నేను' అన్ని నేనులు నేనేనని అమ్మ వాక్యాలు విన్నప్పుడు 'అహం బ్రహ్మాస్మి' అన్న వేదవాక్యం స్ఫురణకు వస్తుంది.

'తత్త్వమసి' అన్నది మరో వేదవాక్యం. ఈ భావమే

'అమ్మ తాను బ్రహ్మమేనని చెప్తూ' మీకంటె భిన్నంగా దేవుణ్ణి చూడలేదు అనీ, మీరంతా దైవస్వరూపాలే' ననీ ఎన్నోమార్లు ప్రకటించింది. అంతేకాక

మీరంతా పరిపూర్ణ జ్ఞానస్వరూపులు, మీరే నా ఆరాధ్యమూర్తులు అన్న అమ్మ వాక్యాలు తత్త్వమసికి సారూప్యాలు.

'అయం ఆత్మా బ్రహ్మ' అన్నది ఇంకొక వేదవాక్యం. ఈ భావాన్నే 'ఎంత వెదికినా అది కానిది కన్పించడం లేదు', 'అంతా అదే' అన్న మాటలలో వ్యక్తపరిచింది అమ్మ.

'ప్రజ్ఞానం బ్రహ్మ' అన్నది మహావాక్యాలలో నాలుగవది. 'ప్రజ్ఞానం బ్రహ్మ అయితే-అజ్ఞానమో ?' అని, అలాగే 'అన్నం పరబ్రహ్మమయితే అశుద్ధం ఎందుకు కాదు' అని ప్రశ్నించింది అమ్మ.

ఆ నాలుగు మహా వాక్యాల సారమే అమ్మ తనను గురించి తాను తెలియజేస్తూ చెప్పినట్లు 'నేను నేనైన నేను' అన్న అమ్మ వాక్యం. మరింత వివరిస్తూ, 'అన్ని నేనులూ నేనే' అని వ్యాఖ్యానించింది. 'మీలో ఉన్న నేను, నాలో ఉన్న నేను, అందరిలో అన్నింటిలోనూ ఉన్న నేనూ నేనే' అని అమ్మ ప్రవచనం. ఇది అమ్మ విశ్వతాదాత్మ్యస్థితికి మహనీయ శబ్దరూపం. ఈ 'నేను నేనైన నేను' అనే అమ్మ వాక్యాన్ని వైదిక వాఙ్మయంలోని మహావాక్యాల సరసన నిలిచే మహా వాక్యంగా

అభివర్ణిస్తూ శ్రీ బులుసు లక్ష్మీప్రసన్న సత్యనారాయణ శాస్త్రిగారు 'తెలుగులో మహావాక్యం' అనే గ్రంథరచన చేశారు. ఇందులో 'బైబిల్' ప్రస్తావన చేస్తూ మోజెస్‌కు మౌంట్ సినాయ్ మీద భగవంతుడు తన గురించి తాను చెప్పిన 'ఐయామ్ దట్ ఐయామ్' మహావాక్యం లాగా అమ్మ తన గురించి 'నేను నేనైన నేను' అని ప్రవచించారని చెప్పారు. అందరిలో నేనుగా వెలుగుతున్న చైతన్యమంతా తానేనని పలుసందర్భాల్లో అమ్మ స్పష్టం చేసింది. ఈ విధంగా అన్నీ తానైన స్థితి యోగానికి పరాకాష్ఠ. జ్ఞానానికి పరమావధి.

లలితాసహస్రనామ స్తోత్రంలో 'నిరాకారా, నిర్గుణా' అని జగన్మాత స్తోత్రం చేయబడింది.

ఏ రూపమూ లేని వాడు కనుక భగవంతుడు ఏ రూపంలో అయినా దర్శనమిస్తాడు. అందుకే అమ్మ నిరాకారుడంటే అన్ని ఆకారాలు తానైనవాడనీ, నిర్గుణుడంటే అన్ని గుణాలూ తానైనవాడనీ, అన్ని నామాలూ ఆయనవే గనుక నామరహితుడని నిర్వచించింది.

'నిగ్రహం కొరకే విగ్రహారాధన' అనీ, దైవం సర్వాంతర్యామి అనీ అంతటా అన్నింటిలో అన్నీ తానై ఉన్నాడు అని చెబుతూనే సాధన దశలో విగ్రహారాధనను అమ్మ ఆమోదించింది. నామరూపాత్మకమైన దైవాన్ని అర్చించడం ద్వారా నామరూపాలకు అతీతమైన పరతత్త్వాన్ని అందుకోవచ్చునని మన ఆధ్యాత్మిక వాఙ్మయం ప్రబోధిస్తోంది. అందుకనే "కాలువ నిండుగా ప్రవహిస్తున్నా దాహమయితే దిగటానికి రేవుకావాలి" అని అమ్మ ప్రవచించింది. **'బ్రహ్మసత్యం-జగత్తూ సత్యమే'** అన్నది అమ్మ వాక్యం.

అమ్మ ఈ విషయాన్ని వివరిస్తూ 'నేను జగత్తు సత్యమంటాను. మిథ్య అంటే లేదని కాదుగా' మార్పు. మార్పు ప్రతివస్తువుకూ ఉన్నది. మారేది మారని దాన్లోంచి పుట్టింది అన్నారు. రూపాంతరమే తప్ప రూపనాశనము' లేదు అన్నది.

'అంతా అదే, అదికానిది కన్పించటం లేదు' అన్న అమ్మ దృష్టిలో ఉన్నదంతా బ్రహ్మే. అందుకే జగన్మాత అన్నప్పుడు కూడ 'జగత్తుకు మాత కాదు, జగత్తే మాత'

అని నిర్వచించింది. జగత్తుకంటే మాత వేరు కాదు అన్న అమ్మ దృష్టిలో జగత్తు మిథ్య ఎలా అవుతుంది ? అందుకే జగత్తు సత్యమేనని చెప్పింది.

మారిపోయే జగత్తులో మారకుండా నిలిచి ఉన్న శక్తిని చూడడమే దర్శనం. ఆభరణాల్లో బంగారాన్నీ, కెరటాలలో, నురుగులో, బుడగలో నీటినే చూసినట్లు, నామరూపాత్మకమైన జగత్తులో సచ్చిదానందాన్ని చూడడమే దర్శనం. శాస్త్రాలలో ఉన్న పరమ సత్యం శాస్త్రరచనకు ముందే విశ్వంలో నిగూఢమై ఉంటుంది. దానిని ధ్యాన మననాదులచే సాక్షాత్కరింపచేసికొన్నవారు ఆ సత్యాన్ని సూత్రీకరించి లోకానికి ఉపదేశిస్తారు.

'తత్త్వవిత్తు మహాబాహో గుణకర్మ విభాగశః
గుణాః గుణేషు వర్తన్తే ఇతి మత్వా న సజ్జతి'

గుణాలు వాటి ప్రభావం వలన జరిగే సంఘర్షణలు కంటపడితే సామాన్యుడు ఉద్విగ్నుడూ ఉద్రిక్తుడూ అవుతాడు. కాని ఆ క్షణంలో తత్త్వవేత్త ఆలోచన ఇలా సాగుతుంది. గుణాలు రకరకాల ప్రభావాలలో భిన్నంగా కన్పిస్తాయి. అది గుణం యొక్క ప్రభావమే కాని వ్యక్తి ప్రభావం కాదని, అందువలన మంచి చెడులకు కర్తలు వీరు కాదు అనే మౌలిక తత్త్వాన్ని దర్శిస్తాడు. కనుక దేనికీ చలించకుండా అతీతస్థితిలో ఉండగల్గుతాడు. అదే స్థితప్రజ్ఞ లక్షణం కూడ.

లోక వ్యవహార దృష్టిలో మనకు కర్త కర్మ క్రియలు ఒకదానికంటే మరొకటి వేరుగా ఉన్నట్లు కన్పిస్తాయి. తత్త్వ సందర్శనం గావించిన మహాత్ములకు అంతా ఒకటిగానే కన్పిస్తుంది. అది ప్రజ్ఞకు రూపాంతరం.

కొండ ఎక్కి చూసినపుడు మేడలూ, మిద్దెలూ, గుళ్ళూ, గోపురాలూ అన్నీ ఒకే స్థాయిలో కన్పిస్తాయి. భూమి మీద నిల్చుని చూసేవారికి మిట్టపల్లాలు వేరు వేరుగా గోచరిస్తాయి. తాత్త్వికుల అన్వేషణ సామాన్యదృష్టికి అందని సత్యాలను అందుకుంటుంది. తత్త్వచింతనకు 'అంతా అదే' అన్న అనుభవం పరాకాష్ఠ.

ఈ కన్పించేదంతా దైవమేననీ, దైవం సర్వాంతర్యామి మాత్రమే కాక సర్వమూ తానై ఉన్నాడనీ, ఈ జగత్తులోని ప్రతి ప్రాణినీ ప్రేమించటమే దైవారాధన అనీ ప్రబోధించింది అమ్మ.

బాల్యంలో ఒకనాటి రాత్రి అమ్మ మన్నవలో రాజ్యలక్ష్మీ అమ్మవారి గుడిలో పడుకున్నది. ఆనాడు అర్చకుడు గుడి తలుపులు వెయ్యకనే వెళ్ళిపోయాడు. ఆ రాత్రి అమ్మ 'దేవుడంటే ఏమిటి?' అన్న విచికిత్స చేసింది. దేవాలయం, గర్భగుడిలోని విగ్రహం, ఆలయ ప్రాకారం, శిఖరం, రాతి రాతిలోనూ అమ్మవారే కనిపించింది. ఆలయ ప్రాంగణంతా కలయ తిరిగింది. నేలపై నడుస్తున్నట్లు లేదు. పాదాలకు అమ్మవారే తగిలింది. ప్రతి అణువులోనూ అమ్మవారే. ఆకాశంలోని నక్షత్రాలకు బదులుగా అమ్మవారి రూపాలే అనంతంగా కన్పించాయి. ఏమిటిది? ఇంతమంది అమ్మవార్లా? లేక అన్నింటిలోనూ ఒకే అమ్మవారా? ఒకే అమ్మవారు ఇన్ని ఆకృతులు ధరించిందా? ఈ విధంగా సాగిన అమ్మ ఆలోచన వల్లిక పుష్పించిన దివ్య కుసుమమే 'అంతా అదే' నన్న భావం.

అప్పటినుంచీ అమ్మ భావన, అమ్మ బోధ, కనిపించేదీ, కనిపించనిదీ, ఉన్నదంతా దైవమే అని. ఒక జిజ్ఞాసువు అమ్మదగ్గరకు వచ్చి 'అమ్మా! నీవు జగజ్జననివి కదా! అని ఆసక్తితో అడిగాడు. 'జగత్తు వేరు, జనని వేరు కాదు, జగత్తే జనని' అని బదులు పలికింది అమ్మ. అమ్మ సమాధానంలో 'అంతా అదే' అనే అమ్మ మౌలిక దృక్పథం గోచరమవుతుంది.

అమ్మ మాటలనే వేదంగా ఆచరణ రూపంలో పెట్టుకోవాలనే ఆలోచన కలిగిన ఒక సోదరునికీ అమ్మకూ మధ్య 'అంతా అదే' అన్న అమ్మ ప్రబోధంపై జరిగిన సంభాషణను పరిశీలిద్దాం.

ఒకసారి అవధూతేంద్ర సరస్వతీ స్వామీజీ అయిన శ్రీశ్రీశ్రీ రఘువరదాసు గారు అమ్మ సన్నిధికి వచ్చారు. ఆయనతో పాటు ఏలూరు నుంచి టి.టి.అప్పారావు గారు కూడా వచ్చారు. ఆయన జిజ్ఞాసువు. అమ్మ మాటలకూ, గీతా ఉపనిషత్తులలో చెప్పిన విషయాలకూ సమన్వయం కుదురుతుందా అనే సందేహంతో స్వామీజీని అడిగారు. అప్పారావు గారికున్న కొన్ని ధర్మసందేహాలు తీర్చవలసిందిగా స్వామీజీ అమ్మను కోరారు. అమ్మ అప్పారావుగారితో 'నీ సందేహాలు అడుగునాన్నా!' అన్నది.

ప్రశ్న : అమ్మా అంతా అదే అంటున్నావుగా! అనుకోవడమా? అనిపించడమా?

అమ్మ : అనిపిస్తుంది నాన్నా.

అప్పా : ఎలా అనిపిస్తుందో వివరించమ్మా.

అమ్మ : అక్కడే ఉన్న సోదరి వసుంధరను పిలిచి ఒక బంగారు గాజు తెప్పించి 'ఇదేమిటి నాన్నా?' అని ప్రశ్నించింది. 'గాజు' అని అప్పారావుగారి సమాధానం.

అమ్మ : మరి ఇది బంగారమే కదా!

అప్పా : అవును

అమ్మ : అయితే ఇది మట్టికాదా! నాన్నా!

అప్పా : అవును.

అమ్మ : గాజును చూసినపుడు మట్టిగా నీకు ఎలా తెలిసిందో మట్టికి మూలమైంది 'అదే' అని నాకు అనిపిస్తుంది.

అప్పా : అనిపించడం ఎలా సాధ్యం ?

అమ్మ : ముందు అనుకో నాన్నా ! తరువాత అనిపిస్తుంది అని చెప్పింది.

ఏ విషయమైనా ముందు అనుకోవడం ప్రారంభిస్తే ఆ సాధన క్రమంలో అనిపించడం ఆరంభమవుతుంది అని అమ్మ ప్రబోధం.

'మీరు నా బిడ్డలే కాదు నా అవయవాలు కూడా అనీ, ఇదంతా నేనేననీ, నేను మీరు కానప్పుడు గదా' అనీ అమ్మ పలికిన అనేక వాక్యాల్లో అమ్మకు ఈ సర్వసృష్టితో గల పరిపూర్ణ తాదాత్మ్యం కన్పిస్తుంది.

సాధకులకు అమ్మ చూపించిన మార్గం.

'సామాన్యంలో నుండి విశేషాన్ని విడదీసి మళ్లీ విశేషాన్ని సామాన్యం చేసుకోవాలి' అని అన్నది అమ్మ. సర్వమూ అయి సర్వత్ర ఉన్న భగవంతుని అన్ని రూపాలలో గుర్తించడం, కనిపించే ప్రతి వస్తువూ దైవ స్వరూపమే అన్న గుర్తును నిలుపుకోవడమే సామాన్యంలో నుంచి విశేషాన్ని విడదీయడం. ఆ విశేషాన్ని తిరిగి సామాన్యం చేసుకోవడమంటే కనిపించేదంతా దైవమే అనే భావనను ప్రయత్న పూర్వకంగా నిలుపుకోవడం కాక సహజం చేసుకోవాలి. అంటే 'సర్వం ఖల్విదం బ్రహ్మ', 'అంతా అదే' అనేది అనుభవంలోనికి రావాలి. అమ్మస్థితి అదే కదా!

"అంతా అదే' అన్న విషయం మాటలతో కాక అనుభవానికి వచ్చినపుడు అద్వైతం" అని అమ్మ చెప్పినట్లుగా ఆ అనుభవాన్ని పొందింది కనుకనే అమ్మ ఎపుడూ అద్వైతస్థితిలోనే ఉన్నది.

ఈ విధంగా 'ఉన్నదంతా దైవమే' అన్న అమ్మ దృష్టిలో ద్వంద్వం అంటూ ఏమీ లేదు. అందుకే 'ప్రజ్ఞానం బ్రహ్మ అయితే అజ్ఞానమూ బ్రహ్మే, అన్నం పరబ్రహ్మ అయితే అశుద్ధం మాత్రం ఎందుకు కాదూ?' అని అమ్మ ప్రశ్నిస్తుంది. 'అంతా దైవమే' అన్న అమ్మ దర్శనానికి ఏ మాత్రం భంగం కలిగే మాట విన్పించినా దానిని అమ్మ వెంటనే సరిదిద్దింది. 'పిపీలికాది బ్రహ్మ పర్యంతం' అన్న వేదాంత పదబంధ ప్రస్తావన వచ్చినప్పుడల్లా అమ్మ 'పిపీలిక బ్రహ్మకాకపోతే గదా!' అని సవరించింది.

ఒకనాడు అమ్మ సమక్షంలో ఒక గాయకుడు త్యాగరాయకీర్తన గానం చేస్తూ చీమలో, దోమలో ఉన్న పరమాత్మను స్తుతిస్తుంటే అమ్మ కలుగచేసికొని 'చీమగా, దోమగా, రాయిగా, రప్పగా దైవం సర్వరూపుడై ఉన్నాడ'ని సత్యావిష్కరణ చేసింది. 'మాలో దైవాన్ని చూస్తావా?'అని అడిగితే 'మీలో కాదు, మీరుగా చూస్తాన'ని సరిచేసింది.

'నీవు సాక్షాత్తూ రాజరాజేశ్వరివమ్మా' అంటే 'మీరు కానిది నేనేదీ కాదు' అని అమ్మ సమాధానం. ఒకరోజు శ్రీ విఠాల రామచంద్రమూర్తిగారు అమ్మ పాదాలు రాస్తూ 'అమ్మా! బ్రహ్మకడిగిన పాదాలు ఇవే కదా!' అని అడిగితే వెంటనే అమ్మ 'ఔను నాన్నా!' అన్నది. అమ్మ తన ప్రతిపాదనను బలపరిచినందుకు ఆయన ఆనందం పొందుతుండగా 'మీరు రోజూ కడుగుతూనే ఉన్నారుగా నాన్నా! మీరంతా బ్రహ్మలు కాకపోతేగా' అని వివరించింది.

'సృష్టి ఎవరు చేశారు' అన్నదానికి అమ్మ చాలా చక్కగా వివరించింది. 'దైవం సృష్టి చేయటం కాదు. దైవమే ఇన్ని రూపాలుగా అయింది. ఉన్నది ఒకటే. అదే ఇన్ని రూపాలుగా మారింది. ఆ శక్తికి స్త్రీ పురుష భేదం లేదు. దాన్ని సైన్స్ శక్తి అనో, చైతన్యమనో అంటే ఆధ్యాత్మికం దైవంఅనో, బ్రహ్మ అనో అంటుంది. శక్తే దైవం. మానవశక్తి దైవశక్తి వేరు వేరుగా లేవు'.

మన దృష్టిలో దేవాలయం భగవంతుడు కాదు. గర్భాలయంలో సుప్రతిష్ఠితుడైన వాడే భగవంతుడు. కాని 'దేవాలయమే కాదు దేవాలయం ప్రహరీగోడ కూడా భగవంతుడే' అని అమ్మ దృష్టి. 'ఆనందో బ్రహ్మ' అని ఉపనిషద్వాక్యమైతే 'బాధ కూడా భగవంతుడే' అన్నది అమ్మ. అమ్మ దృష్టిలో కష్ట సుఖాలు విభిన్న అనుభవాలు మాత్రమే. అమ్మ సనాతన విషయాలను మృదువుగాను, మంజులంగాను చెప్పడమే గాక ఎన్నో అపూర్వ సత్యాలను వెల్లడించి ఆధ్యాత్మిక సారస్వతాన్ని సుసంపన్నంచేసింది. సుదవగాహన కలిగించింది.

'ఆధ్యాత్మిక రంగంలో సంపూర్ణ తత్త్వాన్ని సందర్శించి సామ్యవాదాన్ని ప్రవేశపెట్టి అనర్ఘరత్నాలను వెదజల్లిన అమ్మ క్రాంతిదర్శిని - తత్త్వవేదిని అయింది', అన్నారు కొండముది రామకృష్ణగారు మాతృసంహితలో. "ఆధ్యాత్మిక రంగంలో ఎక్కడైనా నెలవంకలనే చూడగలం జిల్లెళ్ళమూడిలో మాత్రం పూర్ణచంద్రుడిని చూడగలం" అన్నారు డాక్టర్ శ్రీపాదగోపాలకృష్ణమూర్తిగారు.

ఆత్మ సాక్షాత్కారమే ఆధ్యాత్మికానుభవాలకు పరాకాష్ఠ. ఈ స్థితి ఎవరికి ఏ మార్గాన లభిస్తుందో స్పష్టంగా ఎవరికీ తెలియదు. ఆ స్థితి ఈ మార్గాన వచ్చిందనికానీ, ఇట్లా ఉంటుందని కానీ, ఏ సిద్ధపురుషుడూ అభివ్యక్తం చేయలేదు. ఆ స్థితి భక్తివల్లగానీ, యోగం వల్లగానీ, జ్ఞానం వల్లగానీ, ఏ సాధన లేకపోయినా రావచ్చు. అమ్మ 'ఆత్మ సాక్షాత్కారమంటే లోకమంతా ఆత్మగా తోచటమే' అని అనుభవ పూర్వకంగా నిర్వచించింది.

స్వానుభవంతో తత్త్వసందేశాన్ని అందించిన మహాత్ములు అరుదుగా కన్పిస్తారు. ప్రాథమిక పాఠశాలకు కూడా వెళ్లని అమ్మ చిన్నతనం నుంచీ ఏం చెప్పినా అపారమూ, అపూర్వమూ అయిన తన అనుభవంతో అనేక అద్భుత విషయ సముదాయాన్ని లోకానికందించింది. బాల్యంలోనే అమ్మ చెప్పిన మాటలూ చేసిన వేదాంత చర్చలూ పరికిస్తే జీవితకాలం సాధన చేసినా, అధ్యయనం చేసినా అందనివి. అమ్మ తన జీవితానుభవం నుంచి లోకానికి అర్థమయ్యే రీతిలో సూక్తులుగా అందించింది.

వ్యాకరణ శాస్త్రకారుడు తనకు ముందే లోకాన ఉద్భవించి ఉన్న వాఙ్మయ జగత్తును పరిశీలించి భాషను ప్రకృతి ప్రత్యయాది విభాగాలుగా వ్యాకరించి చూపి ఆ భాషా ధర్మాలన్నింటినీ సూత్రరూపంగా అందిస్తాడు. అట్లాగే మహానుభావుల అనుభవాలే సూక్తుల రూపంగా మనకు నేడు మార్గదర్శనం చేస్తున్నాయి.

vi) సామాజిక భావనలు

భారతీయ ఆధ్యాత్మిక చరిత్రలో 19వ శతాబ్దికి ఎంతో ప్రాముఖ్యమున్నది. ఎందరో మహామనీషులు, సిద్ధపురుషులు, దార్శనికులు, సంఘసంస్కర్తలు సామాజిక జీవనాన్ని ఎంతగానో ప్రభావితం చేశారు. వారు ధార్మిక జీవనజ్యోతులై తమ సందేశం ద్వారా ఎందరికో వెలుగుదారి చూపించారు. స్వార్థం పెరిగిపోయి ప్రపంచాన్ని కొన్ని క్షణాలలో ధ్వంసం చేయగల విజ్ఞానం నేడు అభివృద్ధి చెందింది. దేశకాల పరిస్థితులను బట్టి రామకృష్ణ పరమహంస, రమణ మహర్షి, మొదలైన మహాను భావులెందరో సమాజ మనుగడ కోసం ఎన్నో ప్రబోధాలు చేశారు. వారు ఏం చెప్పినా, ఏం చేసినా సామాజిక ప్రయోజనమే ప్రధాన లక్ష్యంగా కన్పిస్తుంది.

సామాజిక భావనలేని ఆధ్యాత్మికత రేవులేని కాలువ వంటిది. సర్వసంగ పరిత్యాగం చేసి అడవుల్లోనో, కొండ గుహల్లోనో ఏకాంతంగా ముక్కుమూసుకుని తపస్సు చేసినంత మాత్రాన ముక్తి లభించదని ఆర్యులు చెప్తారు. కొండగుహలలో ఉన్న ఆత్మానుభవానికి సామాన్య జీవనంతో సంబంధం ఉండదు.

కొడాలి సుబ్బారావుగారు 'హంపీ క్షేత్రం'లో విద్యారణ్యులను గూర్చి ఆయన విజయనగరసామ్రాజ్యాన్ని నిలబెట్టడానికి ప్రయత్నించిన తీరును గూర్చి చెప్తూ లోకం కోసం తన తపస్సును కూడ పక్కన పెట్టి ఆయన ఎలా శ్రమించిందీ తెలియచేశారు.

> **లోకము భద్రమై సుఖవిలోకనమై పొలుపొందునాడు స్వ**
> **ర్లోకమొ మోక్షమో గని వెలుంగుట ధర్మముగాని, లోకమే**
> **చీకటియై విపత్తులకు చిక్కిన నాడు తపంబు మోక్షమున్**
> **చేకొని ముక్కు మూసుకొని చెట్టుల గుట్టల బట్ట ధర్మమే!**

ఆధ్యాత్మిక సమున్నతికి సామాజిక ప్రయోజనం పరమలక్ష్యంగా ఉండాలి. "మనిషి సహనశక్తికి గీటురాయి మంచుకొండఅంచు కాదు, మానవ సంఘమ్మోయి" అన్నారు డా॥సి.నారాయణరెడ్డి. లోకకల్యాణాన్ని కాంక్షించిన మహనీయులు కీకారణ్యాలలో గాక సమాజంలో అందరి మధ్యలో ఉంటూనే జనారణ్యాన్ని ఆధ్యాత్మికోద్యానంగా తీర్చిదిద్ది ఆదర్శజీవనాన్ని గడిపారు. జీవితాన్ని ఒక సాధనగా చేసికొన్నారు. సమాజ సంక్షేమం ద్వారా మోక్షానికి ఆధ్యాత్మిక పరిపుష్టికీ దారులు వేసుకోవచ్చని ప్రబోధించారు. దానికి సజీవ ఉదాహరణమే అమ్మ జీవితం.

అమ్మ జీవితంలో ప్రతిఘట్టమూ మనం పైన చెప్పుకున్న ఉన్నత తాత్త్విక సూత్రాలకు ప్రత్యక్ష నిదర్శనం అమ్మ జీవితమే ఒక సందేశం. పాలలోని వెన్నలాగా అమ్మ ఆలోచనా స్రవంతిలో అంతటా పరచుకున్నది తాత్త్వికత. అమ్మ జీవితంలోని వివిధ సంఘటనలలోని అనుభవాలే వాక్యాలుగా రూపుదిద్దుకున్నాయి. అమ్మ వాక్యాలు ఒక జాతికి గాని ఒక దేశానికి గానీ పరిమితమైనవి కావు. అవి విశ్వజనీనమైన శాశ్వత సత్యాలు. మానవ మనస్తత్వాలను ప్రపంచ రీతులను అనుభవంలో తెలిసికొని చెప్పిన సత్యాలు. ప్రగాఢసత్యం నుండి వెలువడిన మాటలే కలకాలం నిలుస్తాయి. అట్టి మాటలే మనిషి హృదయపులోతులను తాకుతాయి. అనుభవ సత్యాలను ఎవరూ కాదనలేరు. అమ్మ సంభాషణల్లో అపుడపుడు చెప్పిన సూక్తులే నేడు తత్త్వగగనంలో తారకలై జీవన సమరంలో విసిగి వేసారిన పాంథులకు వెలుగుదారిని చూపిస్తున్నాయి. ఆధ్యాత్మిక సమభావం పునాదిగా సామరస్యాన్ని సాధించి ఆదర్శ సమాజానికి ఆహ్వానం పలికి సమాజాన్ని వర్గం లేని స్వర్గంగా రూపొందించాలన్నదే అమ్మ ధ్యేయం. సామాజికత ముడి పడని ఆధ్యాత్మిక చింతన నేలవిడిచిన సాము అవుతుంది.

అమ్మ వాక్యాల్లో తాత్త్వికత, సామాజికత నిత్యజీవన నిర్వహణా నిపుణత అనే త్రివేణీ సంగమం గోచరమవుతుంది. ప్రాపంచికమయినా పారమార్థిక మయినా వస్తువు యొక్క మౌలికతత్త్వాన్ని దర్శించటమే తాత్త్వికత. తత్త్వదర్శనం అమ్మ లక్షణం. అందులోని అంతర్గత సూత్రం ఆధ్యాత్మికత. దాని అభివ్యక్తి మార్గం

ప్రబోధాత్మకత. వీటన్నింటికీ పరమలక్ష్యం సామాజిక ప్రయోజనం. ఈ ప్రబోధానికి అమ్మ ఎంచుకున్న అంశాలన్నీ నిత్యజీవన నిర్వహణకు సంబంధించినవే. అమ్మ వాక్యాల్లో ఏ వాక్యం తీసుకున్నా ఈ మూడు మార్గాలూ ముప్పేటలా అవిభాజ్యంగా కన్పిస్తాయి. సత్యాన్ని దర్శించి తన అనుభవం జోడించి లోకానికి ప్రబోధించి తద్వారా సమాజాభ్యుదయాన్ని సాధించడం అమ్మ లక్ష్యం. ఈ దృష్టితో అమ్మ వాక్యాలను కొన్నింటిని పరిశీలిద్దాం.

చేసే ప్రతి పనీ భగవత్సేవే అనుకుంటే సంసారం ఆధ్యాత్మిక సాధనకు ప్రతిబంధకంకాదు.

సంసారం ఒక సాగరమనీ సన్యాసులే దానిని తరించగలరనే అభిప్రాయం లోకంలో బలపడి పోయింది. ఇదే సత్యమయితే ప్రతివారూ అరణ్యాలలోనో, కొండగుహలలోనో నివసించవలసినదే. కానీ అందరికీ అందుబాటులో ఉండే విధంగా అమ్మ 'చేసేదంతా భగవత్సేవే అనుకుంటే సంసారం ఆధ్యాత్మిక సాధన కడ్డు'కాదనీ, సంసారం పట్ల మనకున్న ఆలోచనాధోరణే బంధానికి కారణమనీ భావబంధమే తప్ప భవబంధం లేనే లేదన్న సత్యాన్ని ఆవిష్కరించి, లౌకికత-ఆధ్యాత్మికత వేర్వేరని భావించే మనకు కనువిప్పు కల్గిస్తున్నది. అమ్మ దృష్టిలో లౌకికం వేరు, ఆధ్యాత్మికం వేరు కాదు. లౌకిక జీవితానికీ ఆధ్యాత్మిక సాధనకూ వారధి నిర్మించిన సమన్వయ సారథి అమ్మ. తన ప్రబోధం ద్వారా ఆధ్యాత్మికలోకంలో అందరికీ ప్రవేశం కల్పిస్తున్నది. 'ఆధ్యాత్మిక జీవితం ప్రసాదించమ్మా!' అని అడిగిన ఒక సోదరునితో 'ఆధ్యాత్మిక జీవనం ప్రత్యేకంగా ఉందని నేను అనుకోవడం లేదు. నీవు చేసే ప్రతి పనీ దైవకార్యమే. ఈ జగత్తు దైవ స్వరూపం అయితే నీవు చూసేది ఏది దైవం కాదూ? నీవు చేసేది ఏది ఆధ్యాత్మికం కాదూ? ఆధ్యాత్మిక జీవితం కోసం ప్రత్యేకంగా చేయవలసిన ప్రయత్న'మంటూ లేదని అమ్మ ప్రవచించింది.

ఎన్నో సమస్యలతో సతమతమవుతూ పరుగులాంటి జీవితాన్ని గడుపుతున్న ఈనాటి మానవుడికి ఎన్నో సాధనలు చేయాలని ఉన్నా చేయటానికి సాధ్యం కాని పరిస్థితి. కాని అమ్మ చేసే ఈ ప్రబోధం ఆధునిక కాలానికి అనుగుణంగా ఉండి, ఆధ్యాత్మిక జీవనమంటూ ఎక్కడో లేదు అది మన నిత్య జీవితంలో భాగమే అని ఊరట కల్గిస్తోంది.

దినచర్యను దేవునికి అర్చనగా నిర్వహించడమే మానవ జీవితానికి పరమార్థం. దినచర్య అంతా పూజా భావంతో సాగిస్తే ఈ లోకంలో ద్వంద్వాలకు, విభేదాలకు అసూయలకూ అహంకారాలకూ తావెక్కడిది ?

అమ్మస్థితిని బాల్యం నుంచి గుర్తించిన వారు అమ్మ వివాహ సందర్భంలో 'నీ కీ పెళ్ళి ఎందుకమ్మా?' అని అడిగితే 'పెళ్ళిలో పెద్దపులి ఉందని భయపడేవారి భయాన్ని పోగొట్టడం కోసం నేనీ పెళ్లి చేసుకుంటున్నాను' అని సమాధానం చెప్పింది. ఆధ్యాత్మిక సాధనకు సంసారం బంధకారణమని అభిప్రాయపడే వారికి భార్య భర్త, పిల్లలను గూడ దైవ స్వరూపాలుగానే అభివర్ణిస్తూ వాళ్లను సాధన మార్గంలో ధ్యేయమూర్తులుగా చూపిస్తున్నది. భార్యకు భర్త దేవుడని ప్రాచీన ఋషులు బోధిస్తుంటే అమ్మ భార్య కూడ భర్తకు దేవతయేనని చేర్చింది. 'మాతృదేవోభవ, పితృదేవోభవ' అని తల్లిదండ్రులు పిల్లలకు అర్చామూర్తులు అని ప్రాచీనులు చెప్తే, 'పిల్లలు కూడా తల్లిదండ్రులకు దైవస్వరూపాలే' అని బోధించింది. అలాగే 'వైద్యో నారాయణో హరిః' అని ప్రాచీనులు చెప్తే వైద్యునికి రోగి కూడా నారాయణ స్వరూపుడే' అన్నది. రోగిని నారాయణ స్వరూపుడిగా భావించిననాడే వైద్యుడు సరైన చికిత్స చేయగల్గుతాడు.

ఈ విధంగా జీవితంలో చేసే ప్రతిపనీ భగవత్సేవగా భావించి చేస్తే ఆధ్యాత్మికంగా ఉన్నతీ, కార్య సాఫల్యమూ చేకూరి ఉభయతారకంగా ఉంటుంది. మరొక సందర్భంలో అమ్మ ఒక సోదరునితో "పూజంటే ఏమిటి నాన్నా! నీ దినచర్య అంతా పూజకాదూ?" అని ప్రశ్నించింది.

"యద్య త్కర్మ కరోమి తత్తదఖిలం శంభో! తవారాధనం" అన్న ఆదిశంకరుల ప్రబోధానికి ప్రతిధ్వని అమ్మ చేసిన ప్రబోధం.

కనుక ప్రతి వారూ కర్తవ్యమే దైవంగా భావించి త్రికరణ శుద్ధిగా పనిచేయగల్గితే సమాజంలో ఈ మోసాలు, కుట్రలు, కుత్సితాలు లేని ఆదర్శ సమాజం రూపొందుతుంది.

"నీ బిడ్డ యందు ఏమి చూస్తున్నావో అందరి యందు దానిని చూడడమే బ్రహ్మస్థితిని పొందడం" అని అమ్మ వాక్యం.

లోకమంతటినీ భగవన్మయంగా దర్శించినవారూ ఆరాధించిన వారూ ఉన్నారేమోకాని ఎవరూ అమ్మలాగా ప్రతివ్యక్తినీ తన బిడ్డగా చూసుకుని ప్రేమించలేదు. లోకంలో ఇదొక మధురమైన భావన. మనోహరమైన ఆరాధన. 'ఆత్మవ త్సర్వభూతాని' అన్నట్లుగా లోకాన్ని తనవలె చూడడం కాక లోకాన్ని బిడ్డగా ప్రేమించడమనే ఒక క్రొత్త విధానానికి అమ్మ శ్రీకారం చుట్టింది. ఈ దృక్పథంలో నుండి వచ్చినదే పై వాక్యం.

గగనకుసుమంలాగా మనకి అందుబాటులో లేని విషయాలను ఆచరాణత్మకమైన ప్రబోధం ద్వారా మన ముంగిట్లో నిలబెట్టడం అమ్మ ప్రబోధంలో కన్పిస్తుంది.

బ్రహ్మస్థితిని పొందడం ఏ యోగులకో, జ్ఞానులకో గాని సాధ్యం కాదు అనుకునే సామాన్య మానవులకు 'నీ బిడ్డయందు దేనిని చూస్తున్నావో అందరి యందు దానిని చూడడమే బ్రహ్మస్థితిని పొందడం' అని ప్రబోధించి, లౌకికానికీ, ఆధ్యాత్మికానికీ మధ్యనున్న అడ్డుగోడను తొలగించింది అమ్మ.

'ఆత్మవత్సర్వభూతాని' అనీ, సర్వప్రాణికోటీ ఒక దానికంటే మరొకటి ఏమాత్రం భిన్నం కావనీ వేదాంతం చెప్తున్నది.

అమ్మ 'పుత్రవత్ సర్వభూతాని' అని నిరంతరం తన మాటల ద్వారా చేతల ద్వారా మనకు అందించిన మహత్తర ప్రబోధం. సర్వజీవులనూ తన బిడ్డలుగా చూడమనీ మన బిడ్డలను ఎలా ప్రేమిస్తామో అందరినీ అలాగే ప్రేమించమనీ అమ్మ సందేశం. సృష్టిలో సమస్త ప్రాణికోటికీ తనను కన్నవాళ్ల మీద కంటే తాను కన్నవాళ్లమీదే మమకారం ఎక్కువ. ఒక ముద్ద అన్నం ఉంటే దానిని బిడ్డకు పెట్టి తాను పస్తు ఉంటుంది తల్లి. చూలింతగానూ, బాలింతగానూ, బిడ్డకోసం తల్లి చేసే పథ్యమూ, పడే కష్టమూ, తపనా, తాపత్రయము చూస్తుంటే తల్లికి బిడ్డయందు ఎంత మమకారమో అర్థమవుతుంది. తాము కష్టపడ్డా తమ సంతానం సుఖపడాలని కోరుకుంటారు తల్లిదండ్రులు. మనిషికి తనకంటే ప్రియమైనది సంతానమేనని అందరూ అంగీకరించే విషయమే. అందువల్లనే సర్వసృష్టినీ తన బిడ్డగా చూసుకోవాలనీ అలాగే ప్రేమించాలని అమ్మ నిరంతర ప్రబోధం. ప్రతివాడూ తన కన్నబిడ్డను చూసినట్లుగా సాటివాడిని చూడగల్గిననాడు ప్రపంచంలో కక్షలకూ,

కార్పణ్యాలకూ, దౌర్జన్యాలకూ, దురాగతాలకూ, మారణ హోమాలకూ తావేది ? మరి ఈఇల్లు నాది, ఈ ఊరు నాది అనుకోగలరేమో గాని లోకంలో ఉన్న ప్రతివాళ్లను తన బిడ్డలుగా భావించడం ఎట్లా సాధ్యం? సాధ్యమేనని నిరూపించింది అమ్మ. సర్వసృష్టినీ తనదిగా భావించి ప్రేమించి ఆచరణాత్మకంగా ప్రబోధించింది. అదే సర్వమాతృభావన. చరాచర భేదరహితంగా సమస్త సృష్టినీ 'నేను అమ్మను, మీరు బిడ్డలు' అనే విశ్వజనీనత్వ స్థితి. 'నీ బిడ్డ యందు దేనిని చూస్తున్నావో అందరి యందు దానిని చూడడమే బ్రహ్మస్థితిని పొందడం' అనేది ఆధ్యాత్మికంగా మహామంత్రంలా ధ్వనిస్తుంది కాని సమాజ శ్రేయస్సుకై అమ్మ చేసిన ప్రబోధంగా కూడా మనం గుర్తించవచ్చు.

ఈ సాధన క్రమంలో ముందు బిడ్డను బిడ్డగా చూడటం ఒక స్థితి. 'ఆత్మా వై పుత్రనామాసి' అని తన బిడ్డ తనకంటే వేరు కాదన్న స్థితి మరొకమెట్టు. క్రమంగా ఆత్మతత్త్వం ఒకటే అని తెలుసుకొని, తాను తన బిడ్డతో అభేదస్థితిని పొందటం మరోమెట్టు. అంటే తన బిడ్డయందు తననే దర్శించడం. ఆ తరువాత తన బిడ్డలాగే లోకాన్ని దర్శించడం వలన సృష్టి రూపంలో ఉన్నది కూడ తానే (ఆత్మయే) అన్న స్థితికి చేరుకుంటాడు. అంటే అంతా ఆత్మే. అంతా తానే అనే స్థితి. అపుడు సృష్టిలో సర్వరూపాల్ని స్వస్వరూపంగా దర్శించగల్గుతాడు. ఇదే చేరుకోవలసిన గమ్యం. భావన ఆధ్యాత్మికమైనా సాధన లౌకికంగా చెప్పి బ్రహ్మస్థితిని పొందడాన్ని ఆచరణ యోగ్యం కావించింది అమ్మ.

'నీచుట్టూ ఉన్నదానిని నీలాగ చూసుకోవడం అద్వైతం' అని అమ్మ చెప్పినట్లుగా అంతా తననే దర్శించడం అంటే అద్వైత స్థితికి చేరుకోవడమే.

సర్వత్రానురాగమే విరాగం : లోకంలో కనుమరుగైపోతున్న ప్రేమ తత్త్వాన్నీ మానవత్వాన్నీ పునరుద్ధరించడం, మానవుల మధ్య పరస్పర అనురాగాన్ని పెంపొందించడమే అమ్మ ధ్యేయం. అందుకోసం అమ్మ ప్రబోధిస్తున్న సర్వత్రానురాగం ఈ కాలానికి ఎంతో అవసరమయింది. 'సర్వత్రానురాగమే విరాగం' అనే అమ్మవాక్యం సామాన్యులకే కాక మహర్షులకూ, ఆధ్యాత్మిక తత్త్వవేత్తలకూ కూడ గొప్పసందేశం. కన్పించే జగత్తంతా దుఃఖమయమనీ, ఈ జగత్తువలన బంధమేర్పడుతోందనీ తలచి, ముక్తిని పొందగోరి ఎక్కడో ఏకాంతంగా

తపస్సు చేసుకుంటారు మహర్షులు. అలాగే జిజ్ఞాసువులు బ్రహ్మతత్త్వాన్ని తెలుసుకునేందుకు అనేక ఆధ్యాత్మిక గ్రంథాలు అధ్యయనం చేస్తారు. కాని అమ్మ అందరిలో ఒకరిగా ఉంటూ అందరినీ ప్రేమించడం విరాగమన్నది. మమకారం బంధహేతువనీ దానిని తగ్గించుకోమనీ సంప్రదాయం చెప్తుంటే అమ్మ అనురాగాన్ని పెంచుకోమనీ అదే విరాగమని చెప్తూ అనురాగ సోపానాల మీదుగా వైరాగ్య శిఖరాన్ని అధిరోహించే మార్గాన్ని చూపించింది. ఇలా అందరినీ ప్రేమించమని చెప్తూ రాగం, విరాగం అనే శబ్ద చమత్కృతితో పాటు సర్వులకూ సులభమైన మార్గాన్ని మోక్ష సాధనగా సూచించింది అమ్మ.

సాధ్యమైనదే సాధన : నేటి సాంఘిక పరిస్థితిననుసరించి మనిషి పొట్టకూటికై ప్రాకులాడుతూ, ఉన్న కాలాన్నంతా ధనార్జన కోసమే ఖర్చుపెడుతూ ఉన్నాడు. వేదాలు, పురాణాలు, బైబిలు, ఖురాన్ వంటి ఉత్తమ గ్రంథాలు బోధించినా, ప్రవక్తలు ప్రవచించినా ఆ ధర్మాలు ఆదర్శాలుగా మిగిలిపోతున్నాయి. వాటినన్నింటిని ఒక్కసారిగా సాధన మార్గంలో పెట్టటం సాధ్యం కాదు. అందువలన మనిషి కర్తవ్యాలనుండి జారిపోకుండా వీలైనంత వరకు పాటించాలి అనే అభిప్రాయంతో అమ్మ 'సాధ్యమైనదే సాధన' అని ప్రబోధించింది.

'ఏదయినా సాధన మార్గం సూచించమ్మా ! అని ఎవరయినా అడిగితే 'సాధన కూడా సాధ్యమే కావాలి గదా నాన్నా! నీకు ఏది సాధ్యమయితే దానినే చేయి' అని అమ్మ సమాధానం. అయితే ఇన్ని మార్గాలెందుకు? ఒకే మార్గాన్ని అందరూ అనుకరించగూడదా? అనిపించవచ్చు. 'సమష్టి వ్యష్టి కావటమే సృష్టి' అని అమ్మ చెప్పినట్లుగా సృష్టి ఎపుడూ భిన్నంగానే ఉంటుంది. అందుచేత భిన్నత్వంలో ఏకత్వాన్ని చూడటం కోసం ఎవరికి తోచిన మార్గాన్ని వారు అనుసరిస్తారు. ఒక విధంగా ఆలోచిస్తే ఎవరు ఏ సాధన మార్గాన్ని ఉపదేశించినా దానిని అనుసరించటం సాధ్యం కానప్పుడు దానివల్ల సాధనకు జరిగేదేమీ ఉండదు. సాధ్యమయితేనే ఏ సాధనయినా చేయగల్గుతాడు మానవుడు.

కఠోర నియమాలను ఆచరించలేని నేటి మానవాళికి ఇది అపూర్వమైన అవకాశం. అయినా సాధకులన్నవారి సాధనలన్నీ ఒకటిగానే ఉండవు కదా!

లక్ష్యం ఒకటే అయినా మార్గాలు మాత్రం వేరు. సాధనలో ఇది గొప్పదీ, ఇది తక్కువదీ అని లేదు. ఒకరికి ధ్యానం బాగుండవచ్చు, ఒకరికి నామం బాగుండవచ్చు ఎవరికి ఏది సాధ్యమయితే అదే సాధన అని సాధన విషయంలో తన అభిప్రాయాన్ని వివరించింది అమ్మ.

అమ్మ అందరి ప్రశ్నలకూ సమాధానాలు చెప్తుంది. కాని, ఒక్కొక్కరితో మాట్లాడేపుడు ఒక్కొక్క విధంగా ఉంటుంది. ప్రశ్నించేవారి స్థాయినిబట్టి అమ్మ సమాధానం ఉంటుంది. పరిగెత్తేవాడిని హఠాత్తుగా ఆపటంకాక వాడివెంట కొంత దూరం పరుగెత్తి, వాడు అలసిపోయి ఆగినపుడు పట్టుకోవడం అమ్మవిధానం.

ఒక సందర్భంలో 'అసలు ఆధ్యాత్మిక సాధన అంటే ఏమిటమ్మా?' అని ఒకరు ప్రశ్నించగా 'ఒకటి అనేకమయింది కనుక, అనేకంలో ఆ ఒక్కదానిని చూడడమే ఆధ్యాత్మిక సాధన' అని నిర్వచించింది. 'మరి అది ఎలా గుర్తించటం'? అని అడిగిన వారికి సమాధానంగా తాను కట్టుకున్న చీరనో, దగ్గరగా ఉన్న మరే వస్తువునో ఉదాహరణగా తీసుకుని చెప్పింది. 'ఒకే దారం పడుగు పేకగా నేయబడి సమష్టి అయిన చీర ఏర్పడటం, అందులో వేరు వేరుగా ఉన్న దారపు పోగులు వ్యష్టికి రూపాలయి రెండూ ఒకే ప్రత్తితో తయారుకావటం-అంతా ఒకటి అన్న మహా సత్యం నిరూపితమవుతుంది అని వివరించింది అమ్మ. స్థూల దృష్టితో చూస్తే పైన చెప్పిన 'సాధ్యమైనదే సాధన' అన్న నిర్వచనానికీ ఈ వాక్యానికీ వైరుధ్యం కన్పించవచ్చు. కాని, ఆలోచిస్తే స్వవచన వ్యాఘాతం ఏమాత్రం లేదు. అనేకంలో ఒకటిని చూడగలగడం సాధ్యమైతే అదే సాధన. తరతమ భేదం గోచరించినా మార్గం ఒకటే. రెండు వాక్యాల్లో రెండు నిర్వచనాలున్నా రెండూ సమన్వయం ఉన్న నిర్వచనాలే.

తోచిందేదో చెయ్యి - తోపింపచేసేది వాడేగా:

అమ్మ దృష్టిలో మనిషికి కర్తృత్వం లేదు. మనిషికి వచ్చే ఆలోచనలకుగానీ, క్రియలకుగానీ అతడు బాధ్యుడు కాదు. వాటికి మూలం అతనిలో కలిగే ప్రేరణ. ఆ ప్రేరణనే దైవం అంటుంది అమ్మ. అందుకనే 'దైవ సంకల్పం కాదు సంకల్పమే దైవం' అని నిర్వచించింది. ఒకడు మంచి పనిచేసినా ఒకడు చెడ్డపని చేసినా ఆ రెంటికీ ఆ ఇద్దరూ కర్తలు కారనీ, ఆ ఇద్దరికీ ప్రేరణ ఇచ్చేది ఒకే శక్తి అని

చెప్పింది. ఆ సమదృష్టితోనే తన పట్ల హింసాత్మకంగా ప్రవర్తించినా వారి యెడల కూడ అమ్మ శాంతాన్నీ, సహనాన్ని ప్రదర్శించింది.

అమ్మ చెప్పిన ప్రసిద్ధ వాక్యాల్లో 'చేతలు చేతుల్లోలేవు' అనే వాక్యం ఒకటి. 'దైవ ప్రేరణ కాదు ప్రేరణే దైవం' అంటూ 'నాచేత దైవం ఏది చేయిస్తే అది చేస్తున్నాననుకో' అని ఆధ్యాత్మిక సత్యాన్ని ప్రబోధించింది. ఏదయినా ఆచరించడం మన చేతుల్లో ఉన్నదా! చెయ్యకుండా ఉండాలన్నా ఉండగలమా ? అట్లా ఉండగల్గినా మన చేతుల్లో కొంత ఉన్నట్లే. ఏది జరిగినా ఏది చేసినా దైవం చేశాడనుకోవడం సుఖానికి మార్గం. ఇది కర్మ ఫలత్యాగం కాదు. సర్వార్పణం. అంతా దైవమే, అంతా వాడే చేస్తున్నాడు అనే నిశ్చల చిత్తంతో ఏ పని చేసినా అది లోకానికి ఉపయోగకరమైనదే అవుతుంది. ఆ భావంతో కర్తవ్యాన్ని నిర్వహిస్తే రాగద్వేషాలకు తావెక్కడుంటుంది? మంచి జరిగినా, చెడ్డ జరిగినా ఇదంతా ఆ దైవానిదే. నాది కాదని అనుకోవటం వలన అహంకారాలు, మమకారాలు నశిస్తాయి. ఈ అహంకార మమకారాలే కర్మ అనే కాలసర్పానికి రెండు కోరలు. దానివల్లనే పుణ్యపాపాలు, సుఖదుఃఖాలు. కనుక చేసేటప్పుడు నేను, నాది అనే సంకుచిత దృష్టి విడనాడాలి. కర్మలన్నీ సత్త్వరజస్తమస్సులనే గుణాలవల్లనే జరుగుతాయి. ఆ గుణాలు ప్రకృతికి చెందిన గుణాలే గాని సాక్షిరూపంగా ఉన్న నావి కావు, అనే భావమే జ్ఞానం. దీనితో కర్మలూ, వాటి ఫలితాలు రెండూ తన మీద కాకుండా ఆ దైవం మీద పెట్టినట్లవుతుంది. ఈ నిశ్చయజ్ఞానమే కర్మయోగంలో ఉండే ఆంతర్యం.

ఈ విషయంలో శ్రీరమణమహర్షి ఏం చెప్పారో పరిశీలిద్దాం. 'నా దృష్టిలో చెడ్డ అనేది లేదు' అన్నారు మహర్షి. సర్వమూ లోకాన్ని నడుపుకు పోయే శక్తి యొక్క కార్యమే. ఆ శక్తి దృష్టిలో ఇది చెడ్డ, ఇది మంచి అని లేదు. వ్యక్తులకు బుద్ధ్యనుసారం నడవడానికి స్వాతంత్ర్యం లేదు. ప్రతి చిన్న కదలికా భగవంతుని ఆజ్ఞననుసరించే జరగాలి కదా? మరి వీడి ఆలోచన అంటూ వేరే ఉన్నదా? ఏమైనా ఉన్నది అని అనుకునే వాడయితే తోచేలా చేసేది చైతన్యాత్మ అన్న స్ఫురణతో చెయ్యడమే' అన్న రమణమహర్షి మాటలకూ, అమ్మ మాటలకూ వ్యత్యాసమేమీ లేదు.

మానవుని నడక నవగ్రహాల మీద ఆధారపడి లేదు. రాగద్వేషాలనే రెండే గ్రహాల మీద ఆధారపడి ఉంది.

మనిషికి, మనసుకు పరమశత్రువు అశాంతి. అశాంతికి బీజాలు రాగద్వేషాలు. వాటిని రూపుమాపితే కాని మనస్సుకు స్వస్థత చేకూరదు. సామాన్యంగా మనకిష్టం అయిన దాని పట్ల రాగమూ, అయిష్టం అయిన దానిపట్ల ద్వేషమూ ఉంటాయి. దీపమున్న చోట నీడలాగ రాగం ఉన్న చోట ద్వేషం తప్పదు. అందుకే అమ్మ 'మానవుని నడకకు రాగద్వేషాలే మూలకారణం' అని రాగద్వేషాల ప్రభావాన్ని చాటి చెప్పింది. ఇంతవరకూ మానవ జీవితంలో వచ్చే ఒడిదుడుకులకు, సుఖదుఃఖాలకు అన్నింటికి నవగ్రహాల నడకే మూలం అని అనుకుంటాం. మనం లోకంలో చూస్తూనే ఉంటాం. గ్రహస్థితి బాగాలేదని వాటి దోషాలనుంచి తప్పించుకోవటానికీ, గ్రహానుకూలత కోసం కొందరు జపతపాలు చేస్తూ ఉంటారు. మానవుని ఆలోచనా సరళికి జీవన సరళికి నవగ్రహాలే ఆధారమని సంప్రదాయంగా వస్తోంది. మానవ సహజమైన ఈతిబాధలకు, కష్టసుఖాలకు నవగ్రహాల్నే బాధ్యుల్ని చేస్తూ ఉంటారు.

అమ్మ కనిపించని గ్రహాలకంటే మానవుని నడకకు రాగద్వేషాలే మూలకారణం అని చెప్పింది. స్థూలదృష్టితో చూసేవారికి ఇటువంటి ఆలోచన రాదు. విశిష్టమయిన ఆలోచనా దృక్పథం అమ్మది. కనుకనే మూలానికి వెళ్లి ఆలోచించి రాగద్వేషాలే కారణమని చెప్పింది. ఈ రాగద్వేషాలు మనిషి జీవితంలో పడుగు పేకల్లా అల్లుకుపోయి ఉంటాయి. రాగం యొక్క రూపాంతరమే ద్వేషం.

ఉదాహరణకు అత్తా, కోడళ్లనే తీసుకుందాం. ఇరువురూ బద్ధశత్రువుల్లాగా ప్రవర్తిస్తూ ఉంటారు. దీని మూలానికి వెళ్లి కారణం ఆలోచిస్తే ఒకే వ్యక్తి మీద పెంచుకున్న మమతే వారి మధ్య విభేదానికి కారణం. కోడలు వచ్చాక తన కొడుకు తనకు దూరమవుతున్నాడేమోనని తల్లి భయం. అలాగే కోడలు కూడా. ఆ భయమే వారి మధ్య స్పర్థకు కారణం. మనుష్యులలోనే, కాదు పశు పక్ష్యాదులలో చూసినా ఈ స్థితే కన్పిస్తుంది.

గ్రహదోషాలను జపమో, తపమో చేసి ఉపశమింప జేయవచ్చు కానీ, ఈ రాగద్వేషద్వయం నుండి మాత్రం మానవుడు తప్పించుకోలేడు. ఇవి ఇంత తప్పనిసరియినపుడు మనం మాత్రం చేయగల్గింది ఏముంది? అని అన్పించవచ్చు. కాని సమస్య తెలిసినపుడు దానికి పరిష్కారం ఆలోచించటానికి ప్రయత్నించవచ్చు.

వెలుగు వచ్చిన దగ్గర నుంచి చీకటి మటుమాయమైపోయినట్లుగా రాగం పెంచుకుంటూ పోతే ద్వేషచ్ఛాయ తగ్గుతుంది. మిట్టమధ్యాహ్నం వేళ దేదీప్యమానంగా వెలుగువచ్చేటప్పటికి చెట్టునీడ కుంచించుకుని చెట్టు క్రిందనే ఒదిగిపోతుంది. అలాగే రాగం పెంచుకున్న కొద్దీ ద్వేషం క్రమంగా తగ్గిపోతుంది. అదే అమ్మ ప్రబోధం.

నీకున్నది తృప్తిగా తిని ఇతరులకు ఆదరంగా పెట్టుకో. అంతా వాడే చేయిస్తున్నాడనుకో.

అమ్మ దృష్టిలో నీకున్నది తృప్తిగా తిని ఇతరులకు ఆదరంగా పెట్టటమనేది ఒక్క భోజనం విషయంలోనే కాదు. అన్ని విషయాలలో సాటి వారిని ఆదుకోవాలన్నదే అమ్మ ఉద్దేశం. ప్రకృతి ప్రసాదించిన సమస్త సంపదనూ మానవులంతా సమంగా పంచుకోగల్గితే ప్రపంచంలో దారిద్ర్యం అనేది ఉండదని అమ్మ భావన. అది అందరికీ సమంగా అందడమే లోకకళ్యాణమని అమ్మ ఆలోచన. ఆకలి మంటల్లో దహించుకుపోతున్న ప్రక్కవాడిని వదిలేసి రేపటికి తన కోసం దాచుకోవడమే ప్రపంచంలోని అశాంతికి మూలం. మనిషిలో దినదినాభివృద్ధి పొందుతున్న ఈ స్వార్థాన్ని తుడిచేసి త్యాగభావాన్ని పెంపొందించేయడానికే అమ్మ చేస్తున్న ప్రయత్నం అని అమ్మ ప్రబోధాల వలన సువిదితమవుతుంది. కాని ఈ నాటి కాలపరిస్థితిని బట్టి ఏ రంగంలోనైనా అరాచకం, అన్యాయం, అశాంతి, అవినీతి చెట్టా పట్టాలేసుకుని తిరుగుతుంటే నాగరికత వికసిస్తున్నకొద్దీ మనం ఆశించే ప్రగతి కేవలం పథకాలూ, ప్రసంగాలకే పరిమితమైపోయింది. మానవులంతా ఒక్కటే అనే భావంతో అందరికీ సమానావకాశాలు, కనీసావసరాలైన తిండి, బట్ట, ఇల్లు ఏర్పడాలని కులమత వర్గవర్ణాది విభేదం లేని వసుధైక కుటుంబం కావాలని నినాదాలు చేసేవారు ఎందరో. పత్రికలద్వారా ప్రచారం

చేసే వారు మరికొందరు. కాని, ప్రస్తుత సమాజంలో అన్ని రంగాలలోను వర్గభేదం ఉందని అందరికీ అనుభవంలో ఉన్న విషయమే. ఒక ప్రక్క సమసమాజ నిర్మాణం కోసం ఆకాంక్ష, మరొక ప్రక్క సాటి మనిషిని మనిషిగా చూడలేని స్థితి నేటి సమాజ సంకట పరిస్థితి.

వెలుగు చీకట్ల సంధికాలంలో నాగరికతవెల్లువలో కొట్టుకుపోతున్న మానవతా విలువల్ని పునరుద్ధరించి ఆచరణాత్మకమైన పరిష్కారాన్ని సూచించింది అమ్మ. చీకటిలో చిరుదివ్వెను వెలిగించినట్లు అమ్మ ఆచరణకు రూపకల్పనే 'అందరిల్లు'. వర్గరహిత సమాజానికి అదొక చిరునామా; చిహ్నరూపం, 'గుణభేదమే లేని నాకు కులభేదమెక్కడిది?' 'శుక్లశోణితాలకేది కులమో అదే నా కులమ'ని, 'సర్వసమ్మతమైనదే నా మతమ'ని ప్రవచించిన అమ్మ వర్గ విభేదం లేకుండా వర్గం లేని స్వర్గాన్ని నిర్మించాలని, అందరింటిని ఒక ప్రయోగశాలగా ఎంచుకున్నదా! అనిపిస్తుంది.

అమ్మ ఏం చెప్పినా ఎన్ని చెప్పినా ప్రధానమైన శిలాశాసనం లాంటి సందేశం 'నీకున్నది తృప్తిగా తిని ఇతరులకు ఆదరంగా పెట్టుకో' అంతా వాడే చేయిస్తున్నాడనుకో' అని. ఏ వ్యక్తి అయినా ఇతరులకు ఏమైనా పెట్టినపుడే తాను తృప్తిగా తినగల్గుతాడు. ఈ సందేశమే అమ్మ జీవితమంతా పరచుకుని ఉన్నది.

ఒకటి రెండు ఉదాహరణలు పరికిద్దాం.

ఒక సోదరునికి అమ్మ బట్టలు పెడుతుంటే అతడు 'నాకు చాలా ఉన్నాయి. నాకెందుకమ్మా' అన్నాడు. వెంటనే అమ్మ 'నీ చేత ఇతరులకు పెట్టించడానికే నీకు నేను పెడుతున్నాను నాన్నా!' అని చెప్పింది.

ఒకసారి ఒక కుటుంబం అమ్మ దగ్గరకు వచ్చి వారి పిల్లవాడికి అమ్మ చేత అక్షరాభ్యాసం చేయించుకున్నారు. మన దృష్టిలో ఆ కార్యక్రమం అంతటితో పరిసమాప్తి అయినట్లే. కాని అమ్మ దృష్టిలో అసలు కార్యక్రమం ముందే ఉన్నది. ట్రేలో పోసి ఉన్న చాక్‌లెట్లలో ఒకటి తీసికొని పిల్లవాని నోటికి ప్రేమగా అందించి వాడి దోసిలి నిండా చాక్‌లెట్లు పోసి అందరికి పంచమన్నది. పిల్లవాడు వాటిని అందరికీ పంచుతుండగా అమ్మ ఆనందంగా చూస్తూ 'ఇదే అసలు అక్షరాభ్యాసం.

జీవితంలో నేర్చుకోవలసిన ప్రథమ పాఠం, ప్రధానపాఠం, ఇదే" అంటూ "తనకున్నదానిని అందరకూ అట్లా హాయిగా పంచుతుంటే ఎంత ఆనందంగా ఉంటుంది?" అని తన ఆనందాన్ని వ్యక్తం చేసింది.

మరొక సందర్భంలో 'పంచనికాడికి ఉండడం దేనికి? అని ప్రశ్నించింది.

సుప్రసిద్ధ పాత్రికేయులు శ్రీ పొత్తూరి వెంకటేశ్వరరావుగారు ఈ సందర్భంగా కొన్ని విషయాలను ప్రస్తావించారు. అందులో ఒకటి.

ఒకసారి వర్షంలో తడిసి ఒకామె అమ్మ దగ్గరకు వచ్చింది. అమ్మ వెంటనే ప్రక్కనున్న సోదరి వసుంధర అక్కయ్యను చీరె తీసుకురమ్మని చెప్పింది. కాని అమ్మ స్నానం చేసిన తరువాత కట్టుకోవడానికని ఉంచిన చీరె ఒకటి ఉన్నది. అందుకని ఆమె తటాపటాయిస్తుండగా అమ్మే లేచి వెళ్లి ఉన్న ఆ ఒక్కచీరె తీసుకు వచ్చి ఆమెకు ఇచ్చింది. తాను స్నానం చేస్తే చీరె మార్చుకోవడం వర్తమాన సమస్య కాదు. తడిసిన చీరెలో ఉన్నావిడ పొడిచీరె కట్టుకోవడం తక్షణం అవసరం. కాబట్టి ఉన్న ఒక్క చీరెను ఆమెకు ఇవ్వడమే అమ్మ దృష్టిలో సముచిత నిర్ణయం. అని ఆ సంఘటనను వివరించారు. ఈ త్యాగమే అమ్మ జీవితంలో వేయిరేకులుగా విరిసి అమ్మ జీవితాన్నే దివ్య పరిమళభరితం చేసింది. **'నీకున్నది తృప్తిగా తిని ఇతరులకు ఆదరంగా పెట్టుకో'.** ప్రబోధాత్మకమైన ఈ వాక్యంలో ఆధ్యాత్మికత, సామాజికత అంతర్లీనంగా ముడిపడి ఉన్నాయి.

"తమవాక్కుతో, దృష్టితో, స్పర్శతో, సంకల్పంతో ఎదుటివారి అంతరంగాన్ని వ్యష్టిగా సమష్టిగా స్పృశించి స్పందింప చేయగల్గిన సర్వజ్ఞులు, సమర్థులు అయిన ప్రతిభావంతులే ప్రవక్తలు. అటువంటి ప్రవక్తలలో మహాప్రవక్త అమ్మ' అన్నారు కొండముది రామకృష్ణగారు."

అమ్మ జీవితంలోని సంఘటనలకు, అమ్మ వాక్యాలకు భేదం ఉండదు. ప్రతి వాక్యం అమ్మతత్త్వాన్ని బోధిస్తుంది.

'అమ్మ ఉపదేశమే వేదాల పఠనం
అమ్మ ఉచ్ఛ్వాసమే లోకాల గమనం

అమ్మ సంభాషణలే శాస్త్రాల సారం

అమ్మ సాన్నిధ్యమే కైలాస శిఖరం' అంటూ ప్రస్తుతించారు కొండముది రామకృష్ణగారు.

vii) జ్ఞాన దీపికలు

అప్పుడప్పుడు ప్రసంగవశాన అమ్మ నోట వెలువడిన ఎన్నో వాక్యాలు జాతిని చైతన్యవంతం చేసే జ్ఞానదీపికలు.

ఎవరి అన్నం వారికున్నది

'అంతా ఉన్న అమ్మను తెలియజేయడానికే ఈ అమ్మ".

"నేను తల్లిధర్మం నెరవేర్చడం కోసమే వచ్చాను" అని తన అవతార పరమార్థాన్ని తెలియజేసింది అమ్మ. తల్లి ధర్మం కాబట్టే అమ్మకు ఎప్పుడూ బిడ్డల ఆకలి గురించే ఆలోచన. మీకు కోరికలు లేవా ? అని ఒకరు అడిగితే "ఎందుకు లేవూ ! మీకు పెట్టుకోవాలనుకోవడం కోరికే కదా !అని అమ్మ సమాధానం. ఈ విధంగా ఎంతసేపటికీ అమ్మ కార్యక్రమం అందరికీ అన్నం పెట్టుకోవడమే. అందుకే అమ్మను అన్నావతారంగా భావిస్తూ ఉంటారు. అన్నం పెట్టడానికి ఇంత ప్రాధాన్యం ఇచ్చిన అమ్మ అవతరణంలోని ప్రత్యేకత ఏమిటి ? ఈ అన్నదాన మహాయజ్ఞం ద్వారా అమ్మ ఏంసందేశం అందిస్తున్నది? అని తెలుసుకునే ముందు అన్న ప్రాధాన్యాన్ని గురించి సంప్రదాయం చెప్పిన విషయాలను పరిశీలిద్దాం.

"అన్నాద్భవంతి భూతాని పర్జన్యా దన్న సంభవః
యజ్ఞాద్భవతి పర్జన్యో యజ్ఞః కర్మ సముద్భవః"

యజ్ఞం వలన వర్షం కురుస్తుంది. తద్వారా అన్నం లభిస్తుంది. ఆ అన్నంతో సమస్త జీవరాసులు పోషింపబడతాయి. "యజ్ఞో వై విష్ణుః" అని ఉన్నది కదా. యజ్ఞమే విష్ణు స్వరూపం. విష్ణువు స్థితికారకుడు. యజ్ఞం వలన వర్షం, దాని వలన అన్నం లభిస్తోంది. కనుక సర్వప్రాణుల ఉనికికీ అన్నమే ఆధారం.

'అన్నం హి భూతానాం జ్యేష్ఠం' - 'అన్నాదేవ ఖల్విమాని భూతాని జాయన్తే' అని ఉపనిషద్వాణి. ఏ విధంగా చూసినా యావద్విశ్వం అన్నం వల్లనే మనుగడ సాగిస్తున్నట్లు తెలుస్తోంది.

'అన్నాశ్రితాని భూతాని - అన్నం ప్రాణమితి శ్రుతిః
తస్మాదన్నం ప్రదాతవ్యం'

ఏ ప్రాణికయినా అన్నమే ప్రాణం. అందుకే అన్నగతప్రాణులని అంటూ ఉంటారు.

"తనుఁ జంప వచ్చిన ఘనశత్రునకు నైన
అన్నంబు బంధుత్వ మావహించు"

అన్నం అంటే ఆహారం. దీన్ని తగిన పరిమాణంలో తీసుకొన్నప్పుడు అన్నం ఆరోగ్యకరం, ఆయుర్దాయాన్ని పెంచేది అవుతుంది. అన్నం విషయంలో చాలామందికి అనుభవంలో ఉన్న విషయం ఏ రోజు ఎక్కడ ప్రాప్తమో తెలియకపోవడం. మనం తినే ప్రతి మెతుకు మీద భగవంతుడు మన పేరు వ్రాస్తాడంటారు. ఎప్పుడు ఎక్కడ మనకు ఆహారం అందేట్లు చేయాలో ముందే నిర్ణయమై ఉంటుంది. దాని ప్రకారమే అందుతూ ఉంటుంది.

"ఆయుః కర్మచ విత్తం చ విద్యా నిధనమేవ చ
పంచైతాన్యపి సృజ్యన్తే గర్భస్థ స్యైవ దేహినః"

శిశువు గర్భంలో ఉన్నప్పుడే ఇవన్నీ నిర్ణయింప బడతాయి. ఉదాహరణకు మనం ప్రయాణం చేయాలి అనుకున్నాం. కానీ రైలు ఎక్కక ముందే టిక్కెట్టు తీసుకుంటున్నాం-అదే విధంగా ప్రాణికోటి సృష్టికి ముందే ఏ జీవికి ఏ ఆహారం కావాలో నిర్ణయమయ్యే ఉంటుంది. **ఉదా** : ఏ రైలులోనో ప్రయాణం చేస్తూ ఉంటాం. నిర్ణయంలో ఎక్కడ తినాలని వ్రాసిపెట్టి ఉన్నదో - అక్కడకు వచ్చినప్పుడే మనకు తినాలని ఆలోచన రావడం కానీ, ఆహారం అందడం కానీ జరుగుతుంది. ఈలోపు మనం తినాలన్నా తినలేము. అంతా నిర్ణయం ప్రకారమే జరుగుతుంది. అది విశ్వప్రణాళికలోని భాగం. ఆ విధంగా అందుకున్న ఆహారం శరీరంలో సప్తధాతువులుగా మారి ప్రాణుల ఉత్పత్తికి కారణం అవుతోంది. ఈ విధంగా ప్రాణుల పుట్టుక, పోషణలకు అన్నమే ఆధారం అవుతోంది. అన్నం ఇంత ప్రశస్త మైంది కనుకనే 'అన్ని దానాలలోకి అన్నదానం మిన్న' అనీ, 'అన్నదానా త్పరం నాస్తి' అనీ అన్నదాన ప్రాశస్త్యాన్ని చెప్తూ ఉంటారు.

అన్నపూర్ణాలయంలో జరిగే నిరతాన్నదానాన్ని గురించి ఎవరయినా 'అమ్మా' మీరు ఇంతమందికి అన్నదానం ఎలా చేస్తున్నారు. మేము కొద్దిమందికి పెట్టటమే

కష్టంగా ఉంది' అని అంటే 'తల్లిబిడ్డలకు - పెట్టుకోవడంలో విశేషం ఏముంది నాన్నా! అయినా నేను పెట్టడం ఏముంది? వాళ్ల అన్నం ఇక్కడ ఉండి వాళ్ళు తింటున్నారు. అది లేకపోతే వారు రాలేరు. వచ్చినా తినలేరు. **'ఎవరి అన్నం వారి కున్నది'** అంతేకాదు, అక్కడ మీరు పెడుతున్నాం అని అనుకుంటున్నారు. ఇక్కడ ఎవరి అన్నం వారు తింటున్నారు అని నేను అనుకుంటున్నాను' అని అమ్మ సమాధానం చెప్తుంది.

చిన్నతనంలో కూడా అమ్మ ఎవరికి ఏది అవసరమో గమనించి అది వారికి ఇస్తూ ఉండేది. ఒక్కొక్కసారి ఒంటిమీద బంగారు నగలు కూడ తీసి ఇచ్చి వేసేది. అదేమిటమ్మా అంటే 'నేను ఎవరికి ఇచ్చినా దానం అనుకోవడం లేదు. వారి వస్తువే నా దగ్గర ఉంది. వారిది వారికి ఇస్తున్నానని అనుకుంటున్నాను' అనేది. ఈ విధంగా ఏ విషయంలోనూ తన కర్తృత్వాన్ని అంగీకరించని స్థితి బాల్యం నుంచీ అమ్మలో వ్యక్తమవుతూ ఉండేది.

నాది అనుకోవడం మమకారం. నేను చేస్తున్నాను అనుకోవడం అహంకారం. ఏ చిన్న వస్తువయినా నాది అనుకోవడం, ఏ చిన్న పనయినా నేను చేస్తున్నాను అనుకోవడం మానవ సహజం. కానీ సొంతం అనుకోవడమే చింతకు కారణం అన్నట్లుగా నాది అన్న భావమే చింతకు కారణం. నేను చేస్తున్నాను అని ప్రతి పనికీ తాను కర్తనని భావిస్తే తాను అనుకున్నది జరుగకపోతే దుఃఖం, బాధ కల్గుతాయి. కానీ దేనికీ నేను కర్తను కాను అనుకున్నప్పుడు విజయానికి పొంగిపోవడం, పరాజయానికి క్రుంగిపోవడం ఉండదు. ఇదే కర్తృత్వరాహిత్య స్థితి. ఈ స్థితి అమ్మలో ఎల్లవేళలా స్థిరంగా ఉంటుంది. అన్నదాతలంతా అమ్మకు వారసులే. కనుక అన్నదాతలందరికీ అమ్మ ఆచరణాత్మకమైన సందేశాన్ని అందిస్తోంది. అన్నదానం చేయడమే కాదు. నేను చేస్తున్నాను అనే భావన లేకుండా చేయాలి అని 'నా జీవితం సందేశం' అని చెప్పిన అమ్మ తాను చెప్పానని కాకుండా తాను చేస్తున్నట్లుగా చేయమని ఆచరణాత్మకంగా ప్రబోధించింది.

'ఎవరి అన్నం వారికున్నది' అనే అమ్మ వాక్యం పరిశీలిస్తే ఒకవంక అమ్మలో కర్తృత్వరాహిత్య స్థితి కన్పిస్తుంది. మరొక వంక అన్నం పెట్టడంలో ఉన్న ఆనందాన్నీ, తృప్తినీ పొందుతూనే ఇదంతా నిర్ణయంలో భాగమే అని విశ్వప్రణాళికను దర్శించిన

దివ్యత్వం అమ్మలో కనిపిస్తుంది. ఈ విధంగా "కర్తృత్వరాహిత్య స్థితి, అన్నదాతలకు సందేశం, దివ్యమాతృత్వం" అనే ఈ మూడు గుణాల ముచ్చటైన ముప్పేటయే 'ఎవరి అన్నం వారికి ఉన్నది' అనే అమ్మవాక్యం.

ఒక వంక 'ఎవరి అన్నం వారికున్నది' అని అంటూనే మరొక వంక "భోజనం చేసే వచ్చానమ్మా" అని అంటున్నా "ప్రసాదంగానే అయినా కొంచెం తిను నాన్నా" అంటూ లాలిస్తూ, బుజ్జగిస్తూ ఏదో విధంగా అన్నం తినిపించేది అమ్మ. ఇలా చేయడం ఒక్క మాతృమూర్తికే సాధ్యం. ఇదే అమ్మగా అవతరించడంలోని అంతరార్థం. ఇంతకుముందు కనీ వినీ ఎరుగని విశేషమైన అవతారం. అన్నపూర్ణాలయంలో భోజనమంటే అది మామూలు అన్నం కాదు ప్రసాదమే. దేవతలు ఏదీ ప్రత్యక్షంగా బోధించరు. "పరోక్ష ప్రియా వై దేవాః" అన్నట్లుగా నర్మగర్భంగా ఆధ్యాత్మిక సత్యాన్ని ప్రబోధిస్తారు. సాధారణంగా ప్రసాదం అనగానే నడిరోడ్డు మీద నడిచివెళ్తున్నా ఆగి ఎంతో పవిత్రంగా కళ్ళకద్దుకొని తీసుకుంటారు. మన మనస్సులో ప్రసాదానికున్న విలువ అటువంటిది. అందుకే అమ్మ వండేవారికి, పెట్టేవారికి, తినేవారికి ఆలయ సంబంధమైన భావన ఉండి ప్రసాదంగా భావించి అన్నం తినాలి అన్న భావంతో అన్నపూర్ణాలయం అని పేరు పెట్టింది. అక్కడ భోజనం చేయడమంటే అమ్మ అనుగ్రహం పొందడమే "అద్వైత ఇతి అన్నం" ఆస్వాదింపబడేది. అంటే అనుభవింపబడేది అని అర్థం. అనుభవించే ప్రతిదీ కర్మే. మామూలుగా శరీర పోషణార్థమై మనం తినే అన్నం ద్వారా మానసిక ప్రవృత్తులు పూర్వకర్మవాసనల చేత ప్రేరణ పొంది మనోవికారాలను కలిగిస్తాయి. కనుక ఆ అన్నం మనశ్శుద్ధిని కలిగించదు. కారణం పెట్టేవారి, వండేవారి భావ వికారాలు ఆ అన్నానికి సంక్రమించటమే.

కానీ, అవతారమూర్తి అయిన అమ్మ అమృతహృదయంతో పెట్టే అన్నం పవిత్రమై, అమ్మభావమే ఆ అన్నంగా మారి, మనోవైకల్యాన్ని తొలగించి సత్త్వగుణాన్ని పెంపొందింప చేస్తుంది. అమ్మ అనుగ్రహరూపమైన ఆ అన్నం భౌతికమైన ఆకలిని తీర్చడమే కాకుండా కర్మఫలాన్ని నిశ్శేషం చేసి మనసును పవిత్రంగాను, పరిశుద్ధంగానూ చేస్తుంది. కర్మానుభవం పరిపక్వమైన స్థితిలో అమ్మ చేతిముద్ద తిని సత్త్వస్థితిని పొందుతారనే ఉద్దేశంతోనే 'ఎవరి అన్నం వారికున్నది' అని చెప్పింది అమ్మ.

"ఆహార శుద్ధౌ సత్త్వశుద్ధిః" అంటారు కదా ! ఆహారాన్ని బట్టి ఆలోచనలు, వాటిని బట్టి ప్రవర్తన, తద్వారా వ్యక్తిత్వం రూపుదిద్దుకుంటుంది. "ఇచటి మెతుకు కొరుకు, బ్రతుకు తెరువు దొరుకు" అని నదీరా అన్నట్లుగా అమ్మ అనుగ్రహంతో పెట్టే ప్రతి మెతుకు బ్రతుకు తెరువునే కాకుండా బ్రతుకు యొక్క పరమార్థాన్ని కూడా చూపిస్తుంది. కనుక లాలనతో అన్నం పెట్టి పోషించి, భౌతికమైన ఆకలిని తీర్చడమే కాకుండా ఆధ్యాత్మిక జ్ఞానతృష్ణను తీర్చి, తృప్తిపరచి తన బిడ్డలను ఉన్నతశిఖరాలపై నిలబెట్టాలని అమ్మ ఆకాంక్ష. 'నేను మీకు పెట్టడం మీ చేత పెట్టించటం కోసమే' అంటూ త్యాగగుణాన్నీ సేవాభావాన్ని పెంపొందించి తన బిడ్డలందరూ పరిపూర్ణమానవులుగా ఎదగడానికి తన జీవితాన్నే సందేశంగా మలచి అందించింది అమ్మ. పరిపూర్ణ మానవత్వమే దైవత్వం కదా.

అమ్మ అన్నావతారంలోని పరమార్థాన్ని గ్రహించి మన జీవితాలను చరితార్థం చేసుకుందాం.

నేను అమ్మను - మీరు బిడ్డలు

"అమ్మా ! మీరు సాక్షాత్తు రాజరాజేశ్వరి కదా !" అని ఒకరు అడిగితే "ఇన్ని పేర్లెందుకు నాన్నా"! అమ్మను అనుకుంటే చాలదూ !" అంటూ తాను ఏ దేవత అవతారమూ కాదనీ, భక్తులు ఎవ్వరూ లేరనీ,

'నేను గురువును కాను. మీరు శిష్యులు కారు.

నేను అమ్మను, మీరు బిడ్డలు' అని చెప్పింది. ఈ వాక్యాలు వినగానే అమ్మ తాను దైవాన్ని కాననీ, గురువును కాననీ చెప్పినట్లుగా అన్పిస్తుంది. అమ్మ వాక్యాలు కొన్ని వినగానే నిషేధంలాగా అన్పిస్తాయి. ఆంతర్యాన్ని పరిశీలిస్తే, నిషేధం కాదని, ప్రధానాంశాన్ని ప్రస్తుతించడానికి ఈ నిషేధవాక్యం భూమికగా ఉపకరిస్తుందని తెలుస్తుంది. ఒక సందర్భంలో అమ్మ 'తెలియనిది తెలియచేయడానికే నా రాక' అని తన అవతార ఉద్దేశాన్ని తానే స్వయంగా తెలియపరచింది. మరొక సందర్భంలో

'తెలియ చెప్పేవాడు గురువు
తెలియచేసేది దైవం' అని చెప్పింది.

అంటే తెలియనిది తెలియచేయడానికే తాను వచ్చానని చెప్పిన అమ్మ మాటల్లోనే అమ్మ దైవం అని చెప్పినట్లయింది. అంతేకాదు ఎంతోమందికి ఎన్నో దర్శనాలనూ, నిదర్శనాలనూ ప్రసాదించింది. హైమక్కయ్య విషయంలో కూడా 'హైమను నేనే కన్నాను, నేనే పెంచాను, నేనే చంపుకున్నాను. నేనే దైవత్వం ఇచ్చాను' అని ప్రకటించింది. మరి దైవత్వాన్ని ఇవ్వడం దైవానికి కాక ఎవరికి సాధ్యం ? అలాగే జ్ఞానం గురించి ఆధ్యాత్మికత గురించి ఎందరో తత్త్వాన్వేష్యషకులకు, సాధకులకు గురువై ప్రబోధిస్తూనే నేను గురువును కాను అని ఎందుకు చెప్పింది? అనే ప్రశ్నలు ఉదయిస్తాయి. కానీ కాస్త నిదానించి ఆలోచిస్తే ఈ ప్రశ్నలన్నింటికీ అమ్మ వాక్యాలే సమాధానాలు ఇస్తాయి.

భగవద్గీతలో శ్రీ కృష్ణపరమాత్మ 'అహమాదిర్హి భూతానాం' అని అన్నింటికీ మూలం తానే అని ప్రకటించాడు. అలాగే అమ్మ 'నేను అమ్మను' అంటూ 'అమ్మ అంటే అంతులేనిదీ, అడ్డులేనిదీ, అంతా అయినదీ, సర్వానికీ ఆధారమయినదీ అమ్మ' అనీ, 'అమ్మ అంటే ఈ మంచం మీద కూర్చున్న ఈ రూపమే కాదు. అన్నీ తానే అయి, అంతటా ఉండేదే అమ్మ 'అనీ 'తల్లి అంటే తొలి' అనీ 'ఈ సృష్టి అనాది నాది' అని ప్రకటించింది. అసలు మాత అంటే "మాంతి లోకాః అస్యాం ఇతి మాతా' సమస్తాన్నీ తన లోనే ఇముడ్చుకునేది అని అర్థం. అంటే అంతా తానే అమ్మే అయినపుడు ప్రత్యేకించి గురువును అనో, దైవాన్ని అనో చెప్పవలసిన అవసరం ఏముంది? అంతేకాదు 'మీ నుండి మేము కైవల్యం పొందగలమా !' అని ఒకరు అమ్మను అడిగితే 'నానుండి పొందే దేముంది? అమ్మ ద్వారా పొందేది ఏముంటుంది? అమ్మను చూడడమే పొందడం' అని అమ్మ జవాబు. అంటే అమ్మదర్శనం అంటే ఆ పరబ్రహ్మ సాక్షాత్కారమే కదా! అంతేకాదు మరొక సందర్భంలో ఓంకార స్వరూపమే తానని తెలియచేసింది. ఒకసారి అమ్మ ఒక పిల్లవాడికి అక్షరాభ్యాసం చేస్తూ ఓం అని వ్రాసి ఇచ్చింది. ఆ పిల్లవాడు ఆ అక్షరం చూడడం మానివేసి అమ్మ ముఖాన్ని మాత్రమే అవలోకిస్తూ ఉండిపోయాడు. అతని తల్లిదండ్రులు ఆ అక్షరం వంక చూడమని మందలిస్తూ ఉంటే అమ్మ అన్నది. 'చూడనీ, ఏదయితేనేం, అన్నీ ఒక్కటేలే' అని ఓంకారస్వరూపమే తానని తెలియచేసింది. ఈ విధంగా ఎన్నో సందర్భాలలో అంతా తానే అని తన మాటలతో

చేతలతో సూచిస్తూనే ఉండేది. మరి అంతా తానే అయినపుడు దైవాన్ని కానని అనడమేమిటి? అని ఆలోచిస్తే 'అమ్మ నేను దైవాన్ని అని సూటిగా చెప్పిఉంటే మనందరికీ అమ్మ అంటే భయమే కలిగేది. ఎందుకంటే కొందరి దృష్టిలో దైవం అంటే పాపాలు చేస్తే శిక్షించేవాడుగా, కొందరికి శిష్టులను కాపాడేవాడుగా, కొందరికి తల్లిగా, కొందరికి తండ్రిగా గోచరిస్తాడు.

కాని దైవాన్ని తల్లిగా ఆరాధించడంలో ఉన్న దగ్గరితనం మరే మార్గంలోనూ కన్పించదు. లోకంలో ఎవరికయినా తల్లికంటె మించిన సన్నిహితులెవరూ ఉండరు. తల్లి కంటె మించిన దైవమూ లేదు. అసలు ఆ భగవంతుడే ప్రతి ఇంటిలో తనకు మారుగా తల్లిని ఏర్పాటు చేశాడంటారు. మరి అమ్మ తల్లులందరికీ తల్లికదా! అందుకే మనకు తన దగ్గర ఆ చనువు కలిగించడానికీ, మాతృతత్త్వంలోని అవ్యాజ ప్రేమను మనకు పంచడానికీ 'నేను అమ్మను' అని చెప్పింది. అలాగే 'నేను గురువును కాను' అని చెప్పింది. ఎందుకంటే గురుశిష్య సంబంధం తల్లీబిడ్డల బంధం కంటే భిన్నమైనది. తల్లికి బిడ్డ ఎటువంటి వాడయినా ఇష్టమే.

బిడ్డ గుణ దోషాలతో, యోగ్యతా యోగ్యతలతో సంబంధం లేదు. అందుకే అమ్మ 'గుణభేదమే లేని నాకు కులభేదమెక్కడిది? గుణభేదమే ఉంటే ఎవ్వరూ ఏడవమైలు దాటిరాలేరు' అని చెప్పింది. కానీ గురువు తనను ఆశ్రయించిన వారందరినీ శిష్యులుగా స్వీకరించడం అంటూ ఉండదు. అన్ని విధాలుగా పరీక్షించి తనకు ఇష్టం అయితేనే దగ్గరకు తీసి ఉపదేశం చేయడం జరుగుతుంది. అందుకే అమ్మ 'నాకు శిష్యులెవరూ లేరు అంతా శిశువులే' అని చెప్పింది. అయినా ఏ బిడ్డకయినా తొలి గురువు తల్లే కదా! గురుత్వాన్ని నింపుకున్న మాతృప్రేమకు మానవాకృతి అయిన అమ్మ ప్రత్యేకించి తాను గురువును అని చెప్పడం ఎందుకు? అందుకే అమ్మ దైవాన్ని కాదు, గురువును కాదంటూ ఆ తత్త్వాలన్నీ ఇమిడిన మాతృతత్త్వమే తానని 'నేను అమ్మను - మీరు బిడ్డలు' అని ప్రకటించింది.

శిక్షణ కూడా రక్షణే

దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసం మహాత్ములు అవతరించి ధర్మసంస్థాపన కావించడం యుగయుగాల్లో జరిగినట్లు తెలుస్తోంది. వారి ఉద్దేశం ధర్మసంస్థాపన

అయితే, మార్గం సాధురక్షణ. ఆ రక్షణలో భాగంగా ధర్మానికి విరుద్ధంగా ప్రవర్తిస్తూ లోకకంటకులుగా ఉన్న దుర్మార్గుల్ని సంహరించవలసిన అవసరం రావచ్చు. నాటిన పైరు పైకి ఎదిగి, మంచి పంట పండాలంటే కలుపు మొక్కలను ఏరి పారెయ్యాలి. దుష్టశిక్షణ చేయడమే వారి ఉద్దేశం కాదు. సమాజస్థితిని కాపాడడమే మహాత్ముల ఉనికికి పరమార్థం.

దుర్జనులు సజ్జనులుగా మారాలని, సజ్జనులు సుఖశాంతులతో ఉండాలని పెద్దల ఆకాంక్ష. అలా జరగాలంటే దుష్టశిక్షణ చేయాలి. అమ్మ దృష్టిలో దుష్టశిక్షణ అంటే దుష్టత్వ శిక్షణ. 'శిక్షణ కూడా రక్షణే' అని అమ్మ చెప్పింది.

ఈ శిక్షణ మనకు మూడు విధాలుగా కన్పిస్తుంది.

శిక్షణ ద్వారా రక్షణ : అంటే ఒక్కరి శిక్షణ ద్వారా మరొకరికి రక్షణ. దుష్టశిక్షణ ద్వారా సాధు రక్షణ జరగటం ఒకటి.

శిక్షణ ద్వారా శిక్షణ : అంటే దుష్టశిక్షణ వలన ఆ శిక్షే వారికి శిక్షణ అయి వారిలో పరివర్తన వచ్చి వారు సజ్జనులుగా మారడం రెండవది. ఇక్కడ వారి శిక్షణే వారికి రక్షణ అయింది.

రక్షణ ద్వారా శిక్షణ : లలితా సహస్రనామాలలో 'శిష్టేష్టా' అనే నామం ఉన్నది. అమ్మ శిష్టుల పట్ల ఇష్టంతో ఉండేది. కాబట్టి సజ్జనులు రక్షింపబడటం చూసి తాము కూడా అలా ఉంటే భగవదనుగ్రహం పొందవచ్చు గదా అని కొందరు దుర్జనులు సజ్జనులుగా మారడం. ఇక్కడ సాధురక్షణ ద్వారా దుర్జనులు శిక్షణ పొందటం.

ఏది ఏమైనా ఏ శిక్షణ అయినా లోకరక్షణ కోసమే. మరి శిక్షణ అనేది ఎలా ఉంటుంది అంటే – చేసే పనులను బట్టి శిక్ష ఉంటుంది. రక్షణ ఆవశ్యకతను బట్టి శిక్షణ ఉంటుంది.

ఉదా : ఒక తల్లికి నలుగురు బిడ్డలుంటారు. వారిలో ఒక పిల్లవాడి ప్రవర్తన సరిగ్గా ఉండదు. వాడి వలన మిగతా పిల్లలకు కూడా ఇబ్బంది కలిగే పరిస్థితి వస్తుంది. అపుడు తల్లి వాడికి ఎన్నో విధాల చెప్పి చూస్తుంది. కాని వాడిలో ఏ మాత్రం పరివర్తన రాకపోతే మిగతా పిల్లల క్షేమం కోసం వాడిని

దూరంగా ఉంచుతుంది. అలాగే ఒక ఉద్యోగి ఉన్నాడనుకుందాం. అతడు ఏ వ్యసనాలకో బానిస అయి ఉద్యోగధర్మాన్ని సరిగా నిర్వర్తించడు. అధికారులు ఎన్నో విధాలుగా చెప్పి చూస్తారు. మార్పు వస్తుందేమోనని ఎంతో ఎదురు చూస్తారు. కాని అతడు మారకపోగా మిగిలిన ఉద్యోగులందరికీ భద్రత కరువవుతుంది. అపుడు అతణ్ణి ఉద్యోగం నుంచి తొలగించడం ఒక్కటే మార్గం.

ధర్మసంస్థాపన కోసం అవతరించిన రామ, కృష్ణాది అవతారాలలో దుష్టశిక్షణ జరిగింది. కాని దుష్టులు తలెత్తగానే సంహారం జరుగలేదు. వారిని సంస్కరించడానికి ఎన్నో ప్రయత్నాలు, ఎన్నో అవకాశాలు ఇచ్చి వారిలో మార్పును ఆకాంక్షించడం జరిగింది. వారిలో ఏ మాత్రం మార్పు రాకపోగా సాధువులను బాధపెట్టడం, మంచి పనులను చెడగొట్టడమే లక్ష్యంగా ప్రవర్తిస్తూ ఉంటే ఇక వారిని శిక్షించక తప్పదు. లేకపోతే లోకం అల్లకల్లోలం అవుతుంది అని దైవం అనుకున్నప్పుడు శరీరంలో దుష్టాంగాన్ని ఖండించి మిగిలిన శరీరభాగాల్ని రక్షించినట్లుగా సంహరించడం జరిగింది. విశ్వకళ్యాణం కోసం విశ్వామిత్ర సంకల్పిత మహాయాగాన్ని విధ్వంసం చేయ విజృంభించిన మారీచ, సుబాహువులనే రాక్షసులిరువురి పైనా శ్రీరాముడు భీకర అస్త్రాల్ని ప్రయోగించాడు. సుబాహువు మరణించగా, మారీచుడు సంస్కరింపబడి తాపసి అయ్యాడు. ఆశ్చర్యం. 'రామో విగ్రహవాన్ ధర్మః సాధుః సత్యపరాక్రమః' అని శ్రీరాముని స్తుతించింది ఆమారీచుడే. శ్రీకృష్ణుడు నూరు తప్పుల వరకు శిశుపాలుణ్ణి వధించాలని అనుకోలేదు. సంస్కరణకు అవకాశం లేనిచోట మాత్రమే సంహారం జరిగింది. ఆ శిక్షణ సాధుజన రక్షణ కోసమే.

ఒక దొంగను శిక్షిస్తున్నారు. అతనిలో పరివర్తన (ప్రవర్తనా మార్పు) తీసుకువచ్చే ఉద్దేశమే కదా అని! పిల్లవాడు నీళ్ళదగ్గరకో, నిప్పుదగ్గరకో వెళ్తుంటే తల్లి దండించి నివారిస్తుంది. అలా శిక్షించడంలో ఉద్దేశం రక్షణే.

'విద్యనేర్పువేళ వినకున్న బాగుగా
గురువు తిట్టవచ్చు - కొట్టవచ్చు
తల్లి బుగ్గ గిల్లి తాగించదా ఉగ్గు....'

అన్నట్లుగా గురువు తిట్టినా, అమ్మ కొట్టినా అదంతా రక్షణలో భాగమే. ఒక విధంగా చెప్పాలంటే భగవంతుడు మనకు శిక్షణ ఇవ్వడం కోసమే ఎన్నో

అనుభవాలను కల్గిస్తున్నాడు. జీవితంలో మనకు ఎదురయ్యే ప్రతి అనుభవం ఒక పాఠమే. ఆ అనుభవాలే జీవితంలో మనను ఉన్నతంగా తీర్చిదిద్దుతాయి. అందుకే అమ్మ 'శిక్షణ కూడా రక్షణే' అని చెప్పింది.

తప్పు అని తెలిసీ మనిషి ఎందుకు తప్పులు చేస్తాడు ? అని అడిగితే "తప్పించుకోలేకనే" అనేది అమ్మ సమాధానం. పుట్టుకతో ఎవ్వరూ నేరస్థులు కారు. కొన్ని సందర్భాలలో పరిస్థితులే వాళ్ళను నేరస్థులను చేస్తాయి. ప్రేమకు దూరమై కొందరు, అవసరాలు తీరక కొందరు, ఆశించినది అందక అసంతృప్తితో కొందరు నేరస్థులుగా మారుతూ ఉంటారు. అందుకే నేరస్థులను సమాజం నుండి దూరం చేయకుండా, మాతృత్వ భావనతో ప్రేమతో వారికున్న మనోవైకల్యాన్ని సరిచేసి అద్భుత పరిణామం తీసుకువచ్చింది అమ్మ.

సహనమనే దేవతను ఆరాధించాలంటే బాధలనే పూజా ద్రవ్యాలు కావాలి

సాధారణంగా ఏ మనిషయినా బాధలు తొలగించమనీ సుఖాలు కల్గించమనీ భగవంతుని ప్రార్థిస్తూ ఉంటాడు. అయితే, వర్షంలో తడవని వారు బాధలను అనుభవించని వారు లోకంలో ఉండరు. వాటిని తట్టుకోవడానికి ఎంతో సహనం కావాలి. సహనం ఉంటే జీవితంలో గెలుపే. సహనం అలవడాలంటే బాధలు అనుభవించాలి.

అందుకే దుఃఖం నుండి పారిపోనవసరం లేదనీ, సుఖదుఃఖాలు రెండూ ఒకే నాణేనికి రెండు పార్శ్వాలనీ, సహనం అలవరుచుకుంటే దేనినైనా నిర్వికారంగా అనుభవించవచ్చుననీ మహాత్ముల జీవితాలే మనకు సందేశాన్ని అందిస్తాయి. అందుకే అమ్మ సహనాన్ని దేవతగా ఆరాధించమని, బాధలనే పూజాద్రవ్యాలుగా భావించమని ఒక సాధన మార్గాన్ని చెప్తున్నది. సహనదేవతను ఆరాధించటం అంటే సహనాన్ని అలవరచుకోవడమే. బాధలవల్ల సహించే లక్షణం వస్తుంది. బాధే మనిషిని ఉన్నతంగా తీర్చిదిద్దుతుంది. జీవితంలో ఏర్పడిన సన్నివేశాల సంఘర్షణ వలన మనిషి వ్యక్తిత్వం ఉద్దీప్తమవుతుంది. జీవిత తత్త్వం తెలిసినవారు బాధలను చూచి నవ్వుకునే స్థితికి చేరుకుంటారు. బాధల వల్ల సహించే లక్షణం వస్తుంది. ఆ సహనమే సర్వదుఃఖాలను భరించే శక్తి నిస్తుంది. భగవదనుగ్రహం

పొందాలంటే ఎవరికిష్టమైన పూజాద్రవ్యాలతో వారు ఆ భగవంతుని పూజిస్తూ ఉంటారు. అలాగే సహనదేవతను ఆరాధించాలంటే బాధలే పూజాద్రవ్యాలు. పూజాద్రవ్యాలను ఎంతో భక్తితో పవిత్రంగా తీసుకుని వచ్చినట్లుగా బాధలను కూడ అదే భక్తితో ఆహ్వానించాలి. ఒక సందర్భంలో అమ్మ 'బాధే భగవంతుడ'ని కూడ చెప్పింది. సహనం అలవడితే బాధలను కూడ నవ్వుతూ అనుభవించే స్థితికి చేరుకుంటారు. సుఖదుఃఖానుభవం మనస్సునకు అంటదు. నిర్వికారంగా నిశ్చలంగా ఉండగల్గుతారు. సహనమే జీవన పరమావధి అని, ఆ గమ్యం చేరుకోవాలంటే బాధలే సోపానాలని, ఆ బాధలు లేని బ్రతుకు వ్యర్థమని బాధలనే సాధనగా చేసికొమ్మని అమ్మ ప్రబోధం.

ప్రేమే కోపానికి మూలం :

ప్రేమ, కోపం రెండూ ఎండ, వాన లాగా విరుద్ధంగా అన్పిస్తాయే తప్ప ఆలోచిస్తే కోపానికి మూలం ప్రేమే అని అర్థమవుతుంది. ఒక్కొక్కసారి అంతర్గతమైన ప్రేమకు వ్యక్తరూపం కోపంగా కన్పిస్తుంది. వ్యక్తిపరంగా చూసినా, సృష్టిపరంగా చూసినా ఎక్కడ కోపం కన్పిస్తోందో అక్కడ ఉండేదే ప్రేమే. ప్రకృతినే తీసుకుందాం. మండుటెండలు కాస్తాయి. భూమి బీటలు వారుతుంది. కాని ఆ తరువాత వర్షం వచ్చి ఆ భూమే పంటలకు అనుకూలంగా మారుతుంది. ఎండ కోపానికి సంకేతం అయితే వర్షం ప్రేమకు సంకేతం. ఎండలు ఎంతగా కాస్తే వర్షాలు అంతగా పడతాయి. వర్షాలు ఎంత ఎక్కువగా కురిస్తే పంటలు అంత బాగా పండుతాయి. అలాగే నిప్పునే తీసుకుందాం. నిప్పులో చేయిపెడితే చురుక్కుమంటుంది. బాధతో వెంటనే చేయి తీసివేస్తాం. కాని నిప్పుకు ఆ లక్షణం లేకపోతే మనకు బాధ తెలియదు. కాని చేయి కాలిపోతూ ఉంటుంది. బాధ తెలిస్తే గదా చేయి తీసేది. కనుక మనకు అలా కాకూడదనీ, మనకు ఏ నష్టం జరుగకూడదనీ నిప్పు తాకగానే బాధ కలిగిస్తున్నది. నిప్పు బాధించడం కోపానికి సంకేతం అనుకుంటే దహించకుండా ఉండడం కొరకే అన్నది ప్రేమకు సంకేతం. అలాగే ఎక్కడ వినాశం ఉంటుందో అక్కడే ఉత్పత్తి ఉంటుంది. పండుటాకులు రాలితేనే కొత్త చిగురాకులు అంకురిస్తాయి. పంచభూతాల ప్రకోపం కూడ పరమాత్మ ప్రేమకు సంకేతమే. పెనుతుఫానుల జరిగిన చోటే సర్వసమృద్ధి జరిగి ప్రకృతిని పరవశింప చేయడం లోకానికి పదేపదే

అనుభవమే. ఎక్కడ నిరాశ క్రీనీడలు ఉంటాయో అక్కడ ఆశలు వెలుగులు వెదజల్లబడతాయి. భస్మరాసుల నుండే బంగారు పండుతుంది.

అలాగే వ్యక్తిపరంగా చూసినా ఏ వ్యక్తిని ఉన్నతంగా తీర్చిదిద్దాలనే ప్రేమ, తపన ఉంటాయో అక్కడ ఆ మనిషికి శిక్షణ తప్పదు. ఆ శిక్షణే కోపంగా వ్యక్తమవుతుంది.

ఉదా : తల్లి తన బిడ్డలు మాట వినక క్రమశిక్షణ లేక పాడయిపోతూ ఉంటే ఎంతో బాధపడుతుంది. ఎన్నోసార్లు చెప్పి చెప్పి ఆ నిస్సహాయతే కోపంగా మారుతుంది. వాళ్ళు బాగుపడటానికి ఎన్నో మార్గాలను అనుసరిస్తుంది. అవసరమయితే దండనకు కూడా సిద్ధపడుతుంది. తప్పటడుగులు సరిచేస్తే తప్పుటడుగులు పడకుండా ఉంటాయనే తల్లి అలా ప్రవర్తిస్తుంది. ఈ కోపానికి మూలం వాళ్ల మీద ఎంతగానో పెంచుకున్న ప్రేమే కారణం. వాళ్ళు ఎంతో ఉన్నతులయి సుఖంగా జీవించాలని కోరుకుంటే దానికి భిన్నంగా జరిగితే ఆ బాధే వారిపట్ల కోపంగా వ్యక్తమవుతుంది. ఈనాడు ఏ కారణంగానయినా తల్లితండ్రులు కాస్త మందలించినా, తమ అనుచితమైన కోరికలు తీర్చకపోయినా వారి ప్రేమను అర్థం చేసుకోలేక ఆ తల్లిదండ్రులనే శత్రువులుగా భావించి ఆవేశంతో ఆత్మహత్యలకు పాల్పడే పిల్లలెందరో కన్పిస్తున్నారు. తల్లిదండ్రుల కోపానికి మూలమైన ప్రేమను అర్థం చేసుకోకపోవడమే దీనికి కారణం.

అందుకే అమ్మ ఈనాటి సమాజంలో ఉన్న అవగాహనా రాహిత్యాన్ని సరిదిద్దాలనే ఆలోచనతో 'ప్రేమే కోపానికి మూలం' అంటూ ప్రబోధించింది. ఎవరయినా మందలిస్తే కోపాన్ని ప్రదర్శిస్తే దాని వెనుకనున్న భావాన్ని గుర్తించండి అంటూ వ్యక్తుల మధ్య పరస్పర అవగాహన ఉండాలని అదే సమాజానికి అభ్యుదయమని అదే వ్యక్తికిగానీ, సమాజానికి గానీ శాంతిని ఇస్తుందని ఈ వాక్యం ద్వారా సందేశాన్ని అందిస్తున్నది. 'నహ్యనిష్టోఽ నుశిష్యతే!' ఇష్టుడు కాని వాడు ఉపదేశింపబడడు. మనతో ఎవరైనా ఒక మంచి మాట చెప్పారు అంటే వారికి మనపై ప్రేమ ఉన్నదని అర్థం చేసుకోవాలి. మన మేలు కోరే మనకు ఉపదేశిస్తారు. తల్లి, తండ్రి గురువు, మిత్రుడు సహజంగానే హిత స్వభావం కల్గి ఉంటారు.

'తల్లికి బిడ్డసొమ్ము - బిడ్డకు డబ్బు సొమ్ము

'పోట్లాడుతున్నా చేసేది తల్లి, చేస్తున్నా పోట్లాడేది బిడ్డ

విమర్శించినా పెట్టేది తల్లి. పెట్టినా విమర్శించేవాడు బిడ్డ

అని తల్లి తత్త్వాన్నీ, తల్లీబిడ్డల బాంధవ్యాన్ని చెప్పింది అమ్మ. అంతేకాదు బిడ్డ తల్లికి సరెండర్ కావడం కాదు. తల్లే బిడ్డకు సరెండర్ అవుతుంది. అదే తల్లికి ఇష్టం. అదే మాతృతత్త్వం అని అమ్మ వివరించింది. బిడ్డ కోసం చూలింతగానూ, బాలింతగానూ ఎన్నో కష్టాలు సహిస్తుంది. 'తనను కన్న వాళ్ల కంటె తాను కన్నవాళ్ల మీద మమకారం ఎక్కువ' అని అమ్మ చెప్పినట్లుగా ఎవరికయినా లోకంలో అన్నింటి కంటె ఇష్టమైనది తమ సంతానమే అని అందరూ అంగీకరించే విషయం. అంతేకాదు ఏ తల్లి అయినా తన బిడ్డలే తన సొమ్ము అనుకుంటుంది. ఇక్కడ సొమ్ము అంటే సంపద. కానీ బిడ్డల దృష్టిలో సొమ్ము అంటే డబ్బు. అందుకని వారికి డబ్బే సొమ్ము. తల్లికి బిడ్డ మీద ఉండేది మమకారం. అందుకే నా సంతానమే నాకు సంపద అనుకుంటుంది. కానీ బిడ్డ తల్లిని ఎంత ప్రేమగా చూసినా ఎంతగా సేవ చేసినా అక్కడ తల్లిపట్ల బాధ్యతే కన్పిస్తుంది. నా సొమ్ము అని అనుకోలేదు. తల్లిసొమ్మును తనసొమ్ముగా అనుకుంటాడే గాని తల్లిని సొమ్ముగా భావించలేడు. డబ్బునే తనసొమ్ముగా భావిస్తాడు. కానీ ఎన్ని తరగని సంపదలు తనకు ఉన్నా తననుంచి వచ్చిన తనకు ప్రతిరూపమైన తన బిడ్డలనే తనకు సంపద అనుకుంటుంది తల్లి. అందుకే పదిమంది బిడ్డలున్న తల్లిని సంతానలక్ష్మి అని లోకవ్యవహారంలో అంటూ ఉంటారు. అందుకే అమ్మ

'తల్లికి బిడ్డ సొమ్ము - బిడ్డకు డబ్బు సొమ్ము' అనే వాక్యం ద్వారా ఒక శాశ్వతమైన జీవన సత్యాన్ని అందించింది.

మంచిని మించిన మహిమలు లేవు

సాధారణంగా లోకంలో మహిమలంటే ఏ అతీంద్రియ శక్తులనో ప్రదర్శించడంగా భావిస్తూ ఉంటారు. అలా మహిమలు చూపడం మహత్త్వం కల్గిన అవతారమూర్తులకో, సిద్ధ వ్యక్తులకో మాత్రమే సాధ్యమయ్యే విషయాలు అనంతమైన మహత్త్వమే అమ్మగా దిగి వచ్చింది. అయినా అమ్మ తాను మహిమలు

చేస్తున్నట్లు అంగీకరించదు. 'మంచిని మించిన మహిమలు లేవు' అంటూ మానవుడు మంచితనం ద్వారా దివ్యత్వానికి చేరుకునే మార్గాన్ని అమ్మ సూచించింది. మూర్తీభవించిన మంచితనమే దివ్యత్వం.

మరి, మంచితనం అంటే ఏమిటి, ధర్మంగా, న్యాయంగా జీవించడం, అవ్యాజంగా అందరినీ ప్రేమించడం, ఎదుటివారి కష్టాన్ని చూసి స్పందించి ఆదుకోవడం మొదలైనవన్నీ కలిస్తే అదే మంచితనం. సాధారణంగా ఈనాడు ఎవరిని చూసినా ధనం సంపాదించి గొప్పవారు కావాలని కోరుకుంటున్నారు. మంచితనానికి, గొప్పతనానికి చాలా వ్యత్యాసం ఉంది. తల్లిదండ్రులు సయితం తమ సంతానం గొప్ప చదువులు చదివి గొప్ప ఉద్యోగం చేయాలని కోరుకుంటున్నారు? ఎవరు గొప్పవారు? ఎవరు మంచివారు. రావణాసురుడు మొదలయినవారు సకల విద్యాపారంగతులు. కానీ వికృతమైన ఆలోచనలతో వారు పెడదారి పట్టి తమ వంశాలనే నాశనం చేసుకున్నారు. అలా కాక, సత్యధర్మాలను అనుసరిస్తూ పితృవాక్య పరిపాలకుడయి అందరికీ ఆదర్శంగా నిలిచి మర్యాదా పురుషోత్తముడయ్యాడు శ్రీరామచంద్రుడు.

గొప్పతనం అనేది నేడు ఉంటుంది. రేపు పోతుంది. అది అశాశ్వతం. మంచితనం మాత్రం శాశ్వతంగా ఉంటుంది. ఈనాడు మనిషి సాధించనిది అంటూ ఏమీ లేదు. వైజ్ఞానికంగా, సాంకేతికంగా విజ్ఞానం నేడు ఎంతో అభివృద్ధి చెందింది. కానీ ఈ గొప్పతనం వెనుక అంతే స్థాయిలో ప్రమాదం పొంచి ఉంటూనే ఉంది. గొప్పతనమే కాదు. మనిషికి మంచితనం అంతకంటే అవసరం. 'రమణీయం ప్రసన్నాంబు సన్మనుష్య మనోయథా' మంచి మనస్సు రాగద్వేషరహితమై నిర్మలమైన జలం లాగా స్వచ్ఛంగా ప్రకాశిస్తుంది. ఈ నిర్మలమైన మనస్సే వారి వ్యక్తిత్వానికి వన్నె చేకూరుస్తుంది. ఎక్కడ మంచితనం ఉంటుందో అక్కడ దివ్యత్వం ఉంటుంది. 'ఎదుటివారి'లో మంచిని చూడడమే మన మంచితనం' అంటూ సాటి మనిషిలో మంచిని మాత్రమే చూడమని అమ్మ ప్రబోధం. అందరిలోనూ మంచిని చూడగల్గడం అంటే దైవాన్ని దర్శించడమే. అదే నిజమైన ఆధ్యాత్మికత. అలా చూసిననాడు లోకంలో ఈర్ష్య, అసూయలకు కాని, కక్షలు, కార్పణ్యాలకు కాని అవకాశమే ఉండదు.

ఈ విధంగా మంచిని చూడడం ద్వారా, మంచిని పెంచుకోవడం ద్వారా ప్రతిమనిషీ మానవత్వం నుండి మాధవత్వానికి చేరుకోవాలన్న సందేశాన్ని 'మంచిని మించిన మహిమలేదు' అనే వాక్యం ద్వారా అమ్మ ధ్వనింపచేసింది.

భార్యకు భర్త దేవుడు - భర్తకు భార్య దేవత

అందరినీ బిడ్డలుగా చూసే మాతృత్వ భావనతో బిడ్డల తప్పు గ్రహించినా శిక్షించకుండా, ప్రేమతో వారికున్న మనోవైకల్యాన్ని సరిచేసి అద్భుతమైన పరిణామం తీసుకు వచ్చింది అమ్మ; అందరికీ అమ్మగా ప్రకటితమైనపుడే కాదు, ముక్కుపచ్చ లారని వయసులో కూడా ఎంతో మందిని సంస్కరించిన విషయం అమ్మ చరిత్ర మనకి చెపుతోంది.

బాల్యంలో ఒకసారి అమ్మ, మరిడమ్మ తాతమ్మతో పెనుగుదలపాడు వెళ్తూ మార్గమధ్యంలో శ్రీరంగపురంలో తెలిసినవారి ఇంట్లో ఉంటుంది. ఆ ఇంటి యజమానిని సంస్కరించడం కోసమే వారి ఇంట్లో అమ్మ బసచేసింది. ఆ సమయంలో అమ్మ ఆరేండ్ల బాలికలాగా కాకుండా అరవై ఏళ్ళ ముత్తయిదువులా వ్యవహరించి ఆ సంసారాన్ని చక్కబెట్టింది. ఆ సందర్భంలోనే "భార్యకు భర్త దేవుడయితే, భర్తకు భార్య దేవత" అని ప్రబోధించింది.

భారతీయ ధార్మిక జీవనానికి పునాది వివాహ వ్యవస్థ. వైవాహిక జీవితమనేది ఒక దీక్ష, ఒక యజ్ఞం. పరమపవిత్రమైన గృహస్థాశ్రమంలో ప్రవేశించడానికి చేసే వైదిక సంస్కారమే వివాహం. అది పరమార్థసాధనకు సోపానం. గృహస్థాశ్రమంలో స్త్రీ ఇల్లాలుగా, అర్ధాంగిగా, సహధర్మచారిణిగా, సఖిగా, భార్యగా, కర్తవ్యాన్ని నిర్వహిస్తూ తన వ్యక్తిత్వాన్ని నిలుపుకుంటుంది. అందుకే సంసార జీవిత నౌకకు చుక్కాని గృహిణి అంటారు. గృహస్థాశ్రమ ధర్మరక్షణకు కేంద్రబిందువు గృహిణి. 'అర్థోవా ఏష ఆత్మనః యత్పత్నీ తన్మిధునం' అని పురుషార్థసాధనలో భార్య భర్తలో సగం స్థానాన్ని పొందుతుందని ఈ మంత్రం మనకు బోధిస్తున్నది.

కన్యాదాన సమయంలో కూడ 'కన్యాం కనక సంపన్నాం' అంటూ, వరుడు నారాయణ స్వరూపుడయితే వధువును లక్ష్మీస్వరూపంగా భావించి ఈ కన్యాదానం

ఉత్తమలోకప్రాప్తికి చేసే మహత్కార్యంగా భావించారు పెద్దలు. భారతీయ సంస్కృతి, సంప్రదాయం, స్త్రీకి ఉన్నతస్థానం ఇచ్చి గౌరవిస్తూ వచ్చింది.

స్త్రీ ఔన్నత్యాన్ని దృష్టిలో పెట్టుకుని పురాణ ఇతిహాస గ్రంథాలన్నీ స్త్రీని పవిత్రమూర్తిగా, పతివ్రతగా, సహధర్మచారిణిగా చిత్రిస్తూ నిత్యజీవనంలో ఆమె ఎంత ప్రధానభూమిక వహిస్తుందో తెలియజేశాయి.

శ్రీ మద్రామాయణంలో శ్రీరాముడు వనవాస సమయంలో అత్రిమహర్షి ఆశ్రమానికి వచ్చినపుడు ఆ మహర్షి తన ధర్మపత్ని అయిన అనసూయాదేవి గొప్పతనాన్ని గురించి వివరిస్తూ....

'తామిమాం సర్వభూతానాం నమస్కుర్యాం యశస్వినీం
అభిగచ్ఛతు వైదేహీ వృద్ధా మక్రోధనం సదా
అనసూయేతి యా లోకే కర్మభిః ఖ్యాతి మాగతా' అంటూ తానే స్వయంగా శ్రీరామునికి చెప్పాడు.

సీతాదేవిని గురించి శ్రీరామచంద్రుడు కూడ అనేక సందర్భాలలో 'అనన్యా హి మయా సీతా భాస్కరేణ ప్రభా యథా' సూర్యుని కంటె సూర్యకాంతి వేరు కానట్లు సీత తన కంటే వేరు కాదు అనీ,

'విశుద్ధా త్రిషులోకేషు మైథిలీ జనకాత్మజా !
న విహాతుం మయా శక్యా కీర్తి రాత్మవతా యధా॥'

ముల్లోకాల్లోనూ సీతాసాధ్వి పరమ పవిత్రురాలు అనీ చెప్పిన మాటల వలన సీతపట్ల గల రాముని హృదయం వ్యక్తం అవుతోంది. అంతేకాదు,

'ఇది నాకెప్పుడు తెలియును
మదవతి నా ప్రాణచయము, మద్దేహము, నా
యెద, మేధ, బుద్ధి, సర్వము...' అంటూ తన దేహం, తన హృదయం, తన మేధ, తన బుద్ధి... అన్నీ సీతేననీ, ఆమె తన ప్రాణమనీ, ఆమే తన జీవితానికి వెలుగని చెప్పి భార్యను ఎంతో మహోన్నతంగా సంభావించిన సముదాత్తమూర్తిగా మనకు దర్శనమిచ్చాడు శ్రీరామచంద్రుడు. అలాగే పార్వతీదేవి తపస్సుకు మెచ్చిన పరమేశ్వరుడు - 'అద్య ప్రభృత్య వనతాంగి తవాస్మి దాసః' -

అంటూ నీ తపస్సుకు నేను వశుడైనాను. ఇక నుండి నీ దాసుడను అంటూ స్వయంసమర్పణ చేసుకున్నట్లుగా కుమారసంభవ కావ్యంలో కాళిదాసమహాకవి ప్రస్తావించారు. అందువల్లనే అమ్మవారిని 'స్వాధీనవల్లభా' అనే నామంతో స్తోత్రం చేస్తూ ఉంటారు.

నన్నయ భారతారంభంలో 'శ్రీ వాణీగిరిజాశ్చిరాయదధతో వక్షో ముఖాంగేషుయే'... అన్న ప్రార్థనాశ్లోకంలో శ్రీ మహావిష్ణువు లక్ష్మీదేవిని తన హృదయ కమలంలోనూ, బ్రహ్మదేవుడు సరస్వతిని ముఖకమలంలోనూ, పరమేశ్వరుడు పార్వతిని అర్ధశరీరంలోనూ ధరించి లోకరక్షణ కావిస్తున్నారు అని చెప్పడంలో త్రిమూర్తులు భార్యకిచ్చిన స్థానమేమిటో తెలుస్తున్నది.

మరి మన సంప్రదాయంలో భార్యకు ఇంత ఉన్నతస్థానం ఇచ్చినట్లు కన్పిస్తూ ఉంటే పురుషాధిక్య సమాజంగా రూపుదిద్దుకున్న ఈ నాటి సాంఘిక వ్యవస్థలో భార్య స్థానానికున్న ప్రాధాన్యతని గుర్తించకుండా తమ ఆధిక్యతను ప్రదర్శిస్తున్నారు కొందరు పురుషులు. భార్య అంటే భరింపబడేది అనీ, ఆమెను మనసులేని మనిషిగా చూసే సామాజిక పరిస్థితి మధ్య యుగాలలో నెలకొన్నది.

ధార్మిక జీవనానికి ఆలంబనమై ఆదర్శమై నిలిచిన, ఈ వివాహ వ్యవస్థ మూలాలలో ఒక ప్రకంపన కన్పిస్తోంది. అందుకే వివాహ వ్యవస్థలో కనుమరుగై పోతున్న విలువలను పరిరక్షించడం కోసమే అమ్మ వివాహం చేసుకున్నది. "తలవంచి తాళికట్టించుకునేది భార్య; నడుం వంచి తాళికట్టేవాడు భర్త" అని ఇరువురికి సమానమైన బాధ్యత ఉన్నదని సూచించింది. సంసార రథానికి స్త్రీ పురుషులిద్దరూ రెండు చక్రాలు. అవి సమానంగా ఉన్నపుడే ఆ రథం ముందుకు సాగి గమ్యం చేరుకుంటుంది.

వివాహం సందర్భంగా అమ్మ అనేక నిర్వచనాలను ప్రసాదించింది. 'కళంకరహితమైన మనస్సును కళంకరహితంగా అర్పించడమే కల్యాణం', 'ఒక పెన్నిధి అండను చేరడమే పెండ్లి' అని నిర్వచించింది. పరస్పర అవగాహనతో ఇద్దరూ ఒకరికొకరు తోడు నీడగా ఉన్నపుడే అది అనుకూల దాంపత్యం అవుతుందనీ, భర్త భావం తెలుసుకొని స్త్రీ, బాధ్యత తెలుసుకుని పురుషుడూ ప్రవర్తిస్తే వివాహ

వ్యవస్థ సర్వాంగీణంగా శోభిల్లుతుందనీ 'భార్యకు భర్త దేవుడయితే, భర్తకు భార్య దేవత' అన్న వాక్యం ద్వారా అమ్మ ప్రబోధిస్తోంది.

viii) త్యాగానికి చరమదశ సర్వసంగపరిత్యాగం :

ఏ మనిషికయినా త్యాగగుణం కొద్దో గొప్పో ఉంటుంది. పీల్చిన గాలి వదిలినప్పుడే ఊపిరితిత్తులు క్షేమంగా ఉన్నట్లు సంపాదించిన ధనానికి సార్థకత త్యాగం చేయడమే. ఇది ఒక ధనం విషయమే కాదు. దేనినైనా వదిలిపెట్టడమే త్యాగం. కాని వస్తువును వదలడం కాదు. వస్తువు పట్ల ఉన్న సంగాన్ని వదిలిపెట్టడమే త్యాగానికి చరమదశ అని అమ్మ చెప్తున్నది. సంగత్యాగమే నిజమైన త్యాగం. ఇది ఎట్లా సాధ్యం? అంటే అమ్మ వాక్యంలోనే ఒక సాధన క్రమం కన్పిస్తోంది. ఇతరుల ఆనందం కోసం ఒక వస్తువును గాని, ఒక విషయాన్ని గాని, సుఖాన్ని గాని, త్యాగం చేయడం మొదటి దశ. ఇతరుల ఆనందంలో మన ఆనందాన్ని చూసుకోవడం రెండవ దశ. త్యాగం ఇతరుల కోసం మొదలు పెట్టినా దానివలన కలిగే తృప్తి, శాంతి మాత్రం తనకే. ఆ విధంగా త్యాగమే పరమార్థంగా చేస్తూ ఉంటే అది సహజమైపోతుంది. త్యాగం సహజమైతే వచ్చేది సర్వసంగపరిత్యాగమే.

'సర్వకర్మఫలత్యాగః ప్రాహుః త్యాగం విచక్షణాః' అని కర్మఫలత్యాగమే త్యాగమని భగవద్గీతా ప్రవచనం. ఫలితాల మీద దృష్టి ఉన్నప్పుడు మనిషికి అనేక ఆలోచనలు. తనకు ఫలితం అనుకూలమైతే ఆనందం. ప్రతికూలమైతే దుఃఖం. కనుక ఫలితం మీద దృష్టిపెట్టకుండా ఫలప్రదాత భగవంతుడు కనుక ఫలితాన్ని ఆయనకే వదలి కార్యాచరణ చేయడం మాత్రమే మనవిధి. సంగత్యాగమంటే నాది అనే భావం లేకుండా చేసే ప్రతిపని యోగదృష్టితో చేయడం. యోగి కాకపోతే త్యాగి కాలేడు.

'యోగస్థః కురు కర్మాణి' అని గీతాచార్యుని ప్రబోధం. ఒక పని చేసినపుడు అది ఫలించినా, ఫలించకపోయినా ఒక్కటేననే సమదృష్టి కల్గి ఉండడమే యోగం. అంటే భిన్న దృష్టిలేకపోవడం. అన్నీ ఒకటి గానే కనపడడం. ఇదే ఆత్మ సాక్షాత్కారం. సర్వమానవాళి చేరుకోవలసిన గమ్యం. సమస్తమైన ఆధ్యాత్మిక సాధనల పరమ

ప్రయోజనం ఇదే. ఆ స్థితిని చేరుకోవడానికి త్యాగాన్ని సోపానంగా సూచించింది అమ్మ. మెట్టు ఎక్కడం మొదలు పెడితే మేడపైకి చేరుకుంటాం. అలాగే ప్రతివారు తనకున్న దానిని నలుగురికీ పంచుతూ త్యాగగుణాన్ని పెంపొందించుకుంటే అదే క్రమంగా వాటి మీద ఉన్న సంగాన్ని వదలుకోవడానికి దారితీస్తుంది. 'సంగాత్ సంజాయతే కామః' సంగం వల్లనే కోరిక కల్గుతుంది. నాది, నేను అనే సంగాన్ని వదిలి పెడితే అదే కోరికలు లేని స్థితికి దారితీస్తుంది. 'కోరికలు కోరేటి కోరికే లేనట్టి స్థితి'ని చేరుకోవడానికి సంగత్యాగమే సాధనం.

త్యాగాన్ని సాధారణ అర్థంలో ధనం, ధాన్యం, భూమి మొదలైన వస్తుదానంగా మనం భావిస్తాం. ఇల్లు, వాకిలి, భార్యాబిడ్డలను, సంపదలను వదలి అరణ్యాలకు వెళ్లి తపస్సు చేయడం లేక సన్యాసం స్వీకరించడం మొదలైనవి త్యాగాలుగా భావిస్తాం. త్యాగం అంటే భౌతికరూపం కాదు. సిరిసంపదల మీదకాని, ఆలుబిడ్డల మీదకాని ప్రత్యేకమైన ఆసక్తి లేకుండా కర్తవ్యం నిర్వహించడం, ఆ వ్యక్తులు కాని, విషయాలు కాని, వచ్చే ఫలితాలు కాని మనస్సును తాకకుండా ఉండడం సంగపరిత్యాగం. అమ్మ ఆచరించి ప్రబోధించిన అద్భుత సందేశం ఇది.

ix) మార్పు సహజం :

సృష్టి పరిణామశీలమైంది. పరిభ్రమణం సృష్టి ధర్మం అయినపుడు అదే అంతటా కన్పిస్తుంది. ప్రకృతినే తీసుకుందాం. అనుక్షణం మార్పు కన్పిస్తూనే ఉంటుంది. ఆ మార్పే ప్రతిక్షణం క్రొత్తగా అన్పించేట్లుగా చేస్తుంది. మొగ్గ పువ్వుగా మారుతుంది. విత్తనం మొక్కగా మారుతుంది. పువ్వు పండుగా మారుతుంది. మొక్క చెట్టవుతుంది. అందుకే రూపాంతరమే కాని రూపనాశనం లేదని అమ్మ చెప్పింది. అలాగే గ్రీష్మం వెంటే తొలకరి జల్లులు పడుతున్నాయి. శిశిరం వెంట వసంతం తొంగి చూసి ప్రకృతినే పరవశింప జేస్తుంది.

పరిచయమయిన విషయాలు కూడ కావ్యంలో కవి రచనా ప్రాభవంలో మన ముందు రంగు హంగులతో సరిక్రొత్త దృశ్యానికి తెరతీస్తున్నట్లుగా ఉంటాయి. సుపరిచితమైన తోట కూడ వసంతాగమనంతో క్రొత్త చిగుళ్ళతో, పక్షుల కిలకిలారావాలతో మన ముందు ఒక క్రొత్త లోకాన్ని ఆవిష్కరిస్తుంది. ఈ విధంగా

ప్రకృతికి మార్పు సహజమే. అదే నూతనత్వాన్ని కల్గిస్తోంది. నిన్న ఉన్నట్లు ఈ రోజు లేకపోవడమే క్రొత్తదనం. ఈ మార్పే ప్రగతికి సోపానం. పరిణామమే చైతన్యానికి సంకేతం. చెట్టులో గుట్టలో మనిషిలో మనస్సులో మార్పు లేకపోతే శిలాసదృశమే. ఈనాడు శాస్త్రీయంగా, సాంకేతికంగా, సామాజికంగా ఎంతో అభివృద్ధి కన్పిస్తోంది. ఇదంతా మార్పులో భాగమే. ఆ మార్పు ఒక్కొక్కసారి మంచిని కల్గించవచ్చు. మరోసారి చెడుకు దారి తీయవచ్చు. ఏదయినా ఆ మార్పును స్వీకరించి తీరవలసిందే.

సృష్టిలో మార్పు ఎంత సహజమో మనిషిలో కూడ మార్పు సహజం. పంచభూతాలకు ప్రతీక మనిషి. పంచభూతాల తత్త్వమే మనిషిలో ఉంటుంది. గాలిని వీచకుండా ఆపలేం. నీటిని ప్రవహించకుండా ఆపలేం. ఆ చలనశీలమే మనిషిలో కన్పిస్తుంది. భౌతికంగాగాని ఆలోచన పరంగా గానీ, ఆధ్యాత్మికంగా గాని మార్పులేకపోతే ఎదుగుదల లేదు. మనిషికి ఎన్నో అనుభవాలు జీవితంలో ఎదురవుతాయి. దాని నుండి ఎంతో నేర్చుకుంటాడు.

'జీవిత మొక రసమయకావ్యం
క్షణక్షణం నవ్యాతినవ్యం' అంటారు కవులు. చూసే దృష్టి ఉండాలి గాని, జీవితంలో కాని, ప్రకృతిలో కాని ప్రతిరోజూ ప్రతిక్షణం నూతనత్వం గోచరిస్తూనే ఉంటుంది. ఈ నూతనత్వమే రామణీయకాన్ని సంతరింప చేస్తుంది. కానీ సాంకేతికంగా, వైజ్ఞానికంగా ఎంత అభివృద్ధి సాధించినా ఆ నాగరికతే ఒక్కొక్కప్పుడు వినాశనాన్ని కల్గిస్తోంది. ఆ మార్పును చూసి భయపడుతున్నాం. కానీ తరాల మధ్య అంతరాలు పెరుగుతున్న ఈ కాలంలో 'మార్పు సహజం' అన్న అమ్మ వాక్యం ఒక ఓదార్పుగా అన్పిస్తుంది. ఏది సహజమో దానిని ఆహ్వానించాలి. అన్నింటినీ ఎదుర్కొనే ధైర్యాన్ని పొందాలి అన్న సందేశాన్ని అమ్మ సమాజానికి అందిస్తోంది.

తత్త్వమే జీవతత్త్వం

పరమాత్మ తత్త్వమే జీవతత్త్వం. ఒకే ఆత్మ చైతన్యం శరీరాలలో ప్రవేశించి లోపల జీవాత్మగాను బయట సమస్త ప్రపంచంగాను ఏర్పడుతోంది. జీవులలో అనుభవానికి వచ్చే నేను అనే స్ఫూర్తి కేవల చైతన్యమే. అది దేనికీ గోచరం కాదు.

ఆ చైతన్యమే పరమాత్మ తత్త్వం. అందుకే జీవ ఈశ్వర తత్త్వాలలో మార్పులేదు. పాంచభౌతికశరీరంలో ప్రవేశించిన భగవత్తత్త్వమే జీవుడు. సర్వత్రా వ్యాపించి ఉన్న తత్త్వమే పరమాత్మ.

'ఆత్మానం ఆత్మనా వేత్తి ఆత్మన్యేవ ప్రలీయతే'

ఆత్మతత్త్వం తెలుసుకునేంత వరకే జీవుడు. తెలుసుకున్న తర్వాత అంతా ఒకటే తత్త్వం. ఆ తత్త్వాన్ని తెలుసుకున్నప్పుడే తాను అదేనని జీవుడు గుర్తిస్తాడు.

'సముద్రంలో అలలు లేచి మళ్లీ కలిసిపోయినట్లే మీ జన్మలు కూడ. నా సంకల్పంతో పుట్టి మీరు నాలోనే లయమవుతారు' అని అమ్మ చెప్పింది.

'సాముద్రోహి తరంగః
క్వచన సముద్రోహి తారంగః'

సముద్రధర్మమే అలలో ఉంటుంది. కాని అల సముద్రం కాదు. అలాగే పరమాత్మ తత్త్వమే జీవతత్త్వం అవుతోంది.

'యథైవ వటబీజస్థో ప్రాకృతశ్చ మహాద్రుమః'

సూక్ష్మమైన మర్రివిత్తనం నుంచి మహావటవృక్షం పుడుతున్నది. విత్తును బట్టే చెట్టు. ఆ చెట్టు కాయలన్నింటిలోను అదే తత్త్వం ఉంటుంది. అలాగే మామిడి విత్తనం నాటితే మామిడి చెట్టు వస్తుంది. ఆ చెట్టు ఫలాలన్నింటిలోను మళ్లీ అదే విత్తనం ఉంటుంది. అలాగే సకల సృష్టికి బీజం ఆ పరమాత్మ అయినపుడు ఆ తత్త్వమే జీవుల యందు కూడా ఉంటుంది. భగవద్గీతలో

'మమైవాంశో జీవలోకే జీవభూత స్సనాతనః'

నా అంశే ఈ ప్రపంచంలో జీవత్వం పొంది ఉన్నది అని భగవానుని ప్రబోధం. 'సహస్రశీర్షా పురుషః' అని కదా ! వేదవాఙ్మయం విరాట్పురుషుణ్ణి వర్ణించింది. నీవు నేను ఈ విభాగాలన్నీ విరాట్ పురుషుడి లోని భాగాలే. 'సృష్టేదైవం అనీ, 'మీరు నా బిడ్డలే కాదు నా అవయవాలు కూడ' అని అమ్మ చెప్పింది. దైవమే సృష్టిగా ఏర్పడినపుడు పరమాత్మ తత్త్వం, జీవతత్త్వం వేరుగా ఉండవు కదా. అంతేకాదు నా అవయవాలు అన్నప్పుడు అవయవాలు శరీరంలో భాగమే కదా! ఒకేదీపం వేరు వేరు ప్రమిదల్లో వెలిగినట్లుగా ఒకే తత్త్వం అందరి యందు

వెలుగొందుతోంది. అందుకే 'తత్త్వమే జీవతత్త్వం' అనే వాక్యం ద్వారా అందరి యందు అన్నింటి యందూ ఉన్నది భగవత్తత్వమే అనీ లోకాన్ని దైవంగా ఆరాధించమని అమ్మ ప్రబోధిస్తున్నది.

బ్రహ్మతత్త్వమే బ్రాహ్మణత్వం :

'చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మ విభాగశః' అనే గీతాచార్యుని ప్రవచనం ప్రకారం గుణ, కర్మ విభాగమే చాతుర్వర్ణ వ్యవస్థకు ఆధారమనీ, జన్మవలన కాదనీ తెలుస్తోంది. గుణమంటే స్వభావం. అంటే మన ధర్మం. కర్మ అంటే భౌతికమైన క్రియ. ఉదా: విత్తనాన్ని తీసుకుందాం. భూమిని చీల్చుకురావడం దాని స్వభావం. అలా వచ్చేటప్పుడు జరిగేది కర్మ. ఏ పనీ చేయకుండా ఎవరూ ఉండలేనట్లే అందరూ అన్ని పనులూ చేయలేరు. మనోధర్మాన్ని బట్టి, కర్మకలాపాన్ని బట్టి వర్ణవిభాగం ఏర్పడింది. కాని వర్ణం అంటే కులం అనే అర్థం తీసికొని ఈనాటి సమాజంలో కులంపేరుతో ఎన్నో గొడవలు సృష్టిస్తున్నారు. మానవులంతా మను సంతతి వారే అయినపుడు ఈ కులాలు, మతాలు ఎక్కడివి ? 'ఆకృతి వ్యంగ్యాజాతిః' అని అంటారు. పశువు, పక్షి, పాము మొదలైన జాతులు. వాటికి ఉన్న ప్రత్యేక చిహ్నాలను బట్టి ఆయా జాతులుగా పరిగణించబడతాయి. బ్రాహ్మణత్వాదులు జాతులైనట్లయితే పుట్టుకతోనే వీడు, బ్రాహ్మణుడు, వీడు వైశ్యుడు అనితెలిపే గుర్తులు ఉండవద్దూ, కనుక కులమత వర్గ భేదం జన్మతః వచ్చేది కాదు. అందరూ విరాట్ పురుషునిలో భాగాలే కదా!

'బ్రాహ్మణోఽ స్య ముఖ మాసీత్, బాహూ రాజన్యః కృతః - అంటూ బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులు ఆ విరాట్ పురుషుని ఒక్కొక్క స్థానం నుంచి వచ్చిన వారుగా చెప్పినపుడు అందరిదీ ఒకే కులం కదా ! ఈ పరమ సత్యాన్నే "మీరంతా నా బిడ్డలే కాదు, నా అవయవాలు" అని స్పష్టం చేసింది అమ్మ. ఒకే దేహంలోని అవయవాలకు హెచ్చుతగ్గులను ఆపాదించటం ఏమిటి? జ్ఞానంతో వ్యవహరిస్తే బ్రాహ్మణుడు, రక్షణ విషయంలో క్షత్రియుడు, వ్యాపార నిర్వహణ - ధనధాన్యాది వస్తు సముపార్జన చేసేటపుడు వైశ్యుడు, పారిశ్రామిక స్థైర్యం కలిగినపుడు శూద్రుడు అని వివరిస్తూంటే ఇంకా తారతమ్యా లెక్కడివి ?

అనువంశిక గుణగణాలను ఎంచేటప్పుడు పిల్లల విషయంలో కళ్ళు, ముక్కు వాళ్ళ అమ్మ, కాళ్ళు చేతులూ వాళ్ళ నాన్న, పొట్టి పొడుగు వాళ్ళ నాయనమ్మ, పెంకితనం వాళ్ళ మేనత్త, తెలివి తాతది-అంటూ ఉంటారు.

ఒకే శరీరంలో ముఖానికి ఒక కులం, బాహువులకు ఒక కులం అంటూ ఉండదు కదా! కులవ్యవస్థ పుట్టుకతో వచ్చేది కాదు. వారి వారి ప్రవృత్తులు జీవన సాధనాల్ని బట్టి చేసిన విభజన ఇది. అంతేకాదు, కొన్ని సందర్భాల్లో బ్రాహ్మణుడు, కొన్ని సందర్భాల్లో క్షత్రియుడు, అలాగే వైశ్యుడు, శూద్రుడు అయి ప్రతి వ్యక్తి పంచలోహ విగ్రహంలాగా చాతుర్వర్ణ్య మిశ్రితమైన సంపూర్ణ మూర్తే. అందుకనే మానవులలో న్యూనతాధిక్యాలు లేవు. కానీ అజ్ఞాన వశాన భేదాలను సృష్టించు కుంటున్నారు. వర్ణ వ్యవస్థలో విభాగాలుండవచ్చు కాని విభేదాలుండ కూడదు. 'శుక్లశోణితాల కేది కులమో అదే నా కులం' అని అమ్మ ప్రకటించింది. కనుక చరాచర సకలజీవరాశికీ నేనే తల్లిని అని అమ్మ వాక్యం వివరిస్తోంది. అందరింటిని, అన్నపూర్ణాలయాన్ని స్థాపించి సహజీవన సౌభాగ్యాన్ని చవి చూపించి జిల్లెళ్ళమూడిలో అక్షరాలా నెలకొల్పింది అమ్మ. వర్గరహిత సమాజాన్ని స్థాపించింది. ఏకోదరభావాన్ని సుప్రతిష్ఠితం చేసింది; రాజ్యాంగ అధికరణాలకు కూడా సాధ్యంకాని సర్వసమాన ఆదర్శ సమాజ స్థాపన అమ్మకు సుసాధ్యమైంది.

'జన్మనా జాయతే శూద్రః కర్మణాచ ద్విజాయతే ।
వేద పాఠేన విప్రత్వం బ్రహ్మజ్ఞానేన బ్రాహ్మణః ॥'

బ్రహ్మజ్ఞానం కలిగి ఉండటమే బ్రాహ్మణత్వం అని బ్రాహ్మణత్వాన్ని నిర్వచించింది. 'సర్వం బ్రహ్మమయం' అనే జ్ఞానం కేవలం బాహ్యావేషం వలన పుట్టుక వలన కాదు, కనుకనే మనీషాపంచకంలో 'చండాలోఽస్తు స తు ద్విజోఽస్తు గురుః ఇత్యేషా మనీషా మమ' - చండాలుడైనా, ద్విజుడైనా ఎవరికి బ్రహ్మజ్ఞానం ఉంటుందో వారే నా గురువని శ్రీ శంకరాచార్యులు ఉద్బోధించారు.

ధర్మవ్యాధుని స్థితిని ఉదాహరణగా తీసుకుందాం. ఆయన వృత్తి ఏదైనా బ్రహ్మజ్ఞాన సంపన్నుడు కనుకనే కౌశికునకు ధర్మప్రబోధం చేయగలిగాడు. జ్ఞానానికి వయస్సు కానీ కులం కానీ అవరోధాలు కావు. బురదలో పుట్టినదైనా పద్మం లక్ష్మీనివాసమూ, పవిత్రమూ ఐనది.

'బ్రహ్మతత్త్వమే బ్రాహ్మణత్వమ'ని బాల్యంలోనే నిర్వచించి, వర్గరహిత సమాజానికి ఏనాడో శంకుస్థాపన చేసింది అమ్మ.

"రక్తమంతా ఈశ్వరతత్త్వమే"నని సర్వసమాన దృక్పథాన్ని (all inclusive attitude) ఆచరణాత్మకంగా చాటి చెప్పిన అమ్మతత్త్వమే బ్రహ్మతత్త్వం; అదే వాస్తవానికి బ్రాహ్మణత్వం.

సంకల్పమే సంసారం

సంకల్పం అంటే ఇచ్ఛ, కోరిక. సంసారం అంటే జనన మరణ ప్రవాహం. సంసారం అంటే సృష్టి. నిర్వికారం, నిర్గుణం అయిన పరబ్రహ్మతత్త్వమందు కల్గిన స్పందనే ఈ సృష్టికి కారణం. 'సోఽ కామయత ప్రజాః సృజేయేతి' నేను ప్రజలను సృష్టించాలి అన్న పరమాత్మ సంకల్పమే ఈ సృష్టి అంతా. ఇది విశ్వ సంసార విషయం. ఇది పరమాత్మ లీలా వినోదం. కానీ లోకంలో సంసారం అనే పదానికున్న అర్థం వేరు. భార్యాబిడ్డలు మొదలైన బంధాలనే సంసారంగా భావిస్తారు. కుటుంబం అన్న తరువాత ఎన్నో బాధ్యతలు ఉంటాయి. ఎన్నో సమస్యలు ఎదురవుతాయి. సుఖంతో పాటు కష్టమూ ఉంటుంది. వాటన్నింటినీ సక్రమంగా నిర్వర్తిస్తూ ఆయా సన్నివేశాలకు తగినట్లుగా ప్రవర్తిస్తూ ఉంటే సంసారం సారవంతమే. కాని ఆ బాధ్యతలనే బరువుగా భావిస్తూ సమస్యలతో సతమతమవుతూ సంసారంలో కూరుకుపోయి బయటకు రాలేక బాధలుపడుతూ ఉంటారు. తమ కష్టాలన్నింటికీ సంసారమే కారణమని ఈ సంసార లంపటంలో చిక్కుకుని ఆధ్యాత్మిక చింతన చేయలేకపోతున్నామని వాపోతూ ఉంటారు. అందుకే సంసారం ఒక మహా సాగరమనీ సన్యాసులే దానిని తరించగలరనే సంప్రదాయం బలపడి పోయింది. అందుకే అమ్మ ఆ అభిప్రాయాన్ని మార్చడం కోసమే సంకల్పమే సంసారమనీ సంసారం పట్ల మనకున్న ఆలోచనాధోరణే బంధానికి కారణమనీ, భావబంధమే తప్ప భవబంధం లేదనీ ప్రబోధించింది.

ఏ మనిషికయినా, సుఖాన్ని కానీ, దుఃఖాన్ని కానీ, కల్గించేది మనస్సే. 'మన ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః' అని చెప్పినట్లుగా దేనికయినా మనస్సే కారణం. సంసారం పట్ల మనకున్న ఆ సంకల్పమే అంటే మనకు కలిగే

ఆలోచనలు, భావాలే అది ఒక పెద్ద బాధ్యతగానో, ఒక ఊబిలానో అన్పించడానికి కారణం అవుతున్నాయి. 'యద్భావం తద్భవతి' అన్నారు కదా! నిత్యజీవిత నిర్వహణలో మనిషి మనస్సుకు చాలా ప్రాధాన్యం ఉన్నది.

'ఆత్మానం రథినం విద్ధి, శరీరం రథ మేవ చ
బుద్ధింతు సారథిం విద్ధి, మనః ప్రగ్రహ మేవచ ।'

శరీరం రథం, ఆత్మ యజమాని, బుద్ధిసారథి, మనస్సు కళ్లెం, ఇంద్రియాలు అశ్వాలు. మనస్సు ఇంద్రియాలవైపు మొగ్గు చూపితే అధర్మాచరణ, బుద్ధిచేత నడిపించబడితే ధర్మాచరణ.

"యస్తు విజ్ఞానవాన్ భవతి యుక్తేన మనసా సదా
తస్యేంద్రియాణి వశ్యాని సదశ్వ ఇవ సారథేః ।"

వివేచన గల సారథి పగ్గాలను స్వాధీనం చేసుకుని తన యజమాని వెళ్లదలచుకున్న మార్గంలో అశ్వాలను నడిపినట్లుగా బుద్ధి మనస్సును నిర్దేశిస్తే ఇంద్రియాలు వశంలో ఉంటాయి. కాబట్టి వివేచనాశక్తి బుద్ధితో తమ మనస్సును స్థిరంగా ఉంచుకుని ఇంద్రియాలను వశం చేసుకున్నవారే విజ్ఞానులు. వారికి సంసారం బంధ హేతువుకాదు. **ఉదా :** ధర్మవ్యాధుడినే తీసుకుందాం. ఆయన సాంసారిక బాధ్యతలను బంధాలుగా భావించలేదు. అందుకే తల్లిదండ్రుల సేవయే దైవసేవగా భావించి సేవించి అదే ధర్మమని అదే తన జ్ఞానానికి కారణమని కౌశికుడికి ధర్మప్రబోధం చేశాడు. కాని కౌశికుడు మాత్రం తల్లిదండ్రులని బంధాలుగా భావించి ఇల్లు వదలి బయటకు వచ్చాడు. ఈ పరిస్థితికి వారి మనస్సే కారణం. అందుకే సంకల్పాలు వేరుగా ఉన్నాయి. మనం అవతారమూర్తులుగా ఆరాధించే రాముడు, కృష్ణుడు గృహస్థులుగా తమ జీవితాన్ని గడిపి సంసారం బంధ హేతువుకాదని ఆచరణ ద్వారా సందేశాన్ని అందించారు. అందుకే అమ్మ సంసారం పట్ల మనకున్న అవగాహనలోని లోపాన్ని సరిచేయడానికే సంకల్పమే సంసారమని సంసారం పట్ల దృష్టి మార్చుకోమని, తాను సంసారంలో ఉండవచ్చు. కానీ తనలో సంసారం ఉండకూడదనీ, ఆచరణాత్మకంగా ప్రబోధించింది.

సంసార చక్రాన్ని నడిపించేది మనస్సే. సంసారం అంటే భార్యాబిడ్డలు కాదు. మనస్సే సంసారం. ఈ భావమే 'సంకల్పమే సంసారం' అన్న వాక్యంలో అమ్మ మనకు అందిస్తోంది.

'అడిగినవాళ్లకు అడిగిననదే ఇస్తాను' అడగని వాళ్లకు అవసరమైనది ఇస్తాను' అన్నది మరో వాక్యం. ఏ తల్లి అయినా బిడ్డ గర్భంలో పడ్డప్పటి నుంచి అతడు పుట్టి, ఊహ తెలిసేవరకూ బిడ్డ శ్రేయస్సుకై ఈ విధంగా చేయమని ఎవరూ కోరకుండానే బిడ్డకు అవసరమయింది తెలుసుకొని చేస్తుంది. బిడ్డ గర్భంలో ఉన్నప్పుడు కూడ ఆ బిడ్డ ఆరోగ్యం కోసం పథ్యం చేస్తుంది. అవసరమయితే పస్తులూ ఉంటుంది. ఇది ఒక వయస్సు వచ్చే వరకు మాత్రమే. అడగడం వచ్చాక అమ్మయినా అడిగితేనే పెడుతుంది. అందుకే కదా 'అడగందే అమ్మయినా పెట్టద'నే సామెత వచ్చింది. కాని అమ్మ 'అడగందే అమ్మయినా పెట్టదు కాదు. బిడ్డ అవసరాన్ని గమనించి అడక్కుండా పెట్టేదే తల్లి' అని సవరించింది. అలాగే మరొక సందర్భంలో చెప్పిన

'అడిగిన వాళ్లకు అడిగిననదే ఇస్తాను

అడగని వాళ్లకు అవసరమయినది ఇస్తాను' అన్న అమ్మ వాక్యాన్ని లోతుగా విశ్లేషిస్తే ఆధ్యాత్మిక సాధనలో ఒక మెట్టు అధిరోహించడానికి ఇది తోడ్పడుతుంది.

'సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ' అనీ

'అనన్యాశ్చింతయంతో మాం యేజనాః పర్యుపాసతే

తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్' అని గీతాచార్యుని ప్రబోధం ఉండనే ఉన్నది కదా. కర్తృత్వ భావన లేకుండా అన్నీ భగవంతుడే అని అనుకోగలిగితే మనకు ఎప్పటికి ఏది అవసరమో ఆ దైవమే చూసుకుంటుంది. కనుక కోరికలు లేని స్థితిని చేరుకోవటానికి అమ్మ వాక్యం మార్గదర్శకంగా ఉన్నది. ఆధ్యాత్మిక సాధనకు పరాకాష్ఠ సర్వార్పణ బుద్ధి. కనుక భగవంతుని ప్రత్యేకమైన కోర్కెలను తీర్చమని వేడడం కంటే సర్వార్పణ బుద్ధితో శరణు వేడినపుడే ఎక్కువ మేలు కలుగుతుంది. ఒక్కొక్కసారి మనకేం కావాలో మనకే తెలియదు. మనం కోరిన కోరికే మనకు హాని తెచ్చి పెట్టవచ్చు.

నీరాజనం

అమ్మ తత్త్వమెలా వైవిధ్యభరితమో అమ్మ గురించి వెలువడిన సాహిత్యం కూడా వైవిధ్య భరితమయినదే. అమ్మపై వెలసిన సాహిత్య సృష్టి అనాది నుండి వస్తున్న సంప్రదాయ సాహిత్యమైన సంస్కృతశ్లోకాలు, పద్యకవిత్వంతో ప్రారంభమయి అత్యాధునికమైన నేటి వచనకవితాసాహిత్యం వరకు సాగింది. ఈ విధంగా అనంతమైన అమ్మ తత్వం అనేక రచనల ద్వారా బహుముఖంగా ఆవిష్కరింపబడింది. ఇంకా అమ్మను గురించి మరెన్నెన్నో గ్రంథాలు వెలువడుతూనే ఉన్నాయి.

విశ్వనాథ వారన్నట్లుగా

మరల నిదేల రామాయణం బన్నచో నీ ప్రపంచకమెల్లనెల్లవేళ
తినుచున్న యన్నమే తినుచున్న దిన్నాళ్లు తన రుచి బ్రతుకులు తనవిగాన

భగవంతుని గుణగణాలు వర్ణించడంలో ఎవరి ఆనందం వారిదే కదా.

'భూజన కల్పకంబగుచు భుక్తికి ముక్తికి మూలమైన యా
రాజును స్వామియైన రఘురాము నుతించిన దప్పు కల్గునే?'

అని రామాయణ రచయిత్రి మొల్లమాంబ చెప్పినట్లుగా ఇహ పరసాధకమైన అమ్మ తత్త్వాన్ని అధ్యయనం చేసి ఆ ఆలోచనలను అమ్మ బిడ్డలందరితో పంచుకోవాలన్న తపనే ఈ గ్రంథరచనకు మూలకారణం. ఈ పరిశోధనా ప్రయత్నం ఒక దిక్ప్రదర్శనం మాత్రమే.

ఇవన్నీ మనమనుకునే లౌకికంగా కన్పించే కారణాలు. కానీ అన్నింటినీ మించి అందరినీ తన సంకల్పానుగుణంగా నడిపించే అమ్మ లీలలలో ఈ గ్రంథరచన కూడా ఒక భాగమే. ఎందుకంటే ఎప్పుడయినా, ఏమయినా, ఎవరికయినా నేనే ఇవ్వవలసిన దానిని అని అమ్మ ప్రకటించింది. అన్నట్లుగానే సంకల్పమే తానై నాచేత పరిశోధన చేయించింది.

'త్వదీయాభి ర్వాగ్భి స్తవ జననివాచాం స్తుతి ! రియం'

అని శ్రీ శంకరాచార్యులు స్తుతించినట్లుగా 'శీతాంశో రమృతార్పణం' అన్న చందంగా అమ్మ వెలిగించిన జ్ఞానజ్యోతి వెలుగులో అమ్మను దర్శించి అమ్మ ప్రసాదించిన వాక్కులతోనే ఈ రచన చేసి అక్షర స్వరూపిణి అయిన అమ్మకు సమర్పించుకుంటున్నాను.

అంఆ



'నాది తెలిసీ తెలియని స్థితి'

'మీరు చూస్తే నేను కనపడను, నేను కనపడితే మీరు చూస్తారు'

'తెలియనిది తెలియ చెప్పటానికే నా రాక'

\- అమ్మ